www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 242

చేయిచేయి కలిపారు!

శ్రీశైలం దారిలోని పురాతన మెట్లబావికి పూర్వ కళ

జనాన్ని కదిలించిన ఇన్‌స్టా రీల్ **14**



నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం గువ్వలకుంట్లలో మురుగును తొలగించి శుభ్రం చేశాక శిల్పకళతో ఉట్టిపడుతున్న మెట్లబావి

మంగళవారం | 17-12-2024 | పేజీలు: 14 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: విదియ ఉ. 10.56 తదుపరి తదియ; నక్షత్రం: పునర్వసు రా. 12.44 తదుపరి పుష్యమి; వర్జ్యం: మ. 12.58-2.32; దుర్ముహూర్తం: ఉ. 8.53-9.37, రా.9.57-10.48; అమృతఘడియలు: రా. 10.22-11.56; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.42; సూర్యాస్తమయం: 5.40

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కాలంతో పరుగు!

పోలవరం 2026 అక్టోబరుకే పూర్తవ్వాలి: సీఎం

ప్రాజెక్టులో ప్రతి పనికీ కాల వ్యవధి.. నిర్దిష్ట కార్యాచరణ ప్రకటన

జాప్యానికి తావులేకుండా పక్కా ప్రణాళిక

- అనుమతులు, ఇతరత్రా అంశాలపై దృష్టి
- ఇంజనీరింగ్ విభాగానికి అతిపెద్ద బాధ్యత
- 2న డయాఫ్రం వాల్ పనులకు శ్రీకారం
- సమాంతరంగా ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులు
- జగన్ పాలనలో ప్రాజెక్టు సర్వనాశనం
- జరిగిన నష్టం అంతా ఇంతా కాదు
- 2019లో మేం మళ్లీ గెలిచి ఉంటే 2021లోనే ప్రాజెక్టు పూర్తయ్యేది
- ఐదేళ్లలో పనులు చేయకపోవడంతో రూ.15 వేల కోట్ల నష్టం
- ప్రాజెక్టు ప్రాముఖ్యమెంతో ప్రధానికి చెప్పి రూ.12,157 కోట్లు సాధించాం: సీఎం
- ప్రాజెక్టు వద్ద పనుల పరిశీలన
- అధికారులతో సమీక్ష.. దిశానిర్దేశం

- ఒక వ్యక్తి మూర్ఖత్వానికి, రాక్షసత్వానికి పోలవరం బలైంది. నాశనం చేసిన ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యతను దేవుడు నాకు అప్పగించాడు.
- పోలవరాన్ని పూర్తిచేసి నదుల అనుసంధానం చేస్తే రాష్ట్రానికి లైఫ్‌లైన్ అవుతుంది. గొల్లపల్లి, బనకచర్లకు 3 దశల్లో అనుసంధానం చేయవచ్చు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి కూడా అనుసంధానమవుతుంది. దీంతో రాష్ట్రానికి నీటి సమస్యే ఉండదు.
- పోలవరం ప్రాజెక్టు ఐకాన్ నిర్మాణంగా సాగాలి. దానిని రాష్ట్ర ప్రజలంతా చూడాలి. ప్రాజెక్టు పనులను అందరూ తిలకించేలా త్వరలోనే ఏర్పాట్లు చేస్తాం.

- ముఖ్యమంత్రి చంద్రబాబు

ఏలూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ 2026 అక్టోబరు నాటికి పూర్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు వెళ్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కాలంతో పరుగులు తీస్తూ పనులు చేయాలని ఆకాంక్షిస్తున్నామని.. దానికి అనుగుణంగానే నిర్దిష్ట గడువులోగా వాటిని పూర్తి చేయడానికి కార్యాచరణ రూపొందించామని ప్రకటించారు. సోమవారం పోలవరం ప్రాజెక్టు క్షేత్రాన్ని సందర్శించిన ఆయన.. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించి.. తర్వాత అధికారులతో సమీక్షించారు. పనులు పరుగులు తీయించేలా దిశానిర్దేశం చేశారు. మీడియాతోనూ మాట్లాడారు. పోలవరం


మిగతా 13వ పేజీలో...



సోమవారం పోలవరం ప్రాజెక్టు పనుల పరిశీలనకు వెళ్లిన సీఎం చంద్రబాబు ల్యాప్‌టాప్‌లో వివరాలను ఆసక్తిగా చూస్తున్న దృశ్యం. చిత్రంలో మంత్రులు నిమ్మల, పార్థసారథి, అధికారులు

వచ్చే డిసెంబరుకే వాల్ పూర్తికావాలి

- ఈసీఆర్ఎఫ్ గ్యాప్-1, గ్యాప్-2 పనులు 2026 మేలోపే అయిపోవాలి
- ఏడాదిన్నరలో కుడి, ఎడమ కాలువల పనులు
- పోలవరం పనులకు కార్యాచరణ





ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ ఇక లేరు **2**

- ప్రపంచ ప్రఖ్యాత తబలా మ్యాస్ట్రో కన్నుమూత
- ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధితో అమెరికాలో మృతి
- తండ్రి ఉస్తాద్ అల్లారఖా వద్ద శిక్షణ.. 12 ఏళ్లకే కచేరీలు
- విశ్వవిఖ్యాత సంగీత కళాకారులతో కలిసి ప్రదర్శనలు
- పద్మ పురస్కారాలతో గౌరవించిన భారత ప్రభుత్వం
- ఐదు 'గ్రామీ'లు సహా పలు అంతర్జాతీయ అవార్డులు

పుట్టగానే నన్ను మా నాన్న చేతుల్లో పెట్టారు. సంప్రదాయం ప్రకారం బిడ్డ చెవిలో తండ్రి ప్రార్థన చేయాలి. నవజాత శిశువును ఈ ప్రపంచంలోకి స్వాగతిస్తూ కొన్ని మంచి మాటలు చెప్పాలి. కానీ మా నాన్న నన్ను చేతుల్లోకి తీసుకోగానే.. నా చెవిలో తబలా తాళాలు వినిపించారు. మా అమ్మ నిర్ఘాంతపోయి.. "ఏం చేస్తున్నారు? ప్రార్థన చేయాలి మీరు" అని అంది. "నా ప్రార్థనలు ఇవే. నేను ప్రార్థన చేసేది ఇలాగే. నేను సరస్వతీ దేవి, వినాయకుడి భక్తుణ్ని" అని మా నాన్న అన్నారు. పరమభక్తుడైన ఒక ముస్లిం చెప్పిన మాట అది. తన గురువుల నుంచి వచ్చిన జ్ఞానాన్ని కుమారుడికి పంచడానికే అలా చేశానని నాన్న చెప్పారు.

- జాకీర్ హుస్సేన్ తన తండ్రి గురించి చెప్పిన మాటలు



నేడు ఎయిమ్స్ తొలి స్నాతకోత్సవం **11**

ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

ఎఫ్‌డీఐలకు జగన్ దెబ్బ! **13**

- 2019-24లో తెలంగాణకు 9,314 మిలియన్ డాలర్లు
- ఆంధ్రకు 1,085 మిలియన్ డాలర్లే
- పార్లమెంటు సాక్షిగా వెల్లడించిన కేంద్రం

శ్రీకాకుళంలో టీడీపీ నేత హత్యకు సుపారీ **14**

- బిహారీ గ్యాంగ్‌కు 10 లక్షలకు పైగా ఇచ్చిన వైసీపీ నేతలు?
- ముఠాతో పాటు పోలీసుల అదుపులో ఇద్దరు నాయకులు
- వారిని విడుదల చేయాలంటూ స్టేషన్‌లో సీదిరి వీరంగం



టెన్త్ సర్టిఫికెట్లన్నీ ఆన్‌లైన్ **12**

- 1969 నుంచి 1990 వరకు డిజిటైజేషన్
- అనుమతిచ్చిన పాఠశాల విద్యాశాఖ
- ఆ తర్వాత 1991 నుంచి 2003 వరకు
- 2004 నుంచి సర్టిఫికెట్లు ఇప్పటికే డిజిలాకర్‌లో డౌన్‌లోడ్‌కు అందుబాటులో

మూడేళ్లలో నవ రాజధాని



వచ్చే నెలలో రాజధాని పనులు

- వారంలో టెండర్లు.. నెలాఖరులోగా ఖరారు
- మొత్తం రూ.62 వేల కోట్ల అంచనా వ్యయం
- తాజాగా రూ.24,276 కోట్ల పనులకు ఆమోదం
- సీఎం అధ్యక్షతన సీఆర్‌డీఏ అథారిటీ సమావేశం
- మూడేళ్లలో ఉత్తమ నగరాల్లో ఒకటిగా అమరావతి: నారాయణ



పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆ శాఖ ఉన్నతాధికారులు

అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు జనవరిలో ప్రారంభం కానున్నాయి. రాజధాని నిర్మాణ పనులకు టెండర్లు పిలిచే కార్యక్రమాన్ని మూడు నుంచి వారం రోజుల్లోగా ప్రారంభించి, ఈ నెలాఖరులోగా వీటన్నిని పూర్తిచేస్తామని మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ ప్రకటించారు. మిగిలినవి

మిగతా 12వ పేజీలో...

డోలీ మోతలు ఆగాలి

- గిరిజన ప్రాంతాల్లో మెరుగ్గా రోడ్ల కనెక్టివిటీ
- రూ.48 కోట్లతో 9 రహదారుల నిర్మాణం
- ఉపాధి పనులను ముమ్మరం చేయాలి
- పీఆర్ అండ్ ఆర్డీపై సమీక్షలో చంద్రబాబు
- ఏజెన్సీ ఏరియాల్లో రోడ్ల పరిస్థితిపై డిప్యూటీ సీఎం పవన్‌తో చర్చ **13**

కేటీఆర్ మెడకు ఈ-కారు



- నేడో రేపో నోటీసులు.. అరెస్టుకూ చాన్స్
- కేటీఆర్‌పై విచారణకు ఇప్పటికే గవర్నర్ అనుమతి
- దానిపై మంత్రి మండలి భేటీలో సుదీర్ఘ చర్చ
- పత్రాలను సీఎస్ ద్వారా ఏసీబీకి పంపాలని నిర్ణయం
- చట్ట ప్రకారం ముందుకు వెళ్లడానికి గ్రీన్ సిగ్నల్ **11**

కేసీఆర్‌పై కేసు!

- మాజీ ముఖ్యమంత్రికి విద్యుత్తు కొనుగోళ్లు, ఒప్పందాల షాక్
- కరెంటుపై జస్టిస్ లోకూర్ కమిషన్ నివేదికకు క్యాబినెట్ ఓకే
- భద్రాద్రి పవర్ ప్లాంట్‌తో పాతికేళ్లలో రూ.9,000 కోట్ల భారం
- ఛత్తీస్‌గఢ్ ఒప్పందంతో తెలంగాణకు రూ.3,642 కోట్ల నష్టం
- నిగ్గు తేల్చిన జస్టిస్ లోకూర్ కమిషన్ నివేదిక



అసెంబ్లీలో చర్చ అనంతరం తీసుకునే చర్యల ప్రకటన

టీడీపీలో 'జోగి' రచ్చ

- నూజివీడులో గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణకు హాజరు
- ఊరేగింపుతో పాటు వేదికపైనా నాయకులతో రాసుకుపూసుకు తిరిగిన మాజీ మంత్రి
- చంద్రబాబు ఇంటిపై దాడికి వెళ్లిన వ్యక్తితో చెట్టపట్టాలపై సర్వత్రా విమర్శలు
- గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి నిందితుడు అనగాని రవికీ ఆహ్వానం
- సోషల్ మీడియాలో విరుచుకుపడిన కార్యకర్తలు
- తీవ్రంగా పరిగణించిన టీడీపీ అధిష్ఠానం **13**
- కొలుసు, శిరీష వివరణ తీసుకోవాలని లోకేశ్ ఆదేశం
- ఆహ్వానం వెనుక ఉన్న కొనకళ్లను అడగలేదేం?.. శ్రేణుల్లో విస్మయం



కేసు మాఫీకి కాసులు!

- పీడీఎస్ బియ్యం మాయం ఘటనలో 1.72 కోట్ల జరిమానా చెల్లించిన పేర్ని నాని
- 14న కోటి.. సోమవారం రూ.72 లక్షలు
- అయినా కేసు ముందుకే..
- మరోసారి గోడాముల్లో తనిఖీలు **14**





పాడేరులో సోమవారం ఉదయం దట్టంగా కురుస్తున్న పొగమంచు **3**

ఏజెన్సీ గజగజ

- అరకు లోయలో 3.8 డిగ్రీలు
- ఉదయం పదైనా వీడని పొగమంచు
- బంగాళాఖాతంలో అల్పపీడనం
- నేటి నుంచి కోస్తా, సీమలో వానలు

నేడే జమిలి బిల్లు **2**



కీలక బిల్లు నేపథ్యంలో బీజేపీ ఎంపీలకు విప్

- పార్లమెంటులో ప్రవేశపెట్టి.. వెంటనే జేపీసీకి..
- 2029లో లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు
- 2034నాటికి జమిలి పరిధిలోకి స్థానిక సంస్థలు
- 2027లో పునర్విభజన, మహిళా రిజర్వేషన్ పూర్తి
- ఏదైనా రాష్ట్రంలో జమిలి సాధ్యం కాకపోతే..?
- రాష్ట్రపతి ఉత్తర్వులతో ఆ అసెంబ్లీకి తర్వాత ఎన్నికలు
- ఈ మేరకు నిర్వహణకు వీలుండేలా బిల్లులో నిబంధన

కాంట్రాక్టుకు లంచం

- భారత సంస్థలకు అమెరికా కంపెనీల భారీ ముడుపులు
- ఇచ్చింది మూగ్, ఒరాకిల్ కార్పొరేషన్, ఆల్బెమార్లే
- తీసుకున్నది ద.మ.రైల్వే, హెచ్ఏఎల్, ఐవోసీ అధికారులు
- డబ్బులిచ్చిన సంస్థలపై అమెరికా జరిమానాల కొరడా
- ముడుపులపై 300 శాతం అధికంగా పెనాల్టీ
- ప్రాసిక్యూషన్‌ను తప్పించడానికి యూఎస్ నిర్ణయం

న్యూఢిల్లీ, డిసెంబరు 16: భారత కుబేరుడు గౌతమ్ అదానీపై అమెరికా సంస్థల ఆరోపణల వేడి చల్లారకముందే.. ఇప్పుడు అలాంటి లంచాల కథే మరొకటి వెలుగుచూసింది. ఈసారి లంచం ఇచ్చింది అమెరికా కంపెనీలు. పుచ్చుకున్నది భారతీయ ప్రముఖ సంస్థల అధికారులు, ఇతర దేశాల్లోని సంస్థలు. అయితే కేసుల్లేకుండా చేయడానికి లంచాలు ఇచ్చిన తమ కంపెనీలపై అమెరికా ప్రభుత్వం భారీ పెనాల్టీ విధించింది. ఆ కంపెనీలు ఇచ్చిన ముడుపులపై 300 శాతం అధికంగా జరిమానా వేసి ప్రాసిక్యూషన్‌ను తప్పించినట్లు అమెరికా అధికారులు వెల్లడించారు. యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (సెక్) ఆదేశాలను బట్టి

మిగతా 2వ పేజీలో...



ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ ఇక లేరు

ఊపిరితిత్తుల్లో సమస్యతో అమెరికాలో కన్నుమూత

- చిన్నప్పటి నుంచే తండ్రి ఉస్తాద్ అల్లారఖా వద్ద శిక్షణ
- పన్నెండేళ్ల వయసు నుంచే దేశవ్యాప్తంగా కచేరీలు
- విశ్వవిఖ్యాత సంగీతకళాకారులతో కలిసి ప్రదర్శనలు

న్యూయార్క్, డిసెంబరు 16: ప్రపంచ ప్రఖ్యాత తబలా విద్వాంసుడు.. పద్మవిభూషణ్ పురస్కారగ్రహీత.. ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ (73) ఇక లేరు. అధిక రక్తపోటు, గుండె, ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలతో బాధపడుతూ రెండు వారాలుగా శాన్‌ఫ్రాన్సిస్కో(అమెరికా)లోని ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన.. భారత కాలమానం ప్రకారం సోమవారం తెల్లవారుజామున ఐదున్నర గంటలకు కన్నుమూశారు. జాకీర్‌హుస్సేన్ 'ఇడియోపతిక్ పల్మనరీ ఫైబ్రోసిస్ (ఊపిరితిత్తుల వ్యాధి)'తో చనిపోయినట్టు వైద్యులు వెల్లడించారు. జాకీర్‌కు భార్య ఆంటోనియా మిన్నెకోలా, ఇద్దరు కుమార్తెలు అనీసా ఖురేషీ, ఇసబెల్లా ఖురేషీ ఉన్నారు. ఆయన అంత్యక్రియలు బుధవారం లేదా గురువారం నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. లెజెండరీ తబలా మ్యాస్ట్రో.. ఉస్తాద్ అల్లారఖా ఖాన్ కుమారుడైన జాకీర్‌హుస్సేన్.. 1951, మార్చి 9న బొంబాయి (నేటి ముంబై)లో జన్మించారు. ఊహ తెలిసిన నాటి నుంచే తండ్రి అడుగుజాడల్లో నడిచారు! నిజానికి జాకీర్‌హుస్సేన్ తాతముత్తాతల్లో సంగీత కళాకారులెవరూ లేరు! ఆయన తండ్రి అల్లా రఖా.. పన్నెండేళ్ల వయసులో, సంగీతం నేర్చుకోవాలనే అభిలాషతో జమ్ము కశ్మీర్‌లోని తమ ఊరైన ఫగ్వాల్ నుంచి లాహోర్‌కు పారిపోయారు. అక్కడ మియా ఖాదర్ బక్స్ వద్ద పంజాబ్ ఘరానా పెర్కుషన్‌లో శిక్షణ పొందారు. సంగీతమే లోకంగా జీవించిన ఆయన.. తన తొలి సంతానమైన జాకీర్ హుస్సేన్ పుట్టగానే ఆ చిన్నారి చెవిలో తారకమంత్రంలా తబలా తాళాలను వినిపించి ఈ ప్రపంచంలోకి స్వాగతం పలికారు. ఇంట్లో ఎల్లప్పుడూ మోగే తబలా నాదాలు వింటూ పెరిగిన జాకీర్.. చిన్న వయసులోనే తండ్రి నేతృత్వంలో సాధన ప్రారంభించారు. "అబ్బాజీ చాలా కఠినమైన గురువు. నేను వేరే గదిలో తబలా సాధన చేస్తున్నా.. ఒక చెవి ఆయన నాపైనే వేసి ఉంచేవారు. తనకు ఎప్పుడు ఏది నేర్పాలనిపిస్తే దాన్ని నేర్పేవారు. ఆయనతో జీవితం 24/7 ఒక సాధన ప్రక్రియ లాగానే ఉండేది. ఫజల్, తౌఫీక్ (జాకీర్ తమ్ముళ్లు) పుట్టిన తర్వాత కూడా అది మారలేదు. మా వరకూ మాకు ఆయన మొదట గురువే. ఆ తర్వాతే తండ్రి" అని జాకీర్ ఒక సందర్భంలో వివరించారు. అలా తండ్రి కఠిన శిక్షణలో రాటుదేలిన జాకీర్‌హుస్సేన్.. ఏడేళ్ల వయసులో తొలి ప్రదర్శన ఇచ్చారు. పన్నెండేళ్లకే దేశవ్యాప్తంగా ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభించి విశేష పేరుప్రఖ్యాతులు సంపాదించారు. అదే సమయంలో అమ్మ మాట విని.. చదువులోనూ మేటి అనిపించుకున్నారు. ముంబైలోని సెయింట్ జేవియర్ నుంచి డిగ్రీ పట్టా పుచ్చుకున్నారు. అనంతరం యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ నుంచి సంగీతంలో పీహెచ్‌డీ పూర్తిచేశారు. ఆ సమయంలోనే అక్కడ ఆయనకు పలువురు పాశ్చాత్య సంగీత కళాకారులతో పరిచయాలయ్యాయి.

దీంతో తరచుగా అమెరికా పర్యటనలు చేస్తూ.. ఏడాదికి దాదాపు 150 దాకా కచేరీలు ఇస్తూ అక్కడా అమిత ప్రజాదరణ పొందారు. సితార్ మ్యాస్ట్రో పండిట్ రవిశంకర్‌తో కలిసి అమెరికాలో తొలిసారి కచేరీ ఇచ్చిన జాకీర్‌హుస్సేన్.. దరివిలా పలువురు ప్రపంచ ప్రఖ్యాత కళాకారులతో కలిసి పనిచేశారు. ఇటు భారతదేశంలోనూ అలీ అక్బర్ ఖాన్, శివకుమార్ శర్మ వంటి ప్రముఖ సంగీత కళాకారులతో కలిసి ప్రదర్శనలు ఇచ్చారు. న్యూయార్క్‌లో ఉండగానే ఆయనకు ప్రముఖ గిటారిస్ట్ జాన్ మెక్‌లాఫ్లిన్‌తో పరిచయమైంది. అంతర్జాతీయంగా పేరొందిన 'బీటిల్స్' బ్యాండ్‌లోని లీడ్ గిటారిస్ట్ జార్జ్ హ్యారిసన్‌కు జాకీర్‌హుస్సేన్ అత్యంత ఇష్టుడు. 1971లో.. అమెరికన్ బ్యాండ్ 'శాంతి'లో భాగమైన జాకీర్.. 1975లో జాన్ మెక్‌లాఫ్లిన్‌తో కలిసి 'శక్తి' బ్యాండ్‌లో పనిచేశారు. ఆ బ్యాండ్‌లో జాకీర్‌హుస్సేన్‌తోపాటు.. ఎల్ శంకర్, టీహెచ్ విక్కు వినాయక్ రామ్, ఆర్.రాఘవన్ కూడా ఉన్నారు. తర్వాత కొద్దికాలానికి విడిపోయిన ఆ బృందం.. మళ్లీ 'రిమెంబర్ శక్తి' పేరుతో మళ్లీ కలిసింది. 1987లో జాకీర్ హుస్సేన్ తన తొలి సోలో ఆల్బమ్ 'మేకింగ్ మ్యూజిక్'ను విడుదల చేశారు. దాదాపు ఆరు దశాబ్దాల సంగీత ప్రస్థానంలో.. ఇటు భారతీయ సంప్రదాయ సంగీతానికి, అటు ప్రపంచ సంగీతానికి ఎనలేని సేవలందించారు. పలు భారతీయ, అంతర్జాతీయ చిత్రాలకు సంగీతం అందించడమే కాక.. హీట్ అండ్ డస్ట్ వంటి కొన్ని చిత్రాల్లో నటించారు కూడా. నాలుగు దశాబ్దాల క్రితం అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో స్థిరపడ్డ జాకీర్ హుస్సేన్.. తన మేనేజర్, కథక్ నృత్య కళాకారిణి అయిన ఆంటోనియా మినెకోలా అనే ఇటాలియన్ అమెరికన్‌ను వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు.. అనీసా, ఇసబెల్లా. పెద్ద కుమార్తె అనీసా చిత్రపరిశ్రమలో పనిచేస్తుండగా.. చిన్న కుమార్తె నృత్య కళాకారిణి.

ఎన్నెన్నో అవార్డులు

వేలికొసలతో తబలపై అద్భుతాలు సృష్టించిన జాకీర్‌హుస్సేన్ ప్రతిభను.. ఎన్నో జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు వరించాయి! తన కెరీర్‌లో ఆయన ఐదు గ్రామీ పురస్కారాలను అందుకున్నారు. అందులో మూడు.. ఈ ఏడాది అందుకున్నవే! ఒకేసారి మూడు గ్రామీలు అందుకున్న తొలి భారతీయుడు ఆయనే. ఇక భారత ప్రభుత్వం ఆయన్ను.. 1988లో పద్మశ్రీ, 2002లో పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది. 2023లో.. దేశ రెండో అత్యున్నత పౌరపురస్కారమైన పద్మవిభూషణ్‌ను ప్రకటించి గౌరవించింది.

చివరాఖరు: "మీ కచేరీ ప్రపంచంలో ఎక్కడ జరిగినా వేల మంది వస్తారు ఎందుకని?" అని ప్రశ్నిస్తే.. "అది నా గొప్పతనం కాదు. సంగీతం గొప్పతనం. నేను సంగీతానికి పూజారిని మాత్రమే" అని సవినయంగా సమాధానం ఇచ్చారు జాకీర్‌హుస్సేన్! ఆ వినయమే, నిత్య విద్యార్థిగా ఉండే తత్వమే, సంగీతంపై గౌరవమే.. ఆయన్ను నిజమైన 'ఉస్తాద్'గా నిలిపాయి!!

వాహ్ తాజ్!

నేపథ్యంలో తాజ్ మహల్! దాని ముందు జాకీర్‌హుస్సేన్, ఒక పిల్లాడు. ఇద్దరూ తబలా వాయిస్తుంటారు. చివర్లో జాకీర్ ఆ చిన్నారిని ఉద్దేశించి.. 'వాహ్ ఉస్తాద్!' అంటాడు. దానికి ఆ చిన్నారి.. 'అరే హుజూర్, వహ్ తాజ్ బోలియే' అంటాడు. ఇప్పుడు నాలుగు పదులు దాటినవారందరికీ ఆ యాడ్ ఓ మధుర జ్ఞాపకం! ఆ సంగతి పక్కన పెడితే.. తాజ్‌మహల్ టీ పాశ్చాత్యదేశాల వినియోగదారులకు సంబంధించిందన్న అపప్రథను తొలగించిన యాడ్ అది. ఆ టీ భారతీయుల కోసం ఉద్దేశించినదే అనే విషయాన్ని తెలపడానికి ప్రకటనకర్తలు ప్రయోగించిన అస్త్రం.. జాకీర్‌హుస్సేన్. ఆ వాణిజ్యప్రకటన సృష్టికర్తలు.. కేవీ శ్రీధర్, కేఎస్ చక్రవర్తి. సుమంత్ర ఘోషల్ ఆ యాడ్‌ను చిత్రీకరించారు. "ఒక సంగీత కళాకారుడు సంగీతాభిమానులకు అద్భుతమైన అనుభవాన్ని అందించడానికి ఎలా వేలాది గంటలు సాధన చేస్తాడో.. అదే తరహాలో మావద్ద ఉన్న టీ టేస్టర్లు వేలాది రుచులను పరీక్షించి, చివరికి దీన్ని ఎంపిక చేశారని చెప్పడానికి మేం ఆ ప్రకటనను అలా రూపొందించాం" అని కేవీ శ్రీధర్ గతంలో తెలిపారు. అప్పట్లో వాణిజ్య ప్రకటనలనగానే.. ఎక్కువగా సినీ తారలు, క్రికెటర్ల వైపు చూసేవారు. అలాంటి సమయంలో తబలా మ్యాస్ట్రో అయిన జాకీర్‌హుస్సేన్‌ను ఈ ప్రకటనకు ఎంచుకోవడం ద్వారానే వారు సగం విజయం సాధించారని వాణిజ్యప్రకటనల నిపుణులు చెబుతారు!

జాకీర్ హుస్సేన్‌తో కమల్‌హాసన్



ఘటం విద్వాంసుడు వినాయక్‌రామ్‌తో



స్నేహితుడి పాడె మోసి..



జాకీర్ హుస్సేన్ ప్రపంచం మొత్తానికీ ఉస్తాద్! దానికంటే ముందు.. సంతూర్ మ్యాస్ట్రో పండిట్ శివకుమార్ శర్మకు మాత్రం ప్రాణానికి ప్రాణమైన దోస్త్!! ఒకటా రెండా.. ఐదు దశాబ్దాలకు పైబడిన స్నేహం వారిది. సంగీత కళాకారులుగా మారిన వారి పరిచయం ప్రాణస్నేహంగా మారింది. 2022 మే నెలలో శివకుమార్ చనిపోయేదాకా వారి బంధం చెక్కుచెదరకుండా కొనసాగింది. శివకుమార్ చనిపోయినప్పుడు.. జాకీర్ హుస్సేన్ ఆయన పార్థివ దేహాన్ని తన భుజాలపై మోసి మిత్రుడిపై తనకున్న ప్రేమను చాటుకున్నారు. అంతేకాదు.. శ్మశానంలో శివకుమార్ శర్మ చితి పక్కన విచారంగా నిలబడి కంటతడి పెడుతున్న జాకీర్ హుస్సేన్ ఫొటో అప్పట్లో వైరల్ అయింది. 'ఇదీ నిజమైన ఇండియా.. స్నేహానికి కుల, మత భేదాలు లేవు' అంటూ నెటిజన్లు సోషల్ మీడియాలో వారి స్నేహం గురించి విస్తృతంగా చర్చించుకున్నారు.

లోకం తీరు



జాకీర్ హుస్సేన్ మృతికి ప్రముఖుల నివాళి

- శాస్త్రీయ సంగీతంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు: మోదీ



న్యూఢిల్లీ, డిసెంబరు 16: జాకీర్ హుస్సేన్ మృతిపై అన్ని వర్గాల ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సంగీత ప్రియులను ఆకట్టుకున్న అసాధారణ ప్రతిభావంతుడు అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ట్వీట్ చేశారు. భారతీయ, పశ్చిమ దేశాల మధ్య సంగీత వారధి అని పేర్కొన్నారు. జాకీర్ హుస్సేన్‌కు పద్మ విభూషణ్ ప్రదానం చేసే అవకాశం తనకు లభించిందని తెలిపారు. ఉస్తాద్ అసమాన ప్రతిభ ప్రజల హృదయాల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంటుందని ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్‌ఖడ్ వ్యాఖ్యానించారు. భారతీయ సంగీతాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లారని అన్నారు. జాకీర్ హుస్సేన్ మృతిపట్ల ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. భారతీయ శాస్త్రీయ సంగీతంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, ప్రపంచ సంగీతంతో మేళవించారని కొనియాడారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్, బీజేపీ అధ్యక్షుడు నడ్డా తదితరులు సైతం సంతాపం తెలిపారు. భారతీయ శాస్త్రీయ సంగీతంలో మహోన్నతుడు జాకీర్ హుస్సేన్ అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. జాకీర్ హుస్సేన్ వారసత్వం ప్రభావం సంగీత ప్రపంచంపై తప్పక ఉంటుందన్నారు. జాకీర్ హుస్సేన్ మృతి సంగీత ప్రపంచానికి తీరని లోటు అని రాహుల్ గాంధీ అన్నారు. జాకీర్ హుస్సేన్ మృతిపట్ల ఖర్గే, మమతా బెనర్జీ, యోగి ఆదిత్యనాథ్ తదితరులు సంతాపం తెలిపారు. జాకీర్ హుస్సేన్ మృతి భారతీయ సంగీతానికే కాదని.. మొత్తం సంగీత ప్రపంచానికే తీరని లోటు అని ఆరెస్సెస్ పేర్కొంది.

అవార్డు అందిన మరునాడే ఆపేశారు

- వివాదాస్పదమైన సుబ్బులక్ష్మి పురస్కార ప్రదానం
- టి.ఎం. కృష్ణను గ్రహీతగా గుర్తించకూడదన్న సుప్రీం

న్యూఢిల్లీ, డిసెంబరు 16: ప్రఖ్యాత కర్ణాటక సంగీత గాయకుడు టి.ఎం. కృష్ణకు ప్రతిష్ఠాత్మక సంగీత కళానిధి ఎం.ఎస్.సుబ్బులక్ష్మి పురస్కారం ప్రదానం చేయడం మలుపులు తిరిగింది. ఆయనకు ఆదివారమే పురస్కారాన్ని బహూకరించగా, ఆయనను పురస్కార గ్రహీతగా గుర్తించకూడదంటూ సోమవారం సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం ప్రాధాన్యతను సంతరించుకొంది. అదే సమయంలో ఈ ఉత్తర్వులు టి.ఎం. కృష్ణ విద్వత్తును గానీ, న్యాయ నిర్ణేతల విజ్ఞతనుగానీ తక్కువ చేయడం కిందికి రావని సుప్రీంకోర్టు స్పష్టం చేయడం గమనార్హం. ఎంఎస్ సుబ్బులక్ష్మి అవార్డును ఈ ఏడాది కృష్ణకు ఇవ్వాలని మద్రాస్ మ్యూజిక్ అకాడమీ నిర్ణయించింది. అయితే, సుబ్బులక్ష్మిపై కృష్ణ గతంలో అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని, ఆమె పేరుతో ఉన్న అవార్డును ఆయనకు ఇవ్వకూడదని సుబ్బులక్ష్మి మనుమడు వి.శ్రీనివాసన్ అభ్యంతరం తెలిపారు. దీనిపై ఆయన తొలుత మద్రాసు హైకోర్టును ఆశ్రయించగా అవార్డును ప్రదానం చేయవచ్చంటూ ఈ నెల 13న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన వెంటనే సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. ఆదివారం కృష్ణకు అవార్డును ప్రదానం చేశారు. శ్రీనివాసన్ అప్పీలుపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరిపింది. "పురస్కారాన్ని ఇప్పటికే అందజేసినందున కృష్ణను అవార్డు గ్రహీతగా గుర్తించకుంటే బాగుంటుందని భావిస్తున్నాం. ఆయన కూడా ప్రస్తుతానికి అవార్డు గ్రహీతనని చెప్పుకోకుంటే మంచిది" అని ఉత్తర్వుల్లో తెలిపింది. అంతకుముందు ధర్మాసనం ఎదుట వాడివేడిగా వాదోపవాదాలు జరిగాయి. పిటిషనర్ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎన్. వెంకట్రామన్ వాదించారు. సుబ్బులక్ష్మిని 'అతి పెద్ద నకిలీ', 'సాధువులా కనిపించే బార్బీ బొమ్మ' అంటూ కృష్ణ విమర్శించారని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఈ ఆరోపణలను టి.ఎం.కృష్ణ ఖండించారు. తాను వేరే సందర్భంలో చేసిన వ్యాఖ్యలను తప్పుగా అన్వయించారని అన్నారు.

'జై శ్రీరాం' అనడం క్రిమినల్ చర్యనా: సుప్రీం

న్యూఢిల్లీ, డిసెంబరు 16: 'జై శ్రీరాం' అనడం క్రిమినల్ నేరమా అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఏదైనా మతానికి చెందిన పేరునుగానీ, నినాదాన్నిగానీ ఎలుగెత్తి చెప్పడం తప్పు ఎలా అవుతుందని వ్యాఖ్యానించింది. మసీదు లోపల జై శ్రీరాం అన్న నినాదాలు చేశారంటూ ఇద్దరు వ్యక్తులపై కర్ణాటకలో కేసు నమోదయింది. ఆ కేసును అక్కడి హైకోర్టు కొట్టివేసింది. దీన్ని సవాలు చేస్తూ పిటిషనర్ హైదర్ ఆలీ సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. ఈ అప్పీలుపై సోమవారం సుప్రీంకోర్టు విచారణ జరిపింది. "జై శ్రీరాం అన్న నినాదం చేయడం నేరమవుతుందా? ఆ ఇద్దరు వ్యక్తులే ఈ నినాదం చేసినట్టు ఎలా గుర్తించారు? సీసీటీవీ కెమేరాలు ఉన్నాయని చెబుతున్నా వారిని గుర్తించింది ఎవరు?" అని అడిగింది. తదుపరి విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది. 2023 సెప్టెంబరు 24న ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మసీదులో చొరబడి జైశ్రీరాం నినాదాలు చేయడంతో పాటు బెదిరించారంటూ కేసు నమోదైంది. అయితే, ఆ నినాదం చేయడం వల్ల ఎలాంటి ఘర్షణలు జరగలేదని, నినాదాలు ఎవరు చేశారో తాను స్వయంగా చూడలేదని పిటిషనరే పేర్కొన్నందున కేసు కొట్టివేస్తున్నట్టు కర్ణాటక హైకోర్టు తెలిపింది.

వణికిస్తున్న చలి... ఆదిలాబాద్‌లో 6 డిగ్రీలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): చలితో రాష్ట్ర ప్రజలు గజ.. గజ వణికిపోతున్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లాలోని భీంపూర్ మండలం అర్లి(టి)లో అత్యల్పంగా 6.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ముఖ్యంగా మారుమూల గ్రామాలను దట్టమైన పొగమంచు కప్పేయడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటు హైదరాబాద్‌లోనూ చలితీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. సోమవారం పఠాన్‌చెరులో అత్యల్పంగా 6.4 డిగ్రీలు, రాజేంద్రనగర్ 8.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆదివారం రాత్రి చలి తీవ్రతను తట్టుకోలేక నర్సింగ్ భట్ల గ్రామానికి చెందిన హనుమాన్ దేవాలయ వాచ్‌మన్ చింతకాయల సత్తయ్య మృతి చెందాడు.

నేడే జమిలి ఎన్నికల బిల్లు

న్యూఢిల్లీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా కేంద్రం రాజ్యాంగ సవరణ బిల్లును మంగళవారం పార్లమెంటులో ప్రవేశపెట్టనుంది. వెంటనే ఈ బిల్లును జేపీసీకి నివేదించాలని కేంద్రం నిర్ణయించింది. జమిలి సహా ఇతర బిల్లులు కూడా ప్రవేశపెట్టి ఉభయ సభలను సాధ్యమైనంత త్వరలో వాయిదా వేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. కేంద్ర ప్రభుత్వ వర్గాల ప్రకారం.. 2029లో జమిలి ఎన్నికలు జరిపించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలిసింది. 2029లో లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతాయని, స్థానిక సంస్థల ఎన్నికలను కూడా జమిలి పరిధిలోకి తీసుకురావడం 2034 నాటికి జరుగుతుందని అధికార వర్గాలు అంటున్నాయి. జమిలి ఎన్నికలకు ప్రధాన అడ్డంకులను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. వివిధ రాజకీయ పార్టీలను ఒప్పించి రాజ్యాంగ సవరణలు సాఫీగా జరిగేలా చూడడం ప్రధానమైనది. అలాగే జనాభా లెక్కల సేకరణ, నియోజకవర్గాల పునర్విభజన కూడా ఈలోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. వచ్చే ఏడాది జనాభా లెక్కల సేకరణను, 2027 నాటికి నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ అమలు చేసే నియోజకవర్గాల గుర్తింపును పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కాగా, పార్లమెంటుతో పాటు ఏదైనా రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించలేని పరిస్థితులు ఉంటే?.. అలాంటి సందర్భంలో ఏం చేయాలో నిర్దేశించే నిబంధనను రాజ్యాంగ సవరణ బిల్లులో పొందుపరిచింది. ఆ రాష్ట్ర ఎన్నికలను తర్వాత నిర్వహించేలా రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేసే వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు బిల్లులోని సెక్షన్ 2 సబ్ క్లాజ్ 5లో చేర్చారు. ఈ బిల్లును ప్రవేశపెట్టిన అనంతరం కేంద్రం జేపీసీకి నివేదిస్తుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. మంగళవారం సాయంత్రానికి జేపీసీ సభ్యులను ప్రకటించే అవకాశం ఉందని తెలిపాయి. కీలకమైన జమిలి బిల్లు ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో మంగళవారం పార్లమెంటు సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశిస్తూ బీజేపీ లోక్‌సభలో తమ ఎంపీలకు విప్ జారీ చేసింది.

మీ భాష సరే.. పనులే బాలేవు

మీరు జేఎన్‌యూ..నేను మున్సిపల్ స్కూల్.. రాసింది చదవడం నాకు కూడా వచ్చు

- నిర్మలా సీతారామన్‌పై ఖర్గే విసుర్లు
- కుటుంబం కోసమే రాజ్యాంగ సవరణలు
- కాంగ్రెస్‌పై కేంద్ర మంత్రి నిర్మల నిప్పులు
- రాజ్యసభలో వాడీవేడిగా రాజ్యాంగ చర్చ..





న్యూఢిల్లీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంపై రాజ్యసభలో సోమవారం జరిగిన చర్చ అధికార, విపక్ష నేతల మధ్య తీవ్ర వాగ్యుద్ధాన్ని రాజేసింది. ఈ చర్చ సందర్భంగా కాంగ్రెస్‌పై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ విరుచుకుపడగా, నిర్మలను ఉద్దేశించి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే పదునైన విమర్శల దాడిని సాగించారు. దీంతో రాజ్యాంగంపై చేపట్టిన చర్చ రాజ్యసభను వేడెక్కించింది. తమ నేతలను కాపాడుకోడానికీ, కుటుంబం, రాజకీయ వంశ పరిరక్షణకూ తప్ప ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు 'వృద్ధ రాజకీయ పార్టీ' (కాంగ్రెస్) ఏనాడూ రాజ్యాంగ సవరణ చేయలేదని మంత్రి నిర్మలా సీతారామన్ ధ్వజమెత్తారు. మాజీ ప్రధాన మంత్రులు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ నుంచి నేటివరకు.. 42వ రాజ్యాంగ సవరణ నుంచి షాబానో ఉదంతంలో చేసిన సవరణ దాకా.. కాంగ్రెస్ ఎది ఇదే తంతు అని విమర్శించారు. "భావ ప్రకటన స్వేచ్ఛను రాజ్యాంగంలో పొందుపరచడం పట్ల దేశం గర్విస్తుంది. కానీ, అప్పటి తొలి మధ్యంతర ప్రభుత్వం ఈ స్వేచ్ఛకు నియంత్రణలు విధిస్తూ రాజ్యాంగ సవరణ తెచ్చింది. రాజ్యాంగాన్ని ఆమోదించి అప్పటికి ఒక ఏడాది కూడా కాలేదు" అని నిర్మల తీవ్ర స్వరం వినిపించారు. ఆమె వ్యాఖ్యలపై ఖర్గే అంతే దీటుగా స్పందించే ప్రయత్నం చేశారు. "నేను మునిసిపల్ స్కూలులో చదివాను. రాసిచ్చింది చదవడం నాకు కూడా వచ్చు. ఆమె జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో చదివారు. ఆమె మాట్లాడే ఇంగ్లిష్, హిందీ సహజంగానే బాగుంటాయి. కానీ, పనులే ఏమీ బాగా లేవు" అని ఖర్గే విరుచుకుపడ్డారు. రాజ్యాంగాన్ని, జాతీయజెండాను, అశోకచక్రను ద్వేషించిన చరిత్ర కలిగినవారు.. తమకు పాఠాలు చెప్పాలని చూడటం ఆశ్చర్యపరుస్తోందని ఎద్దేవా చేశారు. "రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజున వీళ్లు (నిర్మలను ఉద్దేశించి) దానిని తగలబెట్టారు. అంబేడ్కర్, నెహ్రూ, గాంధీల దిష్టిబొమ్మలకు ఢిల్లీ రామ్‌లీలా మైదాన్‌లో ఆ రోజున నిప్పుపెట్టారు" అని ఖర్గే ఆరోపించారు. స్త్రీ, పురుష వివక్ష లేకుండా అందరికీ సార్వత్రిక వయోజన ఓటు హక్కును కల్పించిన ఘనత 'వృద్ధ రాజకీయ పార్టీ', రాజ్యాంగాలదేనని, అప్పటికి మహిళలకు ఓటుహక్కు గురించిన ఆలోచనే ప్రపంచంలోని అత్యధిక దేశాలకు లేదన్నారు. ఈ నిర్ణయాన్ని ఆనాడు ఆర్‌ఎస్‌ఎస్, జనసంఘ్ వ్యతిరేకించాయని ఖర్గే విమర్శించారు. ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన పూర్వ నాయకులు రాజ్యాంగాన్ని వ్యతిరేకించారనేది సుస్పష్టమన్నారు.

రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం

రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమని, కుల గణన చేపట్టకపోవడానికి అదే కారణమని ఖర్గే ఆరోపించారు. రాజ్యాంగాన్ని, జాతీయ జెండాను ఆర్‌ఎస్‌ఎస్ అంగీకరించలేదని, అందుకే 2002 జనవరి 26న ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించాలని న్యాయస్థానం ఆదేశించిందని ఖర్గే తెలిపారు. రిజర్వేషన్ అంశంపై రాష్ట్రాలకు నెహ్రూ లేఖలు రాయడం సహా అనేక అంశాల్లో వాస్తవాలను ప్రధాని మోదీ వక్రీకరించి దేశాన్ని తప్పుదారి పట్టించారని ఖర్గే ఆరోపించారు. ఇందుకుగాను దేశానికి ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రియాంక భుజాన 'పాలస్తీనా' బ్యాగ్



కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా 'పాలస్తీనా' అనే పదం ముద్రించబడి వున్న బ్యాగ్‌ను భుజాన వేసుకొని సోమవారం పార్లమెంట్‌కు రావడం చర్చనీయాంశంగా మారింది. ప్రియాంక ఆ బ్యాగ్‌ను ధరించి ఉన్న ఫొటోను కాంగ్రెస్ అధికార ప్రతినిధి షామా మహమ్మద్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. ప్రత్యేక బ్యాగ్‌ను ధరించడం ద్వారా ఆమె పాలస్తీనాకు మద్దతుగా నిలిచారని పేర్కొన్నారు. దీనిపై బీజేపీ ఎంపీ, ఆ పార్టీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర స్పందించారు. గాంధీ కుటుంబం విషయానికి వస్తే ఇదేమీ కొత్త కాదని, నెహ్రూ నుంచి ప్రియాంక వరకు గాంధీ కుటుంబసభ్యులు 'బుజ్జగింపు' బ్యాగ్‌లతో తిరుగుతున్నారని వ్యాఖ్యానించారు.

కాంట్రాక్టుకు లంచం



(మొదటి పేజీ తరువాయి)

జరిమానాలు చెల్లించిన కంపెనీల్లో మూగ్ ఇంక్, ఒరాకిల్ కార్పొరేషన్, అల్బెమార్లె కార్పొరేషన్ ఉన్నాయి. మూగ్ ఇంక్‌కు భారత్‌లో అనుబంధ సంస్థ అయిన మూగ్ మోషన్ కంట్రోల్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎంఎంసీపీఎల్) ద్వారా హిందుస్థాన్ ఏరో నాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్), సౌత్ సెంట్రల్ రైల్వే రీసెర్చ్ డిజైన్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ (ఆర్‌డీఎస్‌ఓ) అధికారులకు లంచం ఇచ్చి కాంట్రాక్టులు దక్కించుకున్నట్లు అక్టోబరు 11న సెక్ పేర్కొంది. ఆగస్టు 2020లో "ఏజెంట్ ఏ"ని నియమించుకోవడం ద్వారా సౌత్ సెంట్రల్ రైల్వే టెండర్ల జాబితా కంపెనీల్లో మూగ్ చోటు దక్కించుకుందని, ఆ తర్వాత నెలలో 34,323 డాలర్ల విలువైన కాంట్రాక్టు విజేతగా నిలిచిందని సెక్ పేర్కొంది. ఈ కాంట్రాక్టులో 10 శాతం కమిషన్ మూగ్ ఇచ్చినట్లు వెల్లడించింది. ఇక నవంబరు 2021లో హెచ్‌ఏఎల్‌కు విడిభాగాలు, సేవలు అందించే 13,99,328 డాలర్ల కాంట్రాక్టు దక్కించుకునేందుకు హెచ్‌ఏఎల్ అధికారి ఒకరికి 2.5% కమిషన్ ఇచ్చినట్లు సెక్ తెలిపింది. హెచ్‌ఏఎల్, రైల్వేలకు సుమారు 5 లక్షల డాలర్లు మూగ్ లంచం ఇచ్చినట్లు సెక్ చెప్పింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ)తో పాటు ఇండోనేసియా, వియత్నాంలోని కంపెనీల కాంట్రాక్టుల కోసం అల్బెమార్లె కార్పొరేషన్ భారీగా ముడుపులు ఇచ్చి దక్కించుకున్నట్లు గతేడాది సెక్ పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా 700కు పైగా కంపెనీలకు రిఫైనింగ్ సొల్యూషన్స్‌ను అల్బెమార్లే సరఫరా చేస్తోంది. 2009-2017 మధ్య ఐవోసీతో సంబంధాలు నెరిపింది. 2017లో 63.5 మిలియన్ల డాలర్లు లంచం ఇస్తూ అమెరికా అధికారులకు దొరికింది.

ఒరాకిల్ కూడా అదే దారిలో

టెక్ దిగ్గజం ఒరాకిల్ కార్పొరేషన్ ఇండియాతో పాటు యూఏఈ, తుర్కియేల్లో అవినీతి చర్యలకు పాల్పడినట్లు సెక్ తెలిపింది. ఓ ట్రాన్స్‌పోర్టేషన్ కంపెనీ నుంచి 2019లో ఒరాకిల్ సేల్స్ ఉద్యోగులు అధిక రాయితీ పొందారని, ఆ కంపెనీలో ఎక్కువ భాగస్వామ్యం రైల్వేకు ఉందని తెలిపింది. రాష్ట్ర యాజమాన్యంలోని ఓ సంస్థ నిధుల విడుదల విషయంలో 6.8 మిలియన్ డాలర్ల ముడుపులు చెల్లించినట్లు వెల్లడించింది.

జరిమానా ఇలా..

- హెచ్‌ఏఎల్, రైల్వేల్లో 5 లక్షల డాలర్లకుపైగా ముడుపులు ఇస్తూ దొరికిన మూగ్ ఇంక్‌కు సెక్ 1.68మిలియన్ల డాలర్లకుపైగా ఫైన్ వేసింది.
- ఇండియన్ రైల్వేస్, యూఏఈ, తుర్కియేల్లో 6.8 మిలియన్ డాలర్లు లంచం ఇచ్చిన ఒరాకిల్ కార్పొరేషన్‌కు 23 మిలియన్ డాలర్లు పెనాల్టీ విధించి సెక్ కేసు సెటిల్ చేసింది.
- ఐవోసీతో పాటు ఇండోనేసియా, వియత్నాంలో 63.5 మిలియన్ డాలర్లకు పైగా లంచాలు ఇచ్చిన అల్బెమార్లె కార్పొరేషన్‌కు 198 మిలియన్ డాలర్ల భారీ జరిమానా విధించింది.



వైభవంగా భూతప్పల ఉత్సవం



భక్తులను తొక్కుకుంటూ వస్తున్న భూతప్పలు..., భూతప్పలు వచ్చే దారిలో పడుకున్న భక్తులు

కాలి స్పర్శతో వ్యాధులు నయమవుతాయన్నది వారి నమ్మకం. నేలపై బోర్ల పడుకుంటే... భూతప్పలు వారిపై నుంచి నడుస్తూ వెళ్తారు. దీంతో తమకు స్వాంత్వన వస్తుందన్నది వారి విశ్వాసం. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం భక్తరహళ్లిలో వెలసిన నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం భూతప్పల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు, సంతానంలేని వారు వేకువజామునే స్నానం చేసి, తడిదుస్తులతోనే భూతప్పలు వచ్చే దారిలో పడుకుంటారు. వారిపై నుంచి నడిచి వెళ్లే భూతప్పల కాలిస్పర్శతో వ్యాధులు నయమవుతాయనీ, సంతానం ప్రాప్తిస్తుందనీ భక్తుల విశ్వాసం. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు భూతప్పల ఉత్సవం సాగింది. అనంతరం భూతప్పలు నరసింహస్వామి ఆలయంలోకి చేరుకున్నారు. **- మడకశిర రూరల్, ఆంధ్రజ్యోతి**

బంగాళాఖాతంలో అల్పపీడనం



లంబసింగిలో దట్టంగా కురుస్తున్న పొగమంచు

- నేటి నుంచి కోస్తా, సీమలో వానలు
- రేపటి నుంచి 3 రోజులు భారీ వర్షాలు

విశాఖపట్నం, పాడేరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉన్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో సోమవారం దక్షిణ బంగాళాఖాతం పరిసరాల్లో అల్పపీడనం ఏర్పడింది. దీనిపై సముద్ర మట్టానికి 3.1 కి.మీ. ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. అల్పపీడనం పశ్చిమ దిశగా పయనించి రానున్న రెండు రోజుల్లో తమిళనాడు తీరం దిశగా రానుందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) అంచనా వేసింది. అల్పపీడనం మంగళవారం వరకూ పశ్చిమ దిశగా, ఆ తర్వాత వాయవ్యంగా పయనించే క్రమంలో ఈనెల 19వ తేదీకల్లా ఏపీలో మధ్య ఉత్తర కోస్తా దిశగా వచ్చే అవకాశం ఉందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. అల్పపీడనం ప్రభావంతో మంగళవారం నుంచి వర్షాలు పెరగనున్నాయి. మంగళవారం కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ వర్షాలు, తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయి. బుధవారం కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల వర్షాలు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీవర్షాలు, గురువారం దక్షిణ కోస్తాలో అనేకచోట్ల, ఉత్తరకోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య, కడప జిల్లాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. అయితే, అల్పపీడనం కోస్తా తీరం దిశగా నెమ్మదిగా పయనిస్తోందని ఇస్రో వాతావరణ నిపుణుడు వివరించారు. ఈ నేపథ్యంలో ఈనెల 20వ తేదీన కోస్తాలో అక్కడక్కడ, 21న ఉత్తర కోస్తాలో ప్రధానంగా విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం జిల్లాల వరకు భారీ వర్షాలు కురుస్తాయన్నారు. ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో డిసెంబరు నెలకు సంబంధించి ఇది మూడో అల్పపీడనమని(ఒకటి తుఫాన్‌గా మారింది) విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం అధికారి ఎస్.జగన్నాథకుమార్ తెలిపారు. మధ్య, దానికి ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు 28 నుంచి 30 డిగ్రీల వరకు ఉన్నందున అల్పపీడనం ప్రభావం తమిళనాడుపై ఎక్కువగా ఉంటుందన్నారు. ఏపీలో కోస్తా/ఒడిశాకు ఆనుకుని పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో ఉపరితల ఉష్ణోగ్రతలు 25 నుంచి 26 డిగ్రీలు నమోదవుతున్నందున అల్పపీడనం బలపడే అవకాశం లేదని తెలిపారు. అల్పపీడనం తమిళనాడు తీరం దిశగా వచ్చిన తర్వాత బలహీనపడి ఉపరితల ఆవర్తనంగా మారి ఒకటి, రెండు రోజులు అక్కడే ఉండిపోయే అవకాశం ఉందని, ఈ క్రమంలో తేమ మేఘాలు ఉత్తరకోస్తా వైపు వస్తాయని పేర్కొన్నారు. 19న విశాఖ, విజయనగరం, 20న శ్రీకాకుళం జిల్లాల్లో వర్షాలు ఎక్కువగా కురిసే అవకాశం ఉందన్నారు. తర్వాత రెండు రోజు లు దక్షిణ కోస్తాలో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

అరకులోయలో 3.8 డిగ్రీలు నమోదు

- ఏజెన్సీలో ఉదయం పది గంటలైనా వీడని పొగమంచు

మధ్య భారతం నుంచి వీస్తున్న అతి శీతల గాలుల ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో చలి మరింత పెరిగింది. సోమవారం ఉదయం పది గంటల వరకు మన్యంలో అనేకచోట్ల ప్రజలు చలికి తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో 3.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే జి.మాడుగులలో 4.1, డుంబ్రిగుడలో 6, జీకే వీధిలో 7.3, చింతపల్లి, ముంచంగిపుట్టులో 8.1, హుకుంపేటలో 8.8, పెదబయలులో 9.0, అనంతగిరిలో 9.4, తీర ప్రాంతంలోని కళింగపట్నంలో 13.2 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో మొదటిసారి ఏజెన్సీ వ్యాప్తంగా సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలి తీవ్రతకు గిరిజనులు గజగజ వణుకుతున్నారు. ఉదయం పది గంటల వరకూ పొగమంచు వదలడం లేదు. దీంతో వాహనచోదకులు లైట్లు వేసుకోకుండా రాకపోకలు సాగించలేదని పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో గిరిజనులు పెద్దపెద్ద దుంగలతో మంటలు వేసుకుని చలి నుంచి రక్షణ పొందుతున్నారు. కాగా, మంగళవారమూ చలి ప్రభావం కొనసాగుతుందని, అల్పపీడనం ప్రభావంతో బుధవారం నుంచి చలి స్వల్పంగా తగ్గుతుందని వాతావరణ శాఖ తెలిపింది.

నకిలీ బ్రిగేడియర్ ఐడీకార్డుతో శ్రీవారి వీఐపీ బ్రేక్ టికెట్లు!

తిరుమల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ లెఫ్టినెంట్ కల్నల్ ఫొటోతో బ్రిగేడియర్ అధికారిగా నకిలీ గుర్తింపు కార్డును సృష్టించి ఆరు వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్లు పొందాడు ఓ ఆర్మీ క్యాంటీన్ ఉద్యోగి. వాటిని రూ.40 వేలకు ఆ లెఫ్టినెంట్ కల్నల్‌కే విక్రయించగా గుట్టు రట్టయ్యింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. విశ్వేశ్వర ప్రసాద్ రిటైర్డ్ లెఫ్టినెంట్ కల్నల్. శ్రీవారి దర్శనం కోసం చెన్నై ఆర్మీ క్యాంటీన్‌కు మెటీరియల్ సరఫరా చేసే సతీశ్‌ను, ఆయన ద్వారా తిరుపతిలోని ఆర్మీ క్యాంటీన్ ఉద్యోగి బ్రహ్మయ్యను సంప్రదించి నలుగురికి వీఐపీ బ్రేక్ దర్శనం కావాలని కోరారు. బ్రహ్మయ్య రూ.10 వేల చొప్పున నాలుగు టికెట్లకు రూ.40 వేలు వసూలు చేశాడు. విశ్వేశ్వరప్రసాద్ ఆధార్‌లోని ఫొటోతో నకిలీ బ్రిగేడియర్ అధికారి ఐడీ కార్డు తయారు చేశాడు. దగ్గరుండి దర్శన ఏర్పాట్లు చేయాలని బ్రహ్మయ్య తన అసిస్టెంట్ చంద్రశేఖర్‌రెడ్డిని తిరుమలకు పంపాడు. అయితే, చంద్రశేఖర్‌రెడ్డి తాను, తన సతీమణి పేర్లు కూడా జత చేసి ఆరుగురికి వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లు పొందాడు. సోమవారం ఉదయం వారంతా దర్శనానికి రాగా, విజిలెన్స్ అధికారులు గుర్తించి పోలీసులకు అప్పగించారు.

ఆ బియ్యం ఆపొద్దు!

- ఆఫ్రికాతో ఒప్పందాలకు ఇబ్బంది తీసుకురావద్దు
- తనిఖీల పేరిట ఆటంకాలతో దేశానికి ఇబ్బంది
- ఆకలి నివారణ కోసం ఆఫ్రికాతో జీటూజీ డీల్
- కాకినాడ పోర్టు నుంచి నూక బియ్యం ఎగుమతులు
- వాటి నిలిపివేతతో ఒప్పందానికి దెబ్బ
- ప్రభుత్వానికి, కాకినాడ కలెక్టర్‌కు ఎన్‌సీఈఎల్ లేఖ

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ పోర్టు నుంచి ఆఫ్రికా దేశాలకు ఎగుమతయ్యే నూకల విషయంలో అధికారులు తనిఖీల పేరుతో ఇక్కట్లు కలిగించవద్దని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ కో ఆపరేటివ్ ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్ (ఎన్‌సీఈఎల్) విజ్ఞప్తి చేసింది. ప్రపంచంలోని ఆఫ్రికా దేశాల్లో ఆకలి నివారణ, అక్కడి ప్రజలకు ఆహార భద్రత కల్పించే ప్రక్రియలో భాగంగా భారత్‌కు ఆఫ్రికాకు మధ్య కుదిరిన గవర్నమెంట్ టు గవర్నమెంట్ (జీటూజీ) ఒప్పందంలో భాగంగా ఎగుమతి అవుతున్న బియ్యాన్ని తనిఖీల పేరుతో ఆటంక పరచవద్దు అని కోరింది. ఈమేరకు తాజాగా రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు లేఖ రాసింది. జీటూజీ ఒప్పందంలో భాగంగా కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి ఆఫ్రికా దేశాలకు ఎన్‌సీఈఎల్ నూక బియ్యాన్ని ఎగుమతి చేస్తోందని ఆ సంస్థ సీఈవో అనుపమ్‌కౌశిక్ వివరించారు. ఇందులో ఫోర్టిఫైడ్ రైస్ ఆనవాళ్లు ఉన్నాయనే కారణంతో కొంతకాలంగా బియ్యాన్ని స్వాధీనం చేసుకోవడంతోపాటు ఎగుమతి చేయకుండా కాకినాడ అధికారులు అడ్డుకోవడం తెలిసిందే. అయితే, అది సరికాదని లేఖలో ఎన్‌సీఈఎల్ తన లేఖలో పేర్కొంది. ఎగుమతులకు ఆటంకం వల్ల ఆఫ్రికాతో భారతదేశానికి కుదిరిన జీటూజీ ఒప్పందానికి ఆటంకాలు కలుగుతున్నాయని అభ్యంతరం వ్యక్తంచేసింది. ఇదే విషయమై భారత విదేశీ వ్యవహారాలశాఖ తరచూ ఎన్‌సీఈఎల్‌కు మెయిల్స్, ఫోన్లు చేస్తూ ఎగుమతులు ఆగడంపై ప్రశ్నిస్తోందని ఆ లేఖలో ప్రస్తావించింది. వాస్తవానికి రాష్ట్రప్రభుత్వం రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మర ఆడించడానికి మిల్లులకు ఇస్తుందని, ఇలా ఆడగా వచ్చే బియ్యాన్ని ఎఫ్‌సీఐకు అప్పగించే క్రమంలో కొంత బియ్యం తిరస్కరణకు గురవుతాయని లేఖలో వివరించింది. ఇలా తిరస్కరణకు గురైన బియ్యాన్ని మిల్లులు నూకగా ఆడించి బహిరంగ మార్కెట్లో విక్రయిస్తాయని, అవే నూకలను కేంద్రం తరఫున తాము ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేస్తుంటామని వివరించింది. అయితే ఈ నూకల్లో ఫోర్టిఫైడ్ బియ్యం (ప్రభుత్వం సరఫరా చేసే ఉచిత బియ్యం) ఆనవాళ్లు 0.01 నుంచి 0.1 శాతం వరకు ఉండడం అత్యంత సహజం అని పేర్కొంది. కానీ కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు రేషన్ బియ్యం ఎగుమతి అవుతున్నాయన్న కారణంతో పోర్టు వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారని, ఈ చెక్‌పోస్టుల ద్వారా కేంద్రం తరఫున తాము ఎగుమతి చేస్తోన్న నూక బియ్యంలో ఫోర్టిఫైడ్ ఆనవాళ్ల పేరుతో శాంపిళ్లు సేకరించి బియ్యం సీజ్ చేస్తున్నారని లేఖలో ఎన్‌సీఈఎల్ అభ్యంతరం వ్యక్తంచేసింది. సీజ్, శాంపిళ్ల తనిఖీలతో ఆఫ్రికా దేశాలకు నూకబియ్యం ఎగుమతుల్లో ఇక్కట్లు ఎదురవుతున్నాయని, తద్వారా జీటూజీ ఒప్పందాలకు విఘాతం కలుగుతోందని తప్పుబట్టింది. ఈ నేపథ్యంలో ఆఫ్రికా దేశాలకు కాకినాడ పోర్టు నుంచి వెళ్లే నూక బియ్యం ఎగుమతులకు ఇబ్బందులు తీసుకురాకుండా నౌకల్లో లోడింగ్‌కు అనుమతించాలని కోరింది. మరోపక్క ఈ లేఖతో రాష్ట్రప్రభుత్వం సైతం నూకబియ్యం ఎగుమతి విషయంలో ఆంక్షలు లేకుండా ఆదేశాలు ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. ఇదిలాఉంటే కేంద్ర హోంశాఖతోపాటు సహకార శాఖ పరిధిలో ఎన్‌సీఈఎల్ పనిచేస్తుంది. గత కొన్నేళ్లుగా నూక బియ్యాన్ని సేకరించి కాకినాడ పోర్టు ద్వారా విదేశాలకు ఈ సంస్థ ఎగుమతి చేస్తోంది. గతేడాది కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి పలు ఆఫ్రికా దేశాలకు 2.02 లక్షల మెట్రిక్ టన్నుల నూకను ఎగుమతి చేసింది. ఈ ఏడాది ఇప్పటివరకు 2.94 లక్షల మెట్రిక్ టన్నులు ఎగుమతి చేసింది.

రేపు ఆర్జిత సేవా టికెట్ల కోటా విడుదల

తిరుమల, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆర్జితసేవా టికెట్లకు సంబంధించిన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళపాదపద్మారాధన సేవల మార్చి నెల లక్కీడిప్ కోటాను టీటీడీ బుధవారం ఉదయం 10 గంటలకు అధికారిక వెబ్‌సైట్ 'టీటీదేవస్థానమ్స్.ఏపీ.జీవోవీ.ఇన్' ద్వారా విడుదల చేయనుంది. ఈసేవా టికెట్ల రిజిస్ట్రేషన్ కోసం 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈటికెట్లు పొందిన భక్తులు 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు నగదు చెల్లిస్తే లక్కీడిప్ ద్వారా టికెట్లు మంజూరు చేస్తారు. అలాగే 21వ తేదీ ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకారసేవ టికెట్ల కోటాను విడుదల చేస్తారు. ఇక, అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్‌సేవలు కూడా అందుబాటులో ఉంచనున్నారు. 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ, 11 గంటలకు శ్రీవాణి టికెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్న భక్తులకు టోకెన్లను జారీ చేస్తారు. 24వ తేదీన ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, మధ్యాహ్నం 3 గంటలకు గదుల కోటాను కూడా ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.

30 నుంచి అధ్యయనోత్సవాలు

తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 30 నుంచి జనవరి 23వ తేదీ వరకు అధ్యయనోత్సవాలు జరుగనున్నాయి. ఈసందర్భంగా స్వామి ప్రాశస్త్యంపై 12 మంది ఆళ్వార్లు రచించిన దివ్యప్రబంధ పాశురాలను వైష్ణవ జీయంగార్లు గోష్ఠిగానం చేస్తారు. కాగా, తిరుమల మొదటి, రెండవ ఘాట్‌లో ద్విచక్రవాహనాల అనుమతి సమయాన్ని విజిలెన్స్ అధికారులు పెంచారు. ఉదయం 5నుంచి రాత్రి 9.30 గంటల వరకు అనుమతించాలని నిర్ణయం తీసుకున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

శుష్క వాదోపవాదాలు!

రాజ్యాంగానికి డెబ్బయ్‌ఐదేళ్ళయిన సందర్భంలో లోక్‌సభలో జరిగిన చర్చ ఆశించినస్థాయిలో లేకపోయింది. ఎప్పటిలాగానే ఈ దేశపౌరులకు చట్టసభలో ఏదో రచ్చసాగుతోందని అనిపించింది తప్ప, తాము ఎన్నుకున్న ప్రతినిధులు దేశభవిష్యత్తుకు అత్యావశ్యకమైన అంశం మీద మాట్లాడుతున్నారని వారికి అనిపించలేదు. అధికారపక్షం, విపక్షం ఏకమాటగా అత్యంతకీలకమైన ఈ ఘట్టాన్ని ఆరంభించినందున లోతైనచర్చతో, విలువైన వ్యాఖ్యలతో, చూడచక్కని దృశ్యాలతో ఇది సాగాలని మేధావులంతా కోరుకున్నారు. రాజ్యాంగ ఆశయాలకు అనుగుణంగా పయనం సాగుతున్నదీ లేనిదీ తేల్చుకోవాలన్నా, భవిష్యత్తులో అడుగులు ఎలా పడాలో నిర్ణయించుకోవాలన్నా ఉభయపక్షాల మధ్యా సయోధ్య, సుహృద్భావం ఉండాలి. ఇంతటి ఉన్నతమైన సందర్భంలో కూడా అవే ఊకదంపుడు వ్యాఖ్యలు, నాటు విమర్శలు, మోటు మాటలు వినవలసి రావడం దురదృష్టకరం. తాము ఉన్న స్థితికీ, అనుభవిస్తున్న హోదాలూ అధికారాలకూ ఆ మహాగ్రంథమే కారణమనీ, కనీసం ఈ సందర్భంలోనైనా దానిపట్ల గౌరవంతో ఆచితూచి మాట్లాడాలనీ, ఉన్నతంగా నడవాలనీ మన నాయకులకు అనిపించలేదు.

సమీక్ష, ఆత్మవిమర్శ అవసరమైన ఈ సందర్భంలో అది సంఘటితంగా జరిగినప్పుడే ప్రయోజనకరంగా ఉంటుంది. ఆశయాలు అద్భుతంగా ఉన్నా, ఆచరణలో లోపాలు ఉంటాయి కనుక, రాజ్యాంగం అమలులో ఎదురవుతున్న సవాళ్ళను, విస్మరణలను కోపతాపాలు లేకుండా చర్చించుకోవడం అవసరం. అధికార, ప్రతిపక్షాలు ఈ సందర్భాన్ని కూడా ఎదుటిపక్షాన్ని తప్పుబట్టడానికీ, అవమానించడానికి వాడుకోవడం ద్వారా పైచేయి సాధించాలని తెగ తాపత్రయపడ్డాయి. ఒక విధంగా, ఈ పరస్పర దూషణలో ప్రజలకు ఈ పార్టీలేవీ తమ పక్షాన లేవని మరోమారు అర్థమైంది. ఇందిర కాలంలో విధించిన అత్యయిక స్థితిని కాంగ్రెస్ మీద బ్రహ్మాస్త్రంలాగా అధికారపక్షం ప్రయోగించడం కొత్తేమీ కాదు. అది అధికారికంగా జరిగితే, ఇప్పుడు అనధికారికంగా అంతకంటే భయానకమైన అప్రకటిత ఎమర్జెన్సీ దేశంలో అమలవుతోందని విపక్షం ఆరోపించడమూ పదేళ్లుగా చూస్తున్నదే. ఎమర్జెన్సీని ప్రకటించి ఇందిరా గాంధీ రాజ్యాంగాన్ని చీలికలు పీలికలు చేశారంటూ నరేంద్రమోదీ తన అద్భుతమైన వాగ్ధాటితో అప్పటి పరిస్థితులను అభివర్ణించారు. జైళ్ళు, మీడియా, ప్రజలు, స్వేచ్ఛ, ఉక్కుపాదాలు, అణచివేత వంటి మాటలు దట్టించిన ఈ దాడిలో అతి ఉండవచ్చునేమో కానీ, అసత్యమేమీలేదు. అయితే, దానిని ఆయన ఒక ప్రస్తావనగా కాక ఓ ఘాటైన రాజకీయ విమర్శగానే చేశారు. సుదీర్ఘకాలం దేశాన్ని ఏలిన కాంగ్రెస్ హయాంలో అనేక రాజ్యాంగబద్ధ స్వతంత్ర సంస్థలు, వ్యవస్థలు ఏర్పడి, ఈ దేశంలో ప్రజాస్వామ్యం వేళ్ళూనుకున్న విషయాన్ని కూడా ఆయన ఓ మాటగా ప్రస్తావించివుంటే బాగుండేది. వేరుపడిన పాకిస్థాన్ ప్రబల నిదర్శనంగా పొరుగునే ఉన్నది కనుక, మనం కోల్పోని రాజ్యాంగ ఆశయాలను, కాపాడుకున్న విలువలనూ కొన్నింటిని స్మరించి, వాటి పునాదిగా ఎదిగిన క్రమాన్ని ఈ సందర్భంలో ప్రస్తావించి ఉంటే సరిపోయేది. తన హయాంలోనే దేశం ఎదిగిందనీ, వెలుగులు చూసిందనీ, దశాబ్దాల కాంగ్రెస్ ఏలుబడిలో అంతా చీకటేనని ఆరోపిస్తున్నందున ఈ సందర్భంలో కూడా ఆయన నోట ఓ మంచిమాట రాకపోయింది. అప్పటి తప్పిదాన్ని ఒప్పుకోవడానికీ, అత్యయిక స్థితిని ఓ మాటగా ఖండించడానికి కాంగ్రెస్ పార్టీకి కూడా ఇంతకుమించిన తరుణం లేదు. కానీ, ఎప్పటిలాగానే, సంస్థలు, వ్యవస్థల విచ్ఛిన్నంమీద అది ఆరోపణలు ఎక్కుపెట్టింది. రాజ్యాంగం మీద చేయాల్సిన చర్చను నెహ్రూ కుటుంబం చుట్టూ తిప్పడానికి అధికారపక్షానికి ఎందుకంత ఉత్సాహమో అర్థంకాదు. ఉభయపక్షాలు ప్రస్తావించిన విషయాలేమీ ఇప్పుడు కొత్తగా విన్నవేమీ కాదు కనుకనే, చాలామందికి ఇది రాజ్యాంగంపై చర్చలాగా కాక, అవిశ్వాస తీర్మానం రచ్చలాగా అనిపించింది.

ప్రజాస్వామ్యం, లౌకికవాదం, న్యాయవ్యవస్థ సహా పలు స్వతంత్ర వ్యవస్థల మనుగడ, పౌరహక్కులు, అణచివేతలు, అక్రమ నిర్బంధాలు ఇత్యాది అంశాలపై తమ నిబద్ధతను పునరుద్ఘాటించి, ఈ దేశ ప్రజలకు ఓ మాట ఇచ్చేందుకు మన నాయకులెవ్వరూ సిద్ధంగా లేరన్న విషయం మరోమారు స్పష్టమైంది. రాజ్యాంగం పట్ల గౌరవం ఉన్నా, ఆ వెలుగుబాటలో నడవాలన్న సదాశయం ఉన్నా ఈ చర్చ మరింత ఉన్నతంగా జరిగేది. రాజ్యాంగ ఆశయాలకు పూర్తిభిన్నంగా వ్యవహరిస్తూ, సకల అరిష్టాలకు మీరే కారకులని పరస్పరం విమర్శించుకుంటూ, త్వంశుంఠ నాటకాన్ని ఎంతకాలమైనా కొనసాగించగల తెలివితేటలు మన నాయకులకు కావల్సినన్ని ఉన్నాయి.

రెవెన్యూ సదస్సులు ఇలా ఉంటే సత్ఫలితాలు ఎలా?


దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఏభై ఏళ్ళ క్రితం సాహసోపేతంగా మునసబు, కరణాల వ్యవస్థను రద్దు చేసినపుడు అంతా ఆనందించారు. కానీ ప్రస్తుత గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థ ఆ మునసబు, కరణాల వ్యవస్థే మేలనిపించేంతగా దిగజారింది. మొత్తం రెవెన్యూ వ్యవస్థ ప్రస్తుతం పీడన వ్యవస్థగా మారిందన్నది అందరూ గుర్తించే వాస్తవం. దీనికి 90 శాతం అధికారులే బాధ్యులు.

ప్రతీ సోమవారం కలెక్టర్లు జరిపే ప్రజా ఫిర్యాదుల కార్యక్రమానికి వచ్చే సమస్యల్లో అత్యధికం రెవిన్యూ సమస్యలే. కలెక్టర్లు తగు పరిష్కారం కోసం అంటూ ఎండార్స్‌మెంట్ ఇవ్వడం తప్ప వాటికి శాశ్వత పరిష్కారం లేకుండా పోతోంది. క్షేత్ర స్థాయిలో జేసీ, ఆర్డీఓలు క్రియాశీలకంగా లేక వీటికి పరిష్కారం లభించడం లేదు. వ్యవసాయ భూములకు సంబంధించి వచ్చిన సమస్యలపై తహసీల్దార్లు సరైన శ్రద్ధ చూపకుండా ఆర్ఐ, వీఆర్వో, సర్వేయర్ల రిపోర్ట్‌లపై ఆధారపడటం కూడా ఆ సమస్యలు అపరిష్కృతంగా ఉండటానికి ప్రధాన కారణం. చాలామంది వీఆర్వోలు, సర్వేయర్లు పనికి ఒక రేటు చెప్పి అవి చెల్లిస్తేనే ఆ పని జరిగేలా చూస్తున్నారు. లేకుంటే ఏదో కారణం చెప్పి దరఖాస్తును ఆన్‌లైన్‌లో తిరస్కరిస్తారు. ఆన్‌లైన్‌లో తమ పేరు లేకపోతే భూమిపై హక్కు కోల్పోతామని భయపడి రైతులు ఎంతోకొంత ముట్టచెప్పి పని కానిచ్చుకుంటున్నారు. తప్పుగా నమోదు అయిన చిన్న పేరు సవరించడానికి కూడా జేసీ దాకా వెళ్లే పరిస్థితి నెలకొని ఉంది. వీఆర్వో, సర్వేయర్, తహశీల్దార్లదే రాజ్యం.

రాష్ట్రంలో భూ సమస్యలకు రెవెన్యూ సదస్సుల్లో ముగింపు పలికిస్తామంటూ ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చెబుతోంది. ఎట్టకేలకు డిసెంబర్ 6 నుంచి రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయి. రెవెన్యూ సదస్సుల్లో ఎక్కువగా వచ్చే సమస్యలు కొన్ని ఉన్నాయి.

అడంగల్‌లో యజమాని/ అనుభవదారు పేర్ల మార్పు గురించిన సమస్య ప్రధానంగా రెండు రకాలు. ఒకటి కుటుంబ యజమాని చనిపోయినపుడు వారి వారసుల పేర్లు చేర్చడం. రెండు ఎవరైనా ఒక వ్యక్తి నుంచి భూమి కొనుగోలు చేసినపుడు కొనగోలుదారు పేరు అడంగల్‌లో చేర్చి వారికి పాస్ పుస్తకాలు ఇవ్వడం. ఈ విధంగా సక్రమంగా అడంగల్‌లో పేర్లు చేర్చడం వల్ల రైతులు ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు పొందడానికి/ పంటలను కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవడానికి/ పంట నష్ట పరిహారం, బీమా పరిహారం పొందడానికి వీలవుతుంది.

సర్వే నెంబర్లతో సమస్యలు ముఖ్యంగా మూడు రకాలు: 1. కుటుంబ యజమాని చనిపోయినప్పుడు వారి వారసులు భూములు పంచుకున్నప్పుడు కాగితాల్లో రాసుకున్న విధంగా కాక భూమిపై వేరే సర్వే నెంబర్‌లో వాస్తవంగా సాగు చేసుకోవడం. 2. అలాగే ఒక రైతు సర్వే నెంబర్ 10/2లో భూమి కొన్నట్టుగా దస్తావేజులో ఉండి, వాస్తవంగా భూమిపై 10/5లో అనుభవంలో ఉండటం. 3. ఒక రైతు దస్తావేజులో సర్వే నెంబర్ 25 అని రాసుకుని వాస్తవంగా ఆ భూమికి దూరంగా ఉన్న సర్వే నెంబర్ 55లో అనుభవంలో ఉండటం. ఈ మూడు సందర్భాల్లో తహశీల్దార్లు సవరణ దస్తావేజు రాసుకు రమ్మని రైతులకు సూచిస్తున్నారు. భూములు అమ్మినవారు చాలా కాలం క్రితం మరణించి ఉంటారు. వారి వారసుల వద్దకు వెళ్లి సవరణ దస్తావేజు రాయమంటే వారు నిరాకరించవచ్చు. లేదా ప్రస్తుత భూముల ధరను బట్టి సొమ్ములు డిమాండ్ చేయవచ్చు. ఇలాంటి కేసుల్లో సవరణ దస్తావేజు లేకుండానే తహశీల్దార్లు క్షేత్ర పరిశీలన చేసి, సరిహద్దు రైతులు, గ్రామస్థుల నుంచి వాంగ్మూలాలు తీసుకుని ప్రస్తుతం అనుభవంలో ఉన్న సర్వే నెంబర్‌ను నిర్ధారిస్తూ వివరణాత్మక ఉత్తర్వులు జారీ చేసి, అడంగల్‌లో మార్పులు చేయవచ్చు. అలా జారీ చేసిన ఉత్తర్వులు శాశ్వత రికార్డుగా భద్రపరిస్తే భవిష్యత్తులో వివాదాలకు తావు ఉండదు. ఈ సర్వే నెంబర్ల తేడాల సమస్యపై కూడా ప్రభుత్వ స్థాయిలో నిబంధనలు తయారు చేసి, తహశీల్దార్లకు స్పష్టమైన కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ చేస్తే ఇలాంటి సమస్యలు సత్వరం పరిష్కారమవుతాయి.



రోజూ ఇన్ని వందల సభలు జరిగాయి, ఇన్ని వేల పిటిషన్లు వచ్చాయని సమాచార సేకరణకే పరిమితం కాకుండా, వచ్చిన సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారం కావడమే రెవెన్యూ సదస్సుల లక్ష్యం కావాలి. ప్రతీ రెవెన్యూ అధికారి స్థాయితో నిమిత్తం లేకుండా తమ వద్దకు వచ్చిన ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, ఏ విధమైన ప్రలోభాలకూ లోను కాకుండా ప్రతిఫలం ఆశించకుండా పనిచేస్తే నూటికి 80శాతం సమస్యలు సత్వరం పరిష్కారమవుతాయి.

ఈనాము భూముల విషయానికి వస్తే– ఈ విషయంలో 1956లోనే ప్రభుత్వం చట్టం చేసి స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చింది. కానీ దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించ లేదన్న చందంగా రెవెన్యూ సిబ్బంది ఉన్నారు. దేవస్థానం/ దేవుని పేరుతో ఉన్న సర్వీసు ఈనాములు తప్ప మిగిలిన గ్రామ సర్వీసు ఈనాములను రైత్వారీ భూములుగా పరిగణించి/ మార్చి పట్టాదారు పాసు పుస్తకాలు ఇమ్మంటే వాటి అమలులో కూడా అలసత్వం, విపరీతమైన జాప్యం జరుగుతున్నది.

ఇక చుక్కల భూముల విషయమై 2017లో తెలుగుదేశం ప్రభుత్వమే ఉత్తర్వులు ఇచ్చి వాటికి పాసు పుస్తకాల జారీకి విధి విధానాలు జారీ చేసింది. 2022లో వైసీపీ ప్రభుత్వంలో సీసీఎల్ఏగా ఉన్న సాయిప్రసాద్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా కిందిస్థాయి రెవెన్యూ అధికారులు వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవు.

22ఎ నిషేధ భూములు– ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ, దేవాదాయశాఖవారు కొన్ని సర్వే నెంబర్లను గ్రామాలవారీగా సబ్ రిజిస్ట్రార్లకు పంపారు. అలా పంపినపుడు సబ్ డివిజన్లు పేర్కొనకుండా పూర్తి సర్వే నెంబర్ పంపడం వల్ల ఆ సర్వే నెంబర్లలో మిగిలిన రైతులు భూములను అవసరాలకు అమ్ముకోలేక 2015 నుంచి ఇబ్బందులకు గురవుతున్నారు. రెవెన్యూ, దేవాదాయ శాఖలు ఆ తప్పులు సవరించకుండా రైతులను తమ కార్యాలయాల చుట్టూ సంవత్సరాల తరబడి తిప్పించుకుంటున్నారు.

రెవెన్యూ ఉన్నతాధికారులు లేని అధికారాన్ని కట్టబెట్టుకొని 2011లో రెవెన్యూ రికార్డులు కంప్యూటరీకరణ చేసినపుడు కొన్ని భూములను రెడ్ మార్క్/ డిస్ప్యూటెడ్ కేటగిరీలో పెట్టమని ఆదేశించడం తహశీల్దార్లకు వరంగా, రాజకీయ నాయకులకు, భూ కబ్జాదార్లకు అవకాశంగా మారింది. వారు కోరినట్టల్లా తహశీల్దార్లు కొన్ని భూములను రెడ్ కేటగిరీలో పెట్టారు. ఒక ప్రైవేటు భూమిని రెవెన్యూ అధికార్లు కోర్ట్ ఆదేశాల్లేకుండా ఏ అధికారంతో డిస్ప్యూటెడ్ కేటగిరీలో పెడతారు? ఇది వైసీపీ పాలనలో భూకబ్జాలను పరాకాష్ఠకు చేర్చింది. గతంలోనే సుప్రీంకోర్టు సివిల్ తగాదాలను పరిష్కరించే అధికారం రెవెన్యూ అధికారులకు లేదని ఎన్నోసార్లు నొక్కి వక్కాణించింది. ఈ విషయంలో తహశీల్దార్లకు స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వాలి.

డి– పట్టాలు రెండు రకాలు. ఒకటి పేదవారికి రెండు నుంచి ఐదు ఎకరాల వరకు వ్యవసాయం కోసం ఇచ్చే భూములు. రెండోది పేదవారికి ఇళ్లు నిర్మించుకునేందుకు గరిష్ఠంగా మంజూరు చేసే ఐదు సెంట్లు. రానురాను అది మూడు సెంట్ల నుంచి చివరకు ఒక సెంటు వరకు తీసుకుని వచ్చారు నేటి పాలకులు. వ్యవసాయం కోసం ఇచ్చిన డి పట్టా భూములను 20 సంవత్సరాల తరువాత స్వేచ్ఛగా అమ్ముకోవచ్చని వైసీపీ ప్రభుత్వం 2023 అక్టోబర్‌లో ఉత్తర్వులు జారీ చేసింది. దీన్ని ఆసరాగా తీసుకుని వైసీపీ పెద్దలు రెవెన్యూ అధికారులను లోబరుచుకుని 20 సంవత్సరాలు పూర్తి కాని భూములను కూడా ఫ్రీహోల్డ్ చేయించి, వేలాది ఎకరాలు కొట్టేశారన్నది పెద్ద ఆరోపణ. ప్రస్తుతం అలాంటి భూములపై ఎన్డీఏ ప్రభుత్వం రిజిస్ట్రేషన్లు నిలిపివేసింది. వ్యవసాయానికి ఇచ్చిన డి – పట్టాల భూములు ఎలా ఉన్నా ఇళ్ల స్థలాలకు ఇచ్చిన 3–2 సెంట్ల భూమిని చాలామంది పేదలు తమ అవసరాలకు అమ్ముకున్నారు. వాటిని 80శాతం పేదలే కొనుక్కున్నారు. కానీ అమ్మకాలు రిజిస్ట్రేషన్ కాక తెల్లకాగితాలపైనే ఒప్పందాలుగా చేసుకున్నారు. అలాంటి వారు తమ పేరు మీద పట్టాలు మార్చుకోవడానికి నానా తంటాలుపడి రెవెన్యూ అధికారులకు ముడుపులు ఇచ్చి మార్చుకుంటున్నారు. ఇళ్ల స్థలాల కోసం 2/3 సెంట్లు ఇచ్చిన భూములు పదేళ్ళ తరువాత బేషరతుగా ప్రభుత్వమే 22ఏ నుంచి తొలగించి, అమ్ముకునేందుకు అనుమతించాలి.

రోజూ ఇన్ని వందల సభలు జరిగాయి, ఇన్ని వేల పిటిషన్లు వచ్చాయని సమాచార సేకరణకే పరిమితం కాకుండా, వచ్చిన సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారం కావడమే రెవెన్యూ సదస్సుల లక్ష్యం కావాలి. ఇక్కడ పేర్కొన్న పరిష్కారానికి వీఆర్వోల నుంచి కలెక్టర్ల దాకా చిత్తశుద్ధితో పనిచేస్తేనే ప్రభుత్వం ఆశించిన ఫలితాలు వస్తాయి. ప్రతీ రెవెన్యూ అధికారి స్థాయితో నిమిత్తం లేకుండా తమ వద్దకు వచ్చిన ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, ఏ విధమైన ప్రలోభాలకూ లోనుకాకుండా ప్రతిఫలం ఆశించకుండా పనిచేస్తే నూటికి 80శాతం సమస్యలు సత్వరం పరిష్కారమవుతాయి. అప్పుడు ప్రత్యేకంగా రెవెన్యూ సదస్సుల అవసరమే లేదు. 1989–90ల్లో సర్వే సెటిల్‌మెంట్ కమిషనర్‌గా అనందరావు ఉన్నప్పుడు ఆయన పట్టాదారు పాసుపుస్తకాలు జారీ విషయంలో ఆచరణాత్మక సూచనలు చేశారు. వాటిని దుమ్ముదులిపి ఈ రెవెన్యూ సదస్సుల్లో తహశీల్దార్లకు అందజేస్తే మేలు. అలాగే ప్రతీ 15 రోజులకు ఒకసారి సమస్యల పరిష్కారం గురించి తహశీల్దార్లను అడగాలి. లేకుంటే రెవెన్యూ సదస్సులకు అర్థమే లేకుండా పోయే ప్రమాదం ఉంది.

• మారిశెట్టి జితేంద్ర
రిటైర్డ్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్
రాజమహేంద్రవరం

వేల కోట్ల అవినీతిపై చర్యలు ఉండవా?

అవినీతి.. నిర్లక్ష్యం వేరు వేరు పదాలైనప్పటికీ ఆ పదాల పర్యవసానం మాత్రం ఎంతో విలువైన ప్రజాధనాన్ని ప్రజలకు అందకుండా చేయడమే. అవినీతి ధనం వ్యక్తులకు చేరుతుంది; నిర్లక్ష్యం, కక్షపూరిత ధోరణి వల్ల ఎంతో విలువైన ప్రజాధనం వృథా అవుతోంది. గత ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి రావడంతోనే కోట్ల రూపాయల విలువైన ప్రజావేదికను కూల్చివేశారు. దాని నిర్మాణానికి ఉపయోగించిన సొమ్ము ప్రజాధనమే, కూల్చడానికి వినియోగించిన సొమ్ము ప్రజాధనమే. పదవీకాలం ముగిసే సమయానికి వ్యక్తిగత కాంక్షతో విశాఖపట్నం రుషికొండపై అమెరికా అధ్యక్షుని వైట్‌హౌస్‌ని మించిన సదుపాయాలతో నిర్మించిన ప్యాలెస్‌కి వినియోగించిన 680 కోట్ల రూపాయలు ప్రజాధనమే. ఈ రెంటి మధ్య జరిగిన వేల కోట్ల అవినీతి, వేల కోట్ల విలువైన నిర్లక్ష్యం గురించి ఎంతచెప్పినా తక్కువే. తాజాగా వెలుగులోకి వచ్చిన అవినీతి అదానీతో విద్యుత్ ఒప్పందం సందర్భంగా 1750 కోట్ల రూపాయల ముడుపులు పుచ్చుకోవడం.

నూతన ఆంధ్రప్రదేశ్‌కు అమరావతిని రాజధానిగా ఎంపిక చేయడం మొదలుకొని, ఆ ప్రాంతంలో చేపట్టిన నిర్మాణాలకు జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుని హోదాలో ప్రత్యక్ష సాక్షి. కానీ తాను ముఖ్యమంత్రి అయిన తర్వాత అవేవీ తనకు తెలియనట్టుగా మూడు రాజధానులను ముందుకు తీసుకువచ్చారు. రాజధాని అమరావతిలో పిచ్చిచెట్లు, ముళ్లకంపలతో శ్మశానం ఉందని ఎద్దేవా చేశారు. అమరావతిలో ఎటువంటి నిర్మాణాలు జరగలేదని, కేవలం గ్రాఫిక్‌లు మాత్రమేనని ప్రచారం చేసి, వేల కోట్ల రూపాయల విలువైన నిర్మాణాలను పాడుపెట్టారు. పరోక్షంగా వేల కోట్ల రూపాయల నష్టం కలిగించారు. అభివృద్ధి పనులు జరిగే సమయంలో ఎవరైనా ప్రభుత్వ అధికారి నిర్లక్ష్యం వహించి ప్రజాధనం దుర్వినియోగం చేస్తే ఆ అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటారు. కేవలం రాజకీయ దుర్బుద్ధి, స్వార్థంతో వేల కోట్ల రూపాయల నష్టానికి కారణమైన రాజకీయ నాయకులపై ఎటువంటి చర్యలు తీసుకోరా? రాజకీయ నేతలకు ఒక రూల్.. ప్రభుత్వ అధికారులకు మరో రూలా?



ఎవరైనా ప్రభుత్వ అధికారి నిర్లక్ష్యం వహించి ప్రజాధనం దుర్వినియోగం చేస్తే ఆ అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటారు. కేవలం రాజకీయ దుర్బుద్ధి, స్వార్థంతో వేల కోట్ల రూపాయల నష్టానికి కారణమైన రాజకీయ నాయకులపై ఎటువంటి చర్యలు తీసుకోరా? రాజకీయ నేతలకు ఒక రూల్.. ప్రభుత్వ అధికారులకు మరో రూలా?

అమరావతిలో అభివృద్ధి పనులకు సంబంధించిన సందడి ప్రారంభమైంది. రాజధాని అమరావతి గ్రామాలలో ఎక్కడ చూసినా ఉత్సాహం ఉరకలు వేస్తోంది. అన్ని రకాల వృత్తుల వారికి పనులు లభిస్తున్నాయి. కార్మికుల కూడళ్లు కిటకిటలాడుతున్నాయి. నిర్మాణ కార్మికులు, రాడ్ బెండింగ్, విద్యుత్, కార్పెంటరీ, ప్లంబింగ్ కార్మికులకు ఉపాధి లభిస్తోంది. అమరావతి పరిధిలో ఒక పండుగ వాతావరణం నెలకొంది. మొత్తం 18 పనులకు సంబంధించి 11,471 కోట్ల రూపాయల పనులకు సీఆర్‌డీఏ ఆమోదం తెలిపింది. నిజానికి ఈ పనులను గత ప్రభుత్వం సకాలంలో పూర్తిచేసి ఉంటే 7,431 కోట్ల రూపాయలకే పనులు పూర్తయ్యేవి. గడచిన ఐదేళ్లలో పూర్తిగా నిర్లక్ష్యం వహించడం వల్ల ధరల పెరుగుదల, కాలయాపన నేపథ్యంలో దాదాపు 30 శాతం మేరకు నిధులు అదనంగా ఖర్చుచేయాల్సి వస్తోంది. ఈ పనులకు సంబంధించి జాప్యం, జగన్ నిర్లక్ష్యం ఖరీదు అపారం. జగన్ అధికారంలోకి రాకముందు గెజిటెడ్ అధికారుల టైప్–1, టైప్–2 క్వార్టర్లతో పాటు 4వ తరగతి ఉద్యోగులకు సంబంధించి అపార్టుమెంట్ల నిర్మాణం పనులు దాదాపు 80 నుంచి 90 శాతం పూర్తయ్యాయి. కానీ, అయిదు సంవత్సరాల పాటు ఎటువంటి నిర్వహణ లేకపోవడం వల్ల అపార్టుమెంట్లు పాడుపడినట్లుగా తయారయ్యాయి.

ఇంజనీరింగ్ నిపుణులు పరీక్షించిన తర్వాత అపార్టుమెంట్లు నిర్మాణపరంగా బాగానే ఉన్నాయని తెలపడంతో, మిగిలిన పనులు పూర్తిచేయడం నిమిత్తం 594.54 కోట్ల రూపాయలను సీఆర్‌డీఏ మంజూరు చేసింది. ఇదే సమయంలో చంద్రబాబు హయాంలో హ్యాపీనెస్ట్ పథకం కింద నిర్మించతలపెట్టిన ప్లాట్‌లకు ఆన్‌లైన్ దరఖాస్తులు కోరినప్పుడు గంట వ్యవధిలో లక్ష్యం పూర్తి అయింది. అటువంటి హ్యాపీనెస్ట్‌ను జగన్ ప్రభుత్వం వదిలేయడం వల్ల నేటి ప్రభుత్వం దాదాపు 900 కోట్ల రూపాయల మేరకు నష్టం భరించాల్సి వస్తోంది. మళ్లీ రాజధానిలో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి సందడి ప్రారంభం కావడం సంతోషమే.. మరి అధికారం ముసుగులో స్వార్థం, కక్షతో వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు ఉండవా?

అవినీతి పనులన్నీ తెరవెనుక జరుగుతాయి, వాటికి సాక్ష్యం ఉండదు. కానీ స్వార్థంతో వేల కోట్ల రూపాయల ఆస్తులను ధ్వంసం చేయడం మన కంటి ముందు జరిగింది. కోట్ల రూపాయల విలువైన ప్రజావేదిక కూల్చడానికి కారణం ఏమిటి? రాజధానిగా అమరావతికి అసెంబ్లీలో ఆమోదం తెలిపి, ఆ తర్వాత మూడు రాజధానుల పేరుతో వేల కోట్ల ఆస్తులను పాడుపెడితే చర్యలు ఉండవా? తాజాగా వెలుగులోకి వచ్చిన విద్యుత్ కుంభకోణంలో అదాని నుంచి 1750 కోట్ల రూపాయల ముడుపులు తీసుకున్నట్టు అమెరికాలోని నిఘా సంస్థ అన్ని ఆధారాలను సేకరించింది. కానీ చర్యలు తీసుకోవడానికి ఎందుకు వెనుకాడుతున్నారో ప్రజలకు అర్థం కావడం లేదు.


వేల కోట్ల రూపాయల వ్యయంతో రాజధాని అమరావతి పరిధిలో నిర్మించిన భవనాలను పాడుపెడతారని, సొంత విలాసాల కోసం వేల కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేస్తారని ప్రజలకు ముందుగా తెలిసి వుంటే జగన్‌కు ఆనాడు అధికారం కట్టపెట్టేవారు కాదు. మంచి పనులు చేస్తారనే ఉద్దేశ్యంతో అప్పుడు ఓట్లు వేసిన ప్రజలు, అదే ఓటుతో జగన్మోహన్‌రెడ్డిని ఘోరంగా ఓడించారు. వేల కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేసిన గత పాలకులపై ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత నేటి ప్రభుత్వానిదే.

○ అన్నవరపు బ్రహ్మయ్య

నకారా ఆశయాలను కొనసాగిద్దాం

నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లందరు సకాలంలో పెన్షన్ పొందుతూ ప్రశాంత జీవనం గడపడం వెనుక ధరమ్ స్వరూప్ నకారా (డి.యస్ నకారా) చేసిన కృషి, సాగించిన పోరాటం చిరస్మరణీయం. మన దేశంలో పెన్షన్ పొందుతున్న పెన్షనర్లకు ఆయన చిరస్మరణీయుడు.

డి.యస్ నకారా 1914 ఏప్రిల్ 8న ముంబైలో జన్మించి, అలహాబాద్ డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ లిటరేచర్‌లో బంగారు పతకం అందుకున్నారు. ఉర్దూ సాహిత్యంలో ఆయన చేసిన సేవలకు మాజీ రాష్ట్రపతి డాక్టర్ జాకీర్ హుస్సేన్ లాంటి ఉద్దండుల ప్రశంసలు పొందారు. సంగీత, సాహిత్య, చిత్రకళా సంస్థలలో కౌన్సిల్ సభ్యులుగా వ్యవహరించారు. ఎన్నో సంస్థలకు ఆర్థిక సలహాదారుగా, కేంద్ర ప్రభుత్వంలో, ప్రభుత్వ రంగ సంస్థలలో వివిధ పదవులు సమర్థవంతంగా నిర్వహించారు. 1972లో ఆర్థిక మంత్రిత్వ శాఖలో అదనపు కార్యదర్శిగా, రక్షణ శాఖకు ఆర్థిక సలహాదారుగా సేవలందిస్తూ పదవీ విరమణ చేశారు.



పెన్షన్‌దారుల కోసం నకారా చేసిన న్యాయపోరాటం ఆయనకు విశేషమైన గుర్తింపు తెచ్చింది. పదవీ విరమణ తరువాత భారత సేవా సమాజం న్యూఢిల్లీ పెన్షనర్స్ సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పెన్షన్ చెల్లింపులలో ప్రభుత్వాల వివక్షతను గమనించారు. 1977 సంవత్సరానికి ముందు పదవీ విరమణ చేసిన వారికి చాలా తక్కువగా వచ్చే పెన్షన్లలో వివిధ కారణాల పేరుతో కోతలు విధించేవారు. ఆనాడు అత్యధికంగా రూ.675 మాత్రమే పెన్షన్ ఉండేది. ఆ పెన్షన్‌తో కుటుంబ జీవనం గడపడం కష్టతరమయ్యేది. కేంద్ర ప్రభుత్వ సరళీకృత పింఛన్ విధానం ద్వారా లభించే ఆర్థిక, ఇతర సౌలభ్యాలు 1979 మార్చి 31 నాటికి సర్వీసులో వున్నవారికి వర్తిస్తాయని, అంతకు పూర్వం పదవీ విరమణ చేసినవారికి వర్తించవని 1979 మే 25న కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇవి పెన్షన్‌దారులను కుంగదీసాయి. అరకొర పెన్షన్‌తో జీవించడం కన్నా మరణమే మేలు అనే మానసిక భావనకు పెన్షన్‌దారులు గురయ్యారు. స్వయంగా బాధితుడైన నకారా, మరికొంతమంది పెన్షన్ బాధితులతో కలసి సుప్రీంకోర్టులో రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద కేసు దాఖలు చేశారు.

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వై.వి చంద్రచూడ్‌తో పాటు ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, వాటి పూర్వాపరాలను పరిశీలించి 1982 డిసెంబర్ 17న చారిత్రాత్మకమైన తీర్పును వెలువరించినది. అందులో– పించను అనేది యజమాని ఇష్టాయిష్టాలతో, దయతో ఇచ్చే దానం కాదు. అది పించనుదారుని హక్కు; గతంలో ఉద్యోగిగా అతడు చేసిన సేవలను గుర్తించి చెల్లించేదే పింఛన్; ఉద్యోగి పదవీ విరమణ అనంతరం వృద్ధాప్య జీవితం సుఖసంతోషాలతో, గౌరవంతో సమాజంలో జీవించేందుకు చెల్లించేదిగా పింఛన్‌ను పరిగణించాలి; పింఛన్‌దారుడు స్వశక్తిపై ఆధారపడి జీవించడానికి కల్పించబడిన ఆర్థిక, న్యాయ పరంగా ప్రభుత్వం తీసుకోవలసిన చర్య పింఛన్; కేంద్ర ప్రభుత్వం పెన్షనర్లకు ఒక తేదీని ఎంచుకొని దానికి ముందు గాని, తరువాత గాని రిటైర్ అయిన వారిని విభజించి చూడటాన్ని భారత రాజ్యాంగ ఆర్టికల్ 14కి విరుద్ధం. నిర్ణీత తేదీకి ముందు రిటైర్ అయిన వారికి కూడా, ఆ తేదీ తరువాత రిటైర్ అయిన వారితో సమానంగా పెన్షన్ సవరణ లాభాలు ఇవ్వాలి; పెన్షనర్స్ అందరినీ ఒక తరగతిగా పరిగణించి ఒకే ఫార్ములాతో పెన్షనరీ ప్రయోజనాలు వర్తింపజేయాలి. పక్షపాత ధోరణితో వ్యవహరించకూడదు అనే ముఖ్యాంశాలున్నాయి.

ఈ తీర్పును దృష్టిలో పెట్టుకొని 2014 ఏప్రిల్ 30న సుప్రీంకోర్టు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జీఓ నెం 87 తేదీ 25–5–1998 ప్రకారం ఈ తేదీకి ముందు పదవీ విరమణ చేసిన వారికి ఒక రకంగా, తరువాత రిటైర్ అయిన వారికి ఒక రకంగా పెన్షన్ ఉండరాదని పెన్షనర్లకు అనుకూలంగా తీర్పు చెప్పింది. డి.యస్ నకారా చేసిన కృషి ఫలితంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్షలాది పెన్షనర్ల జీవితాలకు ముసురుకున్న చీకట్లు తొలగిపోయాయి. భవిష్యత్‌పై విశ్వాసం ఏర్పడింది. నకారా 94 సంవత్సరాల పరిపూర్ణ జీవితం గడిపారు. ఉద్యోగ విరమణ తరువాత తన శేష జీవితాన్ని పెన్షనర్ల సేవలో గడిపారు. 2009 జూలై 29న ఆయన పెన్షనర్స్ పోరాట యోధునిగా తుది శ్వాస విడిచారు.

పెన్షనర్స్ డే (డిసెంబర్ 17) సందర్భంగా ఆ మహనీయుడు పెన్షనర్లకు సాధించి పెట్టిన రాజ్యాంగబద్ధమైన పెన్షన్ హక్కును కాపాడుకోవడమే మనం ఆయనకు ఇచ్చే ఘన నివాళి.

– వెలిశోజు రామ మనోహర్
రాష్ట్ర ఉపాధ్యక్షులు,
రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం, తెలంగాణ

విగ్రహాల రాజకీయ వలలు!

'తెలంగాణా తల్లి' విగ్రహం మీద, అధికార పార్టీ వారూ– ప్రతిపక్ష పార్టీల వారూ చేస్తున్న ఆర్భాట కార్యక్రమాలు ఇన్నీ అన్నీ కావు. 'తెలంగాణా తల్లికి, మా పార్టీయే ముద్దు బిడ్డ!' అని ఒకరంటే, 'మీ పార్టీ కాదు, మా పార్టీయే!' అని మరొకరూ! ప్రకటనలూ, పాలాభిషేకాలూ, భారీ బహిరంగ సభలూ! 'మా విగ్రహం తెలంగాణా ఆత్మగౌరవానికీ, అస్తిత్వానికీ ప్రతీక' అని ఒక పార్టీ అంటే, 'మీ విగ్రహం తెలంగాణా ఆత్మగౌరవం మీదా, అస్తిత్వం మీదా, దాడి' అని ఇంకో పార్టీ! రెండు పార్టీల వారూ, 'తెలంగాణా తల్లి బిడ్డల'మనే చెప్పుకుంటారు. ఆ బిడ్డల్లో ఒక పార్టీ వారు, 'మా విగ్రహంలో రాజసం ఉట్టిపడుతూ వుంటే, మీ విగ్రహం తెలంగాణా తల్లిని దీనాతి దీనం చేస్తోంది' అని అంటూవుంటే, ఇంకో పార్టీ వారు, 'కాదు, మీ విగ్రహం పరలోక దేవతా విగ్రహం అయితే, మా విగ్రహం బహుజన కన్న తల్లి!' అని అంటున్నారు! ఈ రకంగా, పార్టీలవారి వాద వివాదాలు!

రెండు పార్టీలూ, తెలంగాణా ప్రాంతపు బిడ్డలే! అయినా ఇరు పక్షాల వారికీ, వారి తల్లి రూపురేఖలు వేరు వేరుగా అయిపోయాయి! కారణం, అవి రాజకీయ పార్టీలు! ఎలాంటి రాజకీయాలు? లాభాల్ని దండుకునే, 'శ్రమ దోపిడీ'ని సమర్థించే, పెట్టుబడిదారీ వర్గ రాజకీయాలు!

మరో చిత్రం, ఇటు తెలంగాణాకీ, అటు ఆంధ్రాకీ ఒకే భాష! అది తెలుగు! ఆంధ్రా వాళ్ళు, 'మా తెలుగుతల్లికీ మల్లెపూదండా!' అంటారు. అక్కడ ఆంధ్రా వారికి, 'తెలుగు భాషే' తల్లి! ఇటు, తెలంగాణా వారు, 'జయ జయహే తెలంగాణ జననీ' అంటారు! ఇక్కడ, భాష పేరు కాదు, ప్రాంతం పేరు! ఆంధ్రా తల్లికి ఇప్పటికీ ఒక రూపమే. తెలంగాణా తల్లికి ఇప్పుడు రెండు రూపాలు! మొత్తం మీద ఒకే 'తెలుగు తల్లి'కి మూడు రూపాలు!

విగ్రహాల రాజకీయాల్ని చూస్తోంటే, చలం, 'హంకో మొహబ్బత్' అనే కథలో రాసిన మాటలు కొన్ని అస్పష్టంగా గుర్తొచ్చాయి. ఆ పుస్తకం తీసి ఒకసారి చూశాను. "భరత మాత! తెలుగు తల్లి! పాకిస్తాన్ మాత! ఎక్కడుంది భారత మాత! రష్యా పిత! అమెరికా అత్త! చైనా తాత! పెరూ మరదలు! ఏనాటికైనా నవ్వుకోరా జనం, మట్టిని పట్టుకుని గంతులేసిన కాలాన్ని చూసి! ఈ పద్యాలకూ, మాటలకూ ఏం గానీ, ఆ మట్టిని చూసి నీకు తల్లిలా అనిపించిందా?"... "లేవరా ఆంధ్రుడా! పడుకోవే ఆంధ్రీ! అనుకుంటో!" "మరి, తెలుగు జాతి?" "జాతి! జాతి! ఏం, మనుషులైనాక ఏదో ఒక భాష వుండదూ? ఎక్కడో ఓ చోట పుట్టరూ? ఏదో ఓ తిండి తినరూ? ఏదో మాతటా!... ఏమిటా లేవరా ఆంధ్రుడా? ఎవరి మీదకిరా లేవడం? లేవమను, పక్కలు విరగ తంతారు. ఎవరి మీదకోయీ?" చలం నించీ కొన్ని మాటలే తీశాను. భాషా సంకుచిత తత్వాన్నీ, ప్రాంతీయ దురభిమానాన్నీ, జాతీయ దురహంకారాన్నీ, గొప్ప వ్యంగ్యంతో వర్ణించాడాయన!

ఇది, విగ్రహాల గురించి కాబట్టి, కొన్ని విషయాలు తెలుసుకోవాలి. ఒక ఫలానా మనిషి ప్రతి రూపాన్ని, ఒక చిత్రంగా గానీ, శిల్పంగా గానీ, విగ్రహంగా గానీ, మలిచే కళ, వేలాది సంవత్సరాల నించీ జరుగుతున్న కళే! ఆ ప్రయత్నంలో, ఆ మనిషి రూపం ఎలా ఏర్పడినా, అది, ఫలానా మనిషి కోసం ఏర్పడేదే! ఆ మనిషి నిజం మనిషి కావచ్చు, మనం చూడని మనిషి కావచ్చు. ఊహల్లోనో, సాహిత్యంలోనో చిత్రించిన ఫలానా మనిషి కావచ్చు! అయితే, 'తెలంగాణా తల్లి'గా తయారైన విగ్రహం, తెలంగాణాలో ఏ తల్లిది? తెలంగాణాలోనే కాదు, ఏ ప్రాంతంలో అయినా, సంపన్న తల్లులూ, నిరుపేద తల్లులూ, వుంటారు. వారిలో కూడా వేరు వేరు స్థాయిలు! ఆ నిజమైన స్థాయిల్లో, ఏ స్థాయి స్త్రీ రూపం 'తెలంగాణా తల్లి రూపం' అవుతుంది?

తల్లుల స్థాయిలు వేరు వేరై వుండగా, వారిలో ఏ తల్లి రూపం తెలంగాణా తల్లిగా అవుతుంది? ఒక విగ్రహాన్ని తయారుచేసి, ఇది 'తెలంగాణా తల్లి' అనడం సాధ్యమేనా? సాధ్యం కాదు. వేరు వేరు స్థాయిల స్త్రీలని, ఒకే స్థాయిలోకి మార్చడం అసత్యం! 'ఫలానా మనిషి' కోసం అయితే తప్ప, ఇతర అవసరాల అర్థంతో, ఏ కళా రూపమూ నడవదు. నడకే లేని చోట, చిత్రాలూ, శిల్పాలూ, విగ్రహాలూ, సత్యాల్ని మాయం చేస్తాయి! ఈ కారణంతో, 'తెలంగాణా తల్లి' అయినా, 'ఆంధ్ర మాత' అయినా, అసత్యం!

కంటికి కనిపించినా, వాస్తవాల్ని అర్థం చేసుకోలేని, వర్గ చైతన్యం లేని జనాలను, 'జయ జయహే తెలంగాణ జననీ!', 'జై ఆంధ్ర మాతా!', 'బంగారు తెలంగాణా!', 'స్వర్ణాంధ్రప్రదేశ్!' వంటి నినాదాలతో, నిద్రపుచ్చి, వారిని శ్రమ దోపిడీకి అప్పజెప్పడమే కదా అస్తిత్వవాదులు చెయ్యగలిగే ఘనకార్యం! ఇప్పుడు జరగవలిసిందేమిటంటే, అస్తిత్వం పేరుతో, ఆత్మగౌరవం పేరుతో, నడిచే విగ్రహాల రాజకీయాలకి దూరంగా వుండాలి! 'శ్రమ దోపిడీ' వ్యతిరేకమైన చైతన్యాన్నీ, సమానత్వం గురించిన అవగాహననీ నేర్చుకోవాలి!




ఈ 'తెలుగు తల్లి' బిడ్డలు– తెలంగాణా వాళ్ళు గానీ, ఆంధ్రా వాళ్ళు గానీ, మాట్లాడే మాటలకి అర్థాలేమిటి? 'అస్తిత్వం' అంటారు! 'ఆత్మగౌరవం' అంటారు! 'అస్తిత్వం' అనే మాటకి 'ఉనికి' అనీ, 'గుర్తింపు' అనీ అర్థాలున్నాయి. భాషాపరంగా అయితే, 'తెలుగు వాళ్ళూ–తమిళ వాళ్ళూ'! అవే తేడాలే! ప్రాంతాలుగా అయితే, 'ఆంధ్రా వాళ్ళూ'–'తెలంగాణా వాళ్ళూ'! దేశాలుగా, 'భారతీయులూ' 'పాకిస్తానీయులూ'! 'కులాలు'గా చూస్తే, 'కింది కులాలూ'–'పై కులాలూ'! ఇలా! ఈ అస్తిత్వ భావనలన్నీ చాలా సంకుచితమైనవి. ఎందుకంటే, ఇవి 'శ్రమ దోపిడీ', 'అసమాన శ్రమ విభజన' అనే వాస్తవాల్ని, మరుగుపరుస్తాయి. ఈ వాస్తవ, మూల కారణాల వల్లనే, ప్రాంతీయ అసమానతలూ, కుల భేదాలూ, స్త్రీ–పురుష అసమానత్వమూ పుట్టుకొచ్చాయని గ్రహించడానికి, అస్తిత్వ భావనలు ఆటంకమవుతాయి.

ఇప్పుడు జరుగుతున్న విగ్రహాల రాజకీయాల సందర్భాన్నే చూద్దాం. తెలంగాణా తల్లి పిల్లలందరూ ఒకే స్థితిలో వున్నారా? అనేకులు శ్రమ చేసే వారిగానూ, అతి కొద్ది మంది ఏ శ్రమలూ చేయని వారిగానూ లేరూ? అనేక మంది జీతాల మీదా, కొద్దిమంది లాభాలూ, వడ్డీలూ, కౌళ్ళూ వంటి శ్రమ దోపిడీ ఆదాయాలమీదా బతికేవారుగానూ లేరూ? తెలంగాణా కోసం పోరాడామని చెప్పుకునే పార్టీ నాయకుల్ని గానీ, తెలంగాణాని ఇచ్చామని చెప్పుకునే పార్టీ నాయకుల్ని గానీ, సర్వే చేసి చూడండి! వీళ్ళ ఆస్తులూ, అంతస్తులూ, ఆదాయ మార్గాలూ, అన్నీ ఎలాంటివో తెలుస్తాయి! 'తెలంగాణా తల్లి' బిడ్డలైనా, 'ఆంధ్ర మాత' బిడ్డలైనా, 'ఉత్కల (ఒరిసా) జనని' బిడ్డలైనా, 'కన్నడ రాజ్యమాత' సంతానమైనా, 'తమిళ తాయి' పిల్లలైనా, 'మరాఠీ ఆయీ' పిల్లలైనా, ఒకే అస్తిత్వంతో లేరు. ఏ దేశాన్ని తీసుకున్నా, ఏ ప్రాంతాన్ని తీసుకున్నా, ఏ కులాన్ని తీసుకున్నా, జనాభాలో అసంఖ్యాకులు ఏదో ఒక రకమైన శ్రమ చేసుకుంటూ బ్రతికే వారే! అల్ప సంఖ్యాకులు మాత్రమే సిరిసంపదలతో తులతూగేవారు! కంటికి కనిపించినా, వాస్తవాల్ని అర్థం చేసుకోలేని, వర్గ చైతన్యం లేని జనాలను, 'జయ జయహే తెలంగాణ జననీ!', 'జై ఆంధ్ర మాతా!', 'బంగారు తెలంగాణా!', 'స్వర్ణాంధ్రప్రదేశ్!' వంటి నినాదాలతో, నిద్రపుచ్చి, వారిని శ్రమ దోపిడీకి అప్పజెప్పడమే కదా అస్తిత్వవాదులు చెయ్యగలిగే ఘనకార్యం! ఈ ఘన కార్యాలకోసమే, వేల లీటర్ల పాలాభిషేకాలూ, బహిరంగ సభలూ!

ఈ అస్తిత్వవాదులు, విరివిగా వాడే ఇంకో మాట, 'ఆత్మగౌరవం'! బతుకుతెరువు కోసం అవసరమైన శ్రమ సాధనాలు లేని అసంఖ్యాక శ్రామిక జనాలు, ఆ సాధనాల్ని స్వంత ఆస్తిగా గల యజమానుల కింద జీతాల బానిసత్వంలో జీవిస్తూ వుంటే, అది ఆత్మగౌరవం అవుతుందా? 'పై కులాలూ' – 'కింది కులాలూ'గా చీలివున్న సమాజంలో, ఆత్మగౌరవంతో ఎవరు ఉండగలరు? ఇంటిపని ప్రధానంగా స్త్రీలకీ, బైటిపని ప్రధానంగా పురుషులకీ అనే అసమాన శ్రమ విభజన వున్న కుటుంబ జీవితాల్లో, స్త్రీలు ఎలాంటి ఆత్మగౌరవంతో వుండగలరు?

ఇప్పుడు జరగవలిసిందేమిటంటే, అస్తిత్వం పేరుతో, ఆత్మగౌరవం పేరుతో, నడిచే విగ్రహాల రాజకీయాలకి దూరంగా వుండాలి! 'శ్రమ దోపిడీ' వ్యతిరేకమైన చైతన్యాన్నీ, సమానత్వం గురించిన అవగాహననీ నేర్చుకోవాలి!

▪ రంగనాయకమ్మ



● ఉద్యోగాలకు 'వెలుగు'నివ్వండి

ఏపీ వెలుగు వీవోఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం ధర్నాచౌక్‌లో భారీ ధర్నా నిర్వహించారు. కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, మహిళా మార్టుల్లో బలవంతపు కొనుగోళ్లను ఆపాలని కోరుతూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన వెలుగు ఉద్యోగులతో ధర్నా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. 6లో



నేడు రాష్ట్రపతి రాక

- గన్నవరం నుంచి మంగళగిరిలోని ఎయిమ్స్‌కు పయనం
- ఎయిమ్స్ స్నాతకోత్సవంలో పాల్గొననున్న ద్రౌపది
- గన్నవరం నుంచి మంగళగిరి వరకు బందోబస్తు
- హనుమాన్ జంక్షన్‌లో ట్రాఫిక్ మళ్లింపు
- ఏర్పాట్లపై సీపీ ప్రత్యేక సమీక్ష సమావేశం



గన్నవరం/గుణదల/హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. గన్నవరం విమానాశ్రయంలో సోమవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంగళగిరిలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఢిల్లీ నుంచి మంగళవారం గన్నవరం విమానాశ్రయానికి రానున్నారని తెలిపారు. రాష్ట్రపతి పర్యటనకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గవర్నర్, ముఖ్యమంత్రి, ఇతర అధికారులు రాష్ట్రపతికి స్వాగతం పలకనున్నారని తెలిపారు. విమానాశ్రయంలో ఆయా శాఖల అధికారులకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించి ప్రొటోకాల్‌లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా విజయవంతం చేయాలని కోరారు.

539 మంది పోలీసులతో బందోబస్తు

రాష్ట్రపతి పర్యటన సందర్భంగా 539 మంది పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు. విమానాశ్రయం చుట్టూ, మంగళగిరి వరకూ పోలీసుల పహారా ఏర్పాటు చేశారు. 9 మంది డీఎస్పీలు, 19 మంది సీఐలు, 50 మంది ఎస్సైలు, ఏఎస్సై, 81 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 215 మంది పీసీలు, 64 మంది ఉమెన్ పీసీలు, 247 మంది హోంగార్డులు బందోబస్తులో పాల్గొంటున్నారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.

జంక్షన్‌లో ట్రాఫిక్ మళ్లింపు

రాష్ట్రపతి పర్యటన సందర్భంగా హనుమాన్ మిగతా 6లో..



లెక్క తేలుస్తున్నారు..!

పేర్ని నాని గోడౌన్‌లో అధికారుల లెక్కలు

ఎంత బియ్యం మాయమైందో పరిశీలన

స్వాధీనం చేసుకున్న బియ్యం ఎంఎల్ఎస్ పాయింట్‌కు..

రెండు రోజుల తరువాత పూర్తిస్థాయి వివరాలు

గోడౌన్ తాళాలు పగులకొట్టి తనిఖీలు 8లో



పొట్లపాలెంలోని పేర్ని నాని గోడౌన్ గేటు వద్ద వైసీపీ నాయకులు

మచిలీపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మాజీమంత్రి పేర్ని నానికి చెందిన గోడౌన్‌లోని బియ్యం లెక్కలను తేల్చే పని సోమవారం సాయంత్రం మళ్లీ మొదలైంది. పౌరసరఫరాలు, రెవెన్యూ, పోలీస్ అధికారులు బృందంగా ఏర్పడి మచిలీపట్నం మండలంలోని పొట్లపాలెంలో ఉన్న నాని గోడౌన్ వద్దకు చేరుకుని లెక్కలు చూసే పనిని ప్రారంభించారు. అధికారులు, సిబ్బంది మినహా మరెవరినీ అనుమతించలేదు. ఎస్పీ అనుమతులు ఉంటే తప్ప అనుమతించబోమని పోలీసులు స్పష్టం చేశారు.

తనిఖీలు ముమ్మరం

గోడౌన్‌లో ఎంతమేర బియ్యం నిల్వలు ఉండాలి, ఎంతమేర ఉన్నాయి, ఇతర అంశాలపై పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ పద్మాదేవి, ఆర్డీవో కె.స్వాతి, మచిలీపట్నం రూరల్ సీఐ ఏసుబాబు నేతృత్వంలో సోమవారం తనిఖీలు చేపట్టారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని పేర్ని నాని గోడౌన్ ఆవరణలోని వెయింగ్ మిషన్ వద్ద కాకుండా, మచిలీపట్నంలోని వేరే వెయింగ్ మిషన్ వద్ద కాటా వేసి లెక్కగట్టాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్టు చెబుతున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలను మచిలీపట్నం మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించేందుకు వాహనాలు, హమాలీలను సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఒక్కో లారీలో బియ్యం బస్తాలు ఎత్తి, మళ్లీ దిగుమతి చేసేందుకు కనీసం 5 గంటలు పడుతుందని, స్టాక్ మొత్తం తరలించాక పూర్తిస్థాయి లెక్కలు తెలుస్తాయని చెబుతున్నారు. గోడౌన్ ఖాళీ చేయడానికి కనీసం రెండు రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. సోమవారం సాయంత్రానికి ఒక లారీ బియ్యాన్ని మాత్రమే తరలించారు.

పేర్ని నాని ఇంటికి వైసీపీ నాయకులు

బియ్యం మాయం కేసులో చిక్కుకున్న పేర్ని నాని కుటుంబసభ్యులు వారం రోజులుగా మిగతా 6లో..

ఎంత మొత్తం..?

పేర్ని నానికి చెందిన గోడౌన్లలో 187 టన్నుల బియ్యం తగ్గాయని, వాటి విలువ ఎంతో చెబితే అంతమేర నగదు చెల్లిస్తామని యజమాని, పేర్ని నాని భార్య జయసుధ గతనెల 26న జేసీ గీతాంజలిశర్మకు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో గతనెల 28, 29, 30 తేదీల్లో పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. తగ్గిన బియ్యానికి రూ.1.70 కోట్లు చెల్లించాలని అధికారులు చెప్పారు. దీంతో పేర్ని నాని తన మనుషుల ద్వారా కోటి రూపాయల డీడీలు తీయించి ఈనెల 14న జేసీ కార్యాలయంలో అందించారు. మరో రూ.70 లక్షలను సోమవారం చెల్లించారు. అయితే, సోమవారం అధికారులు ఈ గోడౌన్లను పూర్తిస్థాయిలో తమ ఆధీనంలోకి తీసుకోగా, లెక్కలు చూశాక గానీ, ఎంతమొత్తంలో బియ్యం మాయమైంది, ఎంతమేర నగదు చెల్లించాల్సి వస్తుంది, తదుపరి చర్యలు ఏం తీసుకోవాలనే అంశంపై అప్పుడు నిర్ణయిస్తామని అధికారులు చెబుతున్నారు.

చౌకబేరం



రూ.కోట్లలో ఆదాయం

ఉమ్మడి కృష్ణాజిల్లాలో రేషన్ బియ్యం దోపిడీ

చౌక దుకాణాల వద్ద బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఈ దోపిడీ వ్యవహారమంతా పకడ్బందీగా పక్కా ప్లాన్‌తో చేస్తున్నారు. చౌక దుకాణాలకు చేరకముందే మండల లెవల్ స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింట్ల నుంచి బియ్యం బహిరంగ మార్కెట్‌కు పంపేస్తున్నారు. ఉమ్మడి కృష్ణా మొత్తంగా ప్రతి మండల స్టాక్ పాయింట్‌లో 10 వేల నుంచి 15 వేల క్వింటాళ్లు, ఆపైన తరుగు బియ్యం నిల్వ ఉన్నట్టు తెలుస్తోంది. బఫర్ గోడౌన్లలోనూ ఇదే పరిస్థితి ఉండటంతో అక్రమాలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో అర్థమవుతుంది.

ఎంఎల్ఎస్ పాయింట్లలో 15 వేల క్వింటాళ్ల తరుగు

ఒక చౌక దుకాణానికి సగటున 2 క్వింటాళ్ల మేర తగ్గింపు

యథేచ్ఛగా బయటి మార్కెట్‌కు తరలింపు

పేర్ని నాని ఉదంతం తర్వాత కూడా కదలని అధికారులు

ఆరు నెలలుగా తనిఖీలు చేయని సివిల్ సప్లయిస్, విజిలెన్స్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మాజీ మంత్రి పేర్ని నానికి చెందిన బందరులోని బఫర్ గోడౌన్‌లో బియ్యం నిల్వల మాయం ఘటన నేపథ్యంలో.. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ఎంఎల్ఎస్, బఫర్ గోడౌన్లలో బియ్యం నిల్వల తరుగు అంశాలు చర్చకు వస్తున్నాయి. ఉమ్మడి కృష్ణాజిల్లాలో 50కు పైగా ఎంఎల్ఎస్ పాయింట్ గోడౌన్లు ఉన్నాయి. ఇవికాకుండా మరో 25 వరకు బఫర్ గోడౌన్లు ఉన్నాయి. మండల లెవల్ స్టాక్ పాయింట్లలో సగటున 10 వేల క్వింటాళ్ల నుంచి 15 వేల క్వింటాళ్ల మేర రేషన్ నిల్వలు తక్కువగా ఉన్నట్టు సివిల్ సప్లయిస్ అధికారుల దృష్టికి వచ్చినట్టు తెలుస్తోంది. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచి తనిఖీలకు ఆదేశించినట్టు సమాచారం. ఎంఎల్ఎస్ పాయింట్లలో రేషన్ నిల్వలు తక్కువగా ఉన్నప్పటికీ ఆరు నెలలుగా సివిల్ సప్లయిస్ అధికారులు కానీ, విజిలెన్స్ అధికారులు కానీ ఎలాంటి తనిఖీలు చేయలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ అడ్డగోలు వ్యవహారాలు భారీగా జరిగాయి. కైకలూరు, మొవ్వ, నూజివీడు, మైలవరం తదితర ఎంఎల్ఎస్ పాయింట్లలో బియ్యాన్ని అక్రమంగా తరలించారు. వీటిపై పలుమార్లు 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాలు ప్రచురించింది.

ఎంఎల్ఎస్ పాయింట్లలో దోపిడీ ఇలా..

పేదల బియ్యం దోచేయడానికి మండల లెవల్ స్టాక్ పాయింట్లు ముఖ్య కేంద్రాలుగా మారాయి. డీలర్ వేలిముద్ర వేసి బియ్యం తీసుకునే విధానం లేనపుడు ఈ దోపిడీ విచ్చలవిడిగా జరిగింది. వేలిముద్ర విధానం తీసుకొచ్చినా కూడా ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి 29 వేల క్వింటాళ్ల మేర బియ్యం దోపిడీ జరుగుతోంది. ఎంఎల్ఎస్ పాయింట్లలో ఈ-పోస్ విధానం లేకపోవటం వల్ల తూకం లేకుండానే లిఫ్టింగ్ చేసేస్తున్నారు. ప్రతి ఎంఎల్ఎస్ పాయింట్‌లోనూ మూడు టన్నుల కాటాలు ఉన్నా.. వాటిని వినియోగించట్లేదు. చాలా గోడౌన్లలో అవి పనిచేయడం లేదు. కాటా వేయకుండానే బియ్యం బస్తాలను లిఫ్టింగ్ చేయటం వల్ల రేషన్ డీలర్లకు తరుగు వస్తోంది. ఉమ్మడి జిల్లాలో 2,300 రేషన్ డీలర్లు ఉన్నారు. ఒక్కో డీలర్‌కు సగటున 75 క్వింటాళ్ల నుంచి 100 క్వింటాళ్ల వరకు రేషన్ బియ్యం కోటా వస్తుంది. ఈ కోటాలో సగటున రెండు క్వింటాళ్ల మేర కోత పడుతోంది. తరుగు పేరుతో మహా అయితే ఐదో, పదో కేజీలు వస్తుంది కానీ, 200 కేజీల బియ్యం చూపడం అనుమానించాల్సిన విషయమే. ఎంఎల్ఎస్ పాయింట్లలో కాటాలను ఉపయోగించకపోవడం వల్లే ఈ తరుగు ఏర్పడుతోంది. దీనివల్ల ఒక్కో డీలర్‌కు రెండు క్వింటాళ్ల తరుగు వస్తోంది. రెండు జిల్లాల మొత్తం డీలర్లకు సగటున 4,600 క్వింటాళ్ల బియ్యం తరుగు వస్తోంది. క్వింటా బియ్యం ఖరీదు రూ.2 వేలు. ఈ లెక్కన 15 రోజులకు 4,600 క్వింటాళ్ల ద్వారా రూ.92 లక్షలు ఎంఎల్ఎస్ పాయింట్లలో అవినీతి జరుగుతోంది.

హమాలీల మాయాజాలం

ఎఫ్‌సీఐ గోడౌన్ల నుంచి మండల లెవల్ స్టాక్ పాయింట్లకు రేషన్ బియ్యం బస్తాలు వస్తాయి. దీనిని స్టేజ్-1 అంటారు. ఒక లారీలో బియ్యం బస్తాలు వేసుకుని స్టేజ్-2లో ఉండే ఎంఎల్ఎస్ పాయింట్లకు చేర్చాల్సి ఉంటుంది. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు స్టేజ్-2 రవాణా జరుగుతుంది. లారీల నుంచి బస్తాలను హమాలీలు కిందకు దింపుతారు. ఆ తర్వాత గోడౌన్లకు చేరుస్తారు. గోడౌన్ల నుంచి కాటాపైకి చేర్చి తూకం వేశాక మళ్లీ వాటిని స్టేజ్-2 రవాణా వాహనాల్లో వేయాలి. సరుకు లోడింగ్, అన్‌లోడింగ్‌లకు వేర్వేరుగా ప్రభుత్వం డబ్బు చెల్లిస్తుంది. స్టేజ్-1 రవాణా వాహనం వెనుక స్టేజ్-2 రవాణా వాహనాన్ని నిలిపి ఇందులోని బస్తాలను అందులో వేస్తున్నారు. ఎంఎల్ఎస్ పాయింట్లలో డీలర్లు వేలిముద్ర వేసినా కూడా తూకం లేకుండా తరుగుతో బస్తాలను వేస్తున్నారు. హమాలీలు డీలర్‌కు 2 క్వింటాళ్ల చొప్పున తరుగు తీస్తున్నందున ఆ మొత్తాన్ని ఒక్కసారే స్టేజ్-1 రవాణా వాహనం నుంచి దించేసి బయటకు తరలిస్తున్నారు.

టెక్నాలజీ సాయంతో..

విపత్తులు ఎదుర్కొందాం

ఎన్ఐడీఎంలో రాష్ట్రస్థాయి శిక్షణ ప్రారంభించిన హోంమంత్రి అనిత 6లో

భవానీ దీక్షల విరమణకు

పటిష్ఠ ఏర్పాట్లు

- ఈనెల 21 నుంచి 25 వరకు ఉత్సవాలు
- ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు



8లో

కమిషనరేట్‌కు పాతరూపం



విభజనలో కోల్పోయిన స్టేషన్లు కలిపే ప్రయత్నం

ఉయ్యూరు వరకు కలిపే అవకాశాలు

మళ్లీ ఏర్పాటు కానున్న తూర్పు జోన్

ప్రభుత్వం వద్ద వేగంగా కదులుతున్న ఫైల్

జిల్లా విభజనతో ముక్కలైన పోలీస్ కమిషనరేట్‌ను మళ్లీ కలిపే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కమిషనరేట్‌కు తిరిగి పాత స్వరూపాన్ని తీసుకొచ్చే ప్రతిపాదనలు ముందుకొచ్చాయి. త్వరలోనే కూటమి ప్రభుత్వం ఈ ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసే అవకాశాలున్నాయి. ఇదే కనుక జరిగితే ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ పాత స్వరూపాన్ని సొంతం చేసుకుంటుంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ తూర్పు నియోజకవర్గంలో ఓ పక్క ఉయ్యూరు, మరోపక్క గన్నవరం, పశ్చిమ నియోజకవర్గంలో ఇబ్రహీంపట్నం.. ఒకప్పటి విజయవాడ పోలీస్ కమిషనరేట్ సరిహద్దులు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక జిల్లాల విభజన ప్రతిపాదనతో ఈ సరిహద్దులు చెరిగిపోయాయి. నగరాన్ని ఆనుకుని ఉన్న గన్నవరం, పెనమలూరు కృష్ణాజిల్లా ఎస్పీ పరిధిలోకి వెళ్లిపోయాయి. అప్పటి వరకు ఉన్న విజయవాడ పోలీసు కమిషనరేట్ పేరును ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌గా మార్చారు. గతంలో పోలీసు కమిషనరేట్ ఐదు జోన్లతో విస్తరించి ఉండేది. తూర్పు జోన్‌లో గన్నవరం, ఆత్కూరు, ఉయ్యూరు టౌన్, ఉయ్యూరు రూరల్, పమిడిముక్కల, తోట్లవల్లూరు పోలీస్‌స్టేషన్లు ఉండేవి. సిటీలో ఉండే సెంట్రల్ జోన్‌లో పటమట, మాచవరం, గుణదల, కంకిపాడు, పెనమలూరు పోలీసు స్టేషన్లు ఉండేవి. ఉత్తర జోన్‌లో సత్యనారాయణపురం, అజిత్‌సింగ్‌నగర్, నున్న పీఎస్‌లు, దక్షిణ జోన్‌లో గవర్నరుపేట, సూర్యారావుపేట, కృష్ణలంక పోలీస్‌స్టేషన్లు ఉండేవి. పశ్చిమ జోన్‌లో వన్‌టౌన్, కొత్తపేట, భవానీపురం, ఇబ్రహీంపట్నం ఉండేవి. జిల్లా విభజనతో తూర్పు జోన్ పూర్తిగా కోల్పోయింది. అప్పటి వరకు సెంట్రల్ జోన్‌లో ఉన్న పెనమలూరు, కంకిపాడు, తూర్పు జోన్‌లో ఉన్న గన్నవరం, ఆత్కూరు, ఉయ్యూరు టౌన్, ఉయ్యూరు రూరల్, పమిడిముక్కల, తోట్లవల్లూరు పోలీస్‌స్టేషన్లు కృష్ణాజిల్లా ఎస్పీ పరిధిలోకి వెళ్లిపోయాయి. అప్పటి వరకు జిల్లా ఎస్పీ పరిధిలో ఉన్న మైలవరం నుంచి జగ్గయ్యపేట వరకు పోలీసు స్టేషన్లు కమిషనరేట్‌లో కలిశాయి. తాజాగా రూపొందించిన ప్రతిపాదనల్లో విభజనలో కోల్పోయిన తూర్పు జోన్ మొత్తం తిరిగి పోలీసు కమిషనర్ పరిధిలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మిగతా 6లో..

మళ్లీ స్టేషన్ల సంఖ్య పెంపు

విజయవాడలో 13 పోలీస్‌స్టేషన్లు ఉండగా, రూరల్ పరిధిలో 15 పీఎస్‌లు ఉన్నాయి. వెరసి మొత్తం 28 పోలీస్‌స్టేషన్లతో ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనరేట్ కొనసాగుతోంది. విభజనకు ముందు కమిషనరేట్ పరిధిలో 20 పీఎస్‌లు ఉండేవి. కొత్త ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదముద్ర వేస్తే కమిషనరేట్‌లోని పోలీస్‌స్టేషన్ల సంఖ్య పెరుగుతుంది. గన్నవరం డివిజన్‌లోని ఎనిమిది పోలీస్‌స్టేషన్లు కమిషనరేట్‌లో చేరితే స్టేషన్ల సంఖ్య మొత్తం 36కు చేరుతుంది.

పన్నెండేళ్ల బాలిక.. కిడ్నాప్ కథ

- ఇంట్లో అలిగి వచ్చేసిన గుంటూరుకు చెందిన బాలిక
- కిడ్నాప్ చేశారంటూ పోలీసులకు కథ
- హడావిడి పడిన పోలీసులు.. సీసీ కెమెరాల పరిశీలన
- కట్టుకథ కావడంతో తల్లిదండ్రులకు అప్పగింత

విజయవాడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆ బాలిక వయస్సు పన్నెండేళ్లు. ఐదో తరగతి చదువుతోంది. ఇంట్లో నుంచి పారిపోయి వచ్చిన బాలిక పోలీసులకు పెద్దకథ చెప్పింది. కిడ్నాప్ చేశారని హడావిడి చేయడంతో పోలీసులు నానా హైరానా పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. గుంటూరులోని వెంగళరావునగర్ మూడో లైన్‌కు చెందిన బాలిక మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. ఆమె తండ్రి కార్పెంటర్. తల్లి ఎల్ఐసీలో ఉద్యోగిణి. ఈ బాలిక ఆదివారం సాయంత్రం పక్కింట్లో ఉన్న పిల్లలతో గొడవ పడింది. దీంతో తల్లి ఆమెను మందలించింది. హాస్టల్‌లో చేర్పిస్తానని ఆగ్రహించింది. కాలు వాపుగా ఉండటంతో సోమవారం బాలిక స్కూల్‌కు వెళ్లలేదు. తల్లి ఇంటికి తాళాలు వేసి కార్యాలయానికి వెళ్లింది. తర్వాత బాలిక ఇంటి తాళాలు తీసుకుని బయటకు వచ్చింది. అక్కడి నుంచి కారు డ్రైవర్‌ను లిఫ్ట్ అడిగి విజయవాడకు వచ్చేసింది. రహదారిపై ఉన్న ఆమెను కృష్ణలంక పోలీసులు గుర్తించారు. స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేయగా, తనను కారు డ్రైవర్ కిడ్నాప్ చేశాడని చెప్పింది. దీంతో పోలీసులు బాలిక వచ్చిన మార్గంలో సీసీ కెమెరాలను ఫుటేజీని పరిశీలించారు. ఆమె చెప్పిన ప్రదేశంలో కారు ఆగినట్టు కానీ, బాలిక ఎక్కినట్టు కానీ కనిపించలేదు. తర్వాత నెమ్మదిగా విచారణ చేయగా, అసలు విషయం వెల్లడించింది. పోలీసులు వెంటనే తల్లిదండ్రులకు ఫోన్ చేసి కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి బాలికను అప్పగించారు.

పీఎం సూర్యఘర్‌కు బ్యాంకులే వెన్నెముక

- రుణ మంజూరు దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి
- సమన్వయ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ 6లో



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్‌రావు దంపతులకు దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం అందజేస్తున్న ఈవో రామారావు

దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి

వన్‌టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్‌రావు దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం ఈవో కేఎస్ రామారావు వారికి దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



ప్రజా సమస్యలు వింటున్న కలెక్టర్ లక్ష్మీశ

స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించిందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, నైపుణ్యం మానవవనరుల అభివృద్ధి తదితర 10 సూత్రాల ఆధారంగా రూపొందిన డాక్యుమెంట్‌కు సంబంధించి కార్యాచరణలో లక్ష్యాల సాధనకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పది సూత్రాలపై ప్రత్యేక దృష్టితో శాఖలు తమ రోజువారీ కార్యకలాపాలు సాగించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రియల్‌టైం గవర్నెన్స్ (ఆర్‌టీజీ), పీజీఆర్ఎస్‌కు అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. త్వరలోనే వాట్సాప్ గవర్నెన్స్ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని, ప్రజలకు సుపరిపాలన అందించేందుకు సాంకేతికత అనుసంధానంతో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతోందని, ఇందుకు అధికారులు సన్నద్ధంగా వుండాలని సూచించారు. జిల్లాస్థూల దేశీయోత్పత్తి (జీడీడీపీ) వృద్ధికి సమన్వయంతో పనిచేయాలని, వ్యవసాయ, అనుబంధరంగాలతో పాటు పారిశ్రామిక, సేవారంగాల్లో మరింత అభివృద్ధికి అవకాశమున్న అంశాలపై దృష్టిసారించాలని సూచించారు. జిల్లాలో పర్యాటకం అభివృద్ధికి మంచి అవకాశాలున్నాయని, ఈ దిశగా కూడా ఆలోచించాలన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా దరఖాస్తులను పరిష్కరించాలని, రీ ఓపెన్ కాకుండా చూసుకోవాలని ఆదేశించారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిర్దేశ గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

సమస్యలు సత్వరం పరిష్కరించండి

» అధికారులకు డీఆర్వో ఆదేశం

మచిలీపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారవేదిక(మీకోసం) కార్యక్రమంలో అర్జీలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తోందని, ఈ కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని డీఆర్వో కె.చంద్రశేఖరరావు అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ఆర్డీవో కె.స్వాతితో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈనెల 11, 12 తేదీల్లో కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ప్రజాసమస్యలను ఎప్పటికపుడు పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని తెలిపారు. మండలం, డివిజన్, పురపాలకసంఘాలస్థాయిలో సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. కోర్టు కేసులకు సంబంధించి పర్యవేక్షణ చేసేందుకు కలెక్టరేట్‌లో లీగల్‌సెల్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వంగవీటి రాధాకృష్ణ, పక్కన ఎమ్మెల్యేలు కుమార్ రాజా, బోడెప్రసాద్ తదితరులు

పేద ప్రజల పెన్నిధి వీఎం రంగా

» మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ

» పామర్రులో స్వర్గీయ రంగా విగ్రహావిష్కరణలు

పామర్రు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీన వర్గాల జీవితాల్లోవెలుగులు నింపిన మహనీయుడు స్వర్గీయ వంగవీటి మోహనరంగా అని ఆయన తనయుడు మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ అన్నారు. పట్టణంలోని తోట రామాలయం వద్ద తాడిశెట్టి నాగేశ్వరరావు(పాము)సౌజన్యంతో ఏర్పాటుచేసిన రంగా విగ్రహాలను రాధా-రంగా మిత్రమండలి అధ్యక్షుడు తాడిశెట్టి సాంబశివరావు ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యేలు వర్లకుమార్‌రాజా, బోడె ప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రాధా మాట్లాడుతూ, కులమతాలకతీతంగా ప్రజలు రంగాను వారి హృదయాల్లో నిలుపుకున్నారని, ఆయన చరిత్ర గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదన్నారు. ఆయన తనయుడిగా ప్రజలు చూపిస్తున్న ఆదరణ సంతృప్తికరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా మాట్లాడుతూ, పేదల గుండెల్లో సుస్థిర స్థానం దక్కించుకున్న మహనీయుడు రంగా అన్నారు. ఎమ్మెల్యేలు కాగిత కృష్ణప్రసాద్, బోడె ప్రసాద్‌లు మాట్లాడుతూ, రంగా కులమతాలకతీతంగా ప్రజలకు చేసిన సేవలు మరువలేనివన్నారు. చెన్నుపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ, రంగాకు పామర్రుతో మంచి సాన్నిహిత్యం ఉండేదన్నారు. రంగా ఆశయ సాధనకు నేటి యువత ముందుకు సాగాలని కోరారు.



టెక్నాలజీ సాయంతో.. విపత్తులు ఎదుర్కొందాం

» ఎన్ఐడీఎంలో రాష్ట్రస్థాయి శిక్షణ ప్రారంభించిన హోంమంత్రి అనిత



శిక్షణకు వచ్చిన వారితో హోంమంత్రి అనిత

గన్నవరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు శిక్షణలు దోహదపడతాయని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. రాష్ట్రంలో విపత్తు ప్రమాద తగ్గింపు ప్రయత్నాలను బలోపేతం చేయాలన్నారు. టెక్నాలజీని వినియోగించుకుని విపత్తులను ముందుగానే పసిగట్టాలని చెప్పారు. కృష్ణాజిల్లా గన్నవరం మండలం కొండపావులూరు సర్వే నెంబర్ 6లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్(ఎన్ఐడీఎం) సౌత్ క్యాంపస్‌లో ఎన్ఐడీఎం, ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఏపీఎస్‌డీఎంఏ) సహకారంతో మూడురోజుల పాటు జరగనున్న శిక్షణను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ, జాతీయ, రాష్ట్రస్థాయి అధికారుల మధ్య సహకారాన్ని పెంపొందించటం ద్వారా విపత్తు ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. దీనికోసం వినూత్న, వనరుల సమర్థమైన వ్యూహాలను అవగాహన చేసుకోవాలన్నారు. విజయవాడలో బుడమేరు వరదలను ఎదుర్కోవటంలో ఎన్డీఆర్ఎఫ్ వంటి సంస్థలు సమర్థవంతంగా పనిచేశాయన్నారు. హుద్‌హుద్, బుడమేరు ఇతర విపత్తులను సీఎం చంద్రబాబు సారథ్యంలో ఎదుర్కొన్నామని చెప్పారు. సముద్రంలో వేటగాళ్లను అప్రమత్తం చేసే సాంకేతిక పరికరాలను కూడా గత ప్రభుత్వం మూలన పడేసిందన్నారు. రాష్ట్రంలో ఎటువంటి విపత్తు వచ్చిన సమర్థవంతంగా ఎదుర్కొనేలా సీఎం చంద్రబాబు ఆదేశాలతో అన్ని శాఖల అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వటం అభినందనీయమన్నారు. విపత్తు నిధుల గురించి డోకా లేదన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రమాదం అంచనా, ముందస్తు అవగాహన స్పందనపై అన్ని శాఖల అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఆర్పీ సిసోడియా మాట్లాడుతూ, రిస్క్ నిర్వహణపై అధికారులకు ఒకింత అవగాహన ఉండటం వలనే విజయవాడ వరదలను ఎదుర్కొగలిగామన్నారు. మహిళా, శిశు సంక్షేమ, సమగ్ర శిక్ష అభియాన్, విద్య, ఆర్‌అండ్‌బి, ఇరిగేషన్, హెల్త్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్, ఫైర్, పోలీసు, రెవెన్యూ, మండల పరిషత్ శాఖలకు చెందిన 53మంది శిక్షణకు హాజరయ్యారు. ఎన్ఐడీఎం ప్రాంగణంలో హోంమంత్రి అనిత, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఆర్పీ సిసోడియాలు మొక్కలు నాటారు. ఎన్ఐడీఎం జాయింట్ డైరెక్టర్ పీఎస్ రెడ్డి ప్రాంగణంలో సేవలను వివరించారు. ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్ ప్రసన్న కుమార్, డాక్టర్ బాలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

సమస్యలు పరిష్కరించండి

» వెలుగు ఉద్యోగుల ధర్నా

ధర్నాచౌక్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం తమను ఉద్యోగాల నుంచి తొలగించేందుకు జారీచేసిన సర్క్యులర్‌ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని వీఓఏలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, మహిళా మార్టుల్లో బలవంతపు కొనుగోళ్లను ఆపాలని కోరుతూ స్థానిక ధర్నాచౌక్‌లో ఏపీ వెలుగు వీఓఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ధర్నాలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పనిభారం తగ్గించాలని, అక్రమంగా తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, కోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని, బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడుతూ, వీఓఏలపై పనిభారం పెంచుతూ మానసిక వేదనకు గురిచేస్తున్న ప్రభుత్వ విధానాలను వెంటనే మార్చాలని డిమాండ్ చేశారు. రోజుకో యాప్‌తో వీరి జీవితాలతో అధికారులు ఆటలాడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా వేలాదిమందిని ఉద్యోగాల నుంచి తొలగించడం పరిపాటిగా మారిందన్నారు. రాష్ట్ర అధ్యక్షురాలు రూపాదేవి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంపై వీఓఏలు పెట్టుకున్న ఆశలను అడియాశలు చేయకుండా హామీలు అమలు చేయాలన్నారు. సమస్యలపై సీఎం చంద్రబాబు స్పందించి తగిన న్యాయం చేయాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు వి.ఉమామహేశ్వరరావు, ఆర్వీ నర్సింహారావు వీఓఏల పోరాటానికి మద్దతు ప్రకటించారు. సెర్ప్ సీఈవో వీర పాండియన్ యూనియన్ ప్రతినిధులతో సెర్ప్ కార్యాలయంలో చర్చలు జరిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

నేడు రాష్ట్రపతి రాక

(5వ పేజీ తరువాయి)

జంక్షన్‌లో ట్రాఫిక్ మళ్లించనున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. హైదరాబాద్ వెళ్లే వాహనాలను జంక్షన్ నుంచి నూజివీడు, ఇబ్రహీంపట్నం వైపు, చెన్నై వెళ్లే వాహనాలను జంక్షన్ నుంచి గుడివాడ, పామర్రు, ఒంగోలు మీదుగా దారి మళ్లిస్తున్నట్లు వివరించారు.

అప్రమత్తంగా ఉండాలి : సీపీ

రాష్ట్రపతి బందోబస్తు విషయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు సూచించారు. నగరంలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్‌లో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మంగళవారం ఉదయం గన్నవరం విమానాశ్రయంలో దిగి రోడ్డు మార్గాన 16 కిలోమీటర్లు ప్రయాణం చేసి ఎయిమ్స్ హాస్పిటల్‌కు రాష్ట్రపతి చేరుకోనున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో గూడవల్లి నుంచి కనకదుర్గ వారధి వరకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. స్నాతకోత్సవం ముగిశాక తిరిగి ఆమె రోడ్డు మార్గంలోనే మంగళగిరి నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారని, అప్పటి వరకు సిబ్బంది అలసత్వం వహించకుండా విధులు నిర్వహించాలని చెప్పారు. ఎక్కడైనా ఏదైనా వాహనం బ్రేక్‌డౌన్ అయితే తక్షణమే సదరు వాహనాన్ని పక్కకు తొలగించేందుకు సిద్ధపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు ఉమామహేశ్వరరాజు, ఏ.బి.టి.ఎస్.ఉదయరాణి, కృష్ణమూర్తి నాయుడు, ఎస్.వి.డి.ప్రసాద్, ఏడీసీపీలు ఎం.రాజారావు, ఎ.వి.ఎల్.ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

కమిషనరేట్‌కు పాతరూపం

(5వ పేజీ తరువాయి)

ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌లో ప్రస్తుతం సెంట్రల్, సౌత్, వెస్ట్, తిరువూరు, నందిగామ జోన్లు ఉన్నాయి.

తీరనున్న 'గన్నవరం' సమస్య

గన్నవరం విమానాశ్రయం ప్రస్తుతం కృష్ణాజిల్లా ఎస్పీ పరిధిలో ఉంది. నిరంతరం ఇక్కడ డాగ్, బాంబ్ స్క్వాడ్ తనిఖీలను విజయవాడ సీఎస్‌డబ్ల్యూ పోలీసులే చేయాల్సి వస్తోంది. ప్రముఖులు వచ్చినప్పుడు బందోబస్తు భారం విజయవాడపై పడుతోంది. వీఐపీలు రాకపోకలు సాగించేటప్పుడు జిల్లా ఎస్పీ మచిలీపట్నం నుంచి 60 కిలోమీటర్లు ప్రయాణించి రావాల్సి వస్తోంది. విమానాశ్రయంలో దిగిన ప్రముఖులు నేరుగా విజయవాడకు వస్తున్నారు. లేకపోతే అక్కడి నుంచి అమరావతికి వెళ్తున్నారు. ఈ ప్రయాణమంతా విజయవాడ మీదుగానే జరుగుతోంది. దీంతో బందోబస్తు వ్యవహారాలను ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ అధికారులు చూసుకోవాల్సి వస్తోంది. దీంతోపాటు అల్లరిమూకలు, రౌడీమూకలు సరిహద్దు రేఖలను బాగా ఉపయోగించుకుంటున్నాయి. పెనమలూరు పీఎస్ పరిధిలో ఉండే గ్యాంగ్‌లు దానికి పక్కనే ఉన్న పటమట పరిధిలోకి వచ్చి వ్యవహారాలు చక్కబెడుతున్నారు. నగరం నుంచి బహిష్కరించిన రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు పెనమలూరు, గన్నవరం పరిధిలో తలదాచుకుంటున్నారు. ఇదంతా సమన్వయం, విధి నిర్వహణపరంగా ఇబ్బందులు తీసుకొస్తోంది. జిల్లా విభజన సమయంలో కమిషనరేట్‌ను ముక్కలు చేయవద్దని, యథాతథంగా ఉంచాలని అప్పటి అధికారులు ప్రభుత్వానికి విన్నవించారు. వాటిని వైసీపీ ప్రభుత్వం పక్కన పెట్టింది. ప్రస్తుతం ఎదురవుతున్న ఇబ్బందుల నేపథ్యంలో అప్పటి తూర్పు జోన్, ప్రస్తుత గన్నవరం డివిజన్‌ను కమిషనరేట్ పరిధిలోకి తీసుకురావాలని ప్రతిపాదనలు కదులుతున్నాయి. తోట్లవల్లూరు, పమిడిముక్కల పోలీస్‌స్టేషన్లు పామర్రు నియోజకవర్గం పరిధిలో ఉన్నాయి. ఈ రెండింటినీ కృష్ణాజిల్లాకు వదిలేసినా ఉయ్యూరు వరకు కమిషనరేట్ పరిధిలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పీఎం సూర్యఘర్‌కు బ్యాంకులే వెన్నెముక

» రుణ మంజూరు దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకం పోస్టర్ చూపుతున్న కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కుటుంబాలకు ఆర్థిక చేయూత, పర్యావరణ పరిరక్షణకు మేలుచేసే 'పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' పథకం అమలుకు బ్యాంకులు వెన్నెముక అని.. రుణ మంజూరు దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ బ్యాంకర్లను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పీఎం సూర్యఘర్‌పై బ్యాంకర్లతో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పథకం ద్వారా రాయితీతో ఇంటిపై సోలార్ ప్యానెల్‌ను ఏర్పాటు చేసుకొని, విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చన్నారు. ఈ పథకం కరెంటు జనరేషన్‌తో పాటు ఫ్యూచర్ జనరేషన్ బాగుకు వీలుకల్పిస్తుందన్నారు. శిలాజ ఇంధనాలపై ఒత్తిడిని తగ్గించి, పునరుత్పాదక ఇంధన వనరులను సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాల్సిన అవసరముందన్నారు. రూ.2 లక్షల విలువైన 3 కెడబ్ల్యు సోలార్ ప్యానెల్‌ను రూ.78 వేల రాయితీతో ఇంటి పైకప్పుపై ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. రూ.20 వేలు లబ్ధిదారు వాటా పోను మిగిలిన మొత్తాన్ని ఏడు శాతం తక్కువ వడ్డీతో బ్యాంకు రుణంగా పొందవచ్చన్నారు. ఈ వ్యవస్థ ద్వారా ఏడాదికి దాదాపు రూ.32 వేలు ఆదా అవుతుందని వివరించారు. మన అవసరాలకు సరిపడా మిగిలిన సౌర విద్యుత్‌ను గ్రిడ్‌కు ఇవ్వడం ద్వారా యూనిట్‌కు రూ.2.09 ఆదాయం పొందవచ్చని వివరించారు. సొంత ఇల్లు వుండి కరెంటు కనెక్షన్ వున్న వారెవరైనా డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.పీఎంసూర్యఘర్.జీఓవీ.ఇన్ ద్వారా సులభంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, ఇప్పటికే స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, వివిధ శాఖల ఉద్యోగులకు పథకంపై అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో పెద్దఎత్తున బ్యాంకు లింకేజీ దరఖాస్తులు వచ్చే అవకాశమున్నందున వాటిని సరళీకృత విధానాలతో త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ప్రతివారం పథకంపై సమీక్ష నిర్వహించనున్నామని, పథకం అమలులో జిల్లాను నెం.1లో నిలపడంలో బ్యాంకులు కీలకపాత్ర పోషించాలన్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా ప్రతి శాఖ 15 శాతం వార్షిక వృద్ధి సాధించాలని, ఈ నేపథ్యంలో పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహించాల్సిన అవసరముందని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఈ ఎ.మురళీమోహన్, నోడల్ అధికారి ఎం.భాస్కర్, ఎల్‌డీఎం కె.ప్రియాంక, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీపీఓ పి.లావణ్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

మామిడి బీమా సద్వినియోగం చేసుకోవాలి

» ఏపీ కౌలు రైతు సంఘం

గవర్నర్‌పేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బీమా ప్రీమియం చెల్లింపు గడువును వ్యవసాయశాఖ అధికారులు ఈనెల 31 వరకు పొడిగించిన కారణంగా మామిడి సాగు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘం పిలుపు నిచ్చింది. రాష్ట్రంలో మామిడి తోటలకు బీమా చెల్లింపు గడువు నవంబరు 24తో ముగిసిన కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది రైతులు బీమా ప్రీమియం చెల్లించలేక పోయారన్నారు. దీంతో సోమవారం కౌలు రైతుల సంఘం ప్రతినిధి బృందం కోరిక మేరకు ప్రీమియం చెల్లింపు గడువును డిసెంబరు 31 వరకు పొడిగించినట్టు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబులు తెలిపారు. మామిడి సాగుదారులు, కౌలుదారులు పేరుతోనే ఈ క్రాప్ చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్టు నేతలు తెలిపారు. బీమా ప్రీమియం ఒక్క రూపాయి చెల్లిస్తే, మిగిలిన మొత్తం ప్రభుత్వం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బీమా చెల్లించిన ప్రతి రైతుకు రశీదు ఇవ్వాలని, గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

పాత పెన్షన్ స్కీమ్ అమలుచేయండి

» ఆర్టీసీ చైర్మన్‌కు ఎన్ఎంయూఏ విజ్ఞప్తి

విజయవాడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఉద్యోగులకు పాతపెన్షన్ వర్తింప చేసేలా నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావుకు ఏపీపీటీడీ ఎన్ఎంయూ అసోసియేషన్ రాష్ట్ర నాయకత్వం విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, తదితర బృందం సోమవారం కొనకళ్లను కలిసి పలు అంశాలపై వినతి పత్రాన్ని అందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. పాత పెన్షన్ అమలు చేయాలని, రివైజ్డ్ పే స్కేల్స్ బకాయిలు పూర్తిగా చెల్లించాలని, ఎస్ఆర్‌బీఎస్‌ను పునరుద్ధరించాలని, ఈహెచ్ఎస్ నుంచి మినహాయింపు నిచ్చి పాత విధానాన్ని అమలు చేయాలని, ప్రతి ఏడాది 2 వేల కొత్త బస్సులు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

లెక్క తేలుస్తున్నారు

(5వ పేజీ తరువాయి) అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. వైసీపీ ఆధ్వర్యంలో ఈ నెల 13న కలెక్టరేట్ వద్ద నాయకులు చేపట్టిన ధర్నా కార్యక్రమంలో నాని, ఆయన కుమారుడు కిట్టు కనిపించలేదు. సోమవారం నాని తన ఇంటికి వచ్చారు. మాజీ మంత్రులు జోగి రమేశ్, వేముల నాగార్జున, మాజీ ఎమ్మెల్యేలు సింహాద్రి రమేశ్ బాబు, కైలే అనిల్‌కుమార్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వైసీపీ నాయకులు ఉప్పాల రాము తదితరులు ఆయనతో మంతనాలు జరిపారు.

బెయిల్ పిటిషన్‌పై విచారణ 19కి వాయిదా

ఈ కేసులో పేర్ని నాని భార్య జయసుధపై తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 11న కేసు నమోదైంది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం జయసుధ జిల్లా కోర్టును ఆశ్రయించారు. సోమవారం ఈ కేసు 9వ అదనపు జిల్లాకోర్టు న్యాయమూర్తి ఎదుట విచారణకు రానుంది. తదుపరి విచారణను ఈనెల 19కి వాయిదా వేశారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను మార్చాలనే డిమాండ్ వినిపిస్తోంది.

ఆయకట్టుకు చేరని సాగర్ నీరు!

అధికారుల నిర్లక్ష్యం, పాలకుల నిర్లిప్తత కారణంగా సుమారు 40వేల ఎకరాల ఆయకట్టు సమస్యల వలయంలో చిక్కుకుంది. ఆరుతడి పంట సాగుకు సాగర్ జలాలు అందక అన్నదాత దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. కంచికచర్ల, వీరులపాడు మండలాలకు నాగార్జునసాగర్ జలాలు వచ్చే పరిస్థితి కనుచూపు మేరలో కనిపించటం లేదు. ఆగస్టు నెల చివర్లో కురిసిన భారీ వర్షాలు, వరదలకు మూలపాడు మేజర్ కాల్వ ఎగువ ప్రాంతం తెలంగాణా రాష్ట్ర పరిధిలో ప్రధానకాల్వ యూటీలు కొట్టుకుపోగా ఇప్పటి వరకు మరమ్మతులు జరగలేదు. దీంతో ఈ రెండు మండలాల్లో ఆరుతడి పంటలకు సాగునీరు అందించే ప్రధానమైన మూలపాడు మేజర్‌కు సాగర్ జలాలు విడుదల చేయటానికి వీలుపడటం లేదు.

» ప్రశ్నార్థకంగా సాగర్ జలాలు!

» వర్షాలు, వరదలకు కొట్టుకుపోయిన యూటీలు

» ఇప్పటికీ మరమ్మతులకు నోచని వైనం

» 40 వేల ఎకరాల ఆయకట్టు రైతుల ఆందోళన



తెలంగాణలోని జమలాపురం - రేమిడిచర్ల గ్రామాల మధ్య కొట్టుకుపోయిన యూటీలు

(కంచికచర్ల, ఆంధ్రజ్యోతి)

నాగార్జునసాగర్ ఎడమకాల్వ మూడోజోన్ పరిధిలో చివరి ప్రాంతమైన కంచికచర్ల, వీరులపాడు మండలాలకు మూలపాడు మేజర్‌కాల్వ ద్వారా సాగర్ జలాలు అందుతాయి. ఈ రెండు మండలాల్లో దాదాపుగా 40 వేల ఆయకట్టు ఉంది. ప్రధానంగా మిర్చి, రబీలో శనగ, మొక్కజొన్న ఇతరత్రా పంటలు సాగు చేశారు. ప్రస్తుతం మిర్చి తోటలకు, రబీ పంటలకు తడులు పెట్టాల్సి ఉంది. తడులు పెట్టని పక్షంలో పంటలు దెబ్బతినటమే కాకుండా, దిగుబడులు గణనీయంగా తగ్గే ప్రమాదముంది. కొద్ది రోజుల నుంచి రైతులు సాగర్ జలాల కోసం వేయికళ్లతో నిరీక్షిస్తున్నారు. అయితే ఇప్పట్లో సాగర్ జలాలు వచ్చే పరిస్థితి కనిపించటం లేదు. మూలపాడు మేజర్ కాల్వ (జీరో కిలోమీటరు)కు కొద్దిదూరంలో ఎగువ ప్రాంతంలో తెలంగాణ రాష్ట్ర పరిధిలో జమలాపురం, రేమిడిచర్ల గ్రామాల సమీపంలో ప్రధాన కాల్వపై ఉన్న మూడు అండర్ టన్నెల్స్ (యూటీలు) దెబ్బతిన్నాయి. ఆగస్టు నెల చివరివారంలో కురిసిన భారీ వర్షాలు, వరదలకు యూటీలు స్ట్రక్చర్లతో సహా నామరూపాలు లేకుండా కొట్టుకుపోయాయి. కొత్త యూటీలు నిర్మించేందుకు సుమారుగా రూ.3 కోట్లు కావాల్సి ఉంటుంది. ఇప్పటికే తెలంగాణా అధికారులు ప్రతిపాదనలు రూపొందించి, ప్రభుత్వానికి నివేదించినా అనుమతి రాలేదు. నిధులు మంజూరు కాలేదు. యూటీలు కొట్టుకుపోవటం వల్ల తాత్కాలిక పనులకు వీలుపడని పరిస్థితి. స్థానిక అధికారులు తెలంగాణా అధికారులకు ఇక్కడి పంటల దుస్థితి గురించి వివరించి, యుద్ధప్రాతిపదికపై కాల్వ బాగు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ ప్రయోజనం లేదు. రైతులకు ఏమి చేయాలో పాలుపోవటం లేదు. సాగర్ జలాలు విడుదల చేసి, పంటలను కాపాడాల్సిందిగా రైతులు కోరుతున్నారు. కాల్వకు తాత్కాలికంగానైనా మరమ్మతులు చేసి నీళ్లు విడుదల చేయాల్సిందిగా నీటి సంఘం అధ్యక్షుడు, టీడీపీ నేత గురిజాల అజయ్‌కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇదే విషయమై కంచికచర్ల డీఈఈ శ్రీవాత్సవను సంప్రదించగా, తెలంగాణా రాష్ట్ర పరిధిలో యూటీలు కొట్టుకుపోవటం వల్ల మూలపాడు మేజర్‌కు సాగర్ జలాలు విడుదల చేయటం సాధ్యపడటం లేదన్నారు. అక్కడి అధికారులు బాగు చేయాల్సి ఉందని, ఇప్పటికే పలు సార్లు అధికారులను సంప్రదించామని చెప్పారు. సాగర్ జలాల ఎప్పుడు వస్తాయన్నది కచ్చితంగా చెప్పలేమన్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం



రామలింగేశ్వరనగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని కృష్ణలంక బాలాజీనగర్ నేతాజీ రోడ్డులో శ్రీనివాస కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవాన్ని వెన్నా శంకర్ దంపతులు నిర్వహించారు. పురోహితులు దేవరకొండ సనత్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు వెన్నా శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అభివృద్ధిలో సమ ప్రాధాన్యం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమర్థవంతంగా అమలు చేయడమే కాకుండా నిరంతరం కొనసాగుతాయని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. సోమవారం తూర్పు పరిధిలోని మూడో డివిజన్ జీ స్క్వేర్ హోటల్(మహానాడు రోడ్డు) దగ్గర రూ.3.50 లక్షలతో వాటర్ పైప్‌లైన్ ఏర్పాటు పనులకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ శంకుస్థాపన చేశారు. అనంతరం కాలనీలో పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు సమ ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి చేస్తున్నారని, అందులో భాగంగానే తూర్పులోని వాటర్ పైప్‌లైన్ ఏర్పాటు పనులను ఇప్పుడు ప్రారంభిస్తున్నామని అన్నారు. త్వరలోనే ఈ పనులను పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

కొత్త గవర్నమెంట్ హాస్పిటల్ ప్రాంతంలో గద్దె పర్యటన

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కొత్త గవర్నమెంట్ హాస్పిటల్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులతో కలిసి పర్యటించారు. అక్కడ ఉన్న చిరువ్యాపారులతో మాట్లాడారు. కొత్త గవర్నమెంట్ హాస్పిటల్ ఎదురుగా సర్వీస్‌రోడ్డులో ఉన్న చిరు వ్యాపారులను సమీపంలోని రోడ్డులోకి మార్చాలన్నారు. త్వరలో ఈ పరిసర ప్రాంతాల్లో రెండు ఫుడ్‌కోర్టులు ఏర్పాటు చేయనున్నామని, వ్యాపారులకు ఇష్టమైతే ఆ ఫుడ్‌కోర్టులో స్టాల్స్ కేటాయించేలా చూస్తానని గద్దె హామీ ఇచ్చారు. నిడమానూరు ఫ్లైఓవర్ పను లు పూర్తయిన తర్వాత వ్యాపారాలు నిర్వహించేలా ఏర్పాటు చేస్తానని అన్నారు. వ్యాపారులకు ఏవిధమైన ఇబ్బంది లేకుండా చూస్తానని ఎమ్మెల్యే గద్దె వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రసాద్, తాడి బాబురావు, యలమంచిలి పండు, గంగ్రాజు సత్యనారాయణ, గద్దె రమేష్, బండి కోమలి, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

పటమట: 10వ డివిజన్ ఆర్టీసీ కాలనీ రెండో రోడ్డులో మొవ్వా రామచంద్రరావు లక్ష రూపాయలు ఆన్‌లైన్ ద్వారా చెల్లించి టీడీపీ జీవిత కాల సభ్యత్వం తీసుకున్నారు. ఎమ్మెల్యే గద్దె ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సభ్యత్వ నమోదు ప్రక్రియ ముగియటానికి ఇంకా సమయం ఉందని, ఈలోగా మరిన్ని రికార్డులను టీడీపీ నమోదు చేసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అపర్ణ, ప్రసాద్, మన్నె జయప్రకాష్, వెనిగళ్ల హరనాథ్, లంకా మధుసూదనరావు, పాల్గొన్నారు.

ప్రమాదకరం ...ప్రయాణం

● రోడ్డుకిరువైపులా ఫుట్‌పాత్‌లు లేని వైనం ● రక్షణ గోడలేని మురుగుకాల్వ ● నిత్యం రద్దీగా ఉండే ఐదో నెంబరు రోడ్డు దుస్థితి







పాలిటెక్నిక్ కళాశాల రోడ్డులో ప్రమాదకరంగా మురుగు కాల్వ, రమేష్ ఆసుపత్రి వైపు నిలిచిన మురుగు, వరలక్ష్మీనగర్ కాలనీ వద్ద ఫుట్‌పాత్ లేని వైనం

(భారతీనగర్, ఆంధ్రజ్యోతి)

ఐదో నెంబర్ రోడ్డులో ప్రయాణించడానికి పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని ప్రధాన రహదారుల్లో ఒకటైన ఐదో నెంబర్ రోడ్డు నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. అంతటి ప్రాధాన్యం కలిగిన రోడ్డులో ఫుట్‌పాత్ లేకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. ఐటీఐ కళాశాల నుంచి రమేష్ ఆసుపత్రి సెంటర్ వరకు సుమారు కిలోమీటర్ దూరం ఉంటుంది. ఈ రోడ్లో ప్రభుత్వ పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలతో పాటు, లయోలా ఇంజనీరింగ్ కళాశాల, పలు ప్రభుత్వ కార్యాలయాలు, పలు కాలనీలు ఉన్నాయి. దీంతో ఈరోడ్డు నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వైపు ఉన్న సర్వీస్‌రోడ్డుకు మార్జిన్‌లో సుమారు 4 అడుగుల వెడల్పు, ఐదు అడుగుల లోతుగల మురుగు కాల్వ ప్రవహిస్తూ ప్రమాదకరంగా మారింది. ఈ ప్రాంతంలో రోడ్డుకు రెండు వైపులా ఫుట్‌పాత్ లేకపోవడంతో రోడ్డు మీద నడవాల్సి వస్తోందని పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతూ ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా మారిన మురుగు కాల్వ

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వైపు ఉన్న రోడ్డు మార్జిన్‌లో రమేష్ ఆసుపత్రి సెంటర్ నుంచి ఎల్‌ఐసీ కాలనీ వరకు సుమారు 4 అడుగుల వెడల్పు, ఐదు అడుగుల లోతుగల మురుగు కాల్వ ప్రవహిస్తుంది. ఈ కాల్వకు అధికారులు రక్షణ గోడ ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదకరంగా మారింది.

నీరు నిలిచి అధ్వానం

రమేష్ ఆసుపత్రి వైపు ఉన్న రోడ్డుకు డ్రెయినేజీ వ్యవస్థ లేక పోవడంతో వర్షం కురిసిన ప్రతి సారి నీరు నిలిచిపోవడంతో రోడ్డు అధ్వానంగా మారుతోంది.

క్షయపై వంద రోజుల అవగాహన శిబిరాలు ప్రారంభం



అవగాహన కల్పిస్తున్న జిల్లా క్షయ నివారణ అధికారులు, వాసవ్య మహిళా మండలి ప్రతినిధులు

పటమట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): క్షయలేని భారతదేశం కోసం కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన వంద రోజుల అవగాహన శిబిరాలను జిల్లా క్షయ నియంత్రణా విభాగం, వాసవ్య మహిళామండలి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఆటోనగర్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి ఐలా చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్ ఐఈసీ స్టాల్‌ను ప్రారంభించారు.

ఆయన మాట్లాడుతూ వాసవ్య మహిళా మండలి, అపోలో టైర్స్ సంయుక్త ఆధ్వర్యంలో కార్మికులకు చేస్తున్న సేవలను కొనియాడారు. జిల్లా క్షయ నియంత్రణ సమన్వయ కర్త సీహెచ్ దినేష్ మాట్లాడుతూ 15 రోజుల నుంచి దగ్గు, కళ్లె పడటం, సాయంత్రం వేళలో జ్వరం, ఆకలి లేకపోవటం, బరువు కోల్పోవటం, చిరు చెమటతో పాటు గుండెలో నొప్పి ఇలా ఏ లక్షణాలున్న దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. క్షయగా నిర్థారణ అయితే ఆరు నెలలు మందుతో పాటు పౌష్టికాహారం కోసం ప్రతి నెల వెయ్యి రూపాయలను ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఈ అవగాహన శిబిరాలు ఆటోనగర్‌తో పాటు కామినేని నగర్, రామలింగేశ్వర్‌నగర్, యనమలకుదురు కట్ట, సనత్‌నగర్, రాణిగారి తోట కృష్ణలంక, రాజీవ్‌నగంర్, కండ్రిక ప్రాంతాల్లో కూడా ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐలా పాలకవర్గ సభ్యులు ఎస్‌టీ ఎస్‌కే ఉమామహేశ్వరరావు, వాసవ్య మహిళా మండలి సిబ్బంది డాక్టర్ ఆర్ స్వర్ణలత, కె శ్రీనివాసరావు, కె. రాజామోహన్, ఎ సత్యప్రసాద్‌లు పాల్గొన్నారు.

హిందీభాషపై పట్టు సాధించాలి

పాయకాపురం: హిందీ భాషపై అవగాహన పెంచేందుకు స్థానిక రాజీవ్‌నగర్‌లోని ప్రాంతీయ ఆయుర్వేద ఆసుపత్రిలో సోమవారం రాజభాష హిందీ కార్యశాల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ అసిస్టెంట్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ బి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హిందీభాషపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని, పట్టు సాధించాలని సూచించారు.

ఇంధన పొదుపుపై అవగాహన పెంచుకోవాలి

● విట్ యునివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.మన్మధరావు



విజేతలతో ప్రిన్సిపాల్ కల్పన తదితరులు

లబ్బీపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలని, ఎనర్జీని ఏవిధంగా సేవ్ చేయాలో కూడా అవగాహన పెంచుకోవాలని విట్ యునివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.మన్మధరావు అన్నారు. సిద్ధార్థ మహిళా కళాశాలలో సోమవారం కళాశాల భౌతికశాస్త్ర విభాగం, ఆంధ్రప్రదేశ్ స్టేట్ కన్సర్వేషన్ మిషన్ ఆధ్వర్యంలో ఎనర్జీ కన్సర్వేషన్ వీక్ సందర్భంగా ఇంధనం సంరక్షణ అనే అంశంపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్.కల్పన మాట్లాడుతూ పర్యావరణాన్ని సంరక్షిస్తూనే టెక్నాలజీని కూడా అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ కళాశాలల విద్యార్థులకు క్విజ్, పోస్టర్, పీపీటీ ప్రజెంటేషన్‌లతో పాటు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల స్పెషల్ ఆఫీసర్ ఆర్.మాధవి, ఎం.గీతామాధవి, ఎస్ఎన్ సునీతా, డి.నీరజ పాల్గొన్నారు.

కొల్లు ఫౌండేషన్ క్రికెట్ విజేత డా. హసీంబేగ్ జట్టు



కెప్టెన్ డా. హసీంబేగ్‌కు ట్రోఫీ అందిస్తున్న కొల్లు పునీత్

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోబుల్ కళాశాల క్రీడా ప్రాంగణంలో 17 రోజులుగా నిర్వహించిన పోటీల్లో ఫైనల్స్‌లో డా. హసీంబేగ్ జట్టు విజయం సాధించింది. విన్నర్స్‌గా నిలిచిన కెప్టెన్ హసీంబేగ్‌కు నిర్వాహకులు కొల్లు రవీంద్ర తనయుడు కొల్లు పునీత్ ట్రోఫీని అందజేశారు. ఆదివారం రాత్రి నోబుల్ కళాశాల క్రీడా ప్రాంగణంలో జరిగిన బహుమతి ప్రధానోత్సవ సభలో విన్నర్ హసీంబేగ్‌కు, రన్నర్ ధోనీకి బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా కొల్లు పునీత్ మాట్లాడుతూ, మచిలీపట్నంలో కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో స్టేడియం నిర్మించి తీరతామన్నారు. త్వరలో వాలీ బాల్ టోర్నీ నిర్వహిస్తామన్నారు. జనవరి 2,3 తేదీల్లో యువకెరటాలు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉండి మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు మాట్లాడుతూ, యువతను క్రీడల వైపు ఆకర్షించేందుకు ఈ పోటీలు ఎంతో దోహదపడుతున్నాయన్నారు. తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీంబేగ్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ లంకే నారాయణ ప్రసాద్, జనసేన నాయకుడు గడ్డం రాజు, టీడీపీ నాయకుడు లంకే శేషగిరి, పార్వతి పాల్గొన్నారు.

పెన్షన్‌దారుల ఆనందమే మా లక్ష్యం

విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్ ఎడ్విన్

రైల్వేస్టేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెన్షన్‌దారుల ఆనందమే తమ లక్ష్యమని, ప్రతి పెన్షన్‌దారుడు కూడా చిరునవ్వుతో వెళ్లాలనే ఆశయం తమదని విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్ (మౌలిక సదుపాయాల కల్పన) పి.ఎడ్విన్ అన్నారు. సోమవారం డివిజనల్ ఆడిటోరియంలో పెన్షన్ అదాలత్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తదుపరి పెన్షన్ అదాలత్ తేదీ కోసం ఎదురు చూడకుండా పెన్షన్‌దారుల ఫిర్యాదులను, ఇతర అంశాలను పరిష్కరించడం, వారికి లబ్ధి చేకూర్చటం జరుగుతుందని తెలిపారు. పెన్షనర్లకు సంబంధించి ప్రతి అంశాన్ని తక్షణమే పరిష్కరించటం కోసం వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. సీనియర్ డివిజనల్ పర్సనల్ అధికారి కట్టా ఆనంద్ అదాలత్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా మొత్తం 92 కేసులు నమోదయ్యాయి. మూడు దరఖాస్తులకు సంబంధించి అక్కడికక్కడే క్లియర్ చేశారు. పర్సనల్, అకౌంట్స్ ఆఫీసర్లు కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ ఫైనాన్స్ ఆఫీసర్ వై. సందీప్, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఉద్యోగులకు మ్యాన్ ఆఫ్ ది మంత్ సేఫ్టీ అవార్డులు

రైల్వేస్టేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ డివిజన్‌కు చెందిన ఇద్దరు ఉద్యోగులకు సోమవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ మ్యాన్ ఆఫ్ ది మంత్ సేఫ్టీ అవార్డులను అందచేశారు. సికింద్రాబాద్ రైలు నిలయంలో సోమవారం ఆయన సేఫ్టీపై సమీక్ష నిర్వహించారు. విజయవాడ డీఆర్‌ఎం నరేంద్ర ఎ పాటిల్, ఆయా శాఖల ముఖ్య అధికారులు గుంతకల్, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్ నాందేడ్‌ల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాన్‌సూన్‌మేహం బుక్‌లెట్‌ను విడుదల చేశారు. అక్టోబరు నెలకు సంబంధించి విజయవాడ డివిజన్‌లోని ఇద్దరు ఉద్యోగులకు మ్యాన్ ఆఫ్ ది మంత్ సేఫ్టీ అవార్డు ఇచ్చారు.

ఘనంగా విజయ్ దివస్



మాట్లాడుతున్న ఎన్‌సీసీ ఆఫీసర్ ఎల్ దుర్గారావు

పటమట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర యువజన సర్వీసులశాఖ, క్రీడా మంత్రిత్వశాఖ నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో పటమట బాలుర ఉన్నత పాఠశాలలో విజయ్ దివస్‌ను సోమవారం ఘనంగా నిర్వహించారు.

1971లో బంగ్లాదేశ్ కోసం మనం భారత సైన్యం పోరాటం, పరాయి దేశం కోసం సైన్యం ఏలా త్యాగం చేసిందో అన్న అంశాలపై విద్యార్థులకు జిల్లా యువజన అధికారి సుంకర రాము వివరించారు. ఎన్‌సీసీ ఆఫీసర్ ఎల్ దుర్గారావు మాట్లాడుతూ విద్యార్థులు రేపటి పౌరులని, అగ్నివీర్ పథకాన్ని కూడా అర్థం చేసుకుని సైన్యంలో చేరి దేశానికి సేవలు అందించాలన్నారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు ఎ. సీతారెడ్డి, ప్రోగ్రామ్ నిర్వాహకులు వినోద్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



డ్రెయినేజీని పరిశీలిస్తున్న అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్, సీఈ శ్రీనాథ్

లయోలా కళాశాల రోడ్లో అసిస్టెంట్ కమిషనర్ పర్యటన

భారతీనగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నాల్గో డివిజన్ లయోలా కళాశాల రోడ్లో డ్రెయినేజీ, పారిశుధ్య నిర్వహణ పని తీరును సోమవారం అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి.చంద్రశేఖర్ పరిశీలించారు. ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ పర్యటనలో ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి సంబంధిత అధికారులు ఫీల్డ్‌లోకి రావాలన్నారు. అధికారులందరు సమస్యను సంయుక్తంగా పరిశీలించడంతో పాటు సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్, ఇన్‌చార్జి మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఈఈ సామ్రాజ్యం పాల్గొన్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర

చిట్టినగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం పటమట సర్కిల్-3 కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కారక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. నగరంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీలుగా కమిషనర్‌కు అందజేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సర్కిల్-1,2తోపాటు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో జరుగుతున్న ఫిర్యాదుల స్వీకరణను పరిశీలించారు. సర్కిల్-3లో ఆరు, ప్రధాన కార్యాలయంలో 11 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమం సర్కిల్-3 జోనల్ కమిషనర్ ఇన్‌చార్జి ప్రభుదాస్, ఈఈ సామ్రాజ్యం, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాబుశ్రీనివాస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

గణిత పోటీల్లో నారాయణ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న నారాయణ పాఠశాల యాజమాన్యం

పెనమలూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హోమీబాబా సెంటర్ ఫర్ సైన్స్ అండ్ రీసెర్చ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్ఎంఓ(రీజినల్ మ్యాథ్స్ ఒలింపియాడ్) పరీక్షా ఫలితాలు శనివారం విడుదల చేశారు. ఈ ఫలితాల్లో కానూరు, వెుగల్రాజపురం నారాయణ సీవో పాఠశాలల్లో చదువుతున్న 9, 10తరగతి విద్యార్థులు ఎం. చైతన్య, పి. ఆరవ్‌లు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ బి. సూరయ్య తెలిపారు. ఈ ఇరువురు విద్యార్థులు జనవరి 19న జరిగే ఐఎన్ఎంవో పరీక్షకు అర్హత సాధించారని, ఈ విజయానికి నారాయణ కరికులమ్, మైక్రో షెడ్యూల్స్ తోడ్పడ్డాయని ఆయన తెలిపారు. విజేతలను, వారి తల్లిదండ్రులను డీన్ కేఎస్ అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో ఏజీఎంలు యూ. విజయ, మురళీకిషోర్, సెంట్రల్ కార్యాలయం కో-ఆర్డినేటర్ రవికుమార్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాప తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందజేస్తున్న కార్పొరేటర్ బెల్లం దుర్గ, ఆళ్ల చల్లారావు

చిన్నారి చికిత్సకు ఆర్థికసాయం అందజేత

రామలింగేశ్వరనగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు పిల్లర్ కూలి తీవ్రంగా గాయపడిన చిన్నారి చికిత్సకు డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ రూ.50వేలు ఆర్థిక సాయం అందజేశారు. 16వ డివిజన్ గాయత్రీరోడ్‌లో నివసించే తోట నాగ వర్షిత(8) వారం రోజుల క్రితం డాబాపైన బట్టలు తీస్తుండగా డమ్మీ పిల్లర్ కూలడంతో తీవ్రంగా గాయపడింది. పాప తండ్రి ఆటోడ్రైవర్ కావడంతో ఆస్పత్రి ఖర్చులకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న 15వ డివిజన్ కార్పొరేటర్, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ సోమవారం చికిత్స పొందుతున్న పాపను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. పాప తల్లిదండ్రులకు ధైర్యం చెప్పి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆళ్ల చల్లారావు తదితరులు పాల్గొన్నారు.

భవానీఘాట్‌లో అనధికారిక వసూలు

● రుసుము వసూలు చేసిన యువకుడిని పోలీసులకు పట్టించిన స్థానికులు

విద్యాధరపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భవానీపురం భవానీఘాట్ వద్ద ఓ యువకుడు భక్తుల నుంచి అనధికారికంగా రుసుము వసూలు చేస్తున్నాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానిక టీడీపీ నేతలు సోమవారం ఆ యువకుడిని పట్టుకుని భవానీపురం పోలీసులకు అప్పగించారు. దుర్గగుడికి ఇతర ప్రాంతాల నుంచి టూరిస్టు బస్సులు, కార్లలో వచ్చే భక్తులకు దుర్గగుడి సమీపంలో వాహనాలకు పార్కింగ్ లేకపోవటంతో పలువురు భక్తులు తమ వాహనాలను భవానీఘాట్‌లో నిలుపుదల చేస్తున్నారు. అక్కడ నుంచి కొందరు ఆటోల్లో, మరికొందరు నడుచుకుంటూ కొండపైకి వెళుతున్నారు. ఈ క్రమంలో ఓ యువకుడు భవానీఘాట్‌లో పార్కింగ్ చేసిన వాహనదారుల నుంచి ఒక్కో బస్సుకు రూ.200, కారుకు రూ.100 వసూలు చేస్తున్నాడు. సోమవారం ఉదయం వాకింగ్ చేస్తున్న స్థానిక 40వ డివిజన్ టీడీపీ నేతలు గమనించి ఆ యువకుడిని పట్టుకుని ప్రశ్నించగా పొంతన లేని సమాధానం చెప్పాడు. దీంతో టీడీపీ నేతలు భవానీపురం పోలీసులకు ఫోన్ చేసి సమాచారం చ్చారు. దీంతో కానిస్టేబుల్ అక్కడకు చేరుకుని భక్తుల నుంచి రుసుము వసూలు చేస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అయిదారు రోజుల నుంచి ఆ యువకుడు భవానీఘాట్‌లో పార్కింగ్ చేస్తున్న వాహనదారుల నుంచి అనధికారికంగా రుసుము వసూలు చేస్తున్నట్లు తెలిసింది.

సౌత్‌జోన్ వాలీబాల్‌కు ఎన్టీఆర్ యూనివర్శిటీ టీమ్ ఎంపిక

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరువనంతపురంలోని కేరళ వర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 22 వరకు జరిగే సౌత్‌జోన్ ఇంటర్ వర్శిటీ వాలీబాల్ పురుషుల చాంపియన్‌షిప్‌లో పాల్గొనే డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ వర్శిటీ పురుషుల టీమ్ అక్కడకు బయల్దేరిందని వర్శిటీ స్పోర్ట్సు బోర్డు సెక్రటరీ ఈ త్రిమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. టీమ్‌కు మేనేజర్‌గా డాక్టర్ కే కళా వెంకట్రావు, కోచ్‌గా కే నాగరాజు వ్యవహరిస్తారన్నారు. ఎంపికైన టీమ్‌ను వీసీ డాక్టర్ డీఎస్‌వీఎల్ నర్సింహం, రిజిస్ట్రార్ వీ రాధికారెడ్డి అభినందించారు.

వాలీబాల్ టీమ్ ఇదే...

టీ మహేష్, కే సాగర్, ఎం సందీప్‌కుమార్, సీ కరుణాకర్ రాజు, వై ప్రవీణ్‌కుమార్, ఆర్ సుభాష్ చంద్రబోస్, వై రాకేష్, బీ రాము, కే జగదీశ్వరరావు, ఎంఎల్ఆర్ గోపీచంద్, ఎం సుధీర్, పీ శ్రీకర్, పీ రాజ్‌కుమార్, ఐ అనిల్‌కుమార్.

వలంటీర్ల 50 గంటల ఆత్మగౌరవ దీక్ష

ధర్నాచౌక్, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల సందర్భంగా వలంటీర్లకు సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు వారిని విధుల్లో కొనసాగించాలని, రూ. 10 వేల గౌరవ వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, ఎన్టీఆర్ జిల్లా సీపీఐ కార్యదర్శి దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. వలంటీర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ స్టేట్ వలంటీర్ అసోసియేషన్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో 50 గంటల ఆత్మగౌరవ దీక్ష సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తూ గత వైసీపీ ప్రభుత్వం జీవో ఇవ్వలేదని కూటమి మంత్రులు ప్రకటించడం సిగ్గుచేటని విమర్శించారు. వలంటీర్ వ్యవస్థను కొనసాగించి వలంటీర్లకు న్యాయం చేసేంత వరకు ఉద్యమిస్తామన్నారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్కు గోవిందరాజులు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల వలరాజు, మమత, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకా లభించని బాలిక ఆచూకీ

అవనిగడ్డ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): లంకమ్మ మాన్యం సమీపంలో నివసిస్తూ శనివారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయిన ఆవుల దివ్య (3) ఆచూకీ ఇంకా లభించలేదు. శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి ఆడుకుంటూ వెళ్లి అదృశ్యమైన దివ్యను ఎవరో ఎత్తుకుని పోయి ఉంటారని ఆమె తల్లిదండ్రులు గోపి, కొండాలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు 15 మంది ఎస్‌డీఈఆర్ఎఫ్ సిబ్బందిని, 40మంది స్థానిక పోలీసులతో మరోమారు గాలింపు చేపట్టారు. ఫలితం లేకపోవటంతో 3 బృందాల పోలీసులను విజయవాడ, మచిలీపట్నం, రేపల్లె ప్రాంతాలకు పంపించి బాలికను ఎవరైనా అపహరించారా? అన్న కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు.

దర్జాగా భూమి కబ్జా..!

● వాగు డొంక పోరంబోకు భూమిలో రేకుల షెడ్ నిర్మాణం

● వాగు పోరంబోకు భూమిని అమ్ముకున్న వెలగలేరులోని పెద్దమనిషి

● చోద్యం చూస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

జి.కొండూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జి.కొండూరు మండలం హెచ్.ముత్యాలంపాడు పంచాయతీ పరిధిలో కందులపాడు క్రాస్ రోడ్డు వద్ద ఎంతో విలువైన వాగు డొంక పోరంబోకు స్థలంపై వెలగలేరు గ్రామానికి చెందిన ఓ పెద్దమనిషి కన్నేశాడు. ఎంచక్క కబ్జా చేసి అమాయకులను చూసి అమ్ముకున్నాడు. అందినకాడికి దండుకున్నాడు. అధికారులకు తాయిలాలు ఇచ్చి తప్పుడు సర్వే నంబర్లతో డొంక పోరంబోకును పట్టా భూమిగా రిజిస్ట్రేషన్ చేయించేశాడు. కొనుకున్న వ్యక్తి రేకుల షెడ్ నిర్మాణం మొదలు పెట్టడంతో అసలు విషయం బయటకు వచ్చింది. సమీప గృహాల వారు ఇదేంటి వాగు పోరంబోకు భూమిలో ఇల్లెలా కడతారంటూ అభ్యంతరం చెప్పారు. దీంతో అతడు నేను కొన్నాను. రిజిస్ట్రేషన్ కూడా అయిందని చెప్పుకొచ్చాడు. దీంతో అసలు విషయం బయట పడింది. అధికారులు ఎంట్రీ ఇచ్చి సర్వే చేసి అది డొంక పోరంబోకు భూమి అని తేల్చి నిర్మాణ పనులు ఆపేశారు. కాని పూర్తిస్థాయి నిర్మాణంతో పాటు ఎదురుగా ఉన్న ఇతర నిర్మాణాలను అధికారులు తొలగించే విషయంలో మీనమేషాలు లెక్కించడం పలు అనుమానాలకు తావిస్తోంది. అటు ఇరిగేషన్, ఇటు రెవెన్యూ అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారే తప్ప ఆక్రమణలు తొలగించడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వాగు పోరంబోకు భూమిని కబ్జారాయుళ్ల నుంచి కాపాడాలని వేడుకుంటున్నారు.



కందులపాడు అడ్డరోడ్డు వద్ద హెచ్.ముత్యాలంపాడు పంచాయతీలోని వాగు పోరంబోకులో నిర్మిస్తున్న రేకుల షెడ్

ఆక్రమణలతో అవస్థలు పడుతున్నాం

● చల్లా శైలజ, స్థానికురాలు



వాగు పోరంబోకు భూమిని ఆక్రమించడంతో సమీప గృహాల వాళ్లం ఇబ్బందులు పడుతున్నాం. వరద ప్రవాహం వాగు పోరంబోకు నుంచి వెళ్లిపోకుండా ఇళ్లపైకి వస్తోంది. ఆక్రమణలు తొలగించాలని సచివాలయంలో ఫిర్యాదు చేశాం.

దొంగ రిజిస్ట్రేషన్ చేశారు

● రావి వెంకటేశ్వరరావు, స్థానికుడు



ఇది రైతుల డొంక. కొందరు వ్యక్తులు ఆక్రమించి దొంగ రిజిస్ట్రేషన్లు చేశారు. కొనుకున్న వారు శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారు. డొంక పోరంబోకులో ఆక్రమణలు తొలగించి మురుగు నీరు బయటకు పోయేలా చూడటంతో పాటు రోడ్డువేసి మంచినీటి పైపులైన్, విద్యుత్ సరఫరా చేయాలి

సర్వే చేయించి పనులు ఆపాం: వీఆర్వో విజయుడు, హెచ్.ముత్యాలంపాడు

ఫిర్యాదు రాగానే సర్వే చేయించి పనులు ఆపేశాం. త్వరలో పూర్తిస్థాయిలో ఆక్రమణలు తొలగిస్తాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నివేదించాం.



ధ్యాన యజ్ఞంలో పాల్గొన్న ఈవో రామారావు, ధ్యానులు

దుర్గగుడిలో అఖండ ధ్యానయజ్ఞం

వన్‌టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మనిషిలోని నిస్సత్తువను తొలగించి ఒత్తిడి నుంచి బయటపడేందుకు ధ్యానం ఎంతో ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్న మాట. అటువంటి ధ్యాన కార్యక్రమం దుర్గగుడి ఆధ్వర్యంలో కొన్ని నెలలుగా సాగుతోంది. అమ్మవారి ఆలయంలో ప్రతినెలా ఈ అఖండ ధ్యాన యజ్ఞం ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఎంతోమంది ధ్యానం చేసేందుకు వస్తున్నారు. దేహ ఆరోగ్యంతో పాటు రక్తపోటు నియంత్రణ, రోగనిరోధక శక్తి పెంటు వంటివి ధ్యానం వల్ల కలుగుతాయని నమ్మకం. దీంతో అనేక మంది ఇందులో పాల్గొంటున్నారు. దుర్గగుడి నెలవారీ కార్యక్రమంలో భాగంగా సోమవారం 9 టూ 9 ధ్యాన యజ్ఞాన్ని నిర్వహించారు. ఈవో కేఎస్ రామారావు తన అనుభవాలను వివరిస్తూ ధ్యానం విశిష్టతను తెలియజేశారు. దుర్గగుడిలో ధ్యానానికి ప్రత్యేకంగా సమయం కేటాయించటం ఎంతో సంతోషదాయకమని అభినందించారు.



డోకిపర్రు శ్రీ భూ సమేత శ్రీవేంకటేశ్వర ఆలయంలో శ్రీనివాస కల్యాణం

నేత్రపర్వంగా శ్రీనివాస కల్యాణం

గుడ్లవల్లేరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): డోకిపర్రు భూసమేత వేంకటేశ్వర ఆలయంలో శ్రీనివాస కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. వేదపండితుల వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. సోమవారం ఉదయం నిత్యార్చన, తోమాల సేవ, అనంతరం దేవతామూర్తులు, ఉత్సవ మూర్తులను స్నపన మండపానికి తీసుకువచ్చి పాలు,పెరుగు, తేనె, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, చూర్ణ, గ్రంథోత్సవం, చక్రస్నానం నిర్వహించారు. స్వామి వారికి కోనేటిస్నానం ఆచరించారు. ఆలయ నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతుల చేతుల మీదుగా దేవదేవుని కల్యాణం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు పి.వి.కృష్ణారెడ్డి, సుధా రెడ్డి దంపతులు, పి.వి.సుబ్బారెడి, సుమలత, పి.వీరారెడ్డి,విజయలక్ష్మి, పి.నాగిరెడ్డి పాల్గొన్నారు.



శ్రీనివాస కల్యాణంలో పాల్గొన్న పి.కృష్ణారెడ్డి,సుధారెడ్డి దంపతులు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నేతలు

ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ సమావేశాలను జయప్రదం చేయండి

● యూనియన్ అఖిల భారత కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య

సత్యనారాయణపురం, డిసెంబర్ 16: రవాణారంగ పరిరక్షణ, సంక్షేమబోర్డు సాధనకు జనవరి 8, 9న ఎంబీవీకేలో జరిగే ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ అఖిల భారత సమావేశాలను జయప్రదం చేయాలని ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ అఖిల భారత కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య అన్నారు. ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ సమావేశం దుర్గాపురం రజక వీధిలోని సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల రవాణా రంగం తీవ్ర సంక్షోభంలో పడిందన్నారు. రోడ్డు రవాణా రంగ రక్షణ ట్రాన్స్‌పోర్టు కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, డ్రైవర్లను హంతకుల కింద శిక్షలు విధించే సెక్షన్ తీసి వేయాలని, పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా కేంద్రప్రభుత్వంపైన ఒత్తిడి తేవడానికి పోరాటం చేయాలన్నారు. రోడ్డు రవాణా కార్మికులందరికీ సామాజిక చట్టం అమలు చేయాలనే డిమాండ్‌తో సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. అన్ని రాష్ట్రాల నుంచి ట్రాన్స్‌పోర్టు నేతలు హాజరవుతారన్నారు. తొలుత అఖిల భారత సమావేశాలకు చెందిన వాల్‌పోస్టర్‌ను ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ నేతలు ఆవిష్కరించారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్ నరసింగారావు, ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎన్.శివాజీ, ముజఫర్ అహ్మద్, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు సుందరయ్య, ఎం.అప్పిరెడ్డి, కే దుర్గారావు పాల్గొన్నారు.



భవానీ దీక్షల విరమణకు ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ రాజశేఖర్‌బాబు, ఈవో కేఎస్ రామారావు, ఇతర అధికారులు

భవానీ దీక్షల విరమణకు పటిష్ట ఏర్పాట్ల చేయాలి

● ఈవోతో కలిసి పరిశీలించిన సీపీ రాజశేఖర్ బాబు

వన్‌టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో ఈనెల 21 నుంచి 25 వరకు జరగనున్న భవానీ దీక్షల విరమణలకు దేవస్థానం అధికారులు చేపట్టిన ఏర్పాట్లను సోమవారం ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు, దేవస్థానం ఈవో రామారావు, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. సీపీ సీతమ్మపాదాల వద్ద ఏర్పాటు చేస్తున్న కేశఖండన శాల పనులను, భక్తులు వేచి ఉండే ప్రదేశాలు, క్యూ మార్గాలు, ప్రసాదాల కౌంటర్లు, హోమగుండాలు, రాకపోకల మార్గాలు, కనకదుర్గానగర్ ప్రాంతాల్లో పర్యటించి చేపట్టిన పనులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. దుర్గగుడికి వచ్చే భవానీలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సూచించారు. సీపీ వెంట ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ, వెస్ట్ ఏసీపీ దుర్గారావు, దుర్గగుడి ఈఈలు కేవీఎస్ఎస్ కోటేశ్వరరావు, టీ వైకుంఠరావు, డీఈలు, ఇంజనీరింగ్ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు సమస్యకు ఈవో పరిష్కారం

వన్‌టౌన్: భవానీ దీక్షల విరమణకు దేవస్థానానికి వచ్చే భవానీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈవో కేఎస్ రామారావు భద్రతా చర్యలు చేపట్టారు. కనకదుర్గానగర్ ప్రారంభం నుంచి మహామండపం దిగువ వరకు రోడ్డు సరిగా లేనందున దేవస్థానానికి వచ్చే భవానీలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన ఈవో ఆయా ప్రదేశాలను పరిశీలించి డస్ట్‌తో రోడ్డును చదును చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. దీంతో వారు మహామండపం దిగువ నుంచి కనకదుర్గానగర్ ప్రధాన రోడ్డు వరకు డస్ట్‌తో చదును చేసే పనులు చేపట్టారు.



సాంస్కృతిక ఉద్యమానికి మాకినేని కృషి

● సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

గవర్నర్‌పేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాంస్కృతిక ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లడంలో మాకినేని బసవపున్నయ్య విశేష కృషి చేశారని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. మాకినేని బసవపున్నయ్య 112వ జయంతి సందర్భంగా ఎంబీవీకే ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఎంజీ రోడ్డులోని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో సాంస్కృతిక వైవిధ్యం-దేశ సమైక్యత అనే అంశంపై స్మారకోపన్యాసం జరిగింది. బసవపున్నయ్య చిత్రపటానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు ట్రస్ట్ చైర్మన్ పి.మధు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ ఏ సమాజ మార్పుకైనా సాంస్కృతిక ఉద్యమం సాయం చేస్తుందన్నారు. దేశ సమైక్యత, సమాజం ముందుకు పోవడానికి లౌకిక వాదం ప్రాతిపదిక అన్నారు. పరమత సహనం భారతదేశ లౌకికతత్వంలో ఉందన్నారు. సనాతన ధర్మం అంటే కులవ్యవస్థను సమర్థించడమని, సనాతనధర్మం గురించి చెప్పేవారు కులవ్యవస్థను సమర్థిస్తారా అని ప్రశ్నించారు.



సాంస్కృతిక వైవిధ్యం-దేశ సమైక్యత అనే అంశంపై ప్రసంగిస్తున్న బీవీ రాఘవులు

అభయాంజనేయస్వామి సన్నిధిలో

అన్నదానం సకల పాపహరణం

● ప్రతి మంగళవారం అన్నదానానికి విశేష స్పందన ● వచ్చే ఏడాది వరకు విరాళాలు చెల్లించిన భక్తులు

హనుమాన్‌జంక్షన్-ఆంధ్రజ్యోతి: భక్తుల నీరాజనాలు అందుకుంటున్న హనుమాన్‌జంక్షన్ అభయాంజనేయ స్వామి దేవస్థానం నిర్వహిస్తున్న అన్నదానానికి దాతల నుంచి విశేష స్పందన కనిపిస్తోంది. నిర్వాహకులు ఏడాది కిందట ప్రతి మంగళవారం చేపట్టిన అన్నదానం నిర్విఘ్నంగా కొనసాగుతోంది. ఆంజనేయ స్వామికి మంగళవారం ప్రీతికరం. ఆ రోజు అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు విశేషంగా నిర్వహిస్తారు. ఆ రోజు అన్నదానం చేస్తే సకల పాపాలు హరించిపోయి పుణ్యం వస్తుందని భక్తుల నమ్మకం. దీంతో స్వామికి ప్రీతికరమైన మంగళవారం నాడు వందలాది మందికి అన్నదానం చేసేందుకు గతేడాది ఆగస్టులో అప్పటి పాలక మండలి చైర్మన్ నెరుసు నాగభూషణం ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి అన్నసంతర్పణ నిరవధికంగా సాగుతోంది. భక్తుల కోర్కెలు తీర్చే రామభక్త హనుమంతుడిగా అభయాంజనేయ స్వామి నీరాజనాలు అందుకుంటున్నాడు. ప్రతి మంగళవారం స్వామి దర్శనానికి తెల్లవారు జామున నుంచి భక్తులు క్యూ కడతారు. 1938లో అప్పటి నూజివీడు జమీందారులు ఈ ప్రాంత పరిపాలన వ్యవహారాలను చూసేవారు. ఆ కాలంలో అరణ్యంగా కనిపించే బాపులపాడు, అప్పనవీడు, ఏపూరు కూడలి ప్రాంతం మీదుగా 16వ నెంబరు జాతీయ రహదారి ని క్రాస్ చేస్తూ క ల్లూరు-మచిలీపట్నం రాష్ట్ర రహదారి వెళ్లింది. ఈ రెండు రహదారులు ఒకేచోట క్రాసింగ్ అయ్యే ప్రాంతం నాలుగు రోడ్ల కూడలిగా మారింది. ఆ కూడలిలో రాతి దిమ్మపై మనిషి రూపంలోని అభయాంజనేయ స్వామి సిమెంట్ విగ్రహాన్ని నూజివీడు జమీందారు మేకా వెంకటాద్రి అప్పారావు నిర్మించారు. అప్పటి నుంచి అభయాంజనేయ స్వామి భక్తుల కోర్కెలను తీర్చుతూ రామభక్త హనుమాన్‌గా భక్తుల మదిలో దోచుకుంటూ వస్తున్నా తరువాతి కాలంలో అభయాంజనేయ స్వామి విగ్రహానికి దాతలు, స్థానిక భక్తులు పూనుకొని మందిరం నిర్మించారు. దినదినాభివృద్ధి చెందుతూ వస్తున్న ఆలయాన్ని 1990లో దేవాదాయ ధర్మాదాయ శాఖ స్వాధీనం చేసుకుంది. ఏడాదికి రూ.50 నుంచి రూ.60లక్షలు వరకు ఆదాయం హుండీలో సమకూరుతోంది.



అభయాంజనేయ స్వామి ఆలయం (ఇన్‌సెట్లో) మందిరం నిర్మించక ముందు పురాతన విగ్రహం



వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు అన్నదానం బుకింగ్ : ఈవో శ్రీనివాస్

దేవస్థానం ఆధ్వర్యం లో ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న అన్నదానానికి భక్తులే ముందుకొచ్చి విరాళాలు అందిస్తున్నట్టు ఈవో కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. అన్నదానం నిర్వహణకు దేవస్థానం నిర్ణయించిన రూ.14వేలు చెల్లించిన వారి పేరున ఆ రోజున పూజలు నిర్వహించి 200 నుంచి 250 మందికి అన్నసంతర్పణ చేస్తున్నట్టు తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు భక్తులు అన్నదానానికి విరాళాలు చెల్లించి ఉన్నట్టు ఈవో తెలిపారు.

గోడౌన్ తాళాలు పగులకొట్టి తనిఖీలు

● బియ్యం మాయం కేసులో పేర్ని జయసుధ చెల్లించిన నగదు మొత్తం రూ.1,70,50,800

మచిలీపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పేర్ని నానికి చెందిన గోడౌన్ తాళాలు సకాలంలో ఇవ్వకపోవడంతో అధికారులు పొట్లపాలెంలోని గోడౌన్ తాళాలను సోమవారం సాయంత్రం పగలకొట్టి తనిఖీలు నిర్వహించారు. తాళాలిచ్చే అంశంలో పౌరసరఫరాలశాఖ డీఎంకు, మాజీ మంత్రి పేర్ని నాని మనుషులకు వాగ్వాదం నడించింది. తాళాలు కావాలని పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ కోరగా లిఖితపూర్వకంగా తాళాలివ్వమని కోరితేనే ఇస్తామని పేర్ని నాని మనుషులు లేఖ రాయడం గమనార్హం. పీడీఎస్ బియ్యం మాయం కేసులో ఈనెల 14న రూ.కోటి చెల్లించగా, మిగిలిన మొత్తంతో కలిపి సోమవారం మొత్తంగా రూ.1,70,50,800 విలువైన డీడీలను జేసీ కార్యాలయంలో పేర్ని నాని మనుషుల ద్వారా అందించారు.

'స్వర్ణాంధ్ర 2024' రూపకల్పన అభినందనీయం

● మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

ధర్నాచౌక్, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): 'స్వర్ణాంధ్ర 2047' విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించి ప్రజల ముందు ఉంచడం అభిందనీయమని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి సాధనకు సీఎం చంద్రబాబు ఆలోచనా సరళిలో కొన్ని మార్పులు రావాల్సిన అవశ్యకత ఉందన్నారు. సైబరాబాద్ నగరానికి ప్రపంచ ఐటీ చిత్రపటంలో ప్రముఖ స్థానం లభించడం, హైదరాబాద్‌లో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, విశాఖపట్నంలో ఫార్మా యూనిట్లకు ఉపయోగపడే 'మెడ్ టెక్ జోన్' ఏర్పాటు చంద్రబాబు దూరదృష్టి, విజన్‌కు నిదర్శనాలన్నారు. గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచడమే కాకుండా హద్దులు లేని అవినీతితో ప్రభుత్వ పాలన గాడి తప్పిందన్నారు. భూకబ్జాలు, దాడులతో అరాచక పాలన కొనసాగిందని విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కరించి, రాష్ట్రాభివృద్ధిని వేగవంతం చేసి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచే బాధ్యత చంద్రబాబుపై ఉందన్నారు.



మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

నగల దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్

రూ. 6.30 లక్షల విలువైన బంగారు నగల స్వాధీనం

ఉయ్యూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఐటీఐ (ఎలక్ట్రికల్) చదివి కరెంట్ పనులు చేసుకుని జీవిస్తున్న యువకుడు జల్సాగా బతకడం కోసం దొంగతనాలకు అలవాటు పడ్డాడు. కాటూరులోని ఓ వృద్ధురాలి ఇంటిలో బీరువా పగులగొట్టి బంగారు నగలు దోచుకుపోయి పోలీసులకు దొరికిన ఉదంతమిది. ఆ వివరాలను కంకిపాడు సీఐ జె.మురళీకృష్ణ, ఉయ్యూరు రూరల్ ఎస్సై కె.సురేశ్‌బాబు సోమవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. కాటూరు ఎస్సీ కాలనీకి చెందిన కొత్తూరి మధుబాబు తల్లిదండ్రులతో కలిసి కంకిపాడులోని గొడవర్రు రోడ్డులో నివాసముంటున్నాడు. ఈ క్రమంలో కాటూరు అంబేద్కర్‌నగర్‌లోని తన తాతయ్య ఇంటికి మధుబాబు ఈనెల 13న వచ్చాడు. ఆ ఇంటి సమీపంలో మనుమరాలు, మనుమడుతో కలిసి జీవిస్తున్న కొత్తూరు సంతోషమ్మ ఇంటికి దొంగతనానికి వెళ్లాడు. వృద్ధురాలి మనుమడు స్కూలుకు, మనుమరాలు పనికి వెళ్లారు. ఈక్రమంలో సంతోషమ్మ బాత్‌రూంలో ఉన్న సమయం చూసి ఇంటిలోకి చొరబడి ఇనుపరాడ్డుతో బీరువా తలుపులు పగులగొట్టి లోపలున్న బంగారు నగలు దోచుకుపోయాడు. సాయంత్రం ఇంటికి తిరిగివచ్చిన సంతోషమ్మ మనుమరాలు రోహిణి బీరువాలోని సుమారు 90 గ్రాముల బంగారు నగలు దోచుకుపోయినట్టు గమనించి రూరల్ పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఎస్సై, సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి దర్యాప్తుచేసి సాక్షాధారాలు సేకరించి ముద్దాయి మధుబాబును సోమవారం ఉదయం కాటూరు ఎస్సీకాలనీలోని అతడి తాతయ్య ఇంటివద్ద అదుపులోకి తీసుకుని విచారించగా బంగారు నగలు దొంగతనం చేసినట్టు ఒప్పుకున్నాడు. నిందితుడిని అరెస్ట్ చేసి అతడి నుండి ఒక నానుతాడు, 2 గొలుసులు, 5 ఉంగరాలు, ఒక బ్రాస్లెట్, పాపిడి బిళ్ల, జత చెవిదిద్దులు కలిపి రూ.6 లక్షల 30వేల విలువైన సుమారు 90 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్టు సీఐ మురళీకృష్ణ తెలిపారు. కేసును ఛేదించి దొంగను పట్టుకున్న ఎస్సై సురేశ్‌బాబు, సిబ్బందికి ఎస్పీ గంగాధరరావు నగదు రివార్డు ప్రకటించగా సీఐ అందజేశారు.




బంగారు నగల దొంగతనం కేసులో పట్టుబడ్డ నిందితుడితో కంకిపాడు సీఐ మురళీకృష్ణ, రూరల్ ఎస్సై సురేశ్‌బాబు

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం

● దేవీప్రసాద్

ధర్నాచౌక్, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గుంటూరులో నిర్వహించిన 'మాలల మహాగర్జన' సభ విజయవంతంగా జరిగిందని అఖిల భారత మాలల సంఘాల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవీప్రసాద్ పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. తాము నిర్వహించిన సభకు రాష్ట్ర ప్రభుత్వం అనేక ఆటంకాలు సృష్టించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటన్నింటిని అధిగమించి అధిక సంఖ్యలో మాలలు పాల్గొన్నారన్నారు. వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలన్నారు. జై భీమ్‌రావ్ భారత్ పార్టీ అధ్యక్షుడు జడ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మాలలు, మాదిగల మధ్య విద్వేషాలు రగిలిస్తున్నారన్నారు. త్వరలో ఢిల్లీస్థాయిలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తామన్నారు.



ఎవరైనా అకస్మాత్తుగా కుప్పకూలిపోతే గుండెపోటుగా భావించి, హుటాహుటిన ఆస్పత్రికి తరలిస్తూ ఉంటాం. అయితే గుండెలో తలెత్తే కొన్ని ఇబ్బందులకు తక్షణ చికిత్స అవసరమవుతుంది. అలాంటిదే.. సడెన్ కార్డియాక్ అరెస్ట్. హఠాత్తుగా గుండె ఆగిపోయే ఈ అత్యవసర స్థితి, సడెన్ కార్డియాక్ డెత్‌కు దారి తీయకుండా ఉండకుండా తక్షణమే ఎలా స్పందించాలో, ఆ సమయంలో సిపిఆర్ ఎలా కీలకంగా మారుతుందో వైద్యులు వివరిస్తున్నారు.

ఎఇడి అత్యవసరం

"అపార్ట్‌మెంట్లలో, ఇతరత్రా నివాస సముదాయాల్లో ఎఇడిలను అందుబాటులో ఉంచుకోవాలి. 80 వేల నుంచి లక్ష రూపాయల ధర పలికే ఎఇడిలతో అంతకంటే ఎంతో విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చు. కాబట్టి ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ల మాదిరిగానే ఎఇడిలకు కూడా నివాస సముదాయాల్లో స్థానం కల్పిస్తే, అత్యవసర సందర్భాల్లో ప్రాణ రక్షణకు ఇవి తోడ్పడతాయి. వీటిని అందుబాటులో ఉంచుకోవడంతో పాటు వాటి వాడకం నేర్చుకుని, బ్యాటరీలను సరి చూసుకుంటూ జాగ్రత్తగా నిర్వహించుకుంటూ ఉండాలి."

తక్షణ చికిత్స

గుండెకు గండం లేకుండా...

అప్పటివరకూ చలాకీగా, ఆరోగ్యంగా ఉన్న వ్యక్తులు టక్కున కుప్పకూలిపోయి చనిపోతున్న సందర్భాలను చూస్తున్నాం. ఏం జరిగిందో అర్థం చేసుకుని, ఆస్పత్రికి తరలించేలోపే ప్రాణాలు పోతున్న సందర్భాలు కూడా కోకొల్లలు. ఇలా కుప్పకూలిపోడానికి గుండెపోటు కారణమై ఉంటుందనే అవగాహన మనందరికీ ఉంటోంది. కానీ గుండెపోటుతో పాటు, హఠాత్తుగా గుండె ఆగిపోయే సడెన్ కార్డియాక్ అరెస్ట్‌కు గురైనప్పుడు కూడా ఇలాగే కుప్పకూలిపోతూ ఉంటారు. ఇలాంటప్పుడు క్షణాల వ్యవధిలో ప్రాణాలు పోయే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఏమాత్రం తాత్సారం చేయకుండా, తక్షణమే సిపిఆర్‌తో గుండె కొట్టుకునేలా చేసి, ఆ తర్వాతే ఆస్పత్రికి తరలించవలసి ఉంటుంది.

సడెన్ కార్డియాక్ అరెస్ట్‌కు గుండె జబ్బులు ప్రధాన కారణం. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాల్లో అవరోధాల వల్ల, గుండె కండరం జబ్బు పడడం వల్ల.. ఇలా గుండె, సడెన్ కార్డియాక్ అరెస్ట్‌కు గురి అవడానికి ఎన్నో కారణాలుంటాయి. గుండెపోటుకు గురైన ప్రతి సందర్భంలో గుండె ఆగిపోయే పరిస్థితి తలెత్తకపోవచ్చు. ఛాతీ నొప్పి, ఆయాసం లాంటి లక్షణాలతో గుండెపోటుకు గురైతే ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకునే సమయం ఉంటుంది. కానీ తీవ్రమైన గుండెపోటుకు గురైన సందర్భాల్లో సడెన్ కార్డియాక్ అరెస్ట్ అనే ప్రమాదకరమైన పరిస్థితి తలెత్తే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అయితే ఈ పరిస్థితి అకస్మాత్తుగా తలెత్తుతూ ఉంటుంది. స్నేహితులతో సరదాగా కాలక్షేపం చేస్తున్న సందర్భంలో లేదా పార్కులో నడుస్తున్న సమయంలో.. ఇలా ఎప్పుడైనా, ఎక్కడైనా ఈ పరిస్థితి తలెత్తవచ్చు. ఇలాంటప్పుడు కొన్ని నిమిషాల్లోపే గుండెను కొట్టుకునేలా చేయకపోతే, రక్తస్రావం జరగక మెదడు దెబ్బతింటుంది. కాబట్టి తక్షణమే స్పందించాలి. అంబులెన్స్ వచ్చేవరకూ, ప్రాణాలు పోకుండా సదరు వ్యక్తిని కాపాడుకోవాలంటే, వెంటనే సిపిఆర్ మొదలుపెట్టి గుండె కొట్టుకునేలా చేయాలి.

సడెన్ కార్డియాక్ అరెస్ట్‌కు గురైన వ్యక్తిని బ్రతికించే అవకాశాలు 10 శాతం కంటే తక్కువ. ఈ సమస్యకు గురైన వ్యక్తికి చికిత్సను అందించడం కోసం, అంబులెన్స్ వచ్చేవరకూ ఆలస్యం చేయడం ప్రమాదకరం. సడెన్ కార్డియాక్ అరెస్టులు సడెన్ కార్డియాక్ డెత్స్‌గా పరిణమిస్తున్న సందర్భాలు మన దేశంతో పాటు, అత్యంత వేగంగా అంబులెన్స్ సేవలు అందే విదేశాల్లోనూ పెరిగిపోతున్నాయి. ఇందుకు కారణం తక్షణ సిపిఆర్ అందకపోవడమే! కాబట్టి సడెన్ కార్డియాక్ అరెస్ట్‌ను కచ్చితంగా నిర్ధారించుకోవడంతో పాటు, సత్వరమే సిపిఆర్ మొదలుపెట్టడం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. సాధారణ కారణాల వల్ల స్పృహ కోల్పోయిన వ్యక్తుల్లో శ్వాస ఆడుతూ ఉంటుంది, నాడి కొట్టుకుంటూ ఉంటుంది. కానీ సడెన్ కార్డియాక్ అరెస్ట్‌కు గురైన వాళ్లలో ఈ రెండు లక్షణాలూ ఉండవు. కాబట్టి శ్వాసను నిర్థారించుకోవడం కోసం ముక్కు దగ్గర వేలిని ఉంచి పరీక్షించాలి. నాడిని నిర్థారించుకోవడం కోసం మణికట్టుకు బదులుగా మెడ దగ్గర పరీక్షించాలి.



ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డిఫిబ్రిలేటర్

కార్డియో పల్మనరీ రిససిటేషన్ అనే ఈ ప్రక్రియ గురించి మనందరికీ ఎంతో కొంత అవగాహన ఉంటోంది. అరచేతులు కలిపి ఛాతీ దగ్గర నొక్కే ఈ ప్రక్రియతో ఆగిన గుండె కొట్టుకోవడం మొదలుపెట్టే అవకాశాలుంటాయి. కాబట్టి వీలైనంత త్వరగా సిపిఆర్ మొదలుపెట్టాలి.

> **ఇలా స్పందించాలి**
>
> గుండె పోటు లేదా కార్డియాక్ అరెస్ట్‌తో కుప్పకూలిపోయినప్పుడు చుట్టూ ఉన్న వాళ్లు రకరకాలుగా స్పందిస్తూ ఉంటారు. కొందరు లేపి కూర్చోబెట్టే ప్రయత్నం చేస్తారు. ఇంకొందరు బలవంతంగా నీళ్లు తాగించే ప్రయత్నం చేస్తారు. కానీ ఇలాంటి సందర్భాల్లో చుట్టుపక్కల వాళ్లు ఎలా స్పందించాలంటే..
>
> - మెడ దగ్గర పల్స్, ముక్కు దగ్గర శ్వాసలను పరీక్షించాలి
> - చదునైన ఉపరితలం మీద పడుకోబెట్టి సిపిఆర్ మొదలుపెట్టాలి
> - సిపిఆర్ చేస్తూనే అంబులెన్స్‌కు కబురు పెట్టాలి
> - అవసరాన్ని బట్టి ఎఇడి ఉపయోగించాలి
> - నీళ్లు తాగించే ప్రయత్నం చేయకూడదు
> - శరీరాన్ని ఎక్కువగా కదిలించకూడదు.

అయితే సిపిఆర్ చేయడమెలాగో తెలిసినా, దాన్ని సక్రమంగా చేయడమెలాగో తెలిసి ఉండాలి. అందు కోసం ప్రస్తుతం ఆస్పత్రుల్లో 'హార్ట్ సేవర్స్' పేరుతో సిపిఆర్ శిక్షణా కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డిఫిబ్రిలేటర్ (ఎఇడి) అనే పరికరం వాడకం కూడా తెలుసుకుని ఉండాలి. ఈ పరికరం హృదయ స్పందన ఆధారంగా గుండె పరిస్థితిని అంచనా వేసి, సక్రమంగా స్పందించేలా ఎలక్ట్రిక్ షాక్‌ను విడుదల చేస్తుంది. సడెన్ కార్డియాక్ అరెస్ట్‌కు గురైన వ్యక్తులకు సిపిఆర్ అందిస్తూనే, ఎఇడి పరికరాన్ని కూడా ఉపయోగించగలిగితే ఫలితం మరింత మెరుగ్గా ఉంటుంది. కాబట్టి అపార్ట్‌మెంట్లు, షాపింగ్ మాల్స్, సినిమా హాళ్లు.. ఇలా వీలున్న ప్రతి చోటా ఈ పరికరాన్ని అందుబాటులో ఉంచాలి. అగ్నిప్రమాదాల కోసం ఫైర్ ఎక్స్‌టింగ్విషర్స్ అందుబాటులో ఉంచుకున్న విధంగానే, ఎఇడి పరికరాలను కూడా అందుబాటులో ఉంచుకోగలిగితే సడెన్ కార్డియాక్ డెత్స్‌కు అడ్డుకట్ట వేయొచ్చు.

బైస్టాండర్ సిపిఆర్, పబ్లిక్ ఎఇడి ప్రోగ్రాం

సడెన్ కార్డియాక్ అరెస్ట్ ఎప్పుడైనా, ఎవరికైనా జగరవచ్చు. కాబట్టి ప్రతి ఒక్కరూ సిపిఆర్, ఎఇడిల పట్ల అవగాహన ఏర్పరుచుకోవడం అవసరం. వీటి పట్ల అవగా



హన పెంచడం కోసం నెదర్లాండ్స్, డెన్‌మార్క్ మొదలైన దేశాల్లో బైస్టాండర్ సిపిఆర్, పబ్లిక్ ఎఇడి ప్రోగ్రాంలు విస్తృతంగా కొనసాగుతున్నాయి. సిపిఆర్ చేయాలంటే ఎవరికైనా ఎంతోకొంత భయం ఉంటుంది. నేను సరిగా చేయగలుగుతానో లేదో, పొరపాటు జరిగితే అవతలి వ్యక్తి ప్రాణాలు పోతాయేమో అనే భయంతో సిపిఆర్ చేయడానికి వెనకాడే వాళ్లూ ఉంటారు. ఇలాంటి భయాలను పోగొట్టడం కోసం విదేశాల్లో రక్షణ చట్టాలు కూడా అమల్లో ఉన్నాయి. ఇలా అత్యవసర పరిస్థితిలో సిపిఆర్ చేసే వ్యక్తులు, ఎదుటి వ్యక్తికి సహాయపడాలనే సదుద్దేశంతోనే ఆ ప్రయత్నానికి పూనుకుంటారు కాబట్టి, ఒకవేళ ఫలితం ప్రతికూలంగా మారినా, సదరు వ్యక్తులకు విదేశాల్లో చట్టపరమైన రక్షణ దక్కుతూ ఉంటుంది. అయితే మన దేశంలో ఇలాంటి చట్టాలు లేవు కాబట్టి సిపిఆర్ చేసే విధానం గురించి మెరుగైన శిక్షణ తీసుకోవడం అవసరం. శిక్షణ తీసుకుంటే, ఛాతీ మీద చేతులను ఎక్కడ, ఏ విధంగా ఉంచి, ఎంత తీవ్రతతో ఒత్తిడిని కలిగించాలి అన్నది తెలుస్తుంది. పలు ఆస్పత్రులు, ఆరోగ్య సంస్థలు సిపిఆర్ ట్రైనింగ్ కోర్సును అందిస్తున్నాయి. ఎవరైనా ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకుని, శిక్షణ తీసుకుని, సర్టిఫికెట్ పొందవచ్చు.

డాక్టర్ కుమార్ నారాయణన్
సీనియర్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ అండ్ ఎలక్ట్రోఫిజియాలజిస్ట్,
మెడికవర్ హాస్పిటల్స్,
హైటెక్ సిటీ, హైదరాబాద్.



అవగాహన

ఒత్తిడి చిత్తు

మానసిక ఒత్తిడి పలు రకాల రుగ్మతల రూపంలో శరీరాన్ని చిత్తు చేస్తుంది. కాబట్టి ఒత్తిడి మీద ఓ కన్నేసి ఉంచి, ఎప్పటికప్పుడు వదిలించుకుంటూ ఉండాలి.

- **శారీరక రుగ్మతలు:** ఒత్తిడి వల్ల రుగ్మతలు వచ్చే అవకాశాలు పెరుగుతాయి. మరీ ముఖ్యంగా వంశపారంపర్యంగా సంక్రమించే మధుమేహం, హృద్రోగాలు లాంటి రుగ్మతలు మరికొంత ముందుగానే మొదలవుతాయని శాస్త్రీయంగా రుజువైంది. ఒత్తిడి మూలంగా తలెత్తే రక్తపోటు, రక్తపోటు మూలంగా గుండె పోటు, గుండె విఫలమవడం, గుండె కండరాలు దెబ్బతినడం, స్ట్రెస్ కార్డియోమయోపతీ..ఇలా ఒత్తిడి ప్రభావం పరోక్షంగా గుండె మీద పడుతుంది. రక్తపోటు మూలంగా మూత్రపిండాలు కూడా దెబ్బతింటాయి.
- **ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి:** ఒత్తిడితో కూడిన జీవనశైలితో జీవించేవారు అన్నిటికంటే ముందు ఒత్తిడిని తగ్గించే విధానాలు అనుసరించాలి. వాటితో పాటు 35 ఏళ్లు దాటిన ప్రతి వ్యక్తీ, ఏడాదికోసారి తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. ఇందుకోసం సాధారణ వైద్యులను సంప్రతించినా సరిపోతుంది. రక్తపోటు, మధుమేహం, గుండె పనితీరు తెలిపే పరీక్షలతో ముందుగానే రాబోయే రుగ్మతలను కనిపెట్టవచ్చు. మరీ ముఖ్యంగా వంశపారంపర్యంగా మధుమేహం, రక్తపోటు, హృద్రోగాలు సంక్రమించే వీలున్న వ్యక్తులు మరింత అప్రమత్తంగా ఉండాలి.



అపోహ వాస్తవం

హార్మోన్ సమస్య వాళ్లకేనా?

అపోహ: హార్మోన్ల సమస్యలు మధ్యవయసులోనే మొదలవుతాయి! విగతా వయసుల్లో తలెత్తే అవకాశమే లేదు.

వాస్తవం: ఇది నిజం కాదు. పుట్టిన పసికందులతో సహా ఏ వయసు వాళ్లలోనైనా హార్మోన్లలో హెచ్చుతగ్గులు తలెత్తవచ్చు.

ఆరోగ్య సూత్రాలు

ఇలా ఆరోగ్యం బ్రహ్మాండం

కొన్ని సులువైన నియమాలను అనుసరిస్తూ నిండైన ఆరోగ్యాన్ని పొందే వీలుంది. అదెలాగంటే...

- మూడు పూటలా సుష్టుగా భోంచేయకుండా, తక్కువ పరిమాణాల్లో ఎక్కువసార్లు తినాలి
- ఆకుపచ్చని కూరగాయలు, ముదురు రంగు పళ్లు తినాలి
- యవ్వనంగా కనిపించడం కోసం సౌందర్య సాధనాల మీద ఆధారపడకుండా, ఆ ఫలితం ఆహారం ద్వారా పొందే ప్రయత్నం చేయాలి
- వ్యాయామం కష్టపడి కాకుండా ఇష్టపడి చేయాలి. డాన్స్, ఒంటిని శ్రమ పెట్టే ఆటలు కూడా వ్యాయామాలే!
- ఆహారంలో తెల్లని పదార్థాలను తగ్గించి, గోధుమలతో తయారైన పాస్తా, బ్రెడ్, బ్రౌన్ రైస్ వాడకం పెంచాలి
- ఉదయం అల్పాహారం మానకూడదు. నిద్ర లేచిన రెండు గంటల్లోపే బ్రేక్‌ఫాస్ట్ ముగించాలి. దాన్లో ప్రొటీన్లు, పిండి పదార్థాలు తప్పక ఉండేలా చూసుకోవాలి
- బరువులు ఎత్తే వ్యాయామాలతో కండలు పెరుగుతాయి అనేది అపోహ! కాబట్టి ఎముకల సాంద్రత, పటుత్వాలను పెంచే వెయిట్ ట్రైనింగ్ నిస్సంకోచంగా చేయవచ్చు.
- ఎంతో అరుదుగా తప్ప జంక్ ఫుడ్ జోలికి వెళ్లకూడదు
- చిన్న దూరాలకు వాహనాలు వాడడం మానేయాలి. లిఫ్ట్‌కు బదులుగా మెట్లు వాడాలి.



పోషకాహారం

శక్తినిచ్చే లడ్డు

కొన్ని సార్లు భోజనానికీ, భోజనానికీ మధ్యలో నీరసంగా అనిపిస్తుంది. అలాంటప్పుడు తక్షణ శక్తినిచ్చే పదార్థాలు తినాలి. ఆ కోవకు చెందిన అల్పాహారాల్లో బలవర్ధకమైన 'ఆప్రికాట్ లడ్డు' ఒకటి. శక్తినిచ్చే ఈ లడ్డు ఎలా తయారు చేయాలంటే...

కావలసిన పదార్థాలు: ఎండు ఆప్రికాట్స్- అర కప్పు
ఎండు ద్రాక్ష - అర కప్పు, బాదం - పావు కప్పు
వాల్‌నట్స్ - పావు కప్పు
పచ్చికొబ్బరి కోరు - 3 టేబుల్ స్పూన్లు
వెనిల్లా ఎసెన్స్ - కొన్ని చుక్కలు
అవిసె గింజల పొడి - 1 టేబుల్ స్పూను
దాల్చినచెక్క పొడి - 1 టేబుల్ స్పూను

తయారీ విధానం: వెనిల్లా ఎసెన్స్ మినహా మిగతా పదార్థాలన్నీ మెత్తగా దంచి, కలుపుకోవాలి.

- తర్వాత వెనిల్లా ఎసెన్స్ వేసి కలపాలి.
- పై పదార్థాలన్నీ తీపిగానే ఉంటాయి కాబట్టి, అదనంగా చక్కెర కలపాల్సిన అవసరం లేదు. ఒకవేళ తీపి ఎక్కువ కావాలనిపిస్తే రెండు టీస్పూన్ల తేనె కలుపుకోవచ్చు.
- చివర్లో లడ్డుగా చుట్టి ఎండు కొబ్బరి కోరులో దొర్లించాలి.
- వీటిని గాలి చొరబడని డబ్బాలో ఉంచి, ఫ్రిజ్‌లో నిల్వ ఉంచితే కొన్ని వారాల వరకూ పాడవకుండా ఉంటాయి.



ఆరోగ్యమే మహా భాగ్యం

మలబద్ధకం వదలాలంటే?

ఉదయాన్నే కాలకృత్యాలు తీరకపోతే రోజంతా ఇబ్బందిగానే ఉంటుంది. అయితే కొన్నిసార్లు మన ఆహారశైలి కారణంగా మలబద్ధకం తలెత్తి, తిరిగి రెండో రోజుకి సర్దుకుంటూ ఉంటుంది. కానీ ఇదే ఇబ్బంది పదే పదే తలెత్తుతున్నా, రోజుల తరబడి వేధిస్తున్నా సుఖ విరేచనం జరిగేందుకు తోడ్పడే పదార్థాలను తీసుకోవాలి.

- **కలబంద:** కలబందలో ఉండే 'ఆంథ్రాక్వినోన్స్' అనే సమ్మేళనాలు పెద్ద పేగుల్లో నీరు ఊరేలా చేసి, మ్యూకస్‌ను ఉత్పత్తి చేసి, పేగుల కదలికలను పెంచుతాయి. దాంతో తేలికగా విరేచనం జరిగి మలబద్ధకం వదులుతుంది. కాబట్టి అర కప్పు కలబంద గుజ్జు పరగడుపునే తీసుకుంటే ఫలితం ఉంటుంది.
- **సబ్జా:** నీళ్లతో కలిస్తే సబ్జా జిగురులా తయారవుతుంది. ఆ తత్వం కారణంగా సబ్జా పేగుల్లో తేలికగా కదిలి మలబద్ధకాన్ని వదిలిస్తుంది. రాత్రంతా నీళ్లలో నానబెట్టిన సబ్జా విత్తనాలను పరగడుపునే తాగితే విరోచనం తేలికగా జరుగుతుంది.
- **అవిసెలు:** వీటిలో పీచు పదార్థం ఎక్కువగా ఉంటుంది. మలబద్ధకం ఉన్నవారు వంటకాల్లో అవిసె గింజలు పొడి చేసుకుని కలుపుకుని తింటే, తగినంత పీచు శరీరానికి అందుతుంది. ఇది మలంతో కలిసి పేగుల్లో తేలికగా జారేందుకు సహాయపడుతుంది.
- **ఆకు కూరలు:** ఆకు కూరల్లో ఉండే మెగ్నీషియమ్‌కు మలాన్ని మెత్తబరిచే గుణం ఉంటుంది. అంతేకాదు. పేగుల్లో నీరు ఊరేలా చేయగల శక్తి మెగ్నీషియమ్‌కు ఉంటుంది. ఈ గుణాల వల్ల ఆకు కూరలు తింటే విరోచనం తేలికగా జరుగుతుంది.
- **తాజా పళ్లు:** కొందరికి తాజా పళ్లు సుఖ విరోచనానికి సహాయపడతాయి. ఆకలి తీరటంతోపాటు మలబద్ధకం తలెతకుండా ఉండాలంటే రోజుకి కనీసం 3 రకాల పళ్లు తినాలి. రాత్రి నిద్రకు ముందు మగ్గిన అరటి పండు తిన్నా ఉదయాన్నే సుఖ విరోచనం అవుతుంది.



జీవనశైలి

కుదురుగా... కులాసాగా

గంటల తరబడి శరీరాన్ని ఒకే భంగిమకు పరిమితం చేస్తే, అవయవాల్లో అసౌకర్యాలు, ఇబ్బందులూ తప్పవు. అయితే కొంత అవగాహనతో మెలుగుతూ, అప్రమత్తంగా ఉండగలిగితే జీవనశైలికి సంబంధించిన ఇలాంటి సమస్యలను అదుపులో పెట్టొచ్చు.

మెలితిప్పే మణికట్టు

అరచేయి మొద్దుబారుతూ, సూదులు గుచ్చుతున్నట్టుగా ఉండి, వేళ్లు బలహీనపడితే...'కార్పల్ టన్నల్ సిండ్రోమ్' కావచ్చు. మణికట్టు కంటే చేతిని తక్కువ ఎత్తులో ఉంచి చేసే పనులు (మౌస్, కీబోర్డు వాడకం) వల్ల వచ్చే సమస్య ఇది. భుజం నుంచి ముంజేతి వరకూ సాగి, మణికట్టు గుండా అర చేతిలోకి వెళ్లే 'మీడియన్' అనే నరం ఒత్తిడికి లోనయినప్పుడు ఈ సమస్య తలెత్తుతుంది.

- విరుగుడు ఇలా: పురుషులతో పోలిస్తే మహిళల్లో మణికట్టులో నరాలు వెళ్లే ద్వారం ఇరుకుగా ఉంటుంది. కాబట్టి కార్పల్ టన్నెల్ సిండ్రోమ్ స్త్రీలలో మూడు రెట్లు ఎక్కువ. చేతుల కదలికల వల్ల తలెత్తిన ఇబ్బంది కాబట్టి మణికట్టు మీద ఒత్తిడిని తగ్గించటం ఒక్కటే ఈ సమస్యకు విరుగుడు. ఇందుకోసం....
- కంప్యూటర్ ముందు పని చేసేవాళ్లు ప్రతి రెండు గంటలకు కనీసం 10 నిమిషాలపాటు చేతులకు విశ్రాంతి నిస్తూ ఉండాలి.
- విశ్రాంతి సమయంలో చేతులు, వేళ్లను బలపరిచే వ్యాయామాలు చేయాలి.
- కంప్యూటర్ స్క్రీన్, హెచ్చుతగ్గులు లేకుండా కళ్లకు సూటిగా ఉండాలి.
- మోచేయి, మణికట్టు ఒకే ఎత్తులో ఉండేలా చూసుకోవాలి.

వెన్నులో పోట్లు

గంటలతరబడి కుర్చీలో కూర్చుని పని చేసేవాళ్లకొచ్చే అత్యంత సాధారణ సమస్య ఇది. కుర్చీలో జారగిలబడి కూర్చున్నా, కుర్చీకి వీపు ఆనించకుండా ముందుకు వంగి కూర్చున్నా వెన్నుపాము ఉండాల్సిన భంగిమలో ఉండదు. దాంతో వెన్నులోని లిగమెంట్లు, కండరాలు ఒత్తిడికి గురై నొప్పులు మొదలవుతాయి.

విరుగుడు ఇలా!

- వెన్ను నొప్పి వేధిస్తుంటే వెంటనే లేచి నడవాలి. కదలకుండా రెండు గంటలకు మించి కూర్చోకూడదు. ఈ జాగ్రత్తలతోపాటు...
- కుర్చీ వీపుకు సమానమైన ఎత్తులో ఉండేలా చూసుకోవాలి.
- కుర్చీకి, వెన్నుకి మధ్య గ్యాప్ ఉంటే కుషనింగ్ కోసం 'లంబార్ పిల్లో' అనే దిండు ఉంచుకోవాలి.
- తొడలు నేలకు సమాంతరంగా, పాదాలు నేల మీద పూర్తిగా ఆనేలా కూర్చోవాలి.
- ఒకవేళ ఎత్తులో కూర్చోవలసివస్తే కాళ్లను గాల్లో వేలాడేలా ఉంచకుండా, ఫుట్ స్టూలు వాడాలి.
- కుర్చీ హ్యాండ్ రెస్ట్‌లు ఒకే ఎత్తులో ఉండేలా చూసుకోవాలి.
- వెన్ను కండరాలు బలపడటం కోసం పొత్తికడుపు వ్యాయామాలు, క్రంచెస్ చేయాలి.



మెడ, భుజాల నొప్పులు

ఈ నొప్పులకు కారణం కూర్చున్న ప్రదేశానికి కంప్యూటర్ మానిటర్, కీబోర్డు అవసరానికి మించి దూరంగా ఉండటమే! ఆ దూరాన్ని తగ్గించటం కోసం మనకు తెలియకుండానే మెడను ముందుకు చాపుతాం! దాంతో భుజాలు ముందుకు వంగుతాయి. ఫలితంగా ఆ ప్రదేశాల్లోని కండరాలు, కణజాలాల మీద ఒత్తిడి పెరిగి, మెడ, భుజాల నొప్పులు మొదలవుతాయి.

విరుగుడు ఇలా!

- తరచుగా మెడ, భుజాల స్ట్రెచింగ్ వ్యాయామాలు చేస్తూ ఉండాలి.
- మెడ పట్టేస్తే, చుబుకాన్ని ఛాతీకి ఆనించి వదిలే 'చిన్ టక్' వ్యాయామం చేయాలి.
- కూర్చుని పని చేసేవాళ్లు వెన్ను నిటారుగా ఉండేలా చూసుకోవాలి.
- మెడను అవసరానికి మించి ముందుకు చాపకూడదు.
- మెడ, భుజాల నొప్పులు వదలటం కోసం తల తిప్పకుండా పక్కకు, భుజం వైపు వంచి 20 అంకెలు లెక్కపెట్టి తిరిగి యథాస్థానానికి రావాలి. ఇలా రెండో వైపూ చేయాలి.
- కంప్యూటర్ కుర్చీకి ఎదురుగా ఉండేలా చూసుకోవాలి.
- తరచూ ఫోన్ మాట్లాడేవాళ్లు మెడ, భుజం మధ్యలో ఫోన్ ఉంచుకుని మాట్లాడే అలవాటు మానుకోవాలి.

కళ్ల మంటలు

కంప్యూటర్ మానిటర్ అవసరానికి మించి దూరంగా ఉంటే, అక్షరాలు స్పష్టంగా కనిపించక కళ్లను చికిలిస్తాం! ఒకవేళ మరీ దగ్గరగా ఉన్నా, మానిటర్ వెలువరించే వెలుగుకు కళ్లు చిన్నవి చేస్తాం! ఈ రెండూ కళ్లను ఇబ్బంది పెట్టేవే! గంటల తరబడి కంప్యూటర్ స్క్రీన్ మీద చూపు నిలపటం వల్ల కళ్లు అలసటకు గురవుతాయి. పైగా ఏకాగ్రతతో పని చేస్తున్నప్పుడు కళ్లను తక్కువగా ఆర్పుతూ ఉంటాం. దాంతో కళ్లు పొడిబారి, నీళ్లు కారతాయి.

విరుగుడు ఇలా!:

- కంప్యూటర్ ముందు పని చేసేవాళ్లు ప్రతి అరగంటకూ కళ్లకు విశ్రాంతినివ్వాలి.
- దూరంగా ఉన్న కిటికీ లేదా క్యాలెండర్‌ను 20 సెకండ్లపాటు చూసి, తిరిగి మానిటర్ మీదకు దృష్టి మరల్చాలి. ఇలా చేయటం వల్ల కళ్లకు విశ్రాంతి దొరుకుతుంది.
- డెస్క్‌లో నుంచి పెన్ను తీసి రాయటం, లేదా పక్కనున్న ఉద్యోగితో రెండు కబుర్లు చెప్పటం...ఇలా కంప్యూటర్ నుంచి కొంతసేపైనా దృష్టిని మరల్చే పనులు చేయాలి.
- కుర్చీకి కంప్యూటర్ మానిటర్ కనీసం 20 నుంచి 40 అంగుళాల దూరంలో ఉండేలా చూసుకోవాలి.
- కంప్యూటర్ మానిటర్ పై అంచు కళ్లకు సమాంతరమైన ఎత్తులో ఉండేలా చూసుకోవాలి.
- వెలుగు తగ్గించటం కోసం మానిటర్‌కు ఫిల్టర్ షీట్ అంటించుకోవాలి.
- మనం ధరించే కళ్లజోళ్లు చదవటానికి, దూరానికి సంబంధించినవై ఉంటాయి. కానీ కంప్యూటర్‌తో ఈ రెండు పనులూ ఒకే సమయంలో చేస్తాం. కాబట్టి కంప్యూటర్ వాడకానికి సంబంధించిన కళ్లజోళ్లు ప్రత్యేకంగా ఎంచుకుని, వాటిని ఆఫీసు డెస్క్‌లోనే ఉంచే ఏర్పాటు చేసుకోవాలి.

అంబానీ, అదానీ ఆస్తులకు బీటలు

100 బిలియన్ డాలర్ల క్లబ్ నుంచి ఔట్



న్యూఢిల్లీ : దేశంలోనే అత్యంత సంపన్నులైన ముకేశ్ అంబానీ, గౌతం అదానీల సంపద పరుగుకు బ్రేక్ పడింది. ఈ ఏడాది జూన్‌లో 24,310 కోట్ల డాలర్లుగా (సుమారు రూ.20,63,675 కోట్లు) ఉన్న వీరిరువురి సంపద ఈ నెల 13వ తేదీ నాటికి 17,880 కోట్ల డాలర్లకు (సుమారు రూ.15,17,833 కోట్లు) పడిపోయింది. దీంతో వీరిద్దరికి ఈ సంవత్సరం బ్లూమ్‌బర్గ్ 100 బిలియన్ డాలర్ల క్లబ్‌లో చోటు దొరకలేదు. ఈ ఏడాది జూన్ నుంచి ఈ నెల 13వ తేదీ మధ్య వీరిద్దరి సంపద రూ.5.45 లక్షల కోట్లు ఆవిరైపోయింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ సంపద 12,080 కోట్ల డాలర్ల నుంచి 9,670 కోట్ల డాలర్లకు (సుమారు రూ.8.21 లక్షల కోట్లు), అదానీ సంపద 12,230 కోట్ల డాలర్ల నుంచి 8,210 కోట్ల డాలర్లకు (సుమారు రూ.6.96 లక్షల కోట్లు) పడిపోయింది. ఆర్‌ఐఎల్ ఎనర్జీ, రిటైల్ వ్యాపారాల వృద్ధిరేటు తగ్గడం, అప్పులు పెరిగి పోవడం అంబానీ ఆస్తులను దెబ్బతీసింది. అదానీ గ్రీన్ ఎనర్జీ రాజకీయనేతలు, అధికారులకు లంచాలు మేపిందన్న ఆరోపణలతో అమెరికాలో గౌతం అదానీపై కేసులు నమోదు కావడం ఆయన ఆస్తులు క్షీణించడానికి కారణమని బ్లూమ్‌బర్గ్ తెలిపింది.

20 మంది మరింత పైకి: అయితే ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 20 మంది సంపన్న భారతీయుల సంపద మాత్రం 6,730 కోట్ల డాలర్లు (5.71 లక్షల కోట్లు) పెరిగినట్టు బ్లూమ్‌బర్గ్ తెలిపింది. మళ్లీ ఇందులో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ అధినేత శివ నాడార్ సంపద 1,080 కోట్ల డాలర్లు (సుమారు రూ.91,681 కోట్లు), ఓపీ జిందాల్ గ్రూపు గౌరవ చైర్‌పర్సన్ సావిత్రి జిందాల్ ఆస్తులు 1,010 కోట్ల డాలర్లు (సుమారు రూ.85,738 కోట్లు) పెరిగాయి.

ఐపీఓ మార్కెట్ కళకళ



ఈ నెలలో ఇప్పటికే 11 ఇష్యూలు
నెలాఖరుకల్లా మరో 2-3 ఆఫర్లు!

న్యూఢిల్లీ: ఈ నెల ప్రైమరీ మార్కెట్ పబ్లిక్ ఆఫరింగ్‌లతో (ఐపీఓ) కళకళలాడుతోంది. ఇప్పటికే నాలుగు కంపెనీల ఐపీఓలు పూర్తి కాగా.. ఇంటర్నేషనల్ జెమ్మోలాజికల్ ఇష్యూ మంగళవారంతో ముగియనుంది. తాజాగా మరో 6 కంపెనీలు తమ ప్రణాళికలను ప్రకటించాయి. దాంతో సంఖ్య 11కు చేరనుంది. నెలాఖరు నాటికి మరో 2-3 కంపెనీలు కూడా ఐపీఓ పూర్తి చేసుకునే అవకాశాలున్నాయి. దాంతో ఈ ఏడాదిలో అత్యధిక కంపెనీలు ఐపీఓకు వచ్చిన నెలగా డిసెంబరు నిలిచిపోనుంది. ఈ సెప్టెంబరులో 12 కంపెనీలు ఐపీఓకి వచ్చాయి. కాగా, అక్టోబరులో 6 కంపెనీలే ఇష్యూకు వచ్చినప్పటికీ, అత్యధికంగా రూ.38,689 కోట్లు సమీకరించాయి. సోమవారం ప్రణాళికలు ప్రకటించిన కంపెనీల్లో డీఏఎం క్యాపిటల్ అడ్వైజర్, కాంకర్డ్ ఎన్విరో సిస్టమ్స్, ట్రాన్స్‌రైల్ లైటింగ్, సనాతన్ టెక్స్‌టైల్స్, మమత మెషినరీ ఐపీఓలు ఈనెల 19న ప్రారంభమై 23న ముగియనున్నాయి. డీఏఎం క్యాపిటల్ రూ.840 కోట్ల ఐపీఓ ధరల శ్రేణిని రూ.269-283గా నిర్ణయించింది. కాంకర్డ్ ఐపీఓ ప్రైస్ బ్యాండ్ రూ.665-701గా ఉంది. ట్రాన్స్‌రైల్ లైటింగ్ రూ.839 కోట్ల ఇష్యూ ధరల శ్రేణి రూ.410-432గా ఉంది. సనాతన్ టెక్స్‌టైల్స్ ఐపీఓ ధరల శ్రేణిని రూ.305-321గా నిర్ణయించింది. రూ.179 కోట్ల మమత మెషినరీ ఐపీఓ ధరల శ్రేణి రూ.230-243గా ఉంది. కాగా, అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బ్లాక్‌స్టోన్ పెట్టుబడులు కలిగిన వెంటివ్ హాస్పిటాలిటీ రూ.1,600 కోట్ల ఐపీఓ ఈనెల 20న ప్రారంభమై 24న ముగియనుంది.

- ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్ ఐపీఓకు అనుమతి కోరుతూ సెబీకి డీఆర్‌హెచ్‌పీ దాఖలు చేసింది. ఐపీఓ ద్వారా సంస్థ రూ.750 కోట్ల తాజా ఈక్విటీని జారీ చేయనుంది.

వాణిజ్య లోటు రికార్డు గరిష్ఠం



- నవంబరులో రూ.3.21 లక్షల కోట్లకు..
- ఎగుమతుల క్షీణత, దూసుకుపోయిన దిగుమతులే కారణం
- పసిడి దిగుమతుల్లోనూ కొత్త రికార్డు

న్యూఢిల్లీ: ఎగుమతుల రంగం మరోసారి నిరాశావహమైన పనితీరు ప్రదర్శించింది. అక్టోబరు నెలలో రెండంకెల వృద్ధిని నమోదు చేసుకున్న ఈ రంగం నవంబరులో మరోసారి తిరోగమనం బాట పట్టింది. కేంద్ర వాణిజ్య శాఖ సోమవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం..నవంబరు నెలలో ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 4.85 శాతం తగ్గి 3,211 కోట్ల డాలర్లకు (రూ.2,72,646 కోట్లు) పడిపోయాయి. అదే సమయంలో దిగుమతులు 27 శాతం పెరిగి రికార్డు స్థాయి 6,995 కోట్ల డాలర్లకు (రూ.5,93,945 కోట్లు) చేరుకున్నాయి. ఫలితంగా వాణిజ్య లోటు ఆల్ టైం గరిష్ఠ స్థాయి 3,784 కోట్ల డాలర్లకు (రూ.3.21 లక్షల కోట్లు) పెరిగింది.

ఏప్రిల్-నవంబరు కాలానికి..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్-నవంబరు కాలానికి ఎగుమతులు 2.17 శాతం వృద్ధితో 28,431 కోట్ల డాలర్లకు (రూ.24.14 లక్షల కోట్లు), దిగుమతులు 8.35 శాతం పెరుగుదలతో 48,673 కోట్ల డాలర్లకు (రూ.41.33 లక్షల కోట్లు) చేరాయి. వాణిజ్య లోటు 20,242 కోట్ల డాలర్లుగా నమోదైంది.

బంగారం దిగుమతులు నాలుగింతలు

గత నెలలో పసిడి దిగుమతులు నాలుగింతలై (331%) రికార్డు గరిష్ఠ స్థాయి 1,486 కోట్ల డాలర్లకు (రూ.1.26 లక్షల కోట్లు) చేరాయి. పండగలు, పెళ్లిళ్ల సీజన్ డిమాండ్ నేపథ్యంలో బులియన్ స్టాకిస్టులు బంగారాన్ని భారీగా దిగుమతి చేసుకోవడం ఇందుకు కారణం. 2023 నవంబరులో గోల్డ్ దిగుమతులు కేవలం 344 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. కాగా, ఈ ఏప్రిల్-నవంబరు కాలానికి బంగారం దిగుమతులు వార్షిక ప్రాతిపదికన 49 శాతం వృద్ధితో 4,900 కోట్ల డాలర్లకు (రూ.4.16 లక్షల కోట్లు) చేరాయి.



చమురు ధరల్లో హెచ్చుతగ్గుల వల్లే ఎగుమతుల క్షీణత

ముడిచమురు ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు మన ఎగుమతులపై ప్రభావం చూపాయని వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ భరత్వాల్ అన్నారు. గత నెలలో పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు 50 శాతం తగ్గి 371 కోట్ల డాలర్లకు పరిమితమయ్యాయని ఆయన వెల్లడించారు. అంతేకాదు, గడిచిన 8 నెలల కాలానికి పెట్రో ఉత్పత్తుల ఎగుమతులు 19 శాతం తగ్గి 4,460 కోట్ల డాలర్లకు పడిపోయాయని ఆయన తెలిపారు. చమురేతర ఉత్పత్తుల ఎగుమతులు మాత్రం మంచి వృద్ధిని నమోదు చేయగలిగాయన్నారు. సేవల ఎగుమతులతో కలిపి ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఎగుమతులు 80,000 కోట్ల డాలర్లకు చేరవచ్చన్నారు. గత నెలలో సేవల ఎగుమతులు 3,567 కోట్ల డాలర్ల (రూ.3.03 లక్షల కోట్లు) స్థాయిలో జరిగి ఉండవచ్చని అంచనా. 2023 నవంబరులో సేవల ఎగుమతులు 2,811 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి.

మ్యూచువల్ ఫండ్స్ ఆస్తులు రూ.67.81 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) విభాగంలో అప్‌ట్రెండ్ కొనసాగుతోంది. ఈ ఏడాది జనవరి 1న రూ.52.44 లక్షల కోట్లుగా ఉన్న ఓపెన్ ఎంఎఫ్ పథకాల నిర్వహణలోని ఆస్తులు గత నెలాఖరు నాటికి 29 శాతం పెరిగి రూ.67.81 లక్షల కోట్లకు చేరాయి. ఇదే సమయంలో ఈక్విటీ పథకాల నిర్వహణలోని ఆస్తులు రూ.22.5 లక్షల కోట్ల నుంచి రూ.30.35 లక్షల కోట్లకు, మల్టీక్యాప్ ఫండ్స్ నిర్వహణలోని ఆస్తులు రూ.1.94 లక్షల కోట్ల నుంచి 38 శాతం వృద్ధి రేటుతో రూ.2.68 లక్షల కోట్లకు చేరాయి. ఇండెక్స్ ఫండ్స్, ఈటీఎఫ్, గోల్డ్ ఈటీఎఫ్‌ల నిర్వహణలోని ఆస్తుల విలువ కూడా 28 శాతం వృద్ధితో రూ.8.83 లక్షల కోట్ల నుంచి రూ.11.29 లక్షల కోట్లకు చేరింది. హైబ్రిడ్, డెట్, లిక్విడ్ ఫండ్స్ నిర్వహణలోని ఆస్తుల విలువ సైతం భారీగా పెరిగింది. అధిక రాబడులతో ఇన్వెస్టర్లు ప్రస్తుతం బ్యాంకు డిపాజిట్లపై కంటే ఈక్విటీ, మల్టీకాప్ ఫండ్స్‌పై ఆసక్తి చూపడం ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

ఫెడ్ సమీక్షకు ముందు అప్రమత్తత

సెన్సెక్స్ 385 పాయింట్లు పతనం

ముంబై: స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఒకదశలో 581 పాయింట్లకు పైగా క్షీణించినప్పటికీ, చివర్లో 384.55 పాయింట్ల నష్టంతో 81,748.57 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 100.05 పాయింట్లు కోల్పోయి 24,668.25 వద్దకు జారుకుంది. అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ ఈ వారంలో వడ్డీరేట్ల తగ్గింపుపై తన నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో ఈక్విటీ మదుపరులు ముందు జాగ్రత్తగా అమ్మకాలకు పాల్పడ్డారు. రూపాయి క్షీణతతో పాటు నిరాశాజనక చైనా ఆర్థిక గణాంకాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను మరింత కుంగదీశాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 24 నష్టపోయాయి.

- భారత కరెన్సీ సరికొత్త జీవనకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 11 పైసలు క్షీణించి రూ.84.91 వద్ద ముగిసింది. ఈక్విటీ మార్కెట్లో నష్టాలు, అమెరికా బాండ్ల రిటర్నుల రేటు పెరగడం ఇందుకు కారణం.
- ఢిల్లీ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,150 తగ్గి రూ.78,350కి జారుకుంది. కిలో వెండి రూ.300 తగ్గుదలతో రూ.92,500గా నమోదైంది.

ఏపీ, తెలంగాణలో 'ఆక్సిలో ఫిన్‌సర్వ్' విస్తరణ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విదేశాల్లో ఉన్నత విద్య కోసం రుణాలు అందించే 'ఆక్సిలో ఫిన్‌సర్వ్ (ప్రైవేట్) లిమిటెడ్ కంపెనీ రెండు తెలుగు రాష్ట్రాల్లో తన కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఇందులో భాగంగా వచ్చే ఆరు నెలల్లో విజయవాడ, విశాఖపట్నం, నిజామాబాద్‌లలో కొత్త టచ్ పాయింట్లు ఏర్పాటు చేస్తోంది. కంపెనీ ఓవర్‌సీస్ ఎడ్యుకేషన్ లోన్స్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ శ్వేత గురు ఈ విషయం చెప్పారు. హైదరాబాద్ బ్రాంచ్ ఆఫీసు నుంచి ఈ టచ్ పాయింట్లను నిర్వహిస్తామన్నారు. త్వరలో గుంటూరు, వరంల్, తిరుపతి, కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లోనూ టచ్ పాయింట్లు ఏర్పాటు చేసే యోచన ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికి రూ.930 కోట్ల విద్యా రుణాలివ్వగా అందులో తెలుగు రాష్ట్రాల వాటా రూ.350 కోట్ల వరకు ఉందన్నారు. ఈ రాష్ట్రాల్లో గత మూడేళ్లుగా తమ విద్యా రుణాల పోర్టుఫోలియో ఏటా 50 శాతం చొప్పున పెరుగుతోందన్నారు. వివిధ అంశాల ఆధారంగా ఒక్కో విద్యార్థికి రూ.25 లక్షల నుంచి రూ.65 లక్షల వరకు, ప్రత్యేక కోర్సులకు రూ.75 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. రుణంపై 10.7 శాతం నుంచి 13.5 శాతం వరకు వడ్డీ ఉంటుందని తెలిపారు.

3 నెలల కనిష్ఠానికి టోకు ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ: టోకు ద్రవ్యోల్బణ సూచీ నవంబరులో మూడు నెలల కనిష్ఠ స్థాయి 1.89 శాతానికి జారుకుంది. ఆహార ధరలు కాస్త తగ్గుముఖం పట్టడం ఇందుకు దోహదపడింది. ఈ అక్టోబరులో టోకు ద్రవ్యోల్బణం 2.36 శాతంగా నమోదైంది. కాగా, గత ఏడాది నవంబరులో సూచీ 0.39 శాతానికి పరిమితమైంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,850 ▼	71,350 ▼	1,00,000 ▼
విజయవాడ	79,500 ▲	72,700 ▲	92,000 ▼
విశాఖపట్నం	77,330 ▲	70,980 ▲	91,230 ▲
రాజమండ్రి	77,890 ▲	71,400 ▲	92,000 ▼
ప్రొద్దుటూరు	78,300 ▲	72,510 ▲	92,100 ▲
ముంబై	76,910 ▼	70,450 ▼	89,515 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

17వ తేదీ



హైదరాబాద్	620	విజయవాడ	630
వరంగల్	622	గోదావరి	630
చిత్తూరు	603	విశాఖపట్నం	620
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	101	విజయవాడ	104
వరంగల్	101	గుంటూరు	107
కరీంనగర్	101	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	101	చిత్తూరు	95
కర్నూలు	101	నెల్లూరు	95
విశాఖపట్నం	108	అనంతపురం	95
గోదావరి	104		

అటు వర్షం.. ఇటు వికెట్లు

భారత్ తొలి ఇన్నింగ్స్ 51/4

కుప్పకూలిన టాపార్డర్

ఆసీస్ మొదటి ఇన్నింగ్స్ 445 ● బుమ్రాకు ఆరు వికెట్లు


కోహ్లీ అవుట్.. ఇలా


పంత్


గిల్


జైస్వాల్



బ్రిస్బేన్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ మూడో టెస్టును వరుణుడు వదలడం లేదు. సోమవారం మూడో రోజు ఆటలో ఆటగాళ్లు పదేపదే మైదానంలోకి రావడం.. పెవిలియన్‌కు వెళ్లడంతోనే సరిపోయింది. కేవలం 33 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యం కాగా.. ఇందులో భారత్ ఆడింది 17 ఓవర్లు. కానీ ఈ కాస్త సమయంలోనే మనోళ్లవి టపటపా నాలుగు వికెట్లు పడిపోయాయి. ఆస్ట్రేలియా బ్యాటర్లు శతకాలతో చెలరేగిన చోట భారత బ్యాటర్లు నానా తంటాలుపడిన తీరు అందరినీ నిరాశపరిచింది. పదేపదే అవే తప్పులు చేస్తూ ఆసీస్ బౌలర్లకు అప్పనంగా వికెట్లను సమర్పించుకోవడంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 51/4 స్కోరుతో నిలిచింది. రాహుల్ (33 బ్యాటింగ్) ఒక్కడే ఓపిగ్గా క్రీజులో నిలిచి పరుగులు రాబడుతున్నాడు. అతడికి జతగా రోహిత్ పరుగులేమీ చేయకుండా ఉన్నాడు. స్టార్క్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఓ విధంగా భారత్‌ను వర్షమే కాపాడుతోంది. లేకుంటే ఈపాటికి ఫాలోఆన్ ఆడే దుస్థితి దాపురించేదేమో. అంతకు ముందు ఆసీస్ తమ ఓవర్‌నైట్ స్కోరుకు మరో 40 పరుగులు జోడించి 445 పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్‌ను ముగించింది. క్యారీ (70) హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. బుమ్రాకు ఆరు, సిరాజ్‌కు రెండు వికెట్లు దక్కాయి.

రెండో బంతి నుంచే...: ఆసీస్ ఇన్నింగ్స్ ముగిశాక వెంటనే వర్షం కురవడంతో అరగంట ఆలస్యంగా భారత్ తొలి ఇన్నింగ్స్ ఆరంభించింది. కానీ ఆ తర్వాత కూడా అటు వరుణుడి రాకతో పాటు ఇటు క్రీజులో వికెట్ల పతనం కూడా సాగింది. తొలి బంతినే ఫోర్‌గా మలిచిన ఓపెనర్ యశస్వీని రెండో బంతికే స్టార్క్ అవుట్ చేశాడు. షార్ట్ మిడ్ వికెట్‌లో మార్ష్‌కు క్యాచ్ ఇచ్చిన తను షాక్‌తో వెనుదిరిగాడు. స్టార్క్ తర్వాతి ఓవర్‌లోనూ ఇదే సీన్ రిపీట్ అయ్యింది. ఈసారి గిల్ (1)ని దెబ్బతీశాడు. గిల్ క్యాచ్‌ను గల్లీలో మార్ష్ పట్టేశాడు. అటు రాహుల్ మాత్రం ఆరో ఓవర్‌లో రెండు ఫోర్లు సాధించి పరుగుల కోసం ప్రయత్నించాడు. అలాగే హాజెల్‌వుడ్ ఓవర్‌లో మణికట్టు వద్ద బంతి బలంగా తాకినా చికిత్స చేయించుకుని మరీ ఆడాడు. మరో ఎండ్‌లో విరాట్ (3) 16 బంతులు ఎదుర్కొన్నా ఎప్పటిలాగే ఆఫ్‌సైడ్ ఆవలి బంతిని డ్రైవ్ చేయబోయి కీపర్ క్యారీకి క్యాచ్ ఇచ్చాడు. 22/3 స్కోరుతో నిలిచిన వేళ వర్షం మొదలైంది. దీంతో లంచ్ బ్రేక్‌ను ప్రకటించారు. రెండో సెషన్ ఆరంభమైన కాసేపటికే మళ్లీ వర్షంతో 45 నిమిషాల పాటు అంతరాయం కలిగింది. క్రీజులో రాహుల్‌తో పంత్ (9) కూడా ఉండడంతో ఆ తర్వాతైనా స్కోరు కుదురుకుంటుందనిపించింది. కానీ కమిన్స్ విసిరిన బంతి పంత్ బ్యాట్ ఎడ్జ్ తీసుకుని క్యారీ చేతుల్లో పడింది. ఆ తర్వాత మరో రెండు బంతులకే భారీ వర్షం పలకరించడంతో ఈసారి రెండు గంటలపాటు ఆటగాళ్లు డ్రెస్సింగ్ రూమ్‌కే పరిమితమయ్యారు. తిరిగి ఆసీస్ కాలమానం ప్రకారం సాయంత్రం 5 గంటలకు ఆఖరి సెషన్ ఆటను ఆరంభించారు. కేవలం మూడు ఓవర్లు సాగాక మరోసారి వర్షం కురవడంతో చేసేదేమీలేక ఆటను ముగించాల్సి వచ్చింది.

స్కోరుబోర్డు

ఆసీస్ తొలి ఇన్నింగ్స్: ఖవాజా (సి) పంత్ (బి) బుమ్రా 21; మెక్‌స్వీనే (సి) విరాట్ (బి) బుమ్రా 9; లబుషేన్ (సి) విరాట్ (బి) నితీశ్ 12; స్మిత్ (సి) రోహిత్ (బి) బుమ్రా 101; హెడ్ (సి) పంత్ (బి) బుమ్రా 152; మార్ష్ (సి) విరాట్ (బి) బుమ్రా 5; క్యారీ (సి) గిల్ (బి) ఆకాశ్ 70; కమిన్స్ (సి) పంత్ (బి) సిరాజ్ 20; స్టార్క్ (సి) పంత్ (బి) బుమ్రా 18; లియోన్ (బి) సిరాజ్ 2; హాజెల్‌వుడ్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 35; మొత్తం: 117.1 ఓవర్లలో 445 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-31, 2-38, 3-75, 4-316, 5-326, 6-327, 7-385, 8-423, 9-445, 10-445; **బౌలింగ్:** బుమ్రా 28-9-76-6; సిరాజ్ 23.2-5-97-2; ఆకాశ్ 29.5-5-95-1; నితీశ్ 13-1-65-1; జడేజా 23-2-95-0.

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) మార్ష్ (బి) స్టార్క్ 4; రాహుల్ (బ్యాటింగ్) 33; గిల్ (సి) మార్ష్ (బి) స్టార్క్ 1; విరాట్ (సి) క్యారీ (బి) హాజెల్‌వుడ్ 3; పంత్ (సి) క్యారీ (బి) కమిన్స్ 9; రోహిత్ (బ్యాటింగ్) 0; **ఎక్స్‌ట్రాలు: 1; మొత్తం: 17 ఓవర్లలో 51/4. వికెట్ల పతనం:** 1-4, 2-6, 3-22, 4-44; **బౌలింగ్:** స్టార్క్ 8-1-25-2; హాజెల్‌వుడ్ 5-2-17-1; కమిన్స్ 2-0-7-1; లియోన్ 1-0-1-0; హెడ్ 1-0-1-0.

2 ఆసీస్ గడ్డపై ఎక్కువ టెస్టు వికెట్లు (50) తీసిన రెండో భారత బౌలర్‌గా బుమ్రా. కపిల్ (51) టాప్‌లో ఉన్నాడు.

షకీబ్ బౌలింగ్‌పై సస్పెన్షన్

దుబాయ్: బంగ్లాదేశ్ స్టార్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్ బౌలింగ్‌పై ఐసీసీ సస్పెన్షన్ విధించింది. అంతర్జాతీయ మ్యాచ్‌లతో పాటు దేశవాళీ, లీగ్ స్థాయి మ్యాచ్‌ల్లోనూ ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని తెల్పింది. రెండు రోజుల క్రితమే ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) కూడా అతడి బౌలింగ్‌ను బ్యాన్ చేసింది.

సామి..ఇక అన్ని ఫార్మాట్లకూ

బ్రిడ్జిటౌన్ : మాజీ కెప్టెన్ డారెన్ సామి ఇకపై వెస్టిండీస్ క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్లకూ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. ప్రస్తుతం వన్డే, టీ20ల కోచ్‌గా ఉన్న సామి, వచ్చే ఏడాది ఏప్రిల్ ఒకటినుంచి టెస్టు క్రికెట్ కోచింగ్ బాధ్యతలు కూడా స్వీకరిస్తాడని క్రికెట్ వెస్టిండీస్ డైరెక్టర్ మైల్స్ చెప్పాడు. రెండుసార్లు టీ20 వరల్డ్‌కప్ నెగ్గిన వెస్టిండీస్ జట్టుకు సామి కెప్టెన్‌గా వ్యవహరించాడు.



'బిట్స్ అండ్ పీసెస్' పుస్తకావిష్కరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): క్రీడా విశ్లేషకుడు సి.వెంకటేష్ రచించిన 'బిట్స్ అండ్ పీసెస్-ది లైటర్ సైడ్ ఆఫ్ క్రికెట్' పుస్తకావిష్కరణ సోమవారం ఇక్కడి ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. దేశంలో అత్యంత ప్రజాదరణ ఉన్న క్రికెట్‌కు సంబంధించి స్ఫూర్తిదాయకమైన అంశాలతో తీర్చిదిద్దారని పుస్తకాన్ని ఆవిష్కరించిన సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ కొనియాడారు. ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు చాముండేశ్వరనాథ్, ఆదాయపన్ను శాఖ విశ్రాంత అధికారి సుబ్బారావు, మాజీ ఐఏఎస్ పరశురామయ్య, రచయిత సి.వెంకటేష్, దైవజ్ఞ శర్మ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అర్జెంటీనా పేసర్ డబుల్ హ్యాట్రిక్

టీ20లలో అరుదైన రికార్డ్



బ్యూనస్‌ఎయిర్స్ (అర్జెంటీనా): అర్జెంటీనా బౌలర్ హెర్నాన్ ఫెన్నెల్ అరుదైన రికార్డు నెలకొల్పాడు. పురుషుల టీ20లలో రెండుసార్లు హ్యాట్రిక్ సాధించిన ఆరో బౌలర్‌గా నిలిచాడు. గతంలో కమిన్స్, సౌథీ, మలింగ తదితరులు ఈ ఘనతను సాధించారు. టీ20 ప్రపంచ కప్ సబ్ రీజనల్ అమెరికా క్వాలిఫయర్స్ మ్యాచ్‌లో ఈ ఫీట్ ఆవిష్కృతమైంది. కేమన్ ఐలాండ్స్‌తో ఆదివారం ఇక్కడ జరిగిన మ్యాచ్ ఆఖరి ఓవర్లో 36 ఏళ్ల పేసర్ హెర్నాన్ చివరి నాలుగు బంతుల్లో నాలుగు వికెట్లు పడగొట్టాడు. మొత్తంగా మ్యాచ్‌లో అతడు (5/16) ఐదు వికెట్లు తీశాడు. ఇక వరుసగా నాలుగు బంతుల్లో నాలుగు వికెట్లు తీసిన జాబితాలోనూ ఫెన్నెల్ చేరాడు.

జట్టు సంధి దశలో ఉంది

'ఇప్పుడు తప్పెవరిదనే విషయమై చర్చించుకోవాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం జట్టు సంధి దశలో ఉంది. నితీశ్, ఆకాశ్, హర్షిత్‌లకు ఇక్కడ ఆడిన అనుభవం లేదు. ఆసీస్‌లో క్రికెట్ ఆడడం అంత సులువు కాదు. సీనియర్ బౌలర్‌గా నేను వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉంది' -బుమ్రా

ఎనిమిదేళ్ల దిగువకు..



పేలవ ఫామ్‌తో ఇబ్బందిపడుతున్న విరాట్ కోహ్లీ టెస్టు సగటు ఎనిమిదేళ్ల దిగువకు చేరింది. పెర్త్ టెస్టులో సెంచరీ చేశాక అతడు 7, 11, 3 పరుగులకే పరిమితమయ్యాడు. దీంతో తన టెస్టు సగటు 47.49కి పడిపోయింది. 2016 తర్వాత విరాట్ ఇంత తక్కువ సగటుకి చేరడం ఇదే ప్రథమం. మరోవైపు విరాట్ అవుటైన తీరును మాజీ కెప్టెన్ గవాస్కర్ తప్పుబట్టాడు. 'పేలవ షాట్‌తో తీవ్రంగా నిరుత్సాహపరిచాడు. ఒకవేళ ఆ బంతి నాలుగో స్టంప్‌పై పడితే అర్థం చేసుకోగలం. కానీ ఏడు లేదా ఎనిమిదో స్టంప్‌పై పడిన బంతిని ఆడాల్సిన అవసరం ఏమిటి?' అని ప్రశ్నించాడు.

మరో రెండు రోజులు వర్షం ?

మూడో టెస్టులో భారత్‌కు వరుణుడు అండగా నిలిచే అవకాశం కనిపిస్తోంది. రాబోయే రెండు రోజులు కూడా వర్షం కురిసే అవకాశం 90 శాతం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. ఈ టెస్టులో తొలి రోజు 13.4 ఓవర్ల ఆటే సాధ్యపడగా.. రెండో రోజు మాత్రం పూర్తిగా సాగింది.

స్పోర్ట్స్

ఆరోసారి ప్లేఆఫ్స్‌కు ఢిల్లీ

పుణె: దబాంగ్ ఢిల్లీ కేసీ జట్టు ప్రొ.కబడ్డీ తాజా సీజన్‌లో ప్లేఆఫ్స్‌కు ప్రవేశించింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 47-25తో బెంగాల్ వారియర్స్‌ను చిత్తు చేసింది. ఢిల్లీ స్టార్ రైడర్ అషు మాలిక్ 17 పాయింట్లతో అదరగొట్టాడు. యోగేష్ (9) అతడికి అండగా నిలిచాడు. బెంగాల్ జట్టులో విశ్వాస్ (8), నితేశ్ కుమార్ (5) రాణించారు. కాగా..వరుసగా ఆరో సీజన్‌లో ప్లేఆఫ్స్‌కు చేరిన జట్టుగా ఢిల్లీ రికార్డు నెలకొల్పింది. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 37-32తో పుణెరి పల్టన్‌పై నెగ్గింది.



గుకేష్‌కు ఘనస్వాగతం

నేడు చెన్నైలో సన్మానం

చెన్నై: ప్రపంచ చెస్ కొత్త చాంపియన్ దొమ్మరాజు గుకేష్ సోమవారం.. స్వస్థలం చెన్నై చేరుకున్నాడు. విమానాశ్రయానికి పెద్ద సంఖ్యలో అభిమానులు, తమిళనాడు ప్రభుత్వ అధికారులు తరలివచ్చి అతడిని ఘనంగా స్వాగతించారు. సింగపూర్‌లో జరిగిన వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్ ఫైనల్లో 18 ఏళ్ల గుకేష్ 7.5-6.5 స్కోరుతో గత విజేత డింగ్ లిరెన్ (చైనా)ను ఓడించి టైటిల్ దక్కించుకున్న విషయం తెలిసిందే. తద్వారా అతి పిన్నవయస్సులో విశ్వ విజేతగా నిలిచిన రికార్డునూ చెన్నై చిన్నోడు అందుకున్నాడు. టోర్నీ జరిగిన రెండు వారాలూ తనకు మద్దతుగా నిలిచిన అందరికీ ఈ సందర్భంగా భారత గ్రాండ్‌మాస్టర్ కృతజ్ఞతలు తెలిపాడు. కాగా తమిళనాడు ప్రభుత్వ ఆధ్వర్యంలో గుకేష్‌ను మంగళవారం సన్మానించనున్నారు.

ఇంగ్లండ్ లక్ష్యం 658

హామిల్టన్: న్యూజిలాండ్‌తో మూడో, ఆఖరి టెస్టులో ఇంగ్లండ్ ఓటమి దిశగా పయనిస్తోంది. 658 పరుగుల కొండంత లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ చేపట్టిన పర్యాటక జట్టు మూడో రోజు ఆఖరికి రెండు వికెట్లకు 18 పరుగులు చేసింది. అంతకుముందు..ఓవర్‌నైట్ స్కోరు 136/3తో సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ 453 పరుగులకు ఆలౌటైంది. విలియమ్సన్ (156) శతకంతో కదం తొక్కాడు. ఈ క్రమంలో టెస్టుల్లో 33వ శతకం పూర్తి చేశాడు. ఇక.. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ 347, ఇంగ్లండ్ 143 రన్స్ సాధించాయి.



మధ్యవర్తిత్వంపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ రవినాథ్ తిల్హరి

మధ్యవర్తిత్వంతో వివాదాల పరిష్కారంపై శిక్షణ

▸▸ ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తులు

అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వ విధానంలో వివాదాల పరిష్కారంపై సోమవారం హైకోర్టులో శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఏపీ న్యాయసేవాధికార సంస్థ, ఏపీ హైకోర్టు న్యాయసేవల కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుండి 20వ తేదీ వరకు ఇది జరగనుంది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ రవినాథ్ తిల్హరి ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతిలలో శిక్షణ కార్యక్రమాలను వర్చువల్‌గా ప్రారంభించారు. సుప్రీం కోర్టు మీడియేషన్ అండ్ కంసిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ (ఎంసీపీసీ) సభ్యులు, మాస్టర్ ట్రైనర్లుగా పేరొందిన అనూజా సక్సేనా, సురేందర్ సింగ్ మధ్యవర్తిత్వంపై శిక్షణ ఇవ్వనున్నారు. 40 గంటల పాటు జరిగే ఈ శిక్షణలో మధ్యవర్తిత్వ విధానాలపై లోతైన అవగాహన కల్పించనున్నారు. సమర్థవంతమైన వివాద పరిష్కారానికి అవసరమైన ప్రాక్టికల్, సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి సారించనున్నారు. ఏపీ న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షులు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరేందర్ మాట్లాడుతూ కేసులను తక్షణంగా పరిష్కరించేందుకు మధ్యవర్తిత్వ విధానం ఉపయోగపడుతుందన్నారు. కుటుంబ, వ్యాపార సంబంధ కేసులను ఈ విధానంలో పరిష్కరించుకోవాలని కోరారు. దీని ద్వారా డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు మధ్యవర్తిత్వ మెళకువలు నేర్చుకోవాలని సూచించారు. శిక్షణా కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాదులు, రిజిస్ట్రార్‌లు, రిటైర్డ్ జడ్జిలు, మాజీ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, హైకోర్టు న్యాయసేవల కమిటీ సంస్థ కార్యదర్శి జి.మాలతి, ఏపీ న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి ఎం.బబిత, డిప్యూటీ సెక్రెటరీ హెచ్.అమరరంగేశ్వరరావు పాల్గొన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ మార్గదర్శకంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎం.బబిత పేర్కొన్నారు.

నేడు ఎయిమ్స్ తొలి స్నాతకోత్సవం

▸▸ ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రాక

అమరావతి, మంగళగిరి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఎయిమ్స్ ప్రథమ స్నాతకోత్సవం మంగళవారం మధ్యాహ్నం జరగనుంది. ఈ స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ముఖ్యఅతిథిగా హాజరై వైద్య విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనున్నారు. 2018-19లో తొలి బ్యాచ్‌గా 49 మంది విద్యార్థులు చేరారు. వీరంతా వైద్య విద్యలో గ్రాడ్యుయేషన్‌ను పూర్తి చేసుకున్నారు. వీరిలో 47 మందికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతులమీదుగా పట్టాలను ప్రదానం చేయనున్నారు. మరో నలుగురికి పీడీసీసీ సర్టిఫికెట్ కోర్సులకు సంబంధించిన పట్టాలు అందజేస్తారు. ఎంబీబీఎస్ గ్రాడ్యుయేషన్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మరో నలుగురు విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందిస్తారు. ఎయిమ్స్ ఆవరణలోని ఆడిటోరియంలో జరిగే ఈ స్నాతకోత్సవంలో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా, రాష్ట్ర వైద్య మంత్రి సత్యకుమార్ యాదవ్, మంత్రి లోకేశ్ తదితరులు పాల్గొంటారని ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ మధబానందకర్ తెలిపారు. రాష్ట్రపతి ముర్ము పర్యటన నేపథ్యంలో అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎయిమ్స్ డైరెక్టర్ మధబానందకర్, జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవతేజ రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. స్నాతకోత్సవం జరిగే ప్రధాన ఆడిటోరియంలో రాష్ట్రపతితో విద్యార్థుల ఫొటో సెషన్, వాహనాల పార్కింగ్, ఫైర్ సేఫ్టీ, విద్యుత్ సరఫరా అంశాలపై పలు సూచనలు చేశారు.

కేటీఆర్ మెడకు ఈ-కారు

నేడో రేపో నోటీసులు.. అరెస్టుకూ అవకాశం

కేటీఆర్‌పై విచారణకు గవర్నర్ అనుమతి

హైదరాబాద్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ-కారు రేసు వ్యవహారం పూర్తిస్థాయిలో మాజీ మంత్రి కేటీఆర్ మెడకు చుట్టుకోనుంది. ఈ అంశంలో చట్ట ప్రకారం ముందుకు వెళ్లాలని సర్కారు నిర్ణయించింది. ఈ కేసులో కేటీఆర్‌ను విచారించేందుకు ఇప్పటికే గవర్నర్ అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ వ్యవహారాన్ని ఏసీబీకి అప్పగించారు! నేడో రేపో కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు జారీ చేయనుంది! ఈమేరకు క్యాబినెట్‌లో సుదీర్ఘంగా చర్చ జరిగింది! సోమవారం అసెంబ్లీ వాయిదా పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం సమావేశమైంది. ఈ సందర్భంగా ఫార్ములా ఈ-కారు రేసు కేసులో కేటీఆర్‌ను విచారించేందుకు గవర్నర్ అనుమతి ఇచ్చిన విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గ సహచరులకు వివరించారు. ఇందులో జరిగిన అవినీతిపై ఏసీబీ ఇప్పటికే కేసు నమోదు చేసిన విషయాన్ని మంత్రులకు తెలిపారు. అనంతరం ఈ అంశంపై మంత్రుల అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. చట్ట ప్రకారమే ముందుకు వెళ్లాలని మంత్రులంతా తమ అభిప్రాయాన్ని స్పష్టం చేశారు. కేటీఆర్‌పై విచారణకు సంబంధించి ఇప్పుడే నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని, ఈ విషయంలో జాప్యం జరిగితే ఉపయోగం ఉండదని మెజార్టీ మంత్రులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు తెలిసింది. దాంతో, ఫార్ములా వన్ ఈ-కార్ రేసుకు సంబంధించి కేటీఆర్‌పై కేసు నమోదుకు అనుమతిస్తూ గవర్నర్ పంపిన పత్రాలను సోమవారం రాత్రే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపాలని నిర్ణయించారు. అనంతరం అక్కడి నుంచి ఏసీబీకి పంపనున్నారు. కాగా, ఏసీబీ దర్యాప్తులో భాగంగా తొలుత కేటీఆర్‌కు నోటీసులివ్వనున్నారు. ఆ తర్వాత ఆయనను అరెస్టు చేసే అవకాశం ఉంది.

ఆర్వోఆర్ బిల్లు మినహా..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్తు కొనుగోళ్లపై జస్టిస్ లోకూర్ కమిషన్ ఇచ్చిన నివేదికపై కూడా మంత్రిమండలి చర్చించింది. దీనిపై కూడా మంత్రుల అభిప్రాయాన్ని సీఎం తెలుసుకున్నారు. నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టి చర్చించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అలాగే, ఆర్వోఆర్ బిల్లును కూడా ఈ సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. అయితే, బిల్లు ముసాయిదాకు మంత్రిమండలి సోమవారం ఆమోదం తెలపలేదని తెలుస్తోంది. దీనిపై క్యాబినెట్ మరోమారు సమావేశం కావాలని భావించినట్లు సమాచారం. ఇక, ఐదు ఆర్డినెన్స్‌లకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. పంచాయతీరాజ్ చట్ట సవరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటిదాకా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే వారికి ఇద్దరే పిల్లలుండాలన్న నిబంధనను మార్చి.. ఆ స్థానంలో ముగ్గురు పిల్లలుండేలా చట్టాన్ని మార్చారు.

ఏసీబీ తేలుస్తుంది: పొంగులేటి

ఈ-కార్ రేసు విషయంలో చట్టప్రకారం ముందుకు వెళ్లాలని మంత్రిమండలి నిర్ణయించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించిన పెట్టుబడుల లెక్కలను కూడా ఏసీబీ తేలుస్తుందని, అవి రూ.50 కోట్లా లేక రూ.700 కోట్లా అనేది ఏసీబీ విచారణలో తేలుతుందని వ్యాఖ్యానించారు. మంత్రిమండలి సమావేశం తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ-కార్ ఫార్ములా రేసు పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం దోపిడికి పాల్పడిందని ఆరోపించారు. ఈ విషయంలో కేటీఆర్ అరెస్టు అవుతారో లేదో తనకు తెలియదని, చట్టం తన పని తాను చేస్తుందని వ్యాఖ్యానించారు. అరెస్టు భయంతో కేటీఆర్ రాత్రికి రాత్రే ఢిల్లీకి ఎందుకు పరుగులు పెట్టారో, అక్కడ ఎవర్ని కలిశారో చెప్పాలని ప్రశ్నించారు. అరెస్టు భయంతోనే ఇంటి దగ్గర కాపలా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. తాము ఎవరిపైనా కక్షపూరితంగా వ్యవహరించడం లేదని, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ జరుపుతున్నామని చెప్పారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం కలగా మిగులుతుందన్నారు. శాసన సభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్ల కార్డులను పట్టి నినాదాలతో పదే పదే ఆటంకం కలిగించారని మండిపడ్డారు.

కేసీఆర్‌పై కేసు!

మాజీ సీఎంకు విద్యుత్తు కొనుగోళ్లు, ఒప్పందాల షాక్

హైదరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ హయాంలో పదేళ్లపాటు చేసుకున్న విద్యుత్తు ఒప్పందాలు; ప్లాంట్ల నిర్మాణంలో తప్పిదాలపై విచారణ జరిపి జస్టిస్ మదన్ భీంరావు లోకూర్ కమిషన్ సమర్పించిన నివేదికను తెలంగాణ మంత్రివర్గం సోమవారం ఆమోదించింది. ఆయా నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించిన మాజీ సీఎం కేసీఆర్‌తోపాటు ఇతర పాత్రధారులపై చర్యలకు ఉపక్రమించాలని నిర్ణయించింది. సదరు నివేదికను ప్రస్తుతం కొనసాగుతున్న శాసన సభలో ప్రవేశపెట్టాలని తీర్మానించింది. నివేదికపై సభలో విస్తృతంగా చర్చించిన తర్వాత.. మాజీ సీఎం కేసీఆర్‌పై తీసుకునే చర్యలకు సంబంధించి అసెంబ్లీ సాక్షిగానే ప్రకటన చేయనుంది. దీని ఆధారంగా కేసీఆర్ సహా పలువురిపై కేసు నమోదు చేసే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. సోమవారం నాటి కేబినెట్‌లో విద్యుత్తు కమిషన్ నివేదికపైనే సుదీర్ఘంగా చర్చ జరిగింది. గత పదేళ్ల కాలంలో కేసీఆర్ డిస్కమ్‌లను ఆర్థికంగా కుప్పకూల్చారని, విద్యుత్తు కొనుగోళ్లు, పవర్ ప్లాంట్ల నిర్మాణంలో తీసుకున్న నిర్ణయాలతో రానున్న 25 ఏళ్లపాటు తెలంగాణ సమాజం మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తేల్చింది.

అన్నదమ్ములను చంపేసిన చెల్లి

ఒకరిని కాల్వలోకి తోసేసి.. మరొకరికి చున్నీ బిగించి..

▸▸ తండ్రికి దక్కే ఆర్థిక ప్రయోజనాలపై కన్నేసి దారుణం

▸▸ పల్నాడు జిల్లా నకరికల్లులో ఘటన

నకరికల్లు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆమె తండ్రి ఉపాధ్యాయుడు. ఇటీవల అతడు అనారోగ్యంతో చనిపోయాడు. తండ్రికి ప్రభుత్వం ద్వారా అందే ఆర్థిక ప్రయోజనాలన్నీ తన అన్నదమ్ములిద్దరికీ కాకుండా తనకే దక్కాలనే దురుద్దేశంతో వారిద్దరినీ చంపేసింది. ఇది జరిగి సుమారు 20 రోజులుకాగా, ఇంతకాలం మానసిక సంఘర్షణకు గురైన ఆమే స్వయంగా పోలీసు స్టేషన్‌కు వచ్చి జరిగిన విషయం చెప్పింది. ఆమె పోలీసులకు చెప్పిన తర్వాత... సోమవారం పోలీసులు రంగంలోకి దిగి మృతదేహాల కోసం గాలింపు చేపట్టారు. పల్నాడు జిల్లా నకరికల్లులో జరిగిన ఈ ఘటనపై స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం... నకరికల్లుకు చెందిన తలపల పోలురాజు స్థానిక రామదాసుకాలనీలోని గిరిజన సంక్షేమ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ఆయనకు ముగ్గురు సంతానం. పెద్ద కొడుకు గోపి కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. మద్యానికి బానిసై కొంతకాలంగా విధులకు వెళ్లడం లేదు. అతడితో గొడవలతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. గోపి సోదరి కృష్ణవేణికి పెళ్లయ్యింది. నాలుగేళ్ల కిందట విడాకులు తీసుకుని, నకరికల్లులోని పుట్టింట్లోనే ఉంటూ.. మరొకరితో సహజీవనం చేస్తోంది. వీరి సోదరుడు దుర్గా రామకృష్ణ రామదాసుకాలనీలో ఉంటున్నాడు. భార్యతో సఖ్యత లేక అతడూ విడాకులు తీసుకున్నాడు. వారి తండ్రి పోలురాజు ఈ ఏడాది జనవరిలో అనారోగ్యంతో చనిపోయాడు. అతనికి ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక ప్రయోజనాల విషయంలో ఈ ముగ్గురి మధ్య విభేదాలు వచ్చాయి. తండ్రి బాగోగులు తానే చూశానని, ఆర్థిక ప్రయోజనాల్లో తనకూ వాటా ఇవ్వాలని, కారుణ్య నియామకంలో తనకు ఉద్యోగం వచ్చేలా చూడాలని ఆమె సోదరులను కోరింది. ఈ విషయంలో దుర్గా రామకృష్ణ తనకు అడ్డు వస్తాడనే ఉద్దేశంతో నవంబరు 26న మేజరు కాల్వలోకి నెట్టి అతడిని చంపేసింది. ఆర్థిక ప్రయోజనాలకు ఎక్కడ అడ్డు పడతాడోననే ఉద్దేశంతో తన అన్న, కానిస్టేబుల్ గోపిని డిసెంబరు 10న మద్యం తాగించి.. మెడకు చున్నీ బిగించి చంపేసింది. మృతదేహాన్ని బ్రాంచ్ కెనాల్‌లో పడేసింది. 20 రోజుల వ్యవధిలో అన్నదమ్ములిద్దరినీ చంపేసిన ఆమె.. తానే స్వయంగా పోలీసు స్టేషన్‌కు వచ్చి చేసిన నేరాన్ని చెప్పేసింది. దుర్గా రామకృష్ణను గత నెల 26న హత్య చేసి కాలువలో పడేయగా.. పోలీసులు సోమవారం కాల్వలో గాలింపు చర్యలు చేపట్టారు. మరోవైపు కానిస్టేబుల్ గోపి మృతదేహం కోసం కూడా గాలిస్తున్నారు. ఈ నెల 14న ముప్పాళ్ల పవర్ ప్లాంట్ వద్ద గుర్తుతెలియని మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. ఆ మృతదేహం ఎవరిదనే విషయమై డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తామని పోలీసులు చెబుతున్నారు. కాగా, ఈ ఘటనపై ఫిర్యాదేమీ అందలేదనీ, కేసు కూడా నమోదు చేయలేదని సత్తెనపల్లి రూరల్ సీఐ చెప్పారు.

రైలు కిందపడి ఇద్దరు స్నేహితురాళ్లు ఆత్మహత్య

పెనుకొండ రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇద్దరు స్నేహితురాళ్లు శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ రైల్వే స్టేషన్ వద్ద ఆదివారం రాత్రి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. రైల్వే ఎస్ఐ బాలాజీనాయక్ తెలిపిన వివరాలు.... ఒడిశా రాష్ట్రం గంజం జిల్లా బడాచాతియ గ్రామానికి చెందిన సంధ్యారాణి మహరాణ్ (28), అదే రాష్ట్రం బాలసారబ్లాక్ గ్రామానికి చెందిన సుల్‌బుల్ మెహ్రా(22) ప్రాణ స్నేహితులు. వీరు బెంగళూరుకు వలస వెళ్లి, రెండేళ్లుగా ఓ గార్మెంట్స్ పరిశ్రమలో పనిచేస్తున్నారు. సంధ్యారాణి తండ్రి నారాయణ్‌మహరాజ్ మూడు రోజుల క్రితం ఒడిశాలో ప్రమాదవశాత్తు రైలుకిందపడి మృతిచెందాడు. దీంతో సంధ్యారాణి తీవ్రంగా కుంగిపోయింది. బెంగళూరు నుంచి స్వగ్రామానికి స్నేహితురాలు మెహ్రాతో కలిసి ఆదివారం ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో బయల్దేరింది. దారి మధ్యలో పెనుకొండ రైల్వేస్టేషన్‌లో దిగింది. రైలు పట్టాల పైకి వెళ్లింది. తండ్రి లేనపుడు తానెందుకు బతకాలనీ, చనిపోతానని మెహ్రాకు చెప్పింది. నీవు లేకుండా నేను కూడా ఉండలేనంటూ మెహ్రా కూడా ఆమె వెంటే వెళ్లింది. స్నేహితురాలు సంధ్యారాణి ఆత్మహత్య చేసుకుంటోందనీ, తాను కూడా చనిపోతున్నానని ఫోన్ ద్వారా తల్లిదండ్రులకు మెహ్రా తెలిపింది. శ్రీసత్యసాయి జిల్లాలోని ధర్మవరం నుంచి కర్ణాటకలోని దొడ్డబళ్లాపురకు వెళ్తున్న గూడ్స్ కింద పడి ఇద్దరూ ఆత్మహత్య చేసుకున్నారు. కీమన్ సమాచారంతో రైల్వే పోలీసులకు అక్కడికి వెళ్లి, మృతదేహాలను పరిశీలించారు. పెనుకొండ ఆస్పత్రికి తరలించారు.

జోగ్ జలపాతం సందర్శనకు బ్రేక్

జనవరి 1నుంచి రెండున్నర నెలలు నిషేధం

బెంగళూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలోనే పేరొందిన శివమొగ్గ జిల్లాలోని జోగ్ జలపాతం సందర్శనకు తాత్కాలిక బ్రేక్ పడింది. రెండున్నర నెలలపాటు నిషేధం విధిస్తున్నట్టు జిల్లా అధికారి, జోగ్ అభివృద్ధి ప్రాధికార అధ్యక్షుడు హేమంత్ ప్రకటించారు. శివమొగ్గ జిల్లా సాగర తాలూకాలో జోగ్ జలపాతం ప్రవేశద్వారం, పర్యాటకుల కోసం ప్రత్యేక మౌలిక సదుపాయాల పనులు చేపడుతున్నారు. దీంతో జనవరి 1 నుంచి మార్చి 15వరకు ప్రవేశాలు ఉండవు. నిర్మాణాల కారణంగా సందర్శకులు, పర్యాటకులకు ఇబ్బంది కలగకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు జిల్లా అధికారి వెల్లడించారు.

వృక్షమాత తులసిగౌడ కన్నుమూత

బెంగళూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ ప్రేమికురాలు, వృక్షమాతగా పేరొందిన పద్మశ్రీ పురస్కార గ్రహీత తులసిగౌడ (86) కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆమె సోమవారం తుదిశ్వాస విడిచారు. ఉత్తర కన్నడ జిల్లా అంకోలా తాలూకా హొన్నాళి గ్రామానికి చెందిన తులసిగౌడ హాలక్కి బుడకట్టు (ఆదివాసీ) తెగకు చెందినవారు. ఆమె 30వేలకుపైగా మొక్కలు నాటి, సంరక్షించారు. దీంతో 2021లో ఆమెకు పద్మశ్రీ పురస్కారం దక్కింది. ఉత్తర కన్నడ జిల్లావ్యాప్తంగా ఆమె పర్యావరణంపై సుదీర్ఘకాలం నిస్వార్థంగా పనిచేశారు. బాల్యవివాహం చేసుకున్న ఆమె చిన్న వయసులోనే భర్తను కోల్పోయారు. అప్పటినుంచి పర్యావరణ ప్రేమికురాలిగా కొనసాగారు.

నవ్య | చిత్రజ్యోతి

ఇళయరాజాకు అవమానం?



తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరులోని ఆండాళ్ ఆలయంలో సంగీత దర్శకుడు ఇళయరాజాకు అవమానం జరిగినట్టు సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వార్తలు వైరల్ అయ్యాయి. అయితే అవి నిజం కావని ఆలయ అధికారులు, శడగోప రామానుజ జీయర్ స్వామి స్పష్టం చేశారు. ఆలయంలో మార్గశిర మాస వేడుకల్లో భాగంగా దివ్య పాశుర సంగీత కచ్చేరి, భరత నాట్య కార్యక్రమం ఆదివారం రాత్రి నిర్వహించారు. ఇందులో శ్రీవిల్లిపుత్తూరు శడగోప రామానుజ జీయర్, త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ ముఖ్య అతిథులుగా హాజరుకాగా, ప్రత్యేక అతిథిగా ఇళయరాజా పాల్గొన్నారు. ఆండాళ్ సన్నిధి, నందవనం, పెరియ పెరుమాళ్ సన్నిధిలను రామానుజ జీయర్, త్రిదండి చిన్న శ్రీమన్నారాయణలతో కలసి ఇళయరాజా దర్శనం చేసుకున్నారు. ఈ ముగ్గురు వసంత మండపం దాటి అర్ధమండపం ద్వారం వద్ద నిలుచున్నారు. దీన్ని గమనించిన పూజారులు వసంత మండపంలో నిల్చొని అమ్మవారిని దర్శనం చేసుకోవాలని చెప్పడంతో ఇళయరాజా అలాగే చేశారు.

ఆత్మగౌరవాన్ని వదులుకోను: ఇళయరాజా

శ్రీవిల్లిపుత్తూరు ఆండాళ్ ఆలయంలో తనకు అవమానం జరిగినట్టు సాగుతున్న ప్రచారంపై ఇళయరాజా స్పందించారు 'నేను ఎప్పుడైనా.. ఎక్కడైనా ఆత్మగౌరవాన్ని వదులుకునే వ్యక్తిని కాదు. వదంతుల్ని నమ్మవద్దు' అని పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

ప్రభాస్ కాలికి గాయం



ప్రభాస్‌కు ఓ సినిమా షూటింగ్‌లో కాలికి స్వల్ప గాయమైంది. దీంతో షూటింగులకి విరామమిచ్చిన ప్రభాస్.. వైద్యుల సూచన మేరకు విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన నటించిన 'కల్కి 2898 ఏ.డీ' చిత్రం వచ్చే ఏడాది జనవరి 3న జపాన్‌లో విడుదలవుతున్న సంగతి తెలిసిందే. అయితే, ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ప్రభాస్ జపాన్ వెళ్లాల్సి ఉంది. కాలికి గాయమవ్వడంతో జపాన్‌కు రాలేనంటూ.. అక్కడి అభిమానుల కోసం ప్రభాస్ ఓ పోస్టు పెట్టారు. "నాపై మీరు చూపిస్తున్న ప్రేమకి కృతజ్ఞతలు. మీ అందర్నీ చూడాలని ఎంతోకాలంగా ఎదురు చూస్తున్నాను. షూటింగ్‌లో గాయమవ్వడంతో జపాన్‌కు రాలేకపోతున్నాను. నన్ను క్షమించండి. మీ అందర్నీ త్వరలోనే కలుసుకోవాలని కోరుకుంటున్నాను" అని పేర్కొన్నారు. కాగా, ప్రభాస్ గాయం వల్ల 'రాజాసాబ్' సినిమా విడుదల ఆలస్యం అవుతుందని సోషల్‌మీడియాలో అభిమానులు ఆందోళన పడుతున్నారు. దీనిపై ప్రభాస్ టీమ్ స్పందించింది. "ప్రభాస్ గాయం స్వల్పమైందే. 'రాజాసాబ్' టాకీ పార్ట్ పూర్తైంది. సినిమా అనుకున్న సమయానికే వస్తుంది. 'ఫౌజీ' షూటింగ్‌కు మాత్రమే ఆయన విరామమిచ్చారు. త్వరలోనే ఆయన షూటింగ్‌లో పాల్గొంటారు" అని పేర్కొంది.



సంక్రాంతి తర్వాత ...

మహేశ్‌బాబు, రాజమౌళి దర్శకత్వంలో రూపుదిద్దుకొనే చిత్రం షూటింగ్ ఎప్పుడెప్పుడు మొదలవుతుందా అని ఎదురు చూస్తున్న అభిమానులకు ఓ గుడ్ న్యూస్. శ్రీ దుర్గా ఆర్ట్స్ బేనరుపై డాక్టర్ కె.ఎల్.నారాయణ నిర్మించే ఈ చిత్రం షూటింగ్ వచ్చే నెల చివరి వారంలో ప్రారంభం కానుంది. మహేశ్ డేట్స్ కేటాయించడంతో షూటింగ్ ఏర్పాట్లలో రాజమౌళి టీమ్ బిజీగా ఉంది. ఈ సినిమా కోసం హైదరాబాద్‌లో కొన్ని భారీ సెట్స్ వేశారు. తొలి షెడ్యూల్ వాటిల్లోనే జరుగుతుందని సమాచారం. అలాగే సినిమాలో కీలకమైన ఫారెస్ట్ సీన్స్‌ను ఆఫ్రికాలోని కెన్యా అడవుల్లో చిత్రీకరించడానికి రాజమౌళి ప్లాన్ చేస్తున్నారు. సినిమా షూటింగ్ ప్రారంభించే ముందు ప్రెస్‌మీట్ పెట్టి కథ, ఇతర వివరాలు వెల్లడించడం రాజమౌళికి అలవాటు. అలాగే ఈ సినిమా గురించి కూడా ఓ ప్రెస్‌మీట్‌ను త్వరలో ఏర్పాటు చేయనున్నారు. చిత్రంలో హీరోయిన్, ఇతర తారాగణం ఎవరు.. అనే వివరాలను కూడా ఆ ప్రెస్‌మీట్‌లోనే వెల్లడిస్తారు రాజమౌళి. దాదాపు రూ. వెయ్యి కోట్ల బడ్జెట్‌తో ఈ సినిమా రూపుదిద్దుకోనుంది. మహేశ్ ఇంతవరకూ పోషించని విభిన్న పాత్రను ఇందులో చేస్తున్నారు. ఈ సినిమా రెండు భాగాలుగా తెరకెక్కనుందనే ప్రచారం జరుగుతోంది.

మోహన్‌బాబుకు నోటీసులు...

గన్స్ సరెండర్



మంచు మోహన్ బాబు, ఆయన చిన్న కొడుకు మనోజ్ మధ్య జరిగిన ఇంటి గొడవలు, మీడియా జర్నలిస్టులపై దాడి ఘటనకు సంబంధించి ఇప్పటి వరకు మూడు కేసులు నమోదు చేసినట్లు రాచకొండ సీపీ సుధీర్ బాబు తెలిపారు. ఇప్పటికే మోహన్‌బాబుకు నోటీసులు జారీ చేసినట్లు సీపీ వెల్లడించారు. హైకోర్టు ఆదేశాల మేరకు విచారణకు హాజరుకావడానికి ఈ నెల 24 వరకు సమయం ఇచ్చామన్నారు.

మోహన్‌బాబుకు లైసెన్స్‌డ్ గన్లు రెండు ఉన్నాయి. హైదరాబాద్‌లో ఒకటి, చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం ఎ. రంగంపేటలోని శ్రీవిద్యానికేతన్ స్కూల్‌లోని ఇంట్లో మరో గన్ ఉంది. వీటిని సంబంధిత పోలీసు స్టేషన్లలో మోహన్‌బాబు సిబ్బంది అందజేశారు.

హైదరాబాద్ సిటీ, చంద్రగిరి (ఆంధ్రజ్యోతి)

ప్రేమికుల కోసం లైలా



విశ్వక్ సేన్. ఆకాంక్ష శర్మ జంటగా నటిస్తున్న రొమాంటిక్ యాక్షన్ ఎంటర్టైనర్ 'లైలా'. రామ్‌నారాయణ్ దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఇటీవలే విడుదల చేసిన ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో విశ్వక్ 'లైలా' అనే అమ్మాయి లుక్‌లో కనిపించి అందర్నీ సర్‌ప్రైజ్ చేశారు. తాజాగా, ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించారు మేకర్స్ వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న ప్రేమికుల రోజు సందర్భంగా ఈ సినిమాను విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకి అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని అందిస్తుందని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రిచర్డ్ ప్రసాద్, సంగీతం: లియోన్ జేమ్స్.

రానివ్వొద్దని హెచ్చరించినా..

బెనిఫిట్ షోకి సెలబ్రిటీలను రానివ్వొద్దని సంధ్య థియేటర్ యాజమాన్యానికి పోలీసుల సూచన

హెచ్చరికలు చేసినా పట్టించుకోని యాజమాన్యం

ఆలస్యంగా వెలుగులోకి పోలీసుల లేఖ.. వైరల్

హైదరాబాద్ సిటీ డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2' సినిమా ప్రీమియర్ షోకి ఎలాంటి సెలబ్రిటీలనూ అనుమతించొద్దని.. వారు వస్తే అభిమానులను, జనాన్ని నియంత్రించడం కష్టమవుతుందని పేర్కొంటూ చిక్కడపల్లి పోలీసులు సంధ్య థియేటర్ యాజమాన్యానికి రాసిన లేఖ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బెనిఫిట్ షోకి అనుమతి కోరుతూ థియేటర్ యాజమాన్యం ఇచ్చిన వినతిపత్రం వెనుకనే పోలీసులు ఈ హెచ్చరికలు జారీ చేయడం గమనార్హం. వారు రాసిన లేఖ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది! పోలీసుల హెచ్చరికను థియేటర్ యాజమాన్యం పెడచెవిన పెట్టడం వల్లే అక్కడ తొక్కిసలాట జరిగి.. ఒక మహిళ ప్రాణం పోయిందనే ఆగ్రహం వ్యక్తమవుతోంది. కాగా.. ఈ లేఖ ఆధారంగానే నాంపల్లి న్యాయస్థానంలో ప్రభుత్వ న్యాయవాది బలమైన వాదనలు వినిపించడంతో 9వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ అల్లు అర్జున్‌కు 14 రోజులు రిమాండ్ విధించినట్టు తెలిసింది. థియేటర్ యాజమాన్యం సమాచారం ఇచ్చిన వెంటనే పోలీసులు స్పందించారని, ప్రీమియర్ షోకు రావొద్దంటూ హీరో, హీరోయిన్లకు, నిర్మాతకు, యూనిట్‌కు సమాచారం ఇవ్వాల్సిందిగా సూచించారని పీపీ కోర్టుకు తెలిపారు. అది రద్దీ ప్రాంతం కావడం.. రెండు థియేటర్లు (సంధ్య 70ఎంఎం, సంధ్య 35 ఎంఎం) పక్క పక్కనే ఉండడం.. రోడ్డుమీద రెస్టారెంట్లు ఉండటం వల్ల అభిమానులను నియంత్రించడం కష్టమవుతుందని హెచ్చరించారని ఆయన వివరించారు. ముందే హెచ్చరించినా థియేటర్ యాజమాన్యం, సినిమా హీరో అల్లుఅర్జున్ బాధ్యతారహితంగా వ్యవహరించారని తెలిపారు. పీపీ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి అల్లు అర్జున్‌కు 14 రోజులు రిమాండు విధించారు.

వైవిధ్యమైన పాత్రలో...



నటనకు ఆస్కారమున్న పాత్రలు పోషించి మంచి నటిగా గుర్తింపు తెచ్చుకున్నారు లావణ్య త్రిపాఠి. ఆమె ప్రధాన పాత్రలో నటించే చిత్రం 'సతీ లీలావతి'. 'ఎస్.ఎమ్.ఎస్' ఫేమ్ తాతినేని సత్య దర్శకత్వంలో ఎమ్. నాగమోహన్ బాబు, టీ.రాజేశ్ సంయుక్తంగా నిర్మించనున్నారు. లావణ్య త్రిపాఠి పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు. ఇందులో ఆమె పోషించే పాత్ర ఎంతో వైవిధ్యంగా ఉండబోతోందని.. ఒక ఆసక్తికర కథాంశంతో సినిమా తెరకెక్కుతోందని మేకర్స్ పేర్కొన్నారు. ఈ సినిమా షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది. వరుణ్‌తేజ్‌తో పెళ్లి తర్వాత లావణ్య నటించే చిత్రం ఇదే కావడంతో ఈ సినిమాపై మంచి అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రానికి ఎడిటర్: సతీశ్ సూర్య, సినిమాటోగ్రఫీ: బినేంద్ర మీనన్, సంగీతం: మిక్కీ.జే. మేయర్.

ఉత్కంఠ భరిత చిత్రం



రైటర్ మోహన్ దర్శకత్వంలో వెన్నెల కిశోర్ టైటిల్ రోల్‌లో నటించిన సినిమా 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. లాస్యారెడ్డి సమర్పణలో వెన్నపూస రమణారెడ్డి నిర్మించారు. వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని డిసెంబరు 25న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా మూవీ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఉత్కంఠను రేకెత్తించే ఈ మూవీలో మేరీ అనే యువతి హత్య సంచలనంగా మారుతుంది. పోలీసులు కేసును ఛేదించలేక ప్రైవేట్ డిటెక్టివ్‌ను నియమిస్తారు. బీచ్‌లో జరిగే వరుస హత్యల చుట్టూ కథ తిరుగుతుంది. ప్రేమ జంటతో సహా ఏడుగురు అనుమానితులను గుర్తిస్తాడు డిటెక్టివ్. వెన్నెల కిశోర్ శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్ క్యారెక్టర్‌కు జీవం పోశాడు. రవితేజ మహాదాస్యం, అనన్య నాగళ్ల ప్రేమ జంటగా నటించారు.

ఏడాదిగా ఎదురు చూశా



\- హరిత గోగినేని

డా. హరిత గోగినేని దర్శకత్వంలో వేదిక లీడ్‌రోల్‌లో నటించిన చిత్రం 'ఫియర్'. డా.వంకి పెంచలయ్య, ఏఆర్ అభి నిర్మాతలు. సుజాత రెడ్డి కో ప్రొడ్యూసర్. ఈనెల 14న రిలీజైన సినిమా ప్రేక్షకాదరణను పొందుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో చిత్ర దర్శకురాలు హరిత గోగినేని మాట్లాడుతూ 'ఈ రోజు కోసం ఏడాదిగా ఎదురు చూస్తున్నాను. ఇది సైకలాజికల్ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ. చాలా మంది హారర్ అనుకుంటున్నారు. కాదు కానీ హారర్ ఎలిమెంట్స్ ఉంటాయి. 39 ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో 70కి పైగా అవార్డులు వచ్చాయి. సినిమాను విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు.

అందమైన ప్రేమ కథకు ఆదరణ



పీఎల్ విఘ్నేశ్ దర్శకత్వంలో సదన్ హీరోగా, ప్రియాంక ప్రసాద్ హీరోయిన్‌గా తెరకెక్కిన చిత్రం 'ప్రణయ గోదారి'. ఇటీవలే విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ మీట్‌లో దర్శకుడు విఘ్నేశ్ మాట్లాడుతూ 'సినిమా చూసిన ప్రతీ ఒక్కరూ మా టీమ్‌ను అభినందించారు' అన్నారు. హీరోయిన్ ప్రియాంక ప్రసాద్ మాట్లాడుతూ 'నా పాత్రకు మంచి రెస్పాన్స్ వస్తోంది' అని తెలిపారు. 'చాలా రోజుల తర్వాత అందమైన ప్రేమ కథా చిత్రాన్ని చూశామంటున్నారు' అని నటుడు సునీల్ రావినూతల తెలిపారు.

100 పడకలకు పిఠాపురం ఆస్పత్రి

» నెరవేరిన పవన్ కల్యాణ్ హామీ.. జీవో జారీ

అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నియోజకవర్గమైన పిఠాపురంలో 30 పడకల కమ్యూనిటీ ఆస్పత్రిని ప్రభుత్వం వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎం.టి.కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎన్నికల సమయంలో అక్కడి 30 పడకల సీహెచ్‌సీని వందకు పెంచుతానని హామీ ఇచ్చారు. తాజాగా ఆస్పత్రిలో వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.38.32 కోట్లు విడుదల చేసింది. పెరిగిన పడకలకు అవసరమైన ప్రత్యేక భవనాలు, ఆపరేషన్ థియేటర్లు, వార్డుల నిర్మాణానికి వీటిని ఉపయోగిస్తారు. కొత్తగా 66 మంది అదనపు సిబ్బంది అందుబాటులోకి వస్తారు. జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, ఆర్థోపెడిక్స్, పెథాలజీ, డెంటల్, రేడియాలజీ వంటి కీలక విభాగాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి.



రాజధాని అమరావతిలో సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కనే నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్‌పై మట్టిని చదును చేస్తున్న దృశ్యం. ఈ ట్రాక్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి

రాజధానికి 92 ఏళ్ల వృద్ధురాలి విరాళం



అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని నిర్మాణానికి 92 ఏళ్ల వృద్ధురాలు రూ.లక్ష విరాళం అందజేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం అనంతవరం గ్రామానికి చెందిన బండ్ల వెంకటరత్నం సోమవారం అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి లక్ష రూపాయల చెక్కును అందించారు. రాజధాని నిర్మాణం కోసం సీఎం చంద్రబాబు పడుతున్న శ్రమకు తోడ్పాటు అందించాలని తాను ఈ విరాళాన్ని ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. రాజధాని కోసం చొరవ చూపి, విరాళంతో ముందుకొచ్చినందుకు ఆమెను చంద్రబాబు అభినందించారు.

టెన్త్ సర్టిఫికెట్లన్నీ ఆన్‌లైన్

» 1969 నుంచి 1990 వరకు డిజిటైజేషన్

» అనుమతిచ్చిన పాఠశాల విద్యాశాఖ

అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ధ్రువీకరణ పత్రాలన్నీ ఇకపై ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రాబోతున్నాయి. ఎప్పుడో యాభై ఏళ్ల క్రితం పదో తరగతి చదివిన వారు కూడా డిజిలాకర్ నుంచి సులభంగా వాటిని డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కలగనుంది. ఇప్పటికే 2004 నుంచి ఇప్పటివరకూ టెన్త్ సర్టిఫికెట్లు డిజిటైజేషన్ చేశారు. తాజాగా 1969 నుంచి 1990 వరకు సర్టిఫికెట్లను డిజిటైజేషన్ చేసేందుకు పాఠశాల విద్యాశాఖ అనుమతిచ్చింది. ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ (ఏపీటీఎస్)కు ఈ బాధ్యతను అప్పగించింది. ఇందుకోసం రూ.1.68 కోట్లు కేటాయించింది. డిజిటైజేషన్ అనంతరం ఆ డేటాను డిజిలాకర్‌లో అప్‌లోడ్ చేస్తారు. దాని నుంచి పూర్వ విద్యార్థులు వారి వివరాలు సమర్పించి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఏవైనా పొరపాట్లు ఉంటే రెండేళ్లపాటు ఉచితంగా సవరణలు చేసుకోవచ్చు. రెండో దశలో 1991 నుంచి 2003 వరకు సర్టిఫికెట్లను డిజిటైజేషన్ చేస్తారు. కాగా.. గత మూడేళ్ల నుంచి సర్టిఫికెట్లన్నీ డిజిలాకర్‌లో అందుబాటులో ఉంచుతున్నారు. గతంలో ఒరిజినల్ సర్టిఫికెట్లు పోతే డూప్లికేట్ సర్టిఫికెట్లు పొందేవరకు దరఖాస్తులు, అడ్మిషన్ల కోసం వేచిచూడాల్సి వచ్చేది. డిజిలాకర్ విధానం వచ్చాక వాటిని చూపించి కూడా దరఖాస్తులు చేసుకునే అవకాశం ఏర్పడింది. ఒరిజినల్ సర్టిఫికెట్లు కోల్పోయి జిరాక్స్‌లు కూడా లేనివారు డిజిలాకర్‌లో డౌన్‌లోడ్ చేసుకుని తద్వారా డూప్లికేట్ సర్టిఫికెట్లు పొందవచ్చు.

ఇంటర్ బోర్డు పునర్వ్యవస్థీకరణ

ఇంటర్ బోర్డును పునర్వ్యవస్థీకరిస్తూ పాఠశాల విద్యాశాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. బోర్డు చైర్మన్‌గా మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి, వైస్ చైర్మన్‌గా పాఠశాల విద్య కార్యదర్శి ఉంటారని తెలిపింది. ఎక్స్ అఫిషియో సభ్యులుగా విద్యాశాఖలోని పలు విభాగాల అధికారులు, నామినేటెడ్ సభ్యులుగా ఆంధ్రా, నాగార్జున, ఎన్టీఆర్ వైద్య, పద్మావతి మహిళా యూనివర్సిటీల వీసీలు ఉన్నారు. కాలేజీల విభాగంలో ఆరుగురు ప్రిన్సిపాళ్లను ఎంపిక చేశారు. ఈ బోర్డు కాలవ్యవధి మూడేళ్లు.

మూడేళ్లలో నవ రాజధాని

(మొదటి పేజీ తరువాయి)

జనవరిలో పూర్తి చేసి, అదే నెల నుంచి నిర్మాణ ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పారు. మూడేళ్లలో రాజధాని అమరావతిని ప్రపంచంలోనే ఐదు ఉత్తమ నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దుతామని చెప్పారు. సోమవారం అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 43వ సీఆర్‌డీఏ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ... రాజధానిలో ఐకానిక్



సీఆర్‌డీఏ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు నారాయణ, జనార్దన్ రెడ్డి, ఉన్నతాధికారులు

భవనాలు, ట్రంక్ రోడ్లు, లేఅవుట్లకి సంబంధించి రూ.24,276.83కోట్ల వ్యయంతో చేపట్టే పనులకు సీఆర్‌డీఏ అథారిటీ సమావేశం ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. గత నాలుగు సమావేశాల్లో మొత్తం రూ.45,249.24 కోట్లతో చేపట్టే పనులకు ఆమోదం లభించినట్లు తెలిపారు. రాజధానిలో ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి కూడా ప్రణాళిక రూపొందించాలని సీఎం చెప్పారని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

250 మీటర్ల ఎత్తులో అసెంబ్లీ..

103 ఎకరాల్లో 250 మీటర్ల ఎత్తులో 11.22 లక్షల చ.అడుగుల విస్తీర్ణంలో అసెంబ్లీ భవనాన్ని నిర్మిస్తామని మంత్రి చెప్పారు. ఏడాదిలో 60రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరిగితే.. మిగతా రోజుల్లో అసెంబ్లీ భవనంపై నుంచి సందర్శకులు రాజధానిని తిలకించే అవకాశం కల్పిస్తామన్నారు. రూ.1,048 కోట్లతో హైకోర్టు భవనాన్ని 42.3 ఎకరాల్లో 20.32లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 8 అంతస్థులుగా నిర్మిస్తామని చెప్పారు. సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) భవనాలను 17.03 లక్షల చ.అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్నట్లు తెలిపారు. హెడ్‌వోడీ భవనాలతో కలిపి, 47 అంతస్తులతో మొత్తం 5 టవర్లతో కూడిన భవనాలు 68.88 లక్షల చదరపు అడుగుల్లో రూ.4,688 కోట్లతో నిర్మిస్తామన్నారు. ఎల్పీఎస్‌లో మౌలిక సదుపాయాల్లో భాగంగా నాలుగు ప్రధాన రహదార్లు, ఇతర రోడ్లు, విద్యుత్ లైన్లు, తాగునీటి పైపులైన్లు, ఇతర కేబుల్, ఫుట్‌పాత్‌ల వంటి సౌకర్యాలకు రూ.9,699 కోట్లు, 306.93 కి.మీ. ట్రంక్ రోడ్లలో 151.9 కి.మీ. రోడ్లకు రూ.7,794.56 కోట్లు, ఎస్టీపీ పనులకు రూ.318.15 కోట్లకు ఆమోదం తెలిపినట్లు తెలిపారు. మొత్తం రాజధాని నిర్మాణ వ్యయం అంచనా రూ.62వేల కోట్లు కాగా, ఇప్పటికి రూ.45,249.24 కోట్లకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. మిగతా వాటికి కూడా అథారిటీ ఆమోదం తెలుపుతుందన్నారు. ఈ మొత్తం పనులకు వచ్చే మంత్రివర్గ సమావేశంలో పెట్టనున్నట్లు తెలిపారు. 29 రాజధాని గ్రామాల్లో ఉద్యోగ, ఉపాధి లభించే అన్ని రకాల చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణంలో అడ్డంకులను రైతులతో చర్చించి, పూర్తి చేస్తామన్నారు. అమరావతి రాజధాని నగరాన్ని 217 చదరపు కిలోమీటర్లు మేర డిజైన్ చేసి, సింగపూర్ కన్సల్టెన్సీతో లేఅవుట్లు ప్లాన్ చేశామన్నారు.

వైసీపీ నేతలకు బురదజల్లడమే తెలుసు

కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతలు బురద జల్లుతున్నారని మంత్రి నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణ వ్యయం పెంచామంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, బురదజల్లే నేతలంతా ఎస్‌వోఆర్ రేట్లను పరిశీలన చేయాలని సూచించారు. గత ప్రభుత్వం మూడు ముక్కల ఆటతో నిర్మాణ వ్యయం అనేక రెట్లు పెరిగిపోయిందన్నారు. గత ఐదేళ్లు రాజధాని పనులను కొనసాగించకపోవడం వల్ల ప్రభుత్వ భవనాలన్నింటికీ కలిపితే 49.02%, ఐకానిక్ టవర్స్‌కు 41%, ఫ్లడ్ కెనాల్స్ పనులకు 39%, హైకోర్టు భవనాలకు 28% రేట్లు పెరిగాయని చెప్పారు.

ఆర్-5 జోన్‌తో అమరావతి నాశనం

మంగళగిరి సిటీ, విజయవాడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అమరావతిని నాశనం చేయాలనే దురుద్దేశంతో గత ప్రభుత్వం ఆర్-5 జోన్‌ను తీసుకొచ్చిందని మంత్రి పి నారాయణ అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నీరుకొండలో సోమవారం ఎంజీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆర్-5 జోన్‌లో పట్టాలు ఇచ్చిన పేదలకు గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లోనే వారి సొంత ప్రాంతాల్లో నివేశన స్థలాలు కేటాయిస్తామని స్పష్టం చేశారు. సుప్రీం కోర్టులో రాజధానిపై ఉన్న కేసులు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మరో 9 నెలల్లో అధికారుల నివాసాలు అందుబాటులోకి తెస్తామన్నారు. గతంలో చెప్పిన విధంగానే అమరావతి మాస్టర్ ప్లాన్‌ను అమలు చేస్తామని, రాజధాని నిర్మాణ పనులను మరో మూడేళ్లలో పూర్తి చేస్తామని తెలిపారు. నీరుకొండలో భారీ ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, రైతుల సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

రాజధాని గ్రామాల్లో రోడ్ల టెండర్లు

రాజధాని ప్రాంత గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి సీఆర్‌డీఏ శ్రీకారం చుట్టింది. రాజధాని పరిధిలోని ఉండవల్లి, పెనుమాక, కృష్ణాయపాలెం, బేతపూడి, నిడమర్రు, కురగల్లు, నవులూరు, ఎర్రబాలెం, నీరుకొండ గ్రామాల్లో రూ.3.61 కోట్ల వ్యయంతో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి టెండర్లు పిలిచింది. శాఖమూరు, తుళ్లూరు, తాళ్లాయపాలెం, వెలగపూడి, నేలపాడు, మందడం, మల్కాపురం, వెంకటపాలెం, ఉద్దండ్రాయుని పాలెం, నెక్కల్లు గ్రామాల్లో కూడా రూ.2.40 కోట్ల వ్యయంతో రోడ్ల నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించింది. బీటీ, సీసీ ప్యాచ్ వర్క్‌లు చేపట్టేందుకూ టెండర్లు పిలిచింది. అలాగే శాశ్వత రాజధాని నిర్మాణాలలో అత్యంత కీలకమైన జీఏడీ టవర్లు, హైకోర్టు భవనాలకు సంబంధించి బేస్‌మెంట్‌లో భారీ ఎత్తున నిల్వ ఉన్న నీటిని తొలగించేందుకు కూడా సీఆర్‌డీఏ టెండర్లు పిలిచింది.

53 బార్ల వేలానికి నోటిఫికేషన్

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): గతంలో నిర్వహించిన వేలంలో మిగిలిపోయిన, మధ్యలో మూతపడిన 53 బార్ల వేలానికి ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ జారీచేసింది. మంగళవారం నుంచి 22 వరకు దరఖాస్తులు సమర్పించేందుకు గడువుగా పేర్కొంది. 24న ఈ-వేలం నిర్వహించి ఎంపికైన వారికి లైసెన్సులు ఇస్తామని తెలిపింది. ఈ లైసెన్స్ గడువు 2025 ఆగస్టు వరకు ఉంటుందని తెలిపింది. కానీ గత పాలసీ ప్రకారం దరఖాస్తు ఫీజులు భారీగానే పెట్టింది. దీంతో ఈ 8 నెలల కాలం మాత్రమే ఉండే ఈ బార్ల కోసం ఎవరూ ముందుకు రాకపోవచ్చనే వాదన వినిపిస్తోంది.

జీసీటీఏ-ఏపీ అధ్యక్షుడిగా ఎం.రాఘవరెడ్డి

అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం అధ్యక్షుడిగా ఎం.రాఘవరెడ్డి మరోసారి ఎన్నికయ్యారు. సంఘం ఎన్నికలు ఆదివారం రాత్రి విజయవాడలోని ఎస్ఆర్ఆర్ కాలేజీలో జరిగాయి. ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్యాంబాబు, మహిళా కార్యదర్శిగా చిలక అనిత, ఆర్థిక కార్యదర్శిగా జీ.ఎల్లా కృష్ణ, అకడమిక్ కార్యదర్శిగా డి.పైడితల్లి ఎన్నికయ్యారు.

ఫిషరీస్ వర్సిటీ ఓఎస్డీగా సుగుణ

ఆంధ్రప్రదేశ్ మత్స్య విశ్వవిద్యాలయం ఓఎస్డీ ఆచార్య సుధాకర్‌ను కాకినాడలోని మత్స్య పరిశోధన కేంద్రం ముఖ్య శాస్త్రవేత్తగా ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన స్థానంలో విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు టి.సుగుణ ఓఎస్డీగా నియమించింది. మరోవైపు ఏపీ మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య అధికారిక పర్సన్ ఇన్‌చార్జి పదవీ కాలాన్ని ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. పంట ఉత్పత్తుల సేకరణ కార్యకలాపాల కోసం ఏపీ మార్క్‌ఫెడ్‌కు బ్యాంక్ ఆఫ్ బరోడా నుంచి రూ.300 కోట్ల రుణానికి ప్రభుత్వం ఏడాదిపాటు గ్యారెంటీ ఇచ్చింది.

ఎస్‌కేఎం నిరసనలకు మద్దతు: సీపీఐ

వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థను అదానీ లాంటి కార్పొరేట్‌లకు కట్టబెట్టే ఆలోచనను విరమించుకోవాలని సీపీఐ, కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం విజయవాడలోని దాసరి భవన్‌లో నిర్వహించిన ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. సంయుక్త కిసాన్ మోర్చా 23న రాష్ట్రంలో నిర్వహించనున్న నిరసనలకు సీపీఐ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, పి.దుర్గాభవాని, రావుల వెంకయ్య, అక్కినేని వనజ తదితరులు పాల్గొన్నారు.

గణితం పేపర్ లీక్

» సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్ష వాయిదా

» లీకుపై పోలీసు కేసు నమోదు

అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పేపర్ లీక్ కావడంతో 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు సోమవారం జరగాల్సిన సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 గణితం పరీక్ష వాయిదా పడింది. టెన్త్ ప్రశ్నపత్రం ఆదివారం పలు యూట్యూబ్ చానళ్లు, టెలిగ్రామ్ గ్రూపుల్లో కనిపించింది. దీంతో పరీక్ష నిర్వహించొద్దని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీచేసింది. 6 నుంచి 9 తరగతుల గణితం పరీక్షలను కూడా ఆపాలని ఆదేశించింది. లీకుపై ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విజయవాడ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ పరీక్షను ఈ నెల 20న నిర్వహిస్తామని, మిగిలినవి షెడ్యూలు ప్రకారమే జరుగుతాయని అధికారులు తెలిపారు. కొంతకాలంగా పాఠశాలల్లో ఫార్మేటివ్, సమ్మేటివ్ అసెస్‌మెంట్ ప్రశ్నపత్రాలు లీకవుతున్నాయి. గత ప్రభుత్వంలో అధికారులు దీన్ని సీరియస్‌గా తీసుకోలేదు. ఇదే ట్రెండ్ ఇప్పుడూ కొనసాగుతుండటంతో కూటమి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఆయా యూట్యూబ్ చానళ్లు, టెలిగ్రామ్ గ్రూపుల నిర్వాహకులపైనా చర్యలు తీసుకోనుంది.

ఆయుష్ విభాగంలో తవ్వేకొద్దీ అక్రమాలు బయటికొస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో ఆయుష్ విభాగం ఉన్నతాధికారికి నేరుగా సీఎంవోలోని ఓ కీలక అధికారి అండదండలు ఉండడంతో సదరు అధికారి ప్రింటింగ్ మెటీరియల్ దగ్గర నుంచి మందుల కొనుగోలు వరకూ స్కామ్‌లకు పాల్పడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా కొన్ని రోజుల పాటు సదరు అధికారిని ఆయుష్ విభాగంలోనే కొనసాగించడంతో అక్రమాలు వెలుగులోకి రాలేదు. కానీ మహిళా ఉద్యోగుల ఫిర్యాదుతో ప్రభుత్వం స్పందించి విచారణకు ఆదేశించింది. ఈ విచారణలో ముఖ్యంగా ఆయుష్ మందుల కొనుగోలులో భారీగా అక్రమాలు బయటపడుతున్నాయి.

ఆయుష్‌లో మందులు మాయం!

రూ.2 కోట్ల మందులు కనిపించడం లేదు

» వైసీపీ హయాంలో బ్లాక్ లిస్ట్ కంపెనీకి రూ.20 కోట్ల ఆర్డర్

» సరఫరా చేయకుండానే బిల్లుల చెల్లింపుతో నిధులు స్వాహా

» ఆశా వర్కర్ల ట్రైనింగ్ నిధులు కూడా..

» ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల అండదండలు!

అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జగన్ హయాంలో ఆయుష్ డిస్పెన్సరీలకు 2023లో గోవాకు చెందిన కంపెనీ నుంచి దాదాపు రూ.20 కోట్లతో మందులు కొనుగోలు చేశారు. సదరు కంపెనీ అప్పటికే కొన్ని రాష్ట్రాల్లో బ్లాక్ లిస్ట్‌లో ఉంది. పైగా ఆ కంపెనీ మందులు సరఫరా చేయకముందే అడ్వాన్స్‌లు ఇవ్వడంతో పాటు పూర్తిగా బిల్లులు చెల్లించేశారు. ఈ ఏడాది జనవరిలో బిల్లులు చెల్లింపులు పూర్తి చేస్తే, సదరు కంపెనీ మార్చి నాటికి మందులు సరఫరా చేసినట్లు చూపించారు. గత ప్రభుత్వంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకే సాధారణంగా బిల్లులు ఇవ్వలేదు. ఆయుష్‌లో మాత్రం రూ.20 కోట్లు చెల్లింపులు చేశారంటే అప్పటి సీఎంవో అధికారులు, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల అండదండలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఆయుష్‌లో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించడంతో ఆయన సమయంలో జరిగిన అక్రమాలపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. తొలుత 14 డిస్పెన్సరీల్లో తనిఖీలు చేయగా లక్షల విలువైన మందులు కనిపించలేదు. డిస్పెన్సరీలకు మందులు వచ్చినట్లుగానీ, రోగులకు అందించినట్లుగానీ రికార్డులు ఏవీ లేవని తనిఖీల్లో తేల్చారు. దీంతో ఆరోగ్యశాఖ రాష్ట్రంలోని అన్ని డిస్పెన్సరీల్లో తనిఖీలకు ఆదేశించింది. విశాఖ, ఏలూరు, ఒంగోలు, కడప రీజినల్ జాయింట్ డైరెక్టర్ల పరిధిలో 4కమిటీలను ఏర్పాటు చేసింది. విచారణ పూర్తికాకపోయినప్పటికీ.. దాదాపు రెండు కోట్ల వరకూ మందులు గోల్‌మాల్ జరిగినట్లు గుర్తించారు. అయితే, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి ఉండడంతో విచారణను కొనసాగించలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వాస్తవంగా గోవా రాష్ట్రానికి చెందిన కంపెనీకి ఇచ్చిన రూ.20 కోట్ల ఆర్డర్లలో కనీసం రూ.10 కోట్ల విలువైన మందులు కూడా సరఫరా చేయలేదని తెలుస్తోంది.



ఆశా ట్రైనింగ్ ఒక స్కామ్

కేంద్ర ప్రభుత్వం ఆయుర్వేదం, యునాని వైద్యంపై గ్రామాల్లో అవగాహన కల్పించేందుకు ఆశా వర్కర్లకు ప్రత్యేకంగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా శిక్షణకు అవసరమైన కరపత్రాలు, ఇతర పత్రాల ప్రింటింగ్‌కు ఆయుష్ విభాగానికి రూ.5 కోట్ల వరకూ నిధులు విడుదల చేసింది. అయితే ఓపీ షీట్ ప్రింటింగ్‌లో జరిగినట్లుగానే ఆశాల శిక్షణ పత్రాల ప్రింటింగ్‌లోనూ స్కామ్ చేశారు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' గతంలోనే వెలుగులోకి తీసుకువచ్చింది. దాదాపు రూ.5 కోట్ల విలువైన టెండర్‌ను కేంద్రీయ బండారు పేరుతో గ్రాఫిక్స్ షాపునకు అప్పగించేశారు. ప్రతి ఆర్డీడీ కార్యాలయానికి రూ.1.50 కోట్ల వరకూ విడుదల చేశారు. ఈ నిధులు మొత్తం ఖాళీ అయ్యాయి. కానీ ఆశా వర్కర్లకు ట్రైనింగ్ పూర్తి కాలేదు. ప్రింటింగ్ మెటీరియల్ కూడా ఆర్డీడీ కార్యాలయాలకు పూర్తిస్థాయిలో అందలేదు. ఉన్నతాధికారుల ప్రోద్బలంతో విచారణ పూర్తిస్థాయిలో చేయడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా.. మొత్తం ఆయుష్ విభాగంలో సదరు అధికారి వచ్చినప్పటి నుంచి ఇచ్చిన ఆర్డర్లపై మంత్రి కార్యాలయం సమీక్ష చేస్తే, మరిన్ని అవినీతి బాగోతాలు వెలుగులోకొస్తాయన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఆయుష్‌తో పాటు ఈఎస్ఐలో అక్రమాలపైనా విచారణ చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు

రెండేళ్లలో రైల్వే, రోడ్డు ప్రాజెక్టులు పూర్తి

» మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వెల్లడి

అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భూసేకరణ, అటవీ క్లియరెన్స్‌లను వెంటనే పరిష్కరించాలని, పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి సకాలంలో పనులు పూర్తిచేయాలని నేషనల్ హైవే, రైల్వే శాఖ అధికారులను రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి ఆదేశించారు. 2026 డిసెంబరు నాటికి రాష్ట్రంలో రైల్వే, జాతీయ రహదారుల ప్రాజెక్టుల పనులు పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. అమరావతి సచివాలయంలో ఆయా శాఖల అధికారులతో మంత్రి సోమవారం సమీక్ష నిర్వహించారు. నేషనల్ హైవేలు, రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ, అటవీ క్లియరెన్స్ నిధుల విడుదల, అలైన్‌మెంట్ మార్పులు, క్షేత్రస్థాయిలో ఇబ్బందులు, ఆయా శాఖల మధ్య సమన్వయం వంటి సమస్యల పరిష్కారానికి మంత్రి ఆధ్వర్యంలోని టాస్క్‌ఫోర్స్ కమిటీ పలు కీలక సూచనలు చేసింది. భూసేకరణ ప్రక్రియను ఈ నెల 31 నాటికి 60 శాతం, వచ్చే జనవరి 31 నాటికి 100 శాతం పూర్తి చేస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు. అలాగే అటవీ క్లియరెన్స్ సమస్యలను జనవరి 15 నాటికి 70 శాతం, ఫిబ్రవరి 15 నాటికి 100 శాతం పరిష్కరిస్తామని చెప్పారు. కొత్త రైల్వే ప్రాజెక్టుల భూసేకరణ పనులను కూడా త్వరగా పూర్తిచేయాలని, కొన్ని ప్రాజెక్టులకు రైల్వే శాఖ నిధులతోనే భూసేకరణ చేపట్టాలని మంత్రి సూచించారు.

ఏపీలో 532 స్కిల్ హబ్‌లు

» లోక్‌సభలో కేంద్ర మంత్రి జయంత్ చౌదరి

న్యూఢిల్లీ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన(పీఎంకేవీవై) 4.0 అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 6,835 స్కిల్ హబ్(నైపుణ్య కేంద్రాలు)లు ఏర్పాటవ్వగా, ఏపీలో 532 హబ్‌లు ఏర్పాటు చేసినట్లు కేంద్ర నైపుణ్యాభివృద్ధి సహాయ మంత్రి జయంత్‌చౌదరి వెల్లడించారు. సోమవారం లోక్‌సభలో టీడీపీ ఎంపీ కేశినేని చిన్ని అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఏపీలో 2022-23లో 69 స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేసినా నిధులివ్వలేదని.. ఎవరూ శిక్షణ పొందలేదని తెలిపారు. 2023-24 245 స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేసి, రూ.12.58 కోట్లు ఇచ్చామని, 20,540 మంది శిక్షణ పొందారని చెప్పారు. 2024-25లో అక్టోబరు 31 వరకు 218 స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేసి, రూ.3.54 కోట్లు ఇచ్చామని, 14,253 మంది అభ్యర్థులు శిక్షణ తీసుకున్నారని తెలిపారు.

ఏపీలో రూ.5,653 కోట్ల స్మార్ట్ పనులు పూర్తి

స్మార్ట్ సిటీస్ మిషన్ కింద అమరావతి, కాకినాడ, తిరుపతి, విశాఖపట్నంలో రూ.6,616 కోట్ల విలువైన 281 ప్రాజెక్టులను చేపట్టగా రూ.5653.20 కోట్ల విలువైన 234 ప్రాజెక్టులు పూర్తయ్యాయని కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల సహాయ మంత్రి టోకన్ సాహూ రాజ్యసభలో తెలిపారు. మరో రూ.962.87 కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయన్నారు.

ఒప్పందం ఏఆర్‌తో.. సరఫరా వైష్ణవిది

» కల్తీ దందాపై దాదాపుగా సిట్ నిర్ధారణ

» లడ్డూలో వాడింది ఏఆర్ నెయ్యి కాదు

» వైష్ణవి నుంచి నింపుకొని తిరుమలకు

» డెయిరీల అధికారులను ప్రశ్నించిన సిట్

తిరుపతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి నెయ్యి సరఫరా కోసం కాంట్రాక్టు కుదుర్చుకున్న ఏఆర్ డెయిరీ తాను సొంతంగా నెయ్యి సరఫరా చేయలేదని సుప్రీంకోర్టు నియమించిన సిట్ అధికారులు దాదాపు నిర్ధారణకు వచ్చారు. తమిళనాడులోని దిండిగల్‌కు చెందిన ఏఆర్ డెయిరీ....టీటీడీకి నెయ్యి సరఫరా చేసేందుకు టెండర్ ద్వారా అగ్రిమెంటు కుదుర్చుకుంది. అయితే ఏఆర్ డెయిరీ నుంచి టీటీడీకి అసలు నెయ్యే సరఫరా కాలేదని సిట్ అధికారుల విచారణలో తేలినట్టు సమాచారం. ఏఆర్ డెయిరీ ట్యాంకర్ల రాకపోకలు, ఇతర ఆధారాల ప్రకారం ఈ విషయం సిట్ అధికారులు గుర్తించినట్టు తెలిసింది. ఏఆర్ డెయిరీ ఖాళీ ట్యాంకర్లు పెళ్లకూరు మండలంలోని వైష్ణవి డెయిరీకి చేరుకుని అక్కడ నెయ్యి నింపుకొని టీటీడీకి చేరవేసినట్టు నిర్ధారణకు వచ్చినట్టు తెలిసింది. అలాగే పరిమాణం విషయంలో కూడా తేడాలను గుర్తించినట్టు సమాచారం. రికార్డుల్లో నమోదు చేసిన పరిమాణంలో నెయ్యి సరఫరా కాలేదని, ప్రతి ట్యాంకరులోనూ కనీసం 500 కిలోలు తక్కువ పరిమాణంలో నెయ్యి సరఫరా చేసినట్టు సమాచారం. కాగా ఏఆర్ డెయిరీ, వైష్ణవీ డెయిరీల అధికారులను సిట్ బృందం కార్యాలయానికి పిలిపించి సుదీర్ఘంగా విచారించిందనీ, వారి నుంచి స్టేట్‌మెంట్లు నమోదు చేసిందని తెలిసింది.

వైష్ణవి డెయిరీ లైసెన్సు సస్పెన్షన్?

తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం పునబాకలోని వైష్ణవి డెయిరీ ప్రాసెసింగ్ యూనిట్ లైసెన్సును సెంట్రల్ ఫుడ్ సేఫ్టీ అధికారులు 4రోజుల క్రితం సస్పెండ్ చేసినట్టు తెలిసింది. డెయిరీలో పాల సేకరణ, ప్రాసెసింగ్ రెండూ నిలిపివేసినట్టు తెలిసింది. ఈ నెల 13వ తేదీన ఉద్యోగులను, కార్మికులను సమావేశపరిచి సిట్ అధికారుల విచారణ నేపథ్యంలో ప్రాసెసింగ్ నిలిపివేస్తున్నామని డెయిరీ అధికారులు ప్రకటించినట్టు సమాచారం. ఉద్యోగులు విధులకు రావాలని, ప్రాసెసింగ్ జరగకపోయినా జీతాలు చెల్లిస్తామని భరోసా ఇచ్చినట్టు తెలిసింది. క్యాజువల్ లేబర్‌ను మాత్రం రావద్దని చెప్పినట్టు తెలిసింది. 14వ తేదీన క్యాంటీన్ మూత పడి ఉండడం గమనించి డెయిరీ జనరల్ మేనేజర్‌ను ఉద్యోగులు నిలదీశారని సమాచారం. దీంతో అధికారులంతా డెయిరీ వదిలి వెళ్లిపోయారని, సెల్‌ఫోన్లు కూడా స్విచ్ఛాఫ్ చేసుకున్నారని చెబుతున్నారు. ఆ క్రమంలో సోమవారం ఉద్యోగులు మళ్లీ డెయిరీకి విధులకు రాగా, అధికారులు లేకపోవడంతో ధర్నాకు దిగారు. పెళ్లకూరు పోలీసు స్టేషన్‌కు వెళ్లి యాజమాన్యంపై ఫిర్యాదు చేశారు.

ఇళ్ల స్థలాల 'చదును'లో
భారీగా అక్రమాలు

లెక్క తేల్చనున్న అధికారుల బృందాలు

- పెండింగ్ బిల్లుల కోసం హైకోర్టులో వ్యాజ్యం
- కోర్టు ఆదేశాలతో సోషల్ ఆడిట్, క్వాలిటీ కంట్రోల్ తనిఖీలు
- అవి పూర్తయ్యాకే చెల్లింపులు.. 20లోపు తనిఖీల పూర్తికి ఆదేశం

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): నాటి వైసీపీ ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఇళ్ల స్థలాల చదును పనుల్లో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా దాదాపు రూ.460 కోట్ల మేర ఉపాధి నిధులను ఈ పనులకు సర్దేశారు. చదును పనులకు 75 శాతమే చెల్లింపులు చేయాలని మిగిలిన సొమ్మును సోషల్ ఆడిట్, క్వాలిటీ కంట్రోలు సంయుక్త తనిఖీల తర్వాత ఇవ్వాలని నిబంధనల్లో పేర్కొన్నా.. స్థానిక వైసీపీ నేతల ఒత్తిడితో 90 శాతం మేరకు ముందుగానే చెల్లించేశారు. ఇప్పటికే కొన్నిచోట్ల పనులను తనిఖీ చేసిన అధికారులు... చేసిన పని కంటే చెల్లించిందే ఎక్కువని, ఇంక చెల్లించాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. అయినప్పటికీ పనులు చేసినవారు హైకోర్టుకు వెళ్లడంతో కోర్టు ఆదేశాల మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ విచారణకు ఆదేశించింది. ఈ పనుల్లో అవినీతిపై అసెంబ్లీలో చర్చ జరగడం, పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ ఆ పనులను తనిఖీ చేశాక, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని నిర్ణయించారు. ప్రతి జిల్లాలో పనుల తనిఖీకి పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ ఈఈలు, ఉపాధి పథకం సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారులు, ఇతర శాఖల ఇంజనీర్లతో బృందాలను ఏర్పాటుచేసి సమగ్ర విచారణ చేసి నివేదిక ఇవ్వాలని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. ఆయా జిల్లాల్లో పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల జాబితాను డ్వామా పీడీల నుంచి సేకరించాలని, నిబంధనల ప్రకారం పనులు జరిగాయా.. లేదా?, పంచాయతీలకు సీనరేజ్ చార్జీలు చెల్లించారా లేదా? వంటి విషయాలను పరిశీలించాలని కమిషనర్ మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

చేసింది తక్కువ.. చెల్లింపులు ఎక్కువ!

ఉపాధి హామీ పథకంలో ఈ పనులు చేపట్టేందుకు అనుమతి లేకపోయినా అప్పటి ముఖ్యకార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది సహకారంతో వైసీపీ నేతలు అడ్డగోలుగా పనులు చేశారు. సుమారు రూ.1,125 కోట్ల పనులు చేపట్టి రూ.1500 కోట్లకుపైగా బిల్లులను అప్‌లోడ్ చేశారు. ఈ పనులు చేసేందుకు ఉపాధి పథకంలో అనుమతి లేదని, చెల్లింపులు చేయరాదని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్పట్లోనే హెచ్చరించింది. దీంతో హౌసింగ్ శాఖ ద్వారా బిల్లు చెల్లింపులు చేపట్టాలని వైసీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో పలు పనులకు సంబంధించిన కొలతలను మార్చేసి భారీ స్కాంకు తెరతీశారు. నేతల ఒత్తిడితో ఎక్కడా ప్రీమెజర్‌మెంట్‌ను పరిగణనలోకి తీసుకోకుండా ఉపాధి టీఏలు, ఈసీలు ఎంబుక్‌ల్లో కొలతలు నమోదు చేశారు. 25 శాతం చెల్లింపులను పెండింగ్‌లో పెట్టి మిగిలిన బిల్లులు చెల్లించాలని, క్వాలిటీ కంట్రోల్, సోషల్ ఆడిట్ సంయుక్తంగా తనిఖీలు చేశాక పెండింగ్ బిల్లులు చెల్లించాలని అప్పట్లో మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. అయితే కొన్నిచోట్ల 10 శాతమే బిల్లులు నిలిపేసి 90 శాతం చెల్లించేశారు. సీనరేజ్ చార్జీల కింద గ్రామ పంచాయతీలకు క్యూబిక్ మీటర్‌కు రూ.50 చొప్పున చెల్లించాలని చెప్పినా ఎక్కడా అమలు కాలేదు. వైసీపీ నేతలు తమకు రావాల్సిన 25 శాతం పెండింగ్ బిల్లుల కోసం హైకోర్టుకు వెళ్లారు. కోర్టు ఆదేశాలతో పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు బిల్లులు అప్‌లోడ్ చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాలు ఇచ్చింది. దీంతో కొన్ని జిల్లాల్లో తనిఖీలు చేపట్టగా పనుల్లో భారీగా అవినీతి జరిగినట్లు తేలింది. నెల్లూరు జిల్లా కొండాపురం మండలంలో కొన్ని పనులను క్వాలిటీ అధికారులు తనిఖీలు చేయగా.. చేసిన పనుల కంటే చెల్లించిన బిల్లులే ఎక్కువ మొత్తంలో ఉన్నాయని తేలింది. ఇక బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదని నివేదికలు ఇచ్చారు. అయితే విస్తృతస్థాయిలో జరిగిన ఈ పనులను తనిఖీ చేసేందుకు మరింత సమయం కావాలని ఇంజనీర్లు అంటున్నారు.



పోలవరం ప్రాజెక్టు పనుల పరిశీలనలో చంద్రబాబు

వచ్చే డిసెంబరుకే వాల్ పూర్తికావాలి

2026 అక్టోబరు నాటికి పోలవరం పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడమే కాకుండా ఆలోపు పనులు పూర్తికి తగు కార్యాచరణను కూడా ఖరారుచేశారు. పనులను అత్యంత వేగంగా చేయాలని, ఎక్కడా జాప్యానికి తావుండకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సహాయ పునరావాస పనులను అంతే వేగంగా ఒక కొలిక్కివచ్చేలా చేయాలన్నారు.

- డయాఫ్రం వాల్ నిర్మాణంతోపాటు సమాంతరంగా ఈసీఆర్‌ఎఫ్ డ్యాం నిర్మాణం దిశగా ఏర్పాట్లు చేసుకోవాలి. తగినంత మెటీరియల్ సమకూర్చుకోవాలి. జనవరి 2వ తేదీ నుంచి డయాఫ్రం వాల్ నిర్మాణం పనులు చేపట్టి వేగం పెంచాలి. 2026 మార్చి నాటికి ఈ పనులన్నింటినీ పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నా.. 2025 డిసెంబరు నాటికే పూర్తి చేయాలి.
- ఈసీఆర్‌ఎఫ్ గ్యాప్-1 2026 ఫిబ్రవరికి పూర్తికావాలి. గ్యాప్-2ని 2026 మేలోపే పూర్తి చేయాలి.
- కుడి, ఎడమ కాలువల పనులు ఏడాదిన్నరలోనే పూర్తి కావాలి.
- స్పిల్‌వే పనులన్నీ 2026జూన్‌లోపు పూర్తి చేయాలి.
- పైలట్ ప్రాజెక్టు పనులు 2027లోపే పూర్తి కావాలి.
- టన్నెల్స్ నిర్మాణం 2026 ఫిబ్రవరిలోపు పూర్తి కావాలి.
- కుడికాలువ కనెక్టివిటీ 2026 డిసెంబరులోపే జరగాలి.
- ఎక్కడా జాప్యం జరుగకూడదు. నిర్దేశిత సమయం కంటే ముందే పూర్తయ్యేలా చూడాలి. ఆలోపే ఆర్‌అండ్‌ఆర్ పనులను సంపూర్తి చేయాలి.
- 16,450 ఎకరాల భూసేకరణ పనులు త్వరితగతిన పూర్తి కావాలి.
- యుద్ధ ప్రాతిపదికన పనుల పూర్తికి క్షేత్ర స్థాయిలో నిర్దిష్ట ప్రణాళికలు ఉండాలి.

కాలంతో పరుగు!

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టు రాష్ట్ర జీవనాడి అని, ఈ ప్రాజెక్టును నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేసేందుకు అంతర్జాతీయ నిపుణుల కమిటీ, కేంద్ర జల సంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీతో చర్చించామని నిర్మాణ పనులకు దశల వారీగా లక్ష్యాన్ని నిర్దేశించుకుని 2026 నాటికి పూర్తి చేయబోతున్నామని ధీమాగా చెప్పారు. డయాఫ్రం వాల్, ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (ఈసీఆర్‌ఎఫ్) డ్యాం పనులను సమాంతరంగా చేపట్టవచ్చని నిపుణులు సూచించారని తెలిపారు. దెబ్బతిన్న వాల్ స్థానంలో కొత్త డయాఫ్రం వాల్ పనులు జనవరి 2వ తేదీన మొదలుపెట్టనున్నట్లు చెప్పారు. అందుకు అవసరమైన యంత్ర సామగ్రిని ఇంజనీరింగ్ అధికారులు సిద్ధం చేస్తున్నారన్నారు. వాల్ నిర్మాణం 2026 మార్చి నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. 2014-19 మధ్య తమ ప్రభుత్వ కాలంలో 72 శాతం పనులు పూర్తి చేశామని, గత ప్రభుత్వం కేవలం 3.84 శాతం మాత్రమే పూర్తి చేసిందన్నారు. గత ప్రభుత్వ తప్పిదాల కారణంగా ప్రాజెక్టుకు జరిగిన నష్టం అంతా ఇంతా కాదని దుయ్యబట్టారు. రూ.2,400 కోట్ల నష్టం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్ర రాష్ట్రానికి పోలవరం ప్రాజెక్టు ప్రాముఖ్యతను ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు తెలియజేసి మొదటి దశ నిర్మాణానికి రూ.12,157 కోట్లు సాధించామన్నారు. గత ఐదేళ్లలో ప్రాజెక్టు పనులు చేయకపోవడం వల్ల రూ.15 వేల కోట్ల నష్టం వచ్చిందని చెప్పారు. ప్రాజెక్టు పూర్తయితే ఆ లాభం కూడా వచ్చి ఉండేదని, అది కూడా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. 'అప్పట్లో డయాఫ్రం వాల్ రూ.440 కోట్లతో పూర్తి చేస్తే ప్రస్తుతం అది 990 కోట్లు ఖర్చు కానుంది. శాండ్ ఫిల్లింగ్‌కు రూ.350 కోట్లు అవుతుంది. కేంద్రం నుంచి రూ.8,242 కోట్లు వస్తే అందులో రూ.2,342 కోట్లు దారి మళ్లించారు. ఇప్పటివరకు ప్రాజెక్టు నిర్మాణ పనులు 76.79 శాతం పూర్తయ్యాయి. ప్రాజెక్టు నిర్మాణంపై నిపుణులతో వర్క్‌షాపు కూడా నిర్వహించాం' అని తెలిపారు. డిజైన్ల ఆమోదం, అనుమతులు, ఇతరత్రా అవసరాలపై ముందుచూపుతో వ్యవహరించాలని స్పష్టంచేశారు. నిర్దిష్ట కార్యాచరణ ప్రకటన ద్వారా పనులు శరవేగంగా పూర్తిచేసే అతిపెద్ద బాధ్యతను ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించారు. గైడ్‌బండ్ కుంగడానికి, నష్టం జరగడానికి కారణమైన వారిపై చర్యలు తీసుకుంటారా అని ప్రశ్నించగా.. గత ప్రభుత్వం నష్టం చేసి ఇప్పటికీ బుకాయిస్తూనే ఉందని, డయాఫ్రం వాల్ అంటే తెలియని వ్యక్తులు నాటి ప్రభుత్వంలో ఉన్నారని ముఖ్యమంత్రి ఎద్దేవా చేశారు. గత పాలకులకు ప్రజలు తగిన శిక్ష విధించారని.. 11 సీట్లే ఇచ్చారని చెప్పారు. కానీ ప్రాజెక్టు పూర్తిగాకపోవడం వల్ల జరిగిన నష్టాన్ని రికవరీ చేయలేం కదా అని వ్యాఖ్యానించారు. సీఎం ఇంకా ఏమన్నారంటే..



డయాఫ్రం వాల్ ప్లాట్‌ఫారమ్ పనుల పరిశీలన

> రాష్ట్రంలో గత ఆరు నెలలుగా బూతులు లేవు. అంతకుముందు ప్రతి రోజూ బూతులు మాట్లాడేవారు. ఇప్పుడు అక్కడక్కడా మాత్రమే వినిపిస్తున్నాయి. కట్టడి చేయగలిగాం.
>
> - సీఎం చంద్రబాబు

రివర్స్ టెండరింగ్‌తో..

పోలవరం రాష్ట్రానికి జీవనాడి. దానిని పూర్తి చేయాలన్న తలంపుతో 30 సార్లు పోలవరం వచ్చాను. 80 సార్లు వర్చువల్‌గా సమీక్షించా. అటువంటి ప్రాజెక్టును వైసీపీ సర్వనాశనం చేసింది. రివర్స్ టెండరింగ్ పేరుతో నాటి సీఎం జగన్ అప్పటి కాంట్రాక్టరుకు నోటీసులిచ్చి బయటకు పంపేశారు. అవినీతి, కుట్ర, అనుభవరాహిత్యంతో ప్రాజెక్టు పనులన్నీ నాశనం చేశారు. 2020లో కాఫర్‌డ్యాం గ్యాప్‌ను పూడ్చకపోవడంతో భారీ వరదకు డయాఫ్రం వాల్ దెబ్బతింది. 2019లో మేం తిరిగి అధికారంలోకి వచ్చి ఉంటే 2021 నాటికే పోలవరం పూర్తయ్యేది. ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత పోలవరం, అమరావతి రాష్ట్రానికి రెండు కళ్లుగా మారాయి. వాటిని జగన్ ప్రభుత్వం పాడిచేసి నాశనం చేసింది.

సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు

పోలవరం ఎత్తు తగ్గించాలని కేంద్రానికి ఎవరు లేఖలు రాశారు.. ఎవరు ఒప్పుకొన్నారు..? సిగ్గులేకుండా ఇప్పటికీ మాట్లాడుతున్నారు. నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారు. ప్రాజెక్టును 45.75 మీటర్ల ఎత్తున నిర్మించేందుకే మేం శ్రమిస్తున్నాం. గత ప్రభుత్వం ప్రాజెక్టు పనుల్లో తీవ్ర జాప్యం చేయడమే కాకుండా ఏ పనికీ కనీసం గడువు కూడా విధించలేదు. ఎక్కడికక్కడ విశృంఖలంగా వ్యవహరించారు. త్యాగం చేసిన వారినేకాదు చెడు చేసిన వారిని కూడా గుర్తు పెట్టుకోవాలి. ప్రాజెక్టులో ఒకేసారి నీరు నిల్వ చేయలేం. నిర్మాణం పూర్తయ్యాక నిపుణుల సలహా మేరకు దశల వారీగా నీటి నిల్వను పెంచుతూ పోతాం.

ఎఫ్‌డీఐలకు
జగన్ దెబ్బ!

- 2019-24లో ఆంధ్రకు 1,085.59 మిలియన్ డాలర్లే..
- తెలంగాణకు 9,314 మిలియన్ డాలర్లు
- పార్లమెంటు సాక్షిగా వెల్లడించిన కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జగన్ జమానాలో రాష్ట్రం విదేశీ పెట్టుబడుల విషయంలో పాతాళంలో ఉందన్న విషయం పార్లమెంటు సాక్షిగా వెల్లడైంది. 2019 అక్టోబరు నుంచి 2024 సెప్టెంబరు మధ్య పొరుగున ఉన్న తెలంగాణకు 9,314 మిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) రాగా.. ఏపీకి 1,085.59 మిలియన్ డాలర్లు మాత్రమే వచ్చాయని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధురి వెల్లడించారు. ఈ అంశంలో తెలంగాణ ఏడో స్థానంలో నిలువగా.. ఏపీ 14వ స్థానంలో ఉందని చెప్పారు. సోమవారం లోక్‌సభలో టీడీపీ ఎంపీలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, కృష్ణప్రసాద్ తెన్నేటి, పుట్టా మహేశ్‌కుమార్ అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానమిచ్చారు. మహారాష్ట్ర-82,638.08 మిలియన్ డాలర్లు, కర్ణాటక-54,573.73, గుజరాత్-43,149.95), ఢిల్లీ-34,920.48, తమిళనాడు-12,560.52, హరియాణా-11,042.92 మిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులతో మొదటి ఆరు స్థానాల్లో ఉన్నాయని తెలిపారు. జార్ఖండ్-2,667.10, రాజస్థాన్-2,492.33, పశ్చిమ బెంగాల్-1,723, ఉత్తరప్రదేశ్-1,700.63, కేరళ-1,288.93, పంజాబ్-1,197.93 మిలియన్ డాలర్లతో ఆంధ్ర కంటే ముందున్నాయి. ఏపీకి వచ్చిన 1,085.59 మిలియన్ డాలర్లలో చిత్తూరు జిల్లాకు అత్యధికంగా 446.35 మిలియన్ డాలర్లు వచ్చాయని కేంద్ర మంత్రి వెల్లడించారు.

నదుల అనుసంధానంపై
ఎల్లుండి కీలక భేటీ

రాష్ట్రాలతో కేంద్ర జలశక్తి శాఖ సమీక్ష

అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా నదుల అనుసంధానంపై గురువారం (ఈ నెల 19న) కేంద్ర జలశక్తి శాఖ రాష్ట్రాలతో సమీక్షా సమావేశం నిర్వహించనుంది. జాతీయ జల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) ఆధ్వర్యంలో జరిగే ఈ భేటీకి కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షత వహిస్తారు. ఎజెండాలో గోదావరి (ఇచ్చంపల్లి నుంచి)-కావేరీ నదుల అనుసంధానంపై చర్చ ఉంటుందని ఎన్‌డబ్ల్యూడీఏ తెలిపింది. వాస్తవానికి ఈ ప్రతిపాదనను రెండు తెలుగు రాష్ట్రాలూ అంగీకరించడం లేదు. గోదావరి జలాల్లో తన వాటాపై స్పష్టత ఇవ్వకుండా.. ఛత్తీస్‌గఢ్‌లో మిగులు జలాల ఆధారంగా గోదావరి-కావేరి అనుసంధాన ప్రక్రియను చేపడతామని కేంద్రం అనడంపై తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఇదే సమయంలో పోలవరం కుడి ప్రధా కాలువ ద్వారా వైకుంఠపురం ఎత్తిపోతల పథకం మీదుగా బొల్లాపల్లి రిజర్వాయరు నుంచి బనకచర్ల రెగ్యులేటర్‌కు.. అక్కడి నుంచి కావేరికి జలాలను తరలించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. ఈ నేపథ్యంలో 19వ తేదీన జరిగే సమావేశంలో కేంద్రం వెల్లడించే అభిప్రాయంపై ఆసక్తి నెలకొంది.

డోలీ మోతలు ఆగాలి

- గిరిజన ప్రాంతాల్లో రోడ్ల కనెక్టివిటీ మెరుగుపర్చాలి
- పీఆర్ అండ్ ఆర్డీపై సమీక్షలో సీఎం చంద్రబాబు
- ఏజెన్సీల్లో రోడ్ల పరిస్థితిపై డిప్యూటీ సీఎంతో చర్చ

అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాల్లో డోలీ మోతలు ఆగిపోవాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. సోమవారం సచివాలయంలో చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రత్యేకంగా సమావేశమై ఏజెన్సీ ప్రాంతాల్లోని రోడ్ల పరిస్థితిపై చర్చించారు. తగిన సదుపాయాలు లేని గిరిజన గ్రూపులు (పీవీటీజీలు) నివసిస్తున్న ప్రాంతాల్లో రోడ్డు కనెక్టివిటీ కల్పించి, డోలీ మోతల ఇబ్బందులు లేకుండా చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులను ఈ సందర్భంగా చంద్రబాబు ఆదేశించారు. ముందుగా 20 గిరిజన నివాసిత ప్రాంతాలకు రోడ్డు కనెక్టివిటీ కల్పించేందుకు రూ.48.50 కోట్లతో తొమ్మిది రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వ నిధులు వినియోగించాలని సూచించారు. మన్యం జిల్లాలో 6, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 3 రోడ్ల కనెక్టివిటీ చేపట్టేందుకు ప్రతిపాదనలు ఇవ్వాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ నిధులు రావాలంటే వేతనాల పనులు విరివిగా కల్పించాలన్నారు. కూలీలకు పనులు కల్పించడం ద్వారా మెటీరియల్ నిధులు సమకూర్చుకుని గ్రామాల్లో భారీగా వసతులు కల్పించవచ్చని పేర్కొన్నారు. ఆ మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతే కాకుండా పీఎంజీఎస్‌వై, పీఎంజన్మాన్ తదితర పథకాలను సద్వినియోగం చేసుకొని గిరిజన ప్రాంతాల్లో రోడ్లను మెరుగుపర్చుకోవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులు సమకూర్చడంతో పాటు 100 ఇళ్ల లోపు నివాసిత ప్రాంతాలకు రాష్ట్ర ప్రభుత్వ నిధులు వినియోగించి రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్, కమిషనర్ కృష్ణతేజ, ఈఎన్‌సీ బాలూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల ఆగడాలు అడ్డుకోండి

- టీడీపీ గ్రీవెన్స్‌లో బాధితుల ఫిర్యాదులు

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): 'టీడీపీలో చురుకుగా ఉన్నానన్న కారణంగా మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు అనుచరులు నా ఇంటిపై దాడి చేశారు. సామాన్లు ధ్వంసం చేశారు. నన్ను చంపేస్తామని బెదిరిస్తున్నారు' అని వినుకొండకు చెందిన షేక్ జానీ బాష వాపోయారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కేఎస్ జవహర్, లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు అర్జీలు స్వీకరించారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే కోరముట్ల శ్రీనివాసులు అండతో తమపై అక్రమ కేసులు పెట్టారని, విచారించి, చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా చిట్వేలికి చెందిన సుబ్బారాయుడు కోరారు. కంచికచర్లకు చెందిన ఓ మహిళ మాట్లాడుతూ, 'కంభం గ్రామానికి చెందిన రాంభూపాల్‌రెడ్డి అనే వ్యక్తి నా ఫోన్ హ్యాక్ చేశాడు. నా ఫొటోలు మార్ఫింగ్ చేసి, వేధిస్తున్నాడు' అంటూ వాపోయింది. 'టీడీపీకి అనుకూలంగా ఉన్నామనే కక్షతో వైసీపీ నేతలు నా సోదరుడి కాళ్లు విరగ్గొట్టారు. అతని భార్యను వేధిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోండి' అని పల్నాడు జిల్లా కారంపూడికి చెందిన వెంకటేశ్వర్లు కోరారు. గత ప్రభుత్వంలో తనకు మంజూరైన గృహ రుణాన్ని మరొకరికి ఇచ్చి, తమను మోసం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కర్నూలు జిల్లా రాంపురం గ్రామానికి చెందిన ఖాతూన్‌బీ విజ్ఞప్తి చేశారు.

టీడీపీలో 'జోగి' రచ్చ

నూజివీడులో గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణకు హాజరు

- ఊరేగింపుతో పాటు వేదికపైనా నాయకులతో రాసుకుపూసుకు తిరిగిన మాజీ మంత్రి

అమరావతి/విజయవాడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా నూజివీడులో దివంగత నేత గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమం పాలక టీడీపీలో అంతర్గతంగా కలకలం సృష్టించింది. ఈ కార్యక్రమంలో టీడీపీ కీలక నేతల మధ్య వైసీపీకి చెందిన మాజీ మంత్రి, అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు ఇంటిపై దాడికి వెళ్లిన జోగి రమేశ్ ప్రత్యక్షమై వారితో రాసుకుని పూసుకుని తిరగడం పార్టీ శ్రేణులను విస్మయపరిచింది. టీడీపీ కార్యకర్తలు, మద్దతుదారులు సామాజిక మాధ్యమాల్లో తీవ్ర విమర్శలు గుప్పించడంతో ఈ పరిణామాన్ని టీడీపీ అధిష్ఠానం తీవ్రంగా పరిగణించింది. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కొలుసు పార్థసారథి, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష నుంచి వివరణ తీసుకోవాలని పార్టీ రాష్ట్ర కార్యాలయ బాధ్యులను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్ ఆదేశించారు. అయితే జోగిని మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ ఆహ్వానించారని.. ఆయన్ను వివరణ అడగకపోవడంపై పార్టీ శ్రేణుల్లో ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. నూజివీడు గౌడసంఘం నేతలు ఆదివారం ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. లచ్చన్న మనుమరాలు గౌతు శిరీషతోపాటు నూజివీడుకు ప్రాతినిధ్యం వహిస్తున్న గృహ నిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి, ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ తదితరులతో పాటు జోగి రమేశ్, గన్నవరం ఎంపీపీ, వైసీపీ నేత అనగాని రవి కూడా వచ్చారు. టీడీపీ నేతలతో కలిసి జోగి వాహనంపై నిలబడి ఊరేగింపులో పాల్గొనడమే గాక వేదికపై కూడా వారి సరసన కూర్చున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నివాసంపై జరిగిన దాడి ఘటనలో ఆయనే ప్రధాన నిందితుడు. ఇక అనగాని రవి గన్నవరం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంపై దాడి చేసి దహనం చేసిన కేసులో కీలక పాత్రధారి. ఇలాంటి వ్యక్తులను తమతోపాటు వేదికపై కూర్చోబెట్టుకోవడం ద్వారా టీడీపీ శ్రేణులకు ఎలాంటి సందేశం ఇస్తున్నారంటూ పార్టీ కార్యకర్తలు ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమాల్లో సోమవారం తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దీంతో పార్టీ వర్గాలతో పాటు నిఘా వర్గాల నుంచీ సమాచారం సేకరించిన లోకేశ్.. కేంద్ర కార్యాలయ బాధ్యులతో మాట్లాడి ఏం జరిగిందో తెలుసుకున్నారు. టీడీపీ నేతలు జోగిని తమ మధ్య కూర్చోబెట్టుకుని కార్యక్రమం నడిపించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్థసారథి, శిరీష నుంచి వివరణ కోరాలని వారిని ఆదేశించారు. అయితే కొనకళ్లను మాత్రం వివరణ అడగలేదు. దీనిపై పార్టీ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. అసలు కొనకళ్ల సూచనతోనే నిర్వాహకులు జోగి రమేశ్‌ను పిలిచారని తాము విన్నామని, ఆయన్ను వివరణ కోరకపోవడం ఆశ్చర్యంగా ఉందని టీడీపీ సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించారు.



చంద్రబాబు ఇంటిపైకి దాడికి వెళ్లిన సమయంలో జోగి, సోమవారం నూజివీడు సభలో టీడీపీ నేతల పక్కన జోగి రమేశ్

పార్థసారథి క్షమాపణలు

నూజివీడు కార్యక్రమంపై వివాదం చెలరేగడంతో మంత్రి పార్థసారథి సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పార్టీ అధిష్ఠానానికి, కార్యకర్తలకు క్షమాపణ చెప్పారు. 'గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ పార్టీలకతీతంగా జరిగింది. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన గౌడ సామాజిక వర్గీయులందరూ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి జోగి రమేశ్ రావడం యాదృచ్ఛికంగా జరిగింది. కూటమి నేతలెవరూ ఆయన్ను ఆహ్వానించ లేదు. బలహీన వర్గాలకు చెందిన నన్ను మంత్రిని చేసిన ఘనత చంద్రబాబుది. ఆయన, లోకేశ్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్నాను. పార్టీ కార్యకర్తల మనోభావాలు దెబ్బతిని ఉంటే వారికి క్షమాపణ చెబుతున్నాను. మన్నించాలని ముఖ్యమంత్రికి కూడా విజ్ఞప్తి చేస్తున్నా.

ఎవరెవరు వస్తున్నారో తెలియదు: శిరీష

ఎమ్మెల్యే గౌతు శిరీష నూజివీడు ఘటనపై ఒక వీడియోలో వివరణ ఇచ్చారు. 'మా పార్టీ అధినేత చంద్రబాబు కుటుంబానికి, టీడీపీకి ఇబ్బంది కలిగించే ఏ చర్యనూ నేను తెలిసి చేయను. నూజివీడులో మా తాతగారి విగ్రహావిష్కరణకు నెల రోజుల క్రితమే అక్కడి గౌడ సంఘం పిలిచింది. నాతోపాటు ఇంకా ఎవరెవరిని పిలిచారో నిర్వాహకులు చెప్పలేదు. టీడీపీని, చంద్రబాబును ఎన్నికల ముందు విమర్శించిన వాళ్లు.. ఎన్నికల తర్వాత మా పార్టీలోకి వస్తామని ఆరు నెలల నుంచి ప్రయత్నిస్తున్నారు. అటువంటి వారిని పలాసలో టీడీపీ కార్యాలయం గేటు లోపలికి కూడా అడుగు పెట్టనివ్వడం లేదు. సామాజిక మాధ్యమాల్లో ఏ చర్చ జరిగినా పార్టీ అధిష్ఠానం దృష్టికి ఆ విషయాలు తీసుకెళ్లేది నేనే. వైసీపీ ఎమ్మెల్సీ పోతుల సునీత టీడీపీలోకి రావాలని అనుకున్నప్పుడు తీసుకోవద్దని నేను పార్టీ అధిష్ఠానాన్ని కోరాను. ఆమె చంద్రబాబు మీద, ఆయన కుటుంబ సభ్యుల మీద వ్యక్తిగత విమర్శలు చేశారన్న కోపంతో ఆమె చేరికను వ్యతిరేకించాను. పార్టీ విషయాల్లో ఇంత పట్టుదలగా ఉండే వ్యక్తిని నేను.. తెలిసి తప్పు చేయను. టీడీపీ సోషల్ మీడియా అంటే నాకు అభిమానం. వారికి కూడా ఇదే చెబుతున్నాను. ఇక ముందు ఎవరైనా ఏదైనా కార్యక్రమానికి పిలిస్తే.. ఇంకా ఎవరెవరిని పిలిచారో తెలుసుకున్న తర్వాతే వెళ్తా' అని ఆమె వివరించారు.

ఆహ్వాన పత్రికల్లో పేరున్నా చూసుకోరా..?

గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ ఆహ్వాన పత్రికలో గౌరవ అతిథులుగా పేర్కొన్న వారిలో జోగి రమేశ్ పేరు ఉంది. అది చూసినప్పుడైనా టీడీపీ నేతలు చూసి అప్రమత్తం కావలసి ఉన్నా అలా చేయకపోవడాన్ని ఆ పార్టీ కార్యకర్తలు తప్పుబడుతున్నారు. వాస్తవానికి మంత్రి పార్థసారథి, కొనకళ్ల నారాయణ సూచనల మేరకే జోగి పేరును ఆహ్వానపత్రికలో ముద్రించినట్లు సమాచారం. ఇది తెలుసుకోకుండా కార్యక్రమానికి వెళ్లామని చెప్పడం కేవలం తప్పించుకునే ప్రయత్నమని కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వెంకటాపురం.. పసుపుమయం

పరిటాల స్వగ్రామంలో గ్రామ ఓటర్లంతా టీడీపీ సభ్యత్వ స్వీకారం

అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పరిటాల రవి, సునీతల స్వగ్రామం వెంకటాపురం... టీడీపీ సభ్యత్వ నమోదులో సరికొత్త రికార్డు నెలకొల్పింది. యావత్ గ్రామ ఓటర్లు టీడీపీ సభ్యత్వం స్వీకరించారు. ప్రతి ఇంటిపైనా టీడీపీ జెండాను ఎగురవేశారు. దీంతో గ్రామం పసుపు వర్ణమయింది. వెంకటాపురంలో మొత్తం 581 ఓట్లు ఉండగా, 13 మంది అనారోగ్యం, ఇతర కారణాలతో చనిపోయారు. గ్రామంలో ప్రస్తుతం 568 మంది ఓటర్లున్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత నేతృత్వంలో ఈ ఓటర్లంతా టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. వెంకటాపురం స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కేడర్ ఉత్సాహంగా సభ్యత్వ నమోదులో పాలు పంచుకోవాలని టీడీపీ అధిష్ఠానం విజ్ఞప్తి చేసింది.



రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్, కేంద్ర మంత్రులు నడ్డా, రామ్మోహన్, నూతన ఎంపీలు కృష్ణయ్య, సతీశ్, మస్తాన్ రావుతో కూటమి ఎంపీలు

రాజ్యసభలో కూటమి ఎంపీల ప్రమాణస్వీకారం

న్యూఢిల్లీ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభకు నూతనంగా ఎన్నికైనా ఆర్.కృష్ణయ్య బీద మస్తాన్‌రావు, సానా సతీశ్ బాబు ఎంపీలుగా ప్రమాణస్వీకారం చేశారు. సోమవారం, రాజ్యసభలో చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ వారితో ప్రమాణం చేయించారు. కూటమికి చెందిన టీడీపీ, బీజేపీ లోక్‌సభ ఎంపీలు ఈ కార్యక్రమానికి హాజరై కొత్త ఎంపీల ప్రమాణస్వీకారాన్ని వీక్షించారు. కొత్త ఎంపీలకు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుతో పాటు కూటమి ఎంపీలు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొత్త ఎంపీలతో పాటు కూటమి ఎంపీలు రాజ్యసభ చైర్మన్ కార్యాలయంలో చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్, కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డాలను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, టీడీపీ నేత లావు శ్రీ కృష్ణదేవరాయులు, హరీశ్, దగ్గుమళ్ల ప్రసాదరావు, నాగరాజు, మాగుంట శ్రీనివాసులురెడ్డి, సీఎం రమేశ్, పురందేశ్వరి పాల్గొన్నారు.

రాజ్యసభలో టీడీపీకి మళ్లీ ప్రాతినిధ్యం

బీద మస్తాన్‌రావు, సానా సతీశ్ ఎంపీలుగా ప్రమాణస్వీకారం చేయడంతో టీడీపీకి రాజ్యసభలో మళ్లీ ప్రాతినిధ్యం లభించింది. టీడీపీ తరఫున ఎంపీగా ఉన్న కనకమేడల రవీంద్రకుమార్ పదవీకాలం ఈ ఏడాది ఏప్రిల్ తొలి వారంలో ముగియడంతో అప్పటినుంచి ఆ పార్టీకి రాజ్యసభలో ప్రాతినిధ్యం లేదు.

రాష్ట్రాన్ని వల్లకాడు చేయడమే జగన్ విజన్!

సర్వ నాశనానికి ఆయనే బ్రాండ్ అంబాసిడర్: టీడీపీ

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని వల్లకాడుగా చేయడం ఒక్కటే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి తెలిసిన విజన్ అని తెలుగుదేశం పార్టీ ఎద్దేవా చేసింది. 'రాజధానిని స్మశానంగా మార్చారు. రాష్ట్రం నుంచి పరిశ్రమలను వెళ్లగొట్టారు. ఇసుక నుంచి మద్యం వరకూ దేనినీ వదిలిపెట్టకుండా జగన్ దోచుకొని రాష్ట్రాన్ని పీల్చి పిప్పి చేశారు. పనులు లేక భవన నిర్మాణ కార్మికులు ఆత్మహత్య చేసుకొనే పరిస్థితి వచ్చి, రాష్ట్రం వల్లకాడు మాదిరిగా మిగిలింది. సర్వ నాశనానికి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న జగన్ కూడా తమ పార్టీ వాళ్లతో... తన మీడియాతో విజన్ డాక్యుమెంట్ మీద విమర్శలు చేయించడం వింతల్లోకెల్లా వింత' అని విమర్శించింది. టీడీపీ అధికార ప్రతినిధి, రాష్ట్ర బయో డైవర్సిటీ సంస్థ చైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్ సోమవారం తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'చంద్రబాబు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం విజన్ 2020 డాక్యుమెంట్ తయారు చేయించి విడుదల చేస్తే అప్పటి ప్రతిపక్షం నవ్వింది. కానీ, ఆ విజన్ వల్లే రాష్ట్రానికి ఐటీ కంపెనీలు తరలివచ్చి వాటిలో 34 లక్షల ఉద్యోగాలు అందుబాటులోకి వచ్చాయి. సైబరాబాద్ పేరుతో ఒక కొత్త నగరం రూపుదిద్దుకొంది. హైదరాబాద్ నగరం నుంచి లభిస్తున్న ఆదాయం మొత్తం తెలంగాణ రాష్ట్రానికి ఆర్థికంగా వెన్నెముకగా మారింది. ఆ నాటి విజన్ డాక్యుమెంట్ వల్ల వచ్చిన ఫలితం అది. విభజిత ఆంధ్రప్రదేశ్‌ను కూడా 1947నాటికి అభివృద్ధిలో అత్యుత్తమ స్థాయికి తీసుకువెళ్లడానికి మళ్లీ ఇప్పుడు విజన్ డాక్యుమెంట్‌ను టీడీపీ ప్రభుత్వం తయారు చేయించింది. అయిన కాడికి దోచుకొనే ఆర్థిక నేరగాళ్లకు విజన్ అంటే తెలియదు. అందుకే దానిని తిట్టిపోస్తున్నారు' అని నీలాయపాలెం విమర్శించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాక ముందు 50 ఏళ్లలో రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి కేవలం ఐదు వేల మెగావాట్లు ఉంటే, ఆయన సీఎం అయిన తర్వాత పది వేల మెగావాట్లు పెంచారని, విజన్ అంటే అలాగే ఉంటుందని వ్యాఖ్యానించారు.



నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం గువ్వలకుంట్లలో శుభ్రం చేయకముందు శిథిలావస్థలో మెట్లబావి

చేయిచేయి కలిపారు!

శ్రీశైలం దారిలోని పురాతన మెట్లబావికి పూర్వ కళ

- జనాన్ని కదిలించిన ఇన్‌స్టా రీల్

కొత్తపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాను సమస్యలను వెలుగులోకి తేవడానికి, వాటి పరిష్కారానికి ఉపయోగించుకుంటే ఎలా ఉంటుందో చెప్పేందుకు ఇదే నిదర్శనం! నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం గువ్వలకుంట్ల గ్రామ సమీపంలో ఓ పురాతన మెట్లబావి ఉంది. శ్రీశైలం మల్లన్న దర్శనానికి వెళ్లే యాత్రికుల కోసం 15వ శతాబ్దంలో దీనిని తవ్వించారని చెబుతారు. శ్రీశైలం-ఆత్మకూరు ప్రధాన రహదారికి కొద్ది దూరంలో.. ఒక పొలంలో ఈ బావి ఉంది. ఒకప్పుడు యాత్రికుల దాహార్తిని తీర్చిన ఈ బావి ఇప్పుడు చెత్తాచెదారంతో నిండిపోయింది. చుట్టూ పిచ్చి మొక్కలు! ఆత్మకూరు పట్టణానికి చెందిన యుగంధర్ అనే యూట్యూబర్ వివిధ గ్రామాల చరిత్రలతో కూడిన వీడియోలను అప్‌లోడ్ చేస్తుంటారు. ఆయన ఇటీవల గువ్వలకుంట్ల మెట్ల బావి దుస్థితిపై ఈనెల 10న ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక రీల్ పోస్ట్ చేశారు. అది వైరల్ అయి మంత్రి నారా లోకేశ్ దృష్టికి కూడా వెళ్లింది. 'మన సాంస్కృతిక వారసత్వాన్ని, చారిత్రక సంపదను కాపాడుకోవడం సమష్టి బాధ్యత. ఈ అద్భుతమైన బావి పూర్వ వైభవానికి, భవిష్యత్ తరాలకు దాని సంరక్షణను నిర్ధారించడానికి కట్టుబడి ఉన్నాం' అని ట్వీట్ చేశారు. ఈ బావిని బాగు చేసేందుకు 'మన ఊరు, మన గుడి, మన బాధ్యత' సంస్థతో పాటు స్థానికులు, ఇతర స్వచ్ఛంద సంస్థలకు చెందిన వారు ఆదివారం రంగంలోకి దిగారు. చేయి చేయి కలిపారు. బావిలోని మురుగు నీటిని మోటార్ల ద్వారా తోడారు. సుందరంగా తీర్చిదిద్దారు. ఇకపైనా బావిని పరిరక్షించుకుంటామని గువ్వలకుంట్ల గ్రామస్థులు ప్రతిజ్ఞ చేశారు.



15వ శతాబ్దంనాటి పురాతన బావిని శుభ్రం చేస్తున్న దృశ్యం

నానికి అధికారుల సహకారం

పేర్ని నాని గోదాముల్లో బియ్యం మాయమైనట్టు నవంబరు 28, 29, 30 తేదీల్లోనే అధికారుల తనిఖీల్లో స్పష్టమైంది. వెంటనే స్పందించి కేసు నమోదు చేయాల్సిన పౌరసరఫరాల శాఖ అధికారులు సుమారు రెండు వారాల పాటు మీనమేషాలు లెక్కించారు. ఈ కేసు నుంచి ఎలా బయటపడాలో పేర్ని నానికి కొందరు పౌరసరఫరాల శాఖ అధికారులు సూచనలు కూడా ఇచ్చినట్టు సమాచారం. తాపీగా ఈ నెల 11న కేసు నమోదు చేశారు. ఆ తర్వాత అన్నీ పేర్ని నాని ముందుగా ప్లాన్ చేసుకున్నట్టు జరిగిపోయాయి. పౌరసరఫరాల శాఖలో కొందరు ఉన్నతాధికారులే పక్కా ప్లాన్‌తో పేర్ని నాని కేసును నీరుగార్చే ప్రయత్నాలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



కేసు మాఫీకి కాసులు!

పీడీఎస్ బియ్యం మాయం కేసులో 1.72 కోట్ల జరిమానా చెల్లించిన పేర్ని నాని

- 14న కోటి.. సోమవారం 72 లక్షలు
- అయినా కేసు ముందుకే
- మరోసారి గోదాముల్లో తనిఖీలు

విజయవాడ/మచిలీపట్నం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పీడీఎస్ బియ్యం స్వాహా కేసులో డబ్బులు కట్టి బయటపడేందుకు మాజీ మంత్రి పేర్ని నాని వేసిన ఎత్తులు ఫలించేలా లేవు. ఈ ఘటనలో జరిమానా సుమారు రూ.1.72 కోట్లు చెల్లించినా క్రిమినల్ కేసును ఎదుర్కోవాల్సి ఉంటుందని పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం మండలం పొట్లపాలెంలో పేర్ని నాని సతీమణి జయసుధ పేరిట ఉన్న గోదాముల్లో రేషన్ బియ్యం మాయమైన సంగతి తెలిసిందే. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో సుమారు 187 టన్నుల పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలించినట్టు ఇటీవల వెలుగులోకి వచ్చింది. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ఈ స్వాహా పర్వం వెలుగు చూడలేదు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా చాలా కాలం పాటు పేర్ని నానికి అనుకూలమైన అధికారులే పౌరసరఫరాల శాఖలో ఉండటంతో ఈ ఘటన వెలుగులోకి రాలేదు. ఎట్టకేలకు కొద్దిరోజుల క్రితం బియ్యం స్వాహా ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఈ విషయం టీడీపీ నాయకులకు తెలియడానికి ముందే పేర్ని నానికి చేరిపోయింది. కేసు తీవ్రత గుర్తించిన పేర్ని నాని తప్పించుకునేందుకు తొలి నుంచీ ప్రయత్నిస్తున్నారు. నవంబరు 25న నెలవారీ తనిఖీల్లో భాగంగా పౌరసరఫరాల శాఖ అధికారులు గోదాములకు వెళ్లారు. తనిఖీలు చేస్తే తన గుట్టు ఎక్కడ బయటపడుతుందోనన్న ఉద్దేశంతో తాళాలు లేవంటూ వారిని తిప్పి పంపేశారు. ఆ మరుసటి రోజే నవంబరు 26న ఆయన కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్‌కు లేఖ రాశారు. తన గోదాముల్లో వేబ్రిడ్జిలో లోపాల కారణంగా బియ్యం షార్టేజీ వచ్చినట్టు తెలిసిందని, ఎంత మొత్తంలో తక్కువ వస్తే ఆ మేరకు నగదు చెల్లిస్తానంటూ లేఖ రాశారు. ఈ లేఖతో అప్రమత్తమైన అధికారులు జిల్లాలోని బఫర్ గోదాముల్లో తనిఖీలు చేసి నివేదికలు ఇవ్వాలని కింది స్థాయి అధికారులను ఆదేశించారు. నవంబరు 28, 29, 30 తేదీల్లో అధికారులు బఫర్ గోదాముల్లో తనిఖీలు చేశారు. పేర్ని నానికి చెందిన గోదాముల్లో 3,708 బ్యాగుల బియ్యం 187 టన్నులు తగ్గినట్టుగా తేలింది. ఈ మేరకు జేసీకి నివేదిక ఇచ్చారు. ఈ అంశంపై తదుపరి చర్యల కోసం జేసీ పౌర సరఫరాల శాఖ ఎండీకి లేఖ రాశారు. తగ్గిన బియ్యం ధరకు రెట్టింపు అంటే సుమారు రూ.1.70 కోట్లు జరిమానాగా కట్టించుకుని క్రిమినల్ కేసు నమోదు చేయాలని జేసీకి సూచించారు. జరిమానా నోటీసులు అందిన వెంటనే పేర్ని నాని ఆగమేఘాలపై పావులు కదిపారు. తన సతీమణిపై క్రిమినల్ కేసు నమోదైతే ఆమెను అరెస్టు చేస్తారని ఊహించి ముందస్తు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించడంతో పాటు జరిమానా సొమ్మును చెల్లించేశారు. ఈ నెల 11న కేసు నమోదు చేస్తే 14న ఆయన కోటి రూపాయలు చెల్లించేశారు. సోమవారం మిగిలిన రూ.72 లక్షలు కట్టేశారు. సోమవారం రోజే జిల్లా కోర్టులో పేర్ని జయసుధ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై వాదనలు ఉండటంతో ఆ రోజుకు మొత్తం జరిమానా చెల్లించేస్తే కోర్టు నుంచి ఊరట పొందవచ్చన్న ఆలోచనతో పేర్ని నాని పావులు కదిపారు. అయితే అధికారులు మాత్రం జరిమానా చెల్లించినా పేర్ని జయసుధ క్రిమినల్ కేసును ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. కాగా జిల్లా 9వ అదనపు కోర్టు న్యాయమూర్తి పిటిషన్‌పై విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేశారు.

మళ్లీ గోదాముల్లో తనిఖీ

మాజీ మంత్రి పేర్ని నాని గోదాములను అధికారులు రెండో విడతగా సోమవారం సాయంత్రం నుంచి తనిఖీలు చేస్తున్నారు. ఇక్కడున్న పీడీఎస్ బియ్యాన్ని లెక్కగట్టి మచిలీపట్నం మార్కెట్ యార్డులోని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గత పది రోజులుగా అధికారులు సకాలంలో సరైన చర్యలు తీసుకోలేదనే విమర్శలు వస్తుండటంతో పౌరసరఫరాలు, రెవెన్యూ, పోలీస్ బృందాలు తాజాగా ఈ గోడౌన్‌లను తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఇక్కడున్న పీడీఎస్ బియ్యం లెక్కలు చూసే పనిలో ఉన్నారు. సోమవారం రాత్రి సమయానికి ఒకలారీలో బియ్యాన్ని మచిలీపట్నం ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. హమాలీలు వెళ్లిపోవడంతో బియ్యం తరలించే పనిని నిలిపివేసి లెక్కలు చూస్తున్నారు. గోదాముల్లోకి మీడియాను అనుమతించ లేదు. మొత్తం బియ్యం లెక్కలు చూసి, తరలించేందుకు రెండు రోజుల సమయం పడుతుందని అధికారులు సూచనప్రాయంగా చెబుతున్నారు. లెక్కలు చూసిన తరువాతనే ఇక్కడ ఎంతమేర బియ్యం మాయమైందనే అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. పేర్ని నాని భార్య జయసుధ పేరుతో ఉన్న రెండు గోడౌన్లను 2021 నుంచి పౌరసరఫరాల శాఖ అధికారులు అద్దె ప్రాతిపదికన బఫర్ గోడౌన్‌లుగా నిర్వహిస్తున్నారు. గతేడాది నవంబరు 16వతేదీ నాటికి ఒక గోడౌన్ అద్దె ఒప్పందం ముగిసింది. వచ్చే ఏడాది జనవరి నెలలో మరో గోడౌన్ అద్దె ఒప్పందం ముగుస్తుంది. అయినా ఇక్కడ పీడీఎస్ బియ్యాన్ని ఖాళీ చేయకుండా అధికారులు కొనసాగించారు.

టీడీపీ నేత హత్యకు సుపారీ

శ్రీకాకుళంలో బిహారీ గ్యాంగ్‌కు 10 లక్షలకు పైగా ఇచ్చిన వైసీపీ నేతలు?

- ముఠాతో పాటు పోలీసుల అదుపులో ఇద్దరు నేతలు.. వారి విడుదలకు సీదిరి వీరంగం

పలాస, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): తమ రియల్ అక్రమాలకు, సోషల్ మీడియా వికృత పోకడలకు అడ్డుగా నిలిచిన టీడీపీ నేత హత్యకు వైసీపీ నాయకులు కుట్ర పన్నారు. అందుకు సుపారీ ఇచ్చి బిహారీ గ్యాంగ్‌ను రప్పించారు. వరుస అరెస్టులతో వెలుగులోకి వచ్చిన ఈ సమాచారంతో పలాస ఉలిక్కిపడింది.. శ్రీకాకుళం జిల్లాలో కలకలం రేగింది.

కుట్రకు కారణం ఇది...

బీ నాగరాజు... చిన్నబడాంలో నివాసం ఉంటున్న ఆయన పలాస పట్టణ టీడీపీ అధ్యక్షుడు. గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నేతల అక్రమాలపై వెన్ను చూపకుండా పోరాటం చేశారు. ఈ క్రమంలో గాయపడ్డారు. అరెస్టు అయ్యారు. ఆయనకు సంఘీభావం ప్రకటించిన నాటి ఎంపీ రామ్మోహన్ నాయుడు, గౌతు శిరీష, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ తదితరులు కూడా అరెస్టు అయ్యారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కూడా కొనసాగుతున్న వైసీపీ నేతల రియల్ అక్రమాలకు నాగరాజు పెద్ద అడ్డంకిగా మారారు. దీనితో ఆయనను భౌతికంగా తొలగించాలని వైసీపీ నేతలు నిర్ణయించుకున్నారు.

ప్లాన్ బయటపడింది ఇలా...

టెక్కలిలో అనుమానాస్పదంగా కనిపించిన బిహార్‌కు చెందిన 11 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో వారిని ప్రశ్నించారు. దీంతో అసలు స్కెచ్ బయటపడింది. నాగరాజు హత్యకు వీరికి రూ.10 లక్షలకు పైగా సుపారీ అందినట్లు, పోలీసులకు వీరి వద్ద మారణాయుధాలు లభించినట్లు సమాచారం. హత్యకు పథక రచన వెనుక చిన్నబడాంకు చెందిన విశ్రాంత ఆర్మీ జవాను, మందస మండలం వరదరాజపురం గ్రామానికి చెందిన వైసీపీ నేత (ఈయన ప్రస్తుతం పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒప్పంద అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు) ఉన్నట్లు తెలుస్తోంది. ఆదివారం రాత్రి వీరిద్దర్ని పోలీసులు విచారణకు తీసుకెళ్లినట్లు సమాచారం.

పోలీస్‌స్టేషన్ వద్ద హైడ్రామా!

విషయం తెలుసుకున్న వైసీపీకి చెందిన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు హుటాహుటిన డీఎస్పీ కార్యాలయానికి చేరుకున్నారు. వైసీపీ నేతలను విడుదల చేయాలంటూ గలాటాకు దిగారు. పోలీసులు అక్కడినుంచి పంపించివేయడంతో కాశీబుగ్గపోలీస్ స్టేషన్‌కు చెరుకుని ఆందోళనకు దిగారు.

నోరు విప్పని ఖాకీలు...

మరోవైపు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఏఎస్పీ(క్రైమ్) పి.శ్రీనివాసరావు ఆదివారం అర్ధరాత్రి హుటాహుటిన టెక్కలి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. బిహార్ గ్యాంగ్ విచారణను వారు స్వ యంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిసింది. ఈ మొత్తం వ్యవహారం పై ఇప్పటి వరకూ పోలీసులు నోరు విప్పలేదు. అయితే కాశీబుగ్గ సీఐ డీ మోహనరావు మీడియాతో మాట్లాడుతూ... 'బి హార్ గ్యాంగ్ జిల్లాలో ఓ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొరికింది. ఇ ంకా పూర్తి సమాచారం రాలేదు. తొందరలోనే మొత్తం సమాచారం మీడియాకు అందిస్తాం' అంటూ ముక్తసరిగా చెప్పారు.

హత్యా రాజకీయాలు ఉపేక్షించం : అచ్చెన్న

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పలాసలో బిహార్ ముఠా టీడీపీ నేత హత్యకు కుట్ర పన్నిన ఘటనపై మంత్రి అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన నేపథ్యంలో సోమవారం ఆయన జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి, పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ ఘటన వెనుక ఎంతటి వారున్నా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అధికారంలో ఉన్నప్పుడు హత్యా రాజకీయాలను ప్రోత్సహించిన వైసీపీ.. అధికారం కోల్పోయినా అదే పద్ధతి కొనసాగిస్తోందని మండిపడ్డారు.

మెగా సీడ్ పార్క్ ఏర్పాటుకు చర్యలు

సోమవారం అమరావతి సచివాలయంలో వ్యవసాయ, సహకార, మార్క్‌ఫెడ్, ఏపీ సీడ్స్, వేర్‌హౌసింగ్ అధికారులతో వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు సమీక్ష చేశారు. కర్నూలులో మెగా సీడ్ పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 'రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూడాలి. బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు ఎరువులు అమ్మకుండా చూడాలి. రాష్ట్రంలోని విత్తనోత్పత్తి క్షేత్రాలను సద్వినియోగం చేసుకోవాలి. రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందించాలి. చిరు, తృణ ధాన్యాల సాగును ప్రోత్సహించాలి. రైతులు, రైతు ఉత్పత్తి సంఘాలకు 35% రాయితీపై గోదాములు అద్దెకిచ్చి, పంటకు గిట్టుబాటు ధర వచ్చాక విక్రయించుకునే వెసులుబాటు కల్పించాలి' అని అచ్చెన్న నిర్దేశించారు.

చెవిరెడ్డిపై కేసు వివరాలు మా ముందుంచండి

- పోలీసులకు హైకోర్టు ఆదేశం.. విచారణ 24వ తేదీకి వాయిదా

అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పోక్సో చట్టం కింద వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై నమోదైన కేసు వివరాలను తమ ముందుంచాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఈ కేసులో తదుపరి చర్యలన్నీ నిలిపివేయాలని.. అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని చెవిరెడ్డి చేసిన వినతిని తోసిపుచ్చింది. క్వాష్ పిటిషన్‌లో ఇలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని తెలిపింది. విచారణను ఈ నెల 24కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన మైనర్ కుమార్తెపై లైంగిక దాడి జరిగిందని 'సాక్షి' మీడియాలో ప్రకటన చేసిన చెవిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని చిన్నారి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా మాజీ ఎమ్మెల్యేపై యర్రవారిపాలెం పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ చెవిరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో విచారణ జరిగింది. పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ, చెవిరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది వీరారెడ్డి వాదనలు వినిపించారు.

సజ్జల భార్గవ్ కేసుల వివరాలన్నీ ఇవ్వండి

- రెండు వారాల పాటు తొందరపాటు చర్యలు వద్దు
- పోలీసులకు హైకోర్టు ఆదేశం.. విచారణ ఈ నెల 26కి వాయిదా

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాలలో అసభ్యకర, అనుచిత పోస్టులు పెట్టేలా ప్రోత్సహించారనే ఆరోపణలతో రాష్ట్రంలోని వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన 9 కేసులను కొట్టివేయాలని కోరుతూ వైసీపీ సోషల్ మీడియా మాజీ కన్వీనర్ సజ్జల భార్గవ్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. కౌంటర్ వేయాలని పోలీసులను కోర్టు ఆదేశించింది. విచారణను ఈనెల 26కి వాయిదా వేసింది. రెండువారాల పాటు భార్గవ్‌రెడ్డి విషయంలో ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులకు స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తనపై కేసులు కొట్టివేయాలని కోరుతూ ఇటీవల భార్గవ్‌రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణకు నిరాకరించిన సుప్రీంకోర్టు.. హైకోర్టులోనే తేల్చుకోవాలని ఆదేశించింది. దీంతో భార్గవ్‌రెడ్డి తాజాగా హైకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా.. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాదులు మహేశ్ జఠ్మలానీ, సిద్ధార్థ్ దవే, పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, పోలీసుల తరఫు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ) పాణిని సోమయాజి వాదనలు వినిపించారు.

ఫర్నిచర్ వ్యాజ్యంలో కౌంటర్ వేయండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- జగన్ తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఫర్నిచర్ వ్యవహారం

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫర్నీచర్‌ను వెనక్కి తీసుకెళ్లాలని, అందులో కొంత ఫర్నీచర్‌కు విలువ ఖరారు చేస్తే చెల్లిస్తామంటూ తాము చేసిన అభ్యర్థనపై సాధారణ పరిపాలన శాఖ అధికారులు స్పందించడం లేదంటూ వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ ఏడాది అక్టోబరు 3న తాము ఇచ్చిన వినతిపై నిర్ణయం తీసుకొనేలా అధికారులను ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ వ్యాజ్యంలో తప్పులను సరిచేస్తూ అనుబంధ పిటిషన్ వేశామన్నారు. పిటిషనర్ సమర్పించిన వినతిని పరిగణనలోకి తీసుకొనేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాధారణ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి, డిప్యూటీ సెక్రెటరీకి నోటీసులు జారీ చేశారు. విచారణను మూడు వారాలకు వాయిదా వేశారు.

సోలార్ సిగ్నల్స్



సోలార్ సిగ్నల్ బోర్డులివి. కర్నూలు నగరంలో పలు కూడళ్లలో పోలీసులు వీటిని ఏర్పాటు చేశారు. రోడ్డుపై నిలిపే బారికేడ్లకు సోలార్ ప్యానళ్లతో కూడిన సిగ్నల్ బోర్డులను బిగించి వాటి ద్వారా వాహనదారులను అప్రమత్తం చేసే సమాచారం ప్రదర్శించే ఏర్పాటు చేశారు.

జగన్ పాలనలో 6,927 పోక్సో కేసులు

- గత ఐదేళ్లలో చిన్నారులపై పెరిగిన ఘోరాలు
- రోజూ సగటున నలుగురిపై అత్యాచారాలు
- పార్లమెంటు సాక్షిగా కేంద్రం వెల్లడి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'మహిళలు, చిన్నారుల రక్షణకు దిశ చట్టం తెస్తున్నాం. ఎవరైనా అఘాయిత్యాలకు పాల్పడితే మూడు వారాల్లో ఉరికంబం ఎక్కిస్తాం'.. ఐదేళ్ల క్రితం (2019 డిసెంబరు 13) అప్పటి ముఖ్యమంత్రి జగన్ అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలివి. కానీ వాస్తవంలో అందుకు పూర్తి భిన్నంగా ఆయన పాలన సాగించారు. పార్లమెంటులో తాజాగా కేంద్రం వెల్లడించిన గణాంకాలే ఇందుకు నిదర్శనం. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో చిన్నారులు, మహిళలపై జరిగిన అఘాయిత్యాలకు సంబంధించి విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. జగన్ పాలనలో ప్రతిరోజు సుమారు నలుగురు మైనర్లపై అత్యాచారాలు జరిగినట్లు కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ వెల్లడించింది. గత ఐదేళ్లలో రాష్ట్రంలో 6,927 మంది మైనర్లపై అఘాయిత్యాలు, అత్యాచారాలు జరిగినట్లు 'పోక్సో' కేసులు నమోదైనట్టు తెలిపింది. శిక్షల విషయానికి వస్తే దేశంలో ఏ రాష్ట్రంలో లేనంత అధ్వానంగా కేవలం రెండంటే రెండు శాతంగా ఉంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది(2019) 1,255 పోక్సో కేసులు నమోదయ్యాయి. 2020లో కరోనా రావడంతో ప్రజలు కొన్ని నెలల పాటు ఇళ్లకే పరిమితం కావడంతో కాస్త తగ్గాయి. ఆ ఏడాది 1,211 కేసులు రిజిస్టర్ అయ్యాయి. 2021లో 1,331, 2022లో 1,957, 2023లో 1,173 కేసులు నమోదయ్యాయి. ఐదేళ్లలో రాష్ట్రంలో మొత్తం 6,927 కేసులు నమోదు కాగా, 134 మందికి మాత్రమే శిక్షలు పడ్డాయి. దేశంలో ఏ రాష్ట్రంలోనూ పోక్సో కేసుల్లో ఇంత తక్కువ శాతం శిక్షలు పడలేదు. కేవలం జగన్ ప్రచారానికి తప్ప 'దిశ' ద్వారా చిన్నార్ని కాపాడలేదని, మహిళలకు రక్షణ కల్పించలేదని కేంద్రం వెల్లడించిన గణాంకాలతో స్పష్టమైంది. దిశ అనేది కేవలం ఓ మొబైల్ యాప్ మాత్రమే.

వైసీపీ ప్రభుత్వంలో మైనర్లపై నేరాలు

సంవత్సరం	కేసులు	శిక్షలు
2019	1,255	35
2020	1,211	24
2021	1,331	20
2022	1,957	26
2023	1,173	29
మొత్తం	6,927	134

సంచలన తీర్పు

ఇటీవల ఓ కేసులో ప్రకాశం జిల్లా కోర్టు విధించిన శిక్ష దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ప్రకాశం జిల్లా కంభం ప్రాంతానికి చెందిన షేక్ అన్వర్ బాషా స్థానిక ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడు. అదే స్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లిపోయాడు. ఆ అమ్మాయి మైనర్ కావడంతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో అన్వర్ బాషాను బతికినంత కాలం జైల్లో పెట్టాలంటూ ఒంగోలు పోక్సో కోర్టు డిసెంబరు మొదటి వారంలో సంచలన తీర్పు వెలువరించింది. మైనర్లపై నేరాల కేసుల్లో కఠినంగా వ్యవహరించనున్నట్లు పోలీసులు తెలిపారు.

నాడు మహిళలకు అవమానం

జగన్ పాలనలో మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలే కాదు వారి ఆత్మగౌరవానికీ భంగం వాటిల్లింది. ఇద్దరు మహిళలు (సుచరిత, వనిత) హోంమంత్రులుగా ఉన్నా.. మహిళలను అవమానించిన కేసుల సంఖ్య ఉత్తరప్రదేశ్, బిహార్ వంటి రాష్ట్రాల కంటే దేశంలోనే ఏపీలో అత్యధికంగా ఉంది. జగన్ పార్టీ ప్రోత్సాహంతో సోషల్ సైకోలు, స్థానిక చోటా నాయకులు రెచ్చిపోయారు. నేషనల్ క్రైం రికార్డు బ్యూరో(ఎన్‌సీఆర్‌బీ) నివేదిక ఆధారంగా కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం 2022లో రాష్ట్రంలో మహిళలను అవమానించినట్లు 3,145 కేసులు (11.9 శాతం) నమోదయ్యాయి. ఇక మహిళలపై దాడుల కేసులు 2020లో 17,089, 2021లో 17,752, 2022లో 25,503 కేసులు నమోదయ్యాయి. ఇలాంటి ఘటనలు జగన్ హయాంలో ఎక్కువగా జరిగాయని కేంద్రం వెల్లడించింది. గత ఐదేళ్లలో మహిళలు, చిన్నారులపై దాడులు పెరిగాయని పేర్కొంది.

నాడు-నేడు ఎంత తేడా..

జగన్ ప్రభుత్వంలో ఎన్నో ఘోరాలు జరిగినా చర్యలు తీసుకోలేదు. తాడేపల్లి ప్యాలెస్ సమీపంలో అంధ బాలికపై గంజాయి మత్తులో ఉన్న యువకుడు అత్యాచార యత్నం చేసి, కత్తితో దాడి చేశాడు. కేసు నమోదైంది కానీ శిక్ష పడలేదు. కాబోయే భర్తతో కలిసి జగన్ నివాసానికి కూతవేటు దూరంలో కృష్ణా నది ఒడ్డున సేద తీరుతున్న యువతిపై సామూహిక అత్యాచారం జరిగితే..వైసీపీ ప్రభుత్వం ఉన్నంత కాలం నిందితుల్లో ఒకడిని అరెస్టు చేయలేకపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాకే గుంటూరు పోలీసులు అరెస్ట్ చేశారు. జగన్ పార్టీకి చెందిన వ్యక్తులు రేపల్లెలో అమర్నాథ్ గౌడ్ అనే బాలుడ్ని దహనం చేశారు. ఆర్నెళ్ల క్రితం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ పరిస్థితి మారింది. నంద్యాల, కడప, తిరుపతి, విశాఖపట్నం, చీరాల తదితర ప్రాంతాల్లో ఒకటి, రెండు రోజుల్లోనే పోలీసులు బాధ్యుల్ని అరెస్టుచేసి కటకటాల్లోకి నెట్టారు. భార్యపై అనుమానంతో ఆరేళ్ల కుమారుడిని చంపి పాతిపెట్టి పారిపోయిన నిందితుడిని పాతికేళ్ల తర్వాత సత్యసాయి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు.

సీఐడీ దర్యాప్తునకు సహకరించండి

- కాకినాడ పోర్టు వ్యవహారంలో విక్రాంత్‌రెడ్డికి హైకోర్టు ఆదేశం
- తదుపరి విచారణ వరకు ఆయనపై తొందరపాటు చర్యలొద్దు
- పోలీసులకు న్యాయస్థానం స్పష్టీకరణ
- విచారణ 24వ తేదీకి వాయిదా

అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ డీప్ వాటర్ పోర్ట్, కాకినాడ సెజ్‌లోని వాటాల బదిలీ వ్యవహారంలో సీఐడీ దర్యాప్తునకు సహకరించాలని వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కుమారుడు వై.విక్రాంత్‌రెడ్డిని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ వరకు ఆయనపై ఎలాంటి తొందరపాటు చర్యలూ తీసుకోవద్దని సీఐడీ పోలీసులకు స్పష్టం చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 24కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వ్యాజ్యంలో తనను కూడా ఇంప్లీడ్ చేసి వాదనలు వినిపించేందుకు అవకాశమివ్వాలన్న ఫిర్యాదుదారు కర్నాటి వెంకటేశ్వరరావు (కేవీరావు) అభ్యర్థనను అంగీకరించారు. తనను బెదిరించి, భయపెట్టి కాకినాడ డీప్ వాటర్ పోర్ట్, కాకినాడ సెజ్‌లోని వాటాలను బలవంతంగా అరబిందోకు బదలాయింపు చేశారని కాకినాడ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్, కేవీఆర్ గ్రూపుకు చెందిన కేవీ రావు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ నెల 2న మంగళగిరి సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఏ-1గా ఉన్న విక్రాంత్‌రెడ్డి ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా సీఐడీ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ స్పందిస్తూ.. పూర్తి వివరాలతో కౌంటర్ వేసేందుకు సమయం కోరారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. రెండు కంపెనీల మధ్య షేర్ల బదిలీ వ్యవహారంలో విక్రాంత్‌రెడ్డిని నిందితుడిగా చేర్చారన్నారు. నాలుగు ఏళ్ల తరువాత తనను బెదిరించి షేర్లు బదిలీ చేయించుకున్నారని ఫిర్యాదు చేశారని.. షేర్లు బదిలీ చేసినందుకు కేవీరావు సొమ్ము కూడా తీసుకున్నారని తెలిపారు. విక్రాంత్‌రెడ్డిని అరెస్టు చేసేందుకు పోలీసులు వెంబడిస్తున్నారన్నారు. బీఎన్ఎస్ చట్టంలోని సెక్షన్ 111(వ్యవస్థీకృత నేరం) కింద కేసు నమోదు చెల్లుబాటు కాదన్నారు. అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కేవీ రావు తరఫున న్యాయవాది జవ్వాజి శరత్‌చంద్ర వాదనలు వినిపించారు. అన్ని పక్షాల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలుకు సీఐడీని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేశారు.

జగన్ ముడుపులపై దర్యాప్తు చేయరేం?

- ఇప్పటికైనా సెకీ డీల్‌ను రద్దు చేయండి
- విజయసాయి వ్యాఖ్యలకు సీఎం ఏం చెబుతారు?
- రాష్ట్ర ప్రజల కోసం కోర్టుకెక్కడానికీ సిద్ధం: షర్మిల



అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): జగన్ తప్పు చేస్తే సెకీ ఒప్పందాన్ని ఎందుకు రద్దు చేయలేదో చెప్పాలంటోన్న రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి వ్యాఖ్యలకు ఏమంటారని ముఖ్యమంత్రి చంద్రబాబును పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నిలదీశారు. అదానీతో డీల్‌పై ప్రజా శ్రేయస్సు కోసం కోర్టు మెట్లు ఎక్కడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. మౌనంగా ఉంటున్నారంటే అదానీ ఒప్పందం అక్రమం కాదని ఒప్పుకొన్నారా అని సోమవారం 'ఎక్స్'లో ప్రశ్నించారు. సక్రమం కాబట్టే రద్దు చేయడం లేదని చెప్పకనే చెబుతున్నారా? అని నిలదీశారు. 'ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాజకీయం కోసం ఆరోపణలు చేశారే తప్ప.. వాటిలో నిజం లేదంటారా? సెకీ ఒప్పందంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించడం అంతా తూచ్ అని భావించాలా? ముడుపులు వాళ్లకేనా.. తమకూ అందాయని అంగీకరిస్తున్నట్లేనా? అందుకే ఏసీబీని పంజరంలో బంధించారా? అందుకేనా అదానీపై ఒక్క మాట కూడా మాట్లాడటం లేదు. రూ.1,750 కోట్ల లంచం తీసుకుని రాష్ట్ర ప్రజల నెత్తిన రూ.1.50 లక్షల కోట్ల భారం వేసి.. అదానీకి మేలు చేసే డీల్‌పై మౌనంగా ఉన్నారా?' అని చంద్రబాబును షర్మిల ప్రశ్నించారు. అందానీ డీల్‌పై చంద్రబాబు మౌనంగా ఉన్నా కాంగ్రెస్ మాత్రం ఆందోళనను ఆపదని తేల్చిచెప్పారు. ఇప్పటికైనా డీల్‌ను రద్దు చేసి, రూ.1,750 కోట్ల ముడుపులపై దర్యాప్తునకు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,**
RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.